ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 17-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 338
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

జల వివాదాలపై కమిటీ

కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు

- రెండు రాష్ట్రాలతో పాటు కేంద్ర అధికారులకూ భాగస్వామ్యం
- సాంకేతిక నిపుణులతో పాటు ఐఏఎస్‌లకూ స్థానం
- టెలిమెట్రీల ఏర్పాటు, కృష్ణా బోర్డు అమరావతికి తరలింపు
- శ్రీశైలం ప్రాజెక్టుకు ఏపీ నిధులతో మరమ్మతులపైనా ఏకాభిప్రాయం
- దిల్లీలో ఏపీ, తెలంగాణ సీఎంల భేటీలో నిర్ణయాలు


సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు – దిల్లీ, అమరావతి

తెలుగు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా జలాలకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. దీంతో పాటు మరో మూడు అంశాలపైనా ఏకాభిప్రాయం కుదిరింది. దిల్లీ శ్రమశక్తి భవన్ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు గంటన్నరకు పైగా నిర్వహించిన ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాలు ప్రతిపాదించిన 10 ఎజెండా అంశాలపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు విజయానంద్, రామకృష్ణారావు చర్చల్లో పాల్గొన్నారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశాన్ని ప్రారంభించి, అవసరమైన సందర్భాల్లో కలగజేసుకున్నారు. ఎవరి వాదనలు వారు వినిపించడంతో ఆసక్తికర చర్చలు జరిగాయి. ఏపీ సీఎం చంద్రబాబు తనకు రెండు తెలుగు రాష్ట్రాలూ ముఖ్యమేనని స్పష్టం చేయడంతో పాటు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణ ప్రాజెక్టులు ఎలా చేపట్టిందీ వివరించారు. సమావేశంలో మూడు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

ఇవీ నిర్ణయాలు

1. గోదావరి, కృష్ణా నదులకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు. రెండు రాష్ట్రాల సాంకేతిక నిపుణులతో పాటు జలశక్తి శాఖ నుంచి కమిటీలో సభ్యులు ఉంటారు. సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు మాత్రమే కాకుండా పాలనాధికారు (ఐఏఎస్)లకు కూడా ఈ కమిటీలో భాగస్వామ్యం కల్పిస్తారు. వచ్చే వారం ప్రారంభానికి కమిటీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ కమిటీ నెల రోజుల్లో రోడ్‌మ్యాప్ ఇస్తుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పోలవరం- బనకచర్ల అనుసంధానం అంశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని ఏపీ మంత్రి రామానాయుడు తెలియజేశారు.

2. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలింపు.

3. కృష్ణా, గోదావరి నదుల నుంచి కాలువలకు నీళ్లు తీసుకునే అవుట్‌లెట్‌ల వద్ద టెలిమెట్రీల ఏర్పాటుకు అనుమతి. కేవలం ఆయా నదులకు సంబంధించిన రిజర్వాయర్ల నుంచి నీటిని తీసుకునేచోట మాత్రమే టెలిమెట్రీల ఏర్పాటు. అంతర్గత అవుట్‌లెట్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది.

4. శ్రీశైలం ప్లంజ్‌పూల్ సహా అవసరమైన మరమ్మతు పనులు ఏపీ చేపట్టేందుకు నిర్ణయం.

ఈ మేరకు ఇరు రాష్ట్రాల సీఎంల భేటీలో నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. (మిగతా 2లో)

ఇది ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం కాదు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత నదీ జల వివాదాలు పరిష్కరించేందుకు విభజన చట్టం ప్రకారం ఎపెక్స్ కౌన్సిల్ ఏర్పాటయింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నేతృత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందులో సభ్యులు. ఇంతవరకు రెండుసార్లు ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం అదే తరహా సమావేశం కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేయడంతో ఈ సమావేశంపై అనుమానాలు ఏర్పడ్డాయి. దీంతో భేటీ ప్రారంభంలోనే ఏపీ సీఎం చంద్రబాబు ఇది ఎపెక్స్ కౌన్సిల్ సమావేశమా అని ప్రశ్నించారు. కాదని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమాధానమిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి ఇదొక వేదికగా నిలుస్తుందని, ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేస్తామని వెల్లడించారు. ఇందుకు తగ్గట్టే సమావేశం యావత్తూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ ప్రేక్షక పాత్ర వహించారు.


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నీటి వాటాలపై వాద సంవాదాలు

జలవివాదాలపై దిల్లీలో రెండు రాష్ట్రాల సీఎంల భేటీ

మాకు కావాల్సిన నీళ్లు కేటాయించండి: తెలంగాణ సీఎం రేవంత్

భిన్నాభిప్రాయ అంశాలపై కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రతిపాదన 2లో

వ్యవసాయ వృద్ధికి.. ధనధాన్య కృషి యోజన


వివరాలు వెల్లడిస్తున్న అశ్వినీ వైష్ణవ్

- వెనుకబడిన 100 జిల్లాల్లో ఆరేళ్లు అమలు
- 36 పథకాలను ఒక్కటిచేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- దీనికి రూ.24,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- వ్యోమగామి శుభాంశును అభినందించిన మంత్రివర్గం

ఈనాడు, దిల్లీ: దేశంలో వెనుకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి చేయూతనందించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన'ను అమలుచేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదముద్ర వేసింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలుచేయనున్నారు. వాటికింద ఏటా ఖర్చుచేసే రూ.24,000 కోట్లనే ఈ పథకానికి కేటాయిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరేళ్లపాటు ఇది అమల్లో ఉంటుంది. ప్రతి రాష్ట్రం నుంచి కనీసం ఒక జిల్లాను ఈ పథకానికి ఎంపిక చేస్తారు. ఉత్పాదకత, సాగు విస్తీర్ణం, రుణ వినియోగం.. (మిగతా 2లో)

ప్రసన్నకుమార్‌రెడ్డికి ముందస్తు బెయిలివ్వలేం



ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యల కేసులో తేల్చిచెప్పిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ముందస్తు బెయిలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్నవేనని, ఈ నేపథ్యంలో అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. హైకోర్టు బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

అనుచిత వ్యాఖ్యలపై కోవూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు కోసం ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ఆమె అనుచరులు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని ధ్వంసం చేశారన్నారు. పిటిషనర్‌పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్నవేనని, ముందస్తు బెయిలివ్వాలని కోరారు. పోలీసుల తరఫున పీపీ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని (మిగతా 3లో)

మూడేళ్లలో చంద్రబాబు ఎగిరిపోతాడు



ఆయన పెట్టే కేసులకు భయపడం

మా ప్రభుత్వం వచ్చాక వడ్డీతో తిరిగిస్తాం

డీఐజీలు మాఫియా డాన్లలా తయారయ్యారు: జగన్

ఈనాడు, అమరావతి: 'గట్టిగా మూడు సంవత్సరాలు కళ్లు మూసుకుంటే చంద్రబాబు ఎగిరిపోతాడు.. మళ్లీ వచ్చేది వైకాపానేనని ప్రజలకు అర్థమైనందు వల్లే వారి సమస్యలను మా దగ్గరకొచ్చి చెబుతున్నారు' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యానించారు. దీన్ని తట్టుకోలేకే చంద్రబాబు ప్రతిపక్షాన్ని అణచివేసి, ప్రజల గొంతును నొక్కేయాలని తాపత్రయపడుతున్నాడని విమర్శించారు. 'రైతులు, ప్రజల సమస్యలపై నేను ఏ పర్యటనకు వెళ్లినా కేసులు పెడుతున్నారు. నేను పొదిలికి వెళ్లినప్పుడు 40 వేల మంది రైతులు, ప్రజలు వచ్చారు, వాళ్లపై 40 మందితో చంద్రబాబు రాళ్లు వేయించారు. రైతులు ఆ 40 మందిపై పడి ఉంటే వాళ్లు బతికేవారా? సినిమా డైలాగులతో పోస్టర్లు పెట్టినా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. వాడేదో పోస్టర్‌పై సినిమా డైలాగ్ రాసుకుంటే మీకొచ్చిన నష్టమేంది? చంద్రబాబూ.. మీరెన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదు. మీ ప్రభుత్వం మహా అయితే మూడేళ్లు ఉంటది, తర్వాత వచ్చేది మేమే. మీకు, మీకు పావులుగా మారిన అధికారులకు వడ్డీతో చెల్లిస్తాం' అని హెచ్చరించారు. ఎంపిక చేసి తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకున్న విలేకర్లతో బుధవారం జగన్ మాట్లాడారు.

మా ప్రభుత్వం వచ్చాక మీరేమవుతారు?

'ఈ రోజు దెబ్బతిన్న మావాళ్లు.. రేపు మా ప్రభుత్వం వచ్చాక ప్రతిచర్యకు దిగితే చంద్రబాబు, తెదేపా పరిస్థితేంటి? ఈ రోజు మీరు పైన ఉన్నారు, నాలుగేళ్లకు మీరు కిందకు వస్తారు, మేం పైకి వస్తాం. అప్పుడు నేను చెప్పినా మా వాళ్లు వినే పరిస్థితి ఉండదు' అని హెచ్చరించారు. 'మా హయాంలో (మిగతా 3లో)

మద్యం ముడుపుల్లో 90% 'బిగ్‌బాస్'కే

రూ.2,970 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా

- వసూళ్ల వ్యవస్థ నిర్వహణకు 10 శాతం
- అందులోనే వైకాపా ముఖ్య నేతలకు వాటాలు
- జగన్‌కు తలలో నాలుకలా వ్యవహరించిన ఇద్దరు ఎంపీలకు నెలకు చెరో రూ.5 కోట్లు

ఎవరి వాటా ఎంతో చిట్టా సిద్ధం చేసిన సిట్



ఈనాడు – అమరావతి

మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన రూ.వేల కోట్ల ముడుపుల్లో 90 శాతం నేరుగా 'బిగ్‌బాస్'కే చేరిందని సిట్ దర్యాప్తులో తేలింది. మిగతా 10 శాతం ముడుపుల వసూళ్ల కోసం రాజ్ కెసిరెడ్డి నేతృత్వంలో పనిచేసిన క్యాష్ కొరియర్లు, క్యాష్ హ్యాండ్లర్ల వ్యవస్థ నిర్వహణ ఖర్చులకు, ఈ కుట్ర రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన వైకాపా ముఖ్య నాయకులకు నెలవారీ వాటాలు ఇచ్చేందుకు, అక్రమ దందా అమలులో భాగస్వాములైన అధికారులకు లంచాలకు వెచ్చించినట్లు వెల్లడైంది. రాజ్ కెసిరెడ్డి కమీషన్లతో పాటు మద్యం సరఫరా కంపెనీలు పెట్టుకుని రూ.వందల కోట్లు కొల్లగొట్టినట్లు తేలింది. ముడుపుల సొమ్ములో ఎవరి వాటా ఎంతో పేర్కొంటూ సిట్ జాబితా సిద్ధం చేసింది. ఇప్పటికే అరెస్టయిన నిందితులు, సాక్షుల విచారణలో వెల్లడైన అంశాలు, వాంగ్మూలాలు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలోని సమాచారాన్ని వెలికితీసిన సిట్ ఈ వాటాల గుట్టు తేల్చింది. బేసిక్ ప్రైస్ ఆధారంగా ఒక్కో కేసుపై రూ.150 నుంచి రూ.600 వరకూ వైకాపా మద్యం ముఠా వసూలు చేసింది. ఇలా మొత్తం రూ.3,300 కోట్ల వరకూ కొల్లగొట్టి ఉంటారని ప్రాథమిక అంచనా. అందులో 90 శాతం అంటే దాదాపు రూ.2,970 కోట్లు 'బిగ్‌బాస్'కు చేరాయని సిట్ అంచనా. (మిగతా 3లో)

త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్‌లు

ఏపీపీఎస్సీకి చేరిన ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు

అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వారంలో ప్రకటన జారీ



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నుంచి త్వరలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లు రాబోతున్నాయి. ఎస్సీ వర్గీకరణ అమల్లో భాగంగా సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి రోస్టర్ పాయింట్లు వచ్చినందున సిద్ధంగా ఉన్న నోటిఫికేషన్‌లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ సిద్ధమవుతోంది. అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ (మొత్తం పోస్టులు-691)కి ఈ నెల 14న నోటిఫికేషన్ (06/2025) జారీచేసింది. ఇవికాక.. (మిగతా 3లో)

'ఉపాధి' పనుల సామాజిక తనిఖీల్లో ఏపీ విధానం ఆదర్శనీయం

దక్షిణాది సదస్సులో అభిప్రాయపడిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలకమైన సామాజిక తనిఖీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విధానాలు అనుసరణీయమని ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సామాజిక తనిఖీల విభాగం డైరెక్టర్లు, ఇతర అధికారులు అభిప్రాయపడ్డారు. ఏపీలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తమ రాష్ట్రాల్లోనూ అమలుకు కృషి చేస్తామన్నారు. ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీల్లో (సోషల్ ఆడిట్) ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలు, తీసుకురావలసిన మార్పులపై దక్షిణాది రాష్ట్రాల రెండు రోజుల సదస్సు బుధవారం మంగళగిరిలో ప్రారంభమైంది. తొలి రోజు ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సోషల్ ఆడిట్ విభాగం డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తమిళనాడు, ఒడిశా సోషల్ విభాగం డైరెక్టర్లు (మిగతా 3లో)

లోపలి పేజీల్లో

రహదారులను ఆక్రమించిన వీధి వ్యాపారులపై హైకోర్టు కన్నెర్ర

కొత్త లైసెన్సులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

విచారణ ఆగస్టు 13కు వాయిదా

రవాణా వాహనాలకు హరిత పన్ను తగ్గింపు

గత ప్రభుత్వంలో గరిష్ఠంగా రూ.20 వేలు


ఇప్పుడు రూ.1,500, రూ.3 వేలతో 2 స్లాబ్‌లు మాత్రమే

హంద్రీ నీవా నుంచి సాగునీరు

తొలిసారి వినియోగంలోకి రానున్న 12 పంపులు

నేడు నీరు విడుదల చేయనున్న సీఎం

ఇదీ సంగతి!



2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

సీఎం చంద్రబాబు ప్రకటన


టాస్క్‌ఫోర్స్ నివేదిక అందించిన టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్


సీఐఐ సదస్సులో 'టువర్డ్స్ స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047' టాస్క్‌ఫోర్స్ నివేదికతో ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్. చిత్రంలో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, ఏపీ సీఎస్ విజయానంద్, టీవీఎస్ మోటార్స్ ఛైర్మన్ ఎమిరిటస్ వేణు శ్రీనివాసన్, ఓంకార్ సింగ్ కన్వార్, సీఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మేమాని, అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు, ఎండీ సుచిత్ర ఎల్ల తదితరులు

ఈనాడు, దిల్లీ: వచ్చే పాతికేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. బుధవారం ఇక్కడ జరిగిన సీఐఐ సదస్సులో టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నుంచి "టువర్డ్స్ స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047" పేరుతో టాస్క్‌ఫోర్స్ నివేదిక అందుకున్న తర్వాత ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన దార్శనిక పత్రం తయారు చేయడానికి (మిగతా 3లో)

చంద్రబాబుకు చాలా గుడ్‌విల్ ఉంది: చంద్రశేఖరన్ 3లో

రీసర్వే వ్యవధిని పొడిగించాలి




అప్పుడే సమగ్ర నిర్వహణ సాధ్యం

దూర ప్రాంతాల్లో ఉన్న రైతులను రప్పించడంలో ఇబ్బందులు

కొన్నిచోట్ల భూముల విస్తీర్ణాల్లో తేడాలు • పలు గ్రామాల్లో 'ఈనాడు' పరిశీలన

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గన్నవరం: గ్రామాల్లో రీసర్వే సమగ్ర నిర్వహణకు కాల వ్యవధిని పెంచాల్సిన అవసరం కనిపిస్తోంది. దూర ప్రాంతాల్లో ఉన్న వారిని పిలిపించేందుకు, భూ విస్తీర్ణం తగ్గిన వారికి అదనంగా రెండు, మూడు సార్లైనా కొలతలు వేసేందుకు గడువును పెంచాలని రైతులు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో 'ఈనాడు' పరిశీలన చేపట్టగా.. పంట పనుల సమయంలో రీసర్వే రైతులకు ఇబ్బందిగా మారిందని, కొలతలకు అనుగుణంగా పొలాలకు హద్దు రాళ్లు వేస్తే మంచిదన్న అభిప్రాయాలు రైతుల నుంచి వ్యక్తమయ్యాయి.

60 రోజుల్లో పూర్తి చేయాలని: రాష్ట్రంలోని 11,158 గ్రామాలకుగానూ 6,688 చోట్ల వైకాపా పాలనలో రీసర్వే పూర్తయింది. (మిగతా 3లో)



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అరకు కాఫీని అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పౌరవిమానయాన శాఖమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ప్రత్యేక ఆర్థిక సాయం కింద రూ.10 వేల కోట్లు ఇవ్వండి

కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వినతి

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం అందించే ప్రత్యేక ఆర్థిక సాయం పథకం (ఎస్ఏఎస్‌సీఐ) కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.10,000 కోట్లు అదనంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఆయన బుధవారం దిల్లీలో ఆమెను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికున్న రెవెన్యూ లోటు భర్తీ కోసం గ్రాంట్లు ఇవ్వాలని, 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమరావతికి మొత్తం రూ.79,280 కోట్ల నిధులు అవసరం కాగా, ప్రస్తుతం రూ.44,351 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని నిర్మలా సీతారామన్‌కు వివరించారు. వీటికి సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపారు. ఇంకా నిధులు అవసరం ఉన్నందున అమరావతికి రెండోవిడత ఇచ్చే నిధులను గ్రాంట్ రూపంలో మంజూరు చేయాలని కోరారు. అమరావతి, పోలవరం నిర్మాణానికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా పాల్గొన్నారు.

జల వివాదాలపై కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజల ప్రయోజనార్థం సుస్థిర జల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

కమిటీ తేల్చని అంశాలు సీఎంల వద్దకే..

జలవివాదాలపై కమిటీ ఏర్పాటు వచ్చే సోమవారం నాటికి పూర్తి కావాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎవరెవరు కమిటీలో ఉండాలో ఆ వివరాలు తాము సోమవారం నాటికి అందిస్తామని రెండు రాష్ట్రాలూ పేర్కొన్నాయి. దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ, సోమవారం నాటికి కేంద్రం నుంచి కమిటీ సభ్యులను తేల్చడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుత ఎజెండా అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిని కమిటీకి అప్పజెబుతారు. సాంకేతిక, ఇతర అంశాలపై ఆ కమిటీ చర్చించి అభిప్రాయాలు, నిర్ణయాలు తెలియజేస్తుంది. అక్కడ పరిష్కారం కాని అంశాలపై మళ్లీ ఇద్దరు ముఖ్యమంత్రులూ చర్చించి పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.

హంద్రీ నీవా నుంచి సాగునీరు

- తొలిసారి వినియోగంలోకి రానున్న 12 పంపులు
- నేడు నీరు విడుదల చేయనున్న సీఎం



మల్యాల ఎత్తిపోతల పథకం

ఈనాడు, కర్నూలు; న్యూస్‌టుడే, నందికొట్కూరు: రాయలసీమ జిల్లాలోని 6.02 లక్షల ఎకరాలకు సాగు నీరు, 33 లక్షల జనాభాకు తాగు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో నిర్మించిన హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు నుంచి పుష్కలంగా జలాలు రానున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం నీటిని విడుదల చేయనున్నారు. తదనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాలువలనూ సిద్ధం చేశారు. నంద్యాల జిల్లా మల్యాల గ్రామం దగ్గర కృష్ణా నది నుంచి నీటిని ఎత్తిపోసి రాయలసీమ నీటి అవసరాలు తీర్చేలా హెచ్ఎన్ఎస్ఎస్ రూపొందించారు. ఇందుకు 554 కి.మీ.ల దూరం కాలువ తవ్వారు. మల్యాల ఎత్తిపోతల పథకానికి 12 పంపులు ఉన్నా ఇప్పటి వరకు 6 పంపులే వినియోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెచ్ఎన్ఎస్ఎస్‌ను లక్ష్యం నెరవేరేలా వంద రోజుల్లోనే రూ.696 కోట్లతో విస్తరణ పనులు చేపట్టింది. 93% పనులు చేసింది. ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు 12 భారీ మోటార్లు, పంపులను ఏర్పాటు చేసింది. దశల వారీగా అన్ని పంపుల నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులు ప్రణాళిక వేశారు. గురువారం ప్రాజెక్టులోని 9వ నంబరు పంపు నుంచి సీఎం నీటిని విడుదల చేస్తారు. తర్వాత మరో పంపు నుంచి వదులుతారు. 19వ తేదీ నాటికి 12 పంపులు పూర్తిస్థాయిలో పనిచేయనున్నాయి. అప్పటి నుంచి కాలువలో రోజుకు 3,850 క్యూసెక్కుల నీరు ప్రవహించనుంది.

వచ్చే ప్రభుత్వమూ కూటమి పార్టీలదే: మాధవ్

కరెన్సీనగర్, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా ప్రత్యక్షంగా పాల్గొంటుంది. కూటమి ప్రభుత్వంతోనే ఎన్నికలకు వెళతాం. 2029లోనూ కూటమిదే ప్రభుత్వమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాటామంతీ నిర్వహించారు. ‘తమ పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై అంచనాకి వస్తున్నాం. కూటమి పార్టీలతోనే ఎన్నికల్లో పోటీ చేసి మరిన్ని సీట్లు గెలుచుకుంటాం. నీటి సంఘాలు, విద్యా కమిటీలు, ఆస్పత్రి కమిటీల్లో భాజపా అభ్యర్థులను నిలబెడతాం. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన బాగుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఎక్కడా ప్రధాని మోదీ పేరు పెట్టుకోలేదు. గత ప్రభుత్వాలు ప్రతి పథకానికి పెట్టుకొని ప్రచారం చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు, సీపీఎస్, నిరుద్యోగ భృతి అంశాలపై దృష్టి పెట్టాలి.’ అని పేర్కొన్నారు. ‘దేశంలో అన్ని రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతనాలు ఎక్కువ. వేతనాలు ఇస్తూ కొత్త నియామకాలు చేపట్టడం కత్తిమీద సామే. అందుకే కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో నైపుణ్యం గల ఇంజినీరింగ్ పట్టభద్రులు ఎక్కువ. వారికి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. మిర్చి, పొగాకు, పసుపు, మామిడి, అరటి పంటలకు ఆంధ్రా పెట్టింది పేరు. వాటికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తే నూతన వంగడాలు, పరిశోధనలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం విధానపరంగా తీసుకునే అంశాలకు తమ పార్టీ మద్దతు ఉంటుంది. ఆగస్టు 30 సంచార జాతర నిర్వహిస్తున్నాం. ఆలయాల పరిరక్షణపై దృష్టి పెడతాం’ అని వివరించారు. ఆదోని శాసనసభ్యుడు డాక్టర్ పార్థసారథి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జిల్లా ఇన్‌ఛార్జి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి వాటాలపై వాద సంవాదాలు

జల వివాదాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంల సమావేశం



ఆత్మీయంగా కరచాలనం చేసుకుంటున్న ఏపీ, తెలంగాణల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి

ఈనాడు, అమరావతి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవివాదాల పరిష్కారంలో మరో కీలక అడుగు పడింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశం ఆద్యంతం ఆసక్తికర వాద సంవాదాలతో సాగింది. అందరూ సుహృద్భావంతో హాయిగా వాదనలు వినిపించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ వ్యవహరించిన చంద్రబాబు అదే అనుభవంతో ఉమ్మడి రాష్ట్ర ప్రయోజనాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రాజెక్టులకు తాము ఎలా సహకరించింది చెప్పారు. అదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు తమ రాష్ట్ర ప్రయోజనాలు, నీటి అవసరాలపై సూటిగా మాట్లాడారు. చివరకు ఏకాభిప్రాయం దిశగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

దిల్లీ శ్రమశక్తిభవన్ వేదికగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ భేటీ గంటన్నరకు పైగా సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ‘ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలంగాణలో దేవాదుల, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి నిర్మాణాలు ప్రారంభించాను. బాబ్లీ ప్రాజెక్టుపై పోరాడాను. తెలంగాణకు అన్యాయం చేయలేదు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలూ ముఖ్యమే. కలిసి ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకుందాం’ అని వెల్లడించారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక అంశాలు, తెలంగాణ అవసరాలు సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడిస్తారని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంతకు ముందు కేంద్ర జలశక్తి శాఖ మంత్రికి రాసిన లేఖలోని అంశాలన్నింటినీ ప్రస్తావించారు. పాలమూరు- రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల డీపీఆర్‌ల ఆమోదం, వీటికి ఆంధ్రప్రదేశ్ చెబుతున్న అభ్యంతరాలు, శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఏపీ నీళ్ల మళ్లింపు, విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లడం, తెలంగాణ ప్రాజెక్టులకు నీటి అవసరాలు, టెలిమెట్రీల ఏర్పాటులో భిన్నాభిప్రాయాలు ఇలా అన్ని అంశాలు ప్రస్తావించారు. పోలవరం- బనకచర్ల అనుసంధానంపై కేంద్ర జలసంఘం, గోదావరి బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ వేదికపై చర్చించాల్సిన అవసరం లేదని కూడా ఆయన పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ఆసక్తికర చర్చలు, సంభాషణలు కొనసాగాయి.

అడుగు పడనివ్వండి వెంకటేశ్వర్లరావు!

టెలిమెట్రీల ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. ఈ దశలో ఏపీ సహచరుడు వెంకటేశ్వర్లరావు కలగజేసుకుని అంతర్రాష్ట్ర టెలిమెట్రీల ఏర్పాటుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం రిజర్వాయర్ల నుంచి కాలువలకు నీటిని మళ్లించే చోట టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ కలగజేసుకుని ‘ముందు అడుగు పడనివ్వండి వెంకటేశ్వర్లరావు’ అని చమత్కరించారు. రాయలసీమ ఎత్తిపోతల పనులపై ఒకానొక దశలో సీఎం రేవంత్ అభ్యంతరం వ్యక్తం చేయగా.. ఎలాగూ ఎన్జీటీ నిలుపుదల ఉత్తర్వులు ఉన్నాయి కదా అని చంద్రబాబు సమాధానం ఇచ్చారు.

మీ ప్రాజెక్టులకు ఎక్కడైనా అడ్డు తగిలామా: చంద్రబాబు

చంద్రబాబు: రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఎన్ని ప్రాజెక్టులు నిర్మించింది? ఆ ప్రాజెక్టులకు అనుమతులు ఉన్నాయా? ఎక్కడైనా ఆంధ్రప్రదేశ్ అడ్డు తగిలిందా, విభజన తర్వాత ఏపీ ఒక్క ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకుందా? మీరు కాళేశ్వరం, సీతారామసాగర్, సమ్మక్క బ్యారేజీ, పాలమూరు- రంగారెడ్డి నిర్మించుకోలేదా? మేమేమైనా అడ్డుపడ్డామా? ఎలాంటి అనుమతులు లేకుండానే మీ ప్రాజెక్టులు నిర్మించింది లేదా?

రేవంత్‌రెడ్డి: ఆ ప్రాజెక్టులన్నీ ఉమ్మడి రాష్ట్రంలో అనుమతులు తీసుకున్నవే. కొత్త ప్రాజెక్టులు కాదు.

చంద్రబాబు: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. ఆ ప్రాజెక్టుల స్కోప్, నిర్మించే స్థలం మారిస్తే వాటిని కొత్త ప్రాజెక్టులుగానే పరిగణించాలని బోర్డు నిర్ణయాలు ఉన్నాయి. (ఏయే ప్రాజెక్టులు ఎప్పుడు ఎలా మార్చారో చంద్రబాబు చదివి వినిపించారు)

రేవంత్‌రెడ్డి: మీకు రెండు రాష్ట్రాలపై ప్రేమ అంటే అంగీకరిస్తాం. మాకు కృష్ణాపై ప్రాజెక్టులకు 287 టీఎంసీలు కావాలి. ఆ నీళ్లు ఇచ్చేందుకు అంగీకరించండి. మీ ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పం. వీటిలో ఎక్కువ ప్రాజెక్టులు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించినవే. ఇలా కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు అంగీకరించండి. బేసిన్ బయట గానీ రాష్ట్ర పునర్విభజన తర్వాత గానీ ఏమైనా కేటాయింపులుంటే వాటిని ట్రైబ్యునల్‌కు అప్పగిద్దాం. వారు చెప్పినట్లు చేద్దాం.

చంద్రబాబు: కృష్ణా జలాలపై రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో రెండు రాష్ట్రాలూ నిర్ణయం తీసుకున్నాయి. కృష్ణాలో ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు తెలంగాణ, 512 టీఎంసీలు ఏపీ వాడుకోవాలని అంగీకారం కుదిరింది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ నిర్ణయాలు ఖరారయ్యే వరకు దీనికి కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నాం. అప్పుడు మన ఇద్దరం కూడా సీఎంలం కాము. ఆ సమావేశంలో లేము. కానీ ఆ నిర్ణయాలు రాతపూర్వకంగా ఉన్నాయి (చంద్రబాబు చదివి వినిపించారు)

రేవంత్‌రెడ్డి: ఇచ్చంపల్లి నుంచి 200 టీఎంసీల వరద నీటిని మళ్లించాలని తెలంగాణకు అనుమతివ్వాలి.

చంద్రబాబు: ఇచ్చంపల్లి వద్ద అనుసంధానానికి అవసరమైన నీళ్లు లేవు. అదే పోలవరం వద్ద ఒక్క శబరి నుంచే 500 టీఎంసీల వరకు వచ్చి చేరతాయి. ఆ నీళ్లు పోలవరం నుంచి మళ్లించడానికి ఆస్కారం ఉంటుంది. దిగువన ఏపీ పరీవాహకం నుంచి వచ్చే నీళ్లే ఎక్కువ. అవసరమైతే పోలవరం నుంచి తెలంగాణ ప్రయోజనాలకు నీళ్లు మళ్లించగలిగితే అవి ఇచ్చేందుకు అభ్యంతరాలు లేవు. ఆ విషయమూ ఆలోచిద్దాం. ఉభయ రాష్ట్రాలూ ప్రయోజనాలు పొందాలి.

రేవంత్‌రెడ్డి: వరద జలాలు లెక్కించలేదు

చంద్రబాబు: 40, 50 సంవత్సరాల రికార్డులున్నాయి. గోదావరి వరద జలాలపై అన్ని లెక్కలు ఉన్నాయి. ఈ విషయాలు పరిష్కరించేందుకు సాంకేతిక కమిటీని నియమించుకుందాం. ఏకాభిప్రాయం ఉన్న వాటిపై నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుదాం. (ఇందుకు రేవంత్‌రెడ్డి అంగీకరించారు).

కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు, ఏపీ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్.. ముగ్గురూ బ్యాచ్‌మేట్లే కదా! మీరు ముగ్గురూ కూర్చుని ఈ సమస్యలు పరిష్కరించవచ్చు కదా అని సమావేశంలో చర్చకొచ్చింది. సాయిప్రసాద్ కలగజేసుకుంటూ ఇది అధికారులే తేల్చేది కాదు.. సాంకేతిక నిపుణులే కాకుండా పాలనాధికారు (ఐఏఎస్)లను కూడా కమిటీలో చేర్చాలని సూచించారు.

అధ్యయనం తర్వాత తదుపరి రోడ్‌మ్యాప్



- ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య జల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశం చాలా స్నేహపూర్వక వాతావరణంలో, ఇచ్చిపుచ్చుకొనే విధానంలో జరిగిందని ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆయన బుధవారం ఈ సమావేశం ముగిశాక విలేకర్లతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాలు సమర్పించిన అంశాల్లో సాంకేతిక విషయాలు ఇమిడి ఉన్నందున దానిపై నిపుణల కమిటీ ఏర్పాటుచేసి అధ్యయనం చేసిన తర్వాత తదుపరి రోడ్‌మ్యాప్ తయారుచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. దాని ప్రకారం తదుపరి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసే ఆలోచన ఉంటుందన్నారు. “తెలుగు ప్రజలంతా ఒక్కటే. గత కొంతకాలంగా నలుగుతూ వస్తున్న సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకున్నాం. మిగిలిన విషయాలన్నీ సాంకేతిక అంశాలపై ఆధారపడి ఉన్నాయి. అందువల్ల సాంకేతిక కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ఒక రోడ్‌మ్యాప్ తీసుకొని ముందుకెళ్లాలని నిర్ణయించాం. కృష్ణా, గోదావరికి సంబంధించిన సాంకేతిక అంశాలన్నింటిపైనా ఇరురాష్ట్రాల అధికారులు కూర్చొని ఒక రోడ్‌మ్యాప్ తయారుచేసుకుంటే తర్వాత ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మళ్లీ కేంద్ర జలశక్తి మంత్రి చర్చించి సమస్యలు పరిష్కరించడానికి వీలవుతుంది. ఆంధ్రప్రదేశ్ చెప్పిన పోలవరం-బనకచర్ల, తెలంగాణ చెప్పిన కృష్ణా, గోదావరి నీటి లభ్యత అంశాల్లో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి కాబట్టి వాటిని ముందు సాంకేతిక, పరిపాలనా వ్యవహారాల అధికారులతో కమిటీ వేసి రోడ్‌మ్యాప్ తయారుచేయాలని భావించాం. రాష్ట్ర విభజన అనంతరం 2016, 2020ల్లో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. అవసరమైతే మూడోసారి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. ఈ కమిటీ ద్వారా ఇరు రాష్ట్రాలకు న్యాయం జరిగేలా ముందుకెళ్లాలని ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రమంత్రి ఆధ్వర్యంలో నిర్ణయించారు” అని రామానాయుడు పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు భద్రతకు సీడబ్ల్యూసీ సిఫార్సుల ప్రకారం మరమ్మతు చర్యలు తీసుకుంటామన్నారు.



మీ అవసరాలను బట్టే పెట్టుబడులు ఉండాలి

మీ బంధువు స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తుండొచ్చు. మీ స్నేహితుడు క్రిప్టో కరెన్సీ అత్యుత్తమ పెట్టుబడి అని చెప్పొచ్చు. మీ పొరుగింటి అంకుల్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను మాత్రమే విశ్వసిస్తుండొచ్చు. అంతమాత్రాన మీరూ వారిని అనుసరించాలని చూడటం సరికాదు. పెట్టుబడుల విషయంలో ఇతరుల అభిప్రాయాలు, సలహాలు తీసుకోండి. కానీ మీ అవసరాలు, ప్రాథమ్యాలను బట్టే మీ పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోండి.

– రాధికా గుప్తా, వ్యాపారవేత్త

వ్యవసాయ వృద్ధికి.. ధనధాన్య కృషి యోజన

(మొదటి పేజీ తరువాయి)

ఈ మూడూ తక్కువగా ఉన్న జిల్లాలను ఎంపికచేసి మిగతా జిల్లాలతో సమానంగా పైకి తీసుకురావడానికి చేయూతనందిస్తారు. దీనికింద 1.7 కోట్లమంది రైతులకు ప్రయోజనం లభిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. పథకం ప్రధానోద్దేశం.. ఈ 100 జిల్లాల్లో పంట ఉత్పాదకత పెంచడం, పంటల మార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం; పంచాయతీ, మండల స్థాయిల్లోనే పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచడమేనని చెప్పారు. ఉత్పాదకతను పెంచడానికి సాగునీటి సదుపాయాలు, స్వల్ప-దీర్ఘకాల రుణ వితరణను విస్తృతం చేయనున్నట్లు వివరించారు.

మూడు స్థాయిల్లో కమిటీలు

ధనధాన్య కృషి యోజనను సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటుచేస్తారు. జిల్లా ధనధాన్య సమితి.. జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, అభ్యుదయ రైతులు సభ్యులుగా ఉంటారు. పంటల వైవిధ్యం పాటించడంతోపాటు నీరు, భూసార సంరక్షణ, వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో స్వయంసమృద్ధి సాధించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తారు. ప్రతి జిల్లాలో ఈ పథకం పురోగతిని 117 ముఖ్యమైన సూచికల ఆధారంగా లెక్కిస్తారు. డ్యాష్‌బోర్డు ఏర్పాటుచేసి నెలవారీగా విశ్లేషిస్తారు. నీతి ఆయోగ్ కూడా ఎప్పటికప్పుడు సమీక్షించి జిల్లాలకు మార్గనిర్దేశం చేస్తుంది. పథకం అమలుకోసం ప్రతి జిల్లాకు కేంద్ర నోడల్ అధికారి ఉంటారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ పెట్టుబడులకు అనుమతి

పునరుత్పాదక ఇంధనోత్పత్తి రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వరంగ ఎన్టీపీసీకి క్యాబినెట్ అనుమతిచ్చింది. రూ.20వేల కోట్ల నిధులు సమీకరించుకునేందుకు పచ్చజెండా ఊపింది. 2032నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఎన్టీపీసీ, దాని అనుబంధ సంస్థ ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లు దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి వీలవుతుంది. నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ రూ.7వేల కోట్లను ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యూవబుల్స్ లిమిటెడ్‌లో పెట్టుబడి పెట్టడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

అంతరిక్ష కార్యక్రమంలో నూతనాధ్యాయం

రోదసిలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. భారత అంతరిక్ష కార్యక్రమంలో ఇది నూతన అధ్యాయాన్ని లిఖించిందని, దేశానికిది గర్వకారణమని శ్లాఘించింది. అంతరిక్ష యాత్రల్లో మన ప్రాధాన్యం మరింత పెరిగిందని పేర్కొంది. గగన్‌యాన్, భారతీయ అంతరిక్ష కేంద్రాలకు ఇదొక కీలక ముందడుగు అవుతుందని తెలిపింది. అంతరిక్ష రంగంపై ప్రధాని దార్శనికతను కొనియాడింది.

గ్రహం అనుగ్రహం

17-7-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
సప్తమి: సా. 6-15 తదుపరి అష్టమి
రేవతి: తె. 3-30 తదుపరి అశ్విని
వర్జ్యం: సా. 4-13 నుంచి 5-44 వరకు
అమృత ఘడియలు: రా. 1-15 నుంచి 2-45 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-56 నుంచి 10-47 వరకు తిరిగి మ. 3-06 నుంచి 3-58 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.37; సూర్యాస్తమయం: సా.6.34
దక్షిణాయనం ప్రారంభం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.5	29.0
నెల్లూరు	40.2	29.5
విజయవాడ	39.6	29.0
నరసాపురం	39.4	29.4
గుంటూరు	39.0	27.0
తాడేపల్లిగూడెం	38.9	27.8
తిరుపతి	37.7	28.1

ఏపీలో క్రీడల అభివృద్ధికి చేయూత ఇవ్వండి

- శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయండి.. రూ.538 కోట్లు ఇవ్వండి
- కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయకు సీఎం చంద్రబాబు వినతి



కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పౌరవిమానయాన శాఖమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బ్యాడ్మింటన్, తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరారు. వివిధ క్రీడా ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.538 కోట్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. దిల్లీ వచ్చిన ఆయన బుధవారం ఉదయం కేంద్రమంత్రిని కలిసి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. “ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా విధానం రూపొందించి క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకరించాలి. అమరావతి ప్రాంతంలో జాతీయ జల క్రీడలకు అవకాశం ఉన్నందున కృష్ణా తీరంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి. నాగార్జున విశ్వవిద్యాలయం, కాకినాడలలో నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల ఏర్పాటుకు సహకరించాలి. తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటల్లో ఖేలో ఇండియా కింద మౌలిక వసతులు కల్పించాలి. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.27 కోట్లు, గుంటూరు బీఆర్ స్టేడియంలో బహుళ క్రీడా సముదాయం ఏర్పాటుకు రూ.170 కోట్లు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ.341 కోట్లు మంజూరు చేయాలి. రాయలసీమ ప్రాంతంలో క్రీడాకారులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. ‘మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ 2025’ను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. వాటి నిర్వహణకు రూ.25 కోట్లు విడుదల చేయాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

ఆగస్టు 15 నుంచి ఒంగోలులో పుస్తక మహోత్సవం

ఒంగోలు, న్యూస్‌టుడే: విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీ, ఏపీ సాంస్కృతిక, గ్రంథాలయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులో మూడో పుస్తక మహోత్సవాన్ని ఆగస్టు 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది.

ఉచిత గ్యాస్ సిలిండర్‌కు సొమ్ము చెల్లించాల్సిన పనిలేదు

- గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు

ఈనాడు, అమరావతి: దీపం పథకం కింద అందించే ఉచిత సిలిండర్‌కు ఇప్పటినుంచి లబ్ధిదారులు ముందే సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. సిలిండర్ బుక్ చేసిన వెంటనే రాయితీని బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని ఆరు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. విజయవంతమైతే రాష్ట్రమంతా దీన్ని అమలు చేయాలని యోచిస్తోంది. ఇప్పటి వరకు అర్హత కలిగిన రేషన్ కార్డుదారులు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని మొత్తం సొమ్ము చెల్లిస్తే.. తర్వాత కొన్ని రోజులకు ఆ మొత్తం వారి ఖాతాల్లో జమ అయ్యేది. ఇకపై వారు ఆ మొత్తాన్ని చెల్లించాల్సిన అవసరం లేదు. సిలిండర్ బుక్ చేసిన వెంటనే.. లబ్ధిదారుల డిజిటల్ వాలెట్‌లోకి సొమ్ము జమ అవుతుంది. దాన్ని గ్యాస్ ఏజెన్సీలకు చెల్లించవచ్చు. కేంద్రం పరిధిలోని గ్యాస్ ఏజెన్సీల సహకారంతో పైలట్ ప్రాజెక్టు చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం చెప్పారు.

ఎన్‌హెచ్‌-65 విస్తరణకు మార్గం సుగమం

ఈనాడు, అమరావతి: అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65ని గొల్లపూడి వరకు విస్తరించేందుకు మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌కు లేఖ రాశారు. ఈ రహదారిని గొల్లపూడి వరకు 6 వరసలుగా విస్తరించాలని పట్టుబడుతూ ఎంపీ శివనాథ్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు దానికి ఆమోదించారు. మొత్తం 226 కి.మీ.కు డీపీఆర్ సిద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నీట్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

వైద్యవిద్యలో ప్రవేశం కోసం నిర్వహించే ‘నీట్’ కౌన్సెలింగ్‌పై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థుల అవగాహన కోసం **ఈనాడు- చదువు, శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ** సంయుక్తంగా ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్‌ను జూమ్ ప్లాట్‌ఫామ్‌పై నిర్వహించనున్నాయి.

సమయం: ఈ నెల 20 (ఆదివారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (వరంగల్) వైస్ ఛాన్సలర్ డా. పి.వి. నందకుమార్‌రెడ్డి, డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (విజయవాడ) రిజిస్ట్రార్ డా. వేమిరెడ్డి రాధికారెడ్డి, అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొంటారు. నీట్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ మెలకువలు, కాలేజీల ఎంపికలో జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు.

నీట్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలనుకునేవారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే...

20.7.2025 (ఆదివారం) నాడు...

- **క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.**

లేదా

- https://bit.ly/NEET_AP_TG వెబ్‌లింకు ఓపెన్ చేయండి.
- zoom id - 953 5620 4227 passcode - 037253 తో జాయిన్ కావచ్చు.

2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాది సెప్టెంబరులో చంద్రశేఖరన్ నేతృత్వంలో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్పర్సన్ ప్రీతారెడ్డి, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకులు, ఎండీ సుచిత్ర ఎల్ల, రెడ్డీస్ ల్యాబ్స్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జీఎం రావు, ఎల్అండ్‌టీ సీఎండీ సుబ్రహ్మణ్యన్, టీవీఎస్ మోటార్స్ ఛైర్మన్ ఎమెరిటస్ వేణు శ్రీనివాసన్, ఏపీ సీఐఐ విజయానంద్‌లతో కలిసి ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి కోసం అందించిన 356 పేజీల నివేదికను స్వీకరించాక ఆయన మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ లక్ష్యాలను ప్రకటించారు. 'మేం చాలా ఆశాజనకమైన ముందుచూపుతో వెళ్తున్నాం. 2047 నాటికి 180 బిలియన్ డాలర్ల నుంచి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకునేందుకు కృషి చేస్తున్నాం. తలసరి ఆదాయం 3,400 డాలర్ల నుంచి 42 వేల డాలర్లకు చేరుకోవాలన్నది లక్ష్యం. ఎగుమతులను 450 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లనున్నాం. ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఇటీవల వెల్లడించిన అంచనాల ప్రకారం 2025-29 మధ్య కాలంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉంది. ఏడాదిలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగాం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే 8.5 లక్షల ఉద్యోగాలు కల్పించగలం. 25 ఏళ్ల క్రితం కుటుంబానికో ఐటీ ప్రొఫెషనల్ నినాదంతో పనిచేశాం. దానివల్ల ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడికెళ్లినా అత్యధిక తలసరి ఆదాయాన్ని తెలుగువారు సంపాదిస్తున్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో కుటుంబానికో ఆంత్రప్రెన్యూర్ నినాదంతో పనిచేస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకొచ్చినా వారికి అన్నివిధాలా అండగా ఉంటాం. టాస్క్‌ఫోర్స్ సిఫార్సులన్నిటినీ మేం కచ్చితంగా అమలు చేస్తాం. వాణిజ్యవేత్తలు ఉన్నత సంపద సృష్టి కోసం, రాజకీయ నాయకులు ఉన్నత ప్రజలకు సాధికారత కల్పించడం కోసం. కొందరు నాయకుల్లో పారిశ్రామికవేత్తలు సొంత సంపాదన కోసం ప్రయత్నించేవారే అన్న అభిప్రాయం ఉంది. అది తప్పు మీరు సంపద సృష్టి ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నారు. పారిశ్రామికవేత్తలు సంపద సృష్టించవచ్చు పోతే ప్రభుత్వాలు ఆదాయం రాదు. అప్పుడు సంక్షేమ కార్యక్రమాలు అమలు సాధ్యం కాదు. అందువల్ల రెండు వ్యవస్థలూ కలిసి పనిచేయాలి. రాబోయే రోజుల్లో భారత్, భారతీయులు ప్రపంచం విస్తరించబోతోంది. రాబోయే 25 ఏళ్ల మనకు ముఖ్యం. నివేదిక రూపొందించేందుకు టాస్క్‌ఫోర్స్ సేవలందించినందుకు ప్రతినిధులు మరోసారి అభినందించి దాని ప్రకారం ముందడుగు వేయాలి. ప్రతి పారిశ్రామికవేత్త ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

టాస్క్‌ఫోర్స్ నివేదిక తయారీని గౌరవంగా భావిస్తున్నా

- చంద్రబాబుకు చాలా గుడ్‌విల్ ఉంది
- అందుకే చేయూతకు చాలా మంది ముందుకొస్తున్నారు
- టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం నివేదికను రూపొందించడాన్ని తాను గౌరవంగా భావిస్తున్నట్లు టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన సీఐఐ సదస్సులో ఆయన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించిన తర్వాత ప్రసంగించారు. "ఇటీ పరిశ్రమ బేజా అవుతున్నప్పుడు పాతికేళ్ల క్రితం చంద్రబాబు తో సన్నిహితంగా పనిచేసిన అనుభవం నాకుంది. ఈరోజు హైదరాబాద్‌లో టీసీఎస్ సహ పెద్ద ఐటీ కంపెనీలు కనిపించడానికి కారణం ఆయన దార్శనికతే అప్పట్లో మేం ఉదయం 6 గంటలకే సమావేశమయ్యేవాళ్లం. ఇప్పుడు మళ్లీ ఏపీ అభివృద్ధికి నివేదిక రూపొందించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ జీడీపీ దాదాపు 170 బిలియన్ డాలర్ల మేర ఉంది. వచ్చే 20 ఏళ్లలో ఏటా 15% వృద్ధి సాధించాలన్నది సీఎం లక్ష్యం. ఆ రాష్ట్రానికి ఏదైనా సాధ్యమే. ఈ నివేదికలో ప్రతి జిల్లాలో తలసరి ఆదాయాలు, అందులో మొదట, చివరి వరకు ఉన్న జిల్లాల గురించి చెప్పాం. ఆంధ్రకు చాలా బలాలున్నాయి. అందులో ప్రధానమైంది అత్యధిక సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగులు. ఇందులో చాలామంది ప్రపంచవ్యాప్తంగా చాలా పెద్ద హోదాల్లో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్‌గా నన్ను నియమించినట్లు వార్తలు రాగానే తామెలా సహాయపడగలమో చెప్పాలంటూ నాకు మెయిల్స్ పంపారు. చంద్రబాబుకు చాలా గుడ్‌విల్ ఉంది. అందుకే చాలామంది రాష్ట్రానికి వచ్చి చేయూత ఇవ్వాలనుకుంటున్నారు. అందువల్ల టెక్ ఇండస్ట్రీస్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో సరైన నాయకత్వాన్ని ఎంపికచేయడం పెద్ద కష్టం కాబోదు. రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి మిగతావన్నీ జరిగిపోతాయి. వ్యవసాయం, ఆహారం, పెట్రోకెమికల్స్, మైనింగ్ లాంటి రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయి. వీటన్నింటి గురించి నివేదికలో చెప్పాం" అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

'ఉపాధి' పనుల సామాజిక తనిఖీల్లో ఏపీ విధానం ఆదర్శనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

గ్లాడ్ స్టోన్, నిహార్ తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానం, శ్రేష్ఠ యిలో ఎదురవుతున్న సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీ సోషల్ విభాగం డైరెక్టర్ శ్రీకాంత్.. రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఉత్తమ విధానాల ద్వారా పనుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగింది న్నారు. ఉపాధి పనుల్లో ఏదైనా అవస్వంగా చేస్తున్న సోషల్ ఆడిట్‌ల వల్ల తలెత్తుతున్న ఇబ్బందుల ప్రస్తావనకు వచ్చాయి. వీటిల్లో అధునిక సాంకేతికతను వినియోగించాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సదస్సును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ ప్రారంభించారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉపాధి హామీ పథకం డైరెక్టర్లు, అధికారులు గురువారం నాటి సదస్సులో పాల్గొననున్నారు.

రీసర్వే వ్యవధిని పొడిగించాలి

(మొదటి పేజీ తరువాయి)

నాడు దొర్లిన తప్పులు సరిదిద్దేందుకే ప్రస్తుతం ఎక్కువ సమయం పడుతోంది. కూటమి ప్రభుత్వం తొలి విడత 628 గ్రామాల్లో చేపట్టిన రీసర్వే చివరి దశలో ఉంది. మరో 700 గ్రామాల్లో మలి విడత ప్రక్రియ మొదలైంది. ఉదాహరణకు ఒక గ్రామంలో వెయ్యి ఎకరాలు ఉంటే నలుగురు సర్వేయర్లు 60 రోజుల్లో రీసర్వే చేస్తున్నారు. కొందరు భూ యజమానులు సంబంధిత గ్రామాల్లో కాకుండా దూరప్రాంతాల్లో ఉంటున్నారు. రీసర్వే చేపట్టినప్పుడు సమాచారం ఇచ్చినా వారి నుంచి స్పందన కనిపించడంలేదు. వారి ఫోన్ నంబర్లను సేకరించడమూ ఇబ్బందిగా మారింది. ఈ సమస్యతో పాటు స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అదనంగా రీసర్వే పూర్తికి మరో నెల లేదా అంతకుమించి గడువు పెంచాలని రైతులు, రెవెన్యూ సిబ్బంది విన్నవిస్తున్నారు.

కొందరికి తగ్గుదల.. మరికొందరికి పెరుగుదల

- కృష్ణా జిల్లా గన్నవరం మండలం వెంకట నరసింహపురంలో రీసర్వే పూర్తయింది. 620.16 ఎకరాలకు రీసర్వే తర్వాత 619.806 ఎకరాలున్నట్లు తేలింది. 450 మంది రైతులకు 647 ఎల్‌పీఎంలు ఇచ్చారు. విస్తీర్ణం తగ్గిందని 46 మంది ఫిర్యాదులు చేశారు. వారికి రికార్డులను, నియమ నిబంధలను వివరించి, ఏకాభిప్రాయాన్ని సాధించారు. 146 మంది రైతులకు 1 సెంటు నుంచి 4 సెంట్ల మధ్య పెరిగింది. పంటల సమయంలో రీసర్వే చేపడితే ఇబ్బందిగా ఉందని స్థానిక రైతులు చెప్పారు.
- గన్నవరం మండలం చిక్కవరంలో రీసర్వే చివరి దశలో ఉంది. 3,088.51 ఎకరాలకు రీసర్వే అనంతరం 3,093.364 ఎకరాలున్నట్లు తేలింది. గ్రామంలో 1,986 మంది రైతులు ఉన్నారు. వీరిలో కొద్దిమందికి 1% సెంటు విస్తీర్ణం అదనంగా కలిసింది. 5% సెంట్లు కలిసిన వారు 70 మంది ఉన్నారు. ఈ మేరకు కొందరికి భూమి తగ్గింది.
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు కండ్రికలో రీసర్వే పూర్తయింది. 536.37 ఎకరాలను కొలిచారు. 541.207 ఎకరాలకు 240 ఎల్‌పీఎంలు కేటాయించారు. విస్తీర్ణం తగ్గిందంటూ ఐదుగురు రైతులు ఫిర్యాదు చేశారు.
- గుంటూరు జిల్లా కొల్లిపర మండలం కుంచవరంలో 356.130 ఎకరాల్లో రీసర్వే జరిగింది. 353.456 ఎకరాలున్నట్లు తేల్చారు.
- వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలం చెన్నమనేనిపల్లెలో 783.35 ఎకరాల్లో రీసర్వే నిర్వహించారు. తమ పొలాల విస్తీర్ణంలో రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తేడాలు వచ్చినట్లు పలువురు రైతులు చెప్పారు. 'మాకు 12 ఎకరాలకు సంబంధించి ఐదు సెంట్లు తేడా వచ్చింది. ఇక్కడ రైతులంతా సంతృప్తిగానే ఉన్నారు' అని రైతు రమణారెడ్డి అన్నారు.

అమరావతి రింగ్‌రోడ్డు వెంబడి హైటెక్ సిటీ

- ఇతర ప్రాంతాల్లోనూ శ్రీసిటీ నమూనా
- అమరావతి చుట్టుపక్కల మెడిసిటీ
- స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యసాధనకు టాస్క్‌ఫోర్స్ సూచనలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రింగ్‌రోడ్డు వెంబడి హైటెక్ సిటీని ఏర్పాటు చేయాలని, దానిలో కృత్రిమమేధ (ఏఐ), సెమీ కండక్టర్లతో పాటు ఇతర హైటెక్ ఇండస్ట్రియల్ హబ్‌లు అభివృద్ధి చేయాలని 'స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047 లక్ష్యసాధన దిశగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి' అన్న అంశంపై దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలతో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేసింది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డ్రోన్ రంగాల్లో ఏపీ ప్రత్యేకదృష్టి పెట్టాలని, దాని కోసం తిరుపతి జిల్లాలోని 'శ్రీ సిటీ' నమూనాను రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో అమలుచేయాలని సూచించింది. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిల్లో సమీకృత ఐటీ పార్కులు, ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటుచేయాలని, అభివృద్ధి, పరిశోధన (ఆర్ అండ్ డీ) వంటి నిర్దిష్టమైన విభాగాల్లో పనిచేసే సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని సూచించింది. అమరావతి చుట్టుపక్కల మెడిసిటీని అభివృద్ధి చేయాలని సిఫారసు చేసింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ కో-ఛైర్మన్‌గా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ రూపొందించిన 360 పేజీల నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో బుధవారం విడుదల చేశారు. వాటిలోని ముఖ్యాంశాలు ఇవీ...

- ప్రస్తుతం రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 72% విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి, కృష్ణా, ఏలూరు వంటి 15 జిల్లాల నుంచే వస్తోంది. ఆయా జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, మెరైన్, ఆక్వాకల్చర్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, లైఫ్‌సైన్సెస్, బల్క్ డ్రగ్స్, ఎంఎస్ఎంఈ, లాజిస్టిక్స్, రోబోటిక్స్, డేటా సెంటర్లు, ఏఐ, థీమ్ ఆధారిత పర్యాటకం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- పారిశ్రామికరంగంలో ప్రభుత్వ విధానాలన్నీ సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు, అవసరమైన మార్పులు చేసేందుకు, ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వ, పారిశ్రామికరంగ ప్రతినిధులతో పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటుచేయాలి.
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చంద్రబాబు ప్రతిపాదించిన పీ4 విధానం చాలా తోడ్పడుతుంది. ఇలాంటి నమూనాల్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుండాలి.
- రాష్ట్రాభివృద్ధి లక్ష్యానికి రుణాలు విఘాతంగా మారకుండా చూడాలి. ద్రవ్యనియంత్రణ చట్ట నిబంధనల అమలుకు స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలి. నీతి ఆయోగ్‌తో కలసి స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సిట్) నెలకొల్పాలి. రెవెన్యూ వ్యయాలకు రెవెన్యూ రాబడినే ఖర్చుచేయాలి. రుణాల ద్వారా తెచ్చిన నిధుల్ని మూలధన వ్యయంపై వెచ్చించాలి.
- ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్ (ఏఎంటీజెడ్) కాన్సెప్ట్‌ను ప్రమోట్ చేయాలి. లైఫ్‌సైన్సెస్, టెక్నాలజీ రంగాల్లో అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు ప్రపంచ శ్రేణి 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటుచేయాలి. సెమీకండక్టర్లు, ఫ్యాబ్స్, డిస్‌ప్లే యూనిట్‌లు, ఎనర్జీ స్టోరేజ్, సోలార్ సెల్స్ వంటి హై ఎండ్ ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి పరిశ్రమల్ని నెలకొల్పడంపై దృష్టిపెట్టాలి.

పెట్టుబడులకు ఉన్న అవకాశాలు

వ్యవసాయం, ఆహార శుద్ధి: రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతం, ఎగుమతులకు అనుగుణంగా అధిక విలువ కలిగిన ఉత్పత్తుల తయారీ, సీఫుడ్ పార్కులు, ప్యాకేజింగ్ సాంకేతికత, కోల్డ్ చైన్, ఆహార పరీక్ష ల్యాబ్స్, వ్యవసాయ పరికరాల తయారీ

ఎలక్ట్రానిక్స్: పీసీబీలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, విడిభాగాలు, ఐటీ, హార్డ్‌వేర్ డిజైన్, మొబైల్ కాంపొనెంట్స్, బ్యాటరీలు, సోలార్ సెల్స్, మాడ్యూల్స్, టెలికం పరికరాలు

జీవశాస్త్ర సాంకేతిక రంగం: ఏపీఐలు, బయోసిమిలర్స్, స్పెషాలిటీ డ్రగ్స్, క్లినికల్ పరిశోధన, మెడ్‌టెక్ జోన్

లాజిస్టిక్స్, పారిశ్రామిక మౌలిక వసతులు: అనంతపురం, విశాఖపట్నాల్లో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పోర్టు ఆధారిత ఆధునీకీకరణ, పోర్టుల అనుసంధానం, తీరప్రాంతాల అభివృద్ధి, నౌకారవాణా, ఉపరితల జలరవాణా

ఏరోస్పేస్, డిఫెన్స్: ఈ రంగాల్లో అవకాశాలు, హెవీ మినరల్, బీచ్‌శాండ్ ఆధారిత డిఫెన్స్ రంగ ఉత్పత్తి అవకాశాలు, మెటల్ గ్రేడ్ టైటానియం

నీలి ఆర్థిక వ్యవస్థ: పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో విస్తృత అవకాశాలు

ప్రసన్నకుమార్‌రెడ్డికి ముందస్తు బెయిలివ్వలేం

(మొదటి పేజీ తరువాయి)


లక్ష్యంగా చేసుకొని, ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పిటిషనర్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారన్నారు. తన వ్యాఖ్యలను సమర్థించుకునేలా మరునాడు వీడియో కూడా విడుదల చేశారని పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇతరుల మనోభావాలు, ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటానికి వీల్లేదని, ఇలాంటి విషయమై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ముందస్తు బెయిలు పొందేందుకు ప్రసన్నకుమార్‌రెడ్డి అనర్హులన్నారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి నిందితుడిని అరెస్టు చేయాలా, వద్దా అనే విషయం దర్యాప్తు అధికారి విచక్షణాధికారం మీద ఆధారపడి ఉంటుందన్నారు.

మోహిత్‌రెడ్డి బెయిల్‌పై విచారణ 23కు వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 23కు వాయిదా పడింది. ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను 23 వరకు పొడిగించింది. హైకోర్టు సింగిల్ జడ్జి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి లిక్కర్ కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు సమయం కోరడంతో విచారణ వాయిదా పడింది.

యువతకు జగన్ ఉగ్రవాదాన్ని నూరిపోస్తున్నారు: అనగాని

హిందూపురం, న్యూస్‌టుడే: ఎన్నికల అనంతరం ఏడాది వరకు బయటకు రాని జగన్ ప్రస్తుతం పరామర్శలు, పర్యటనలు అంటూ యువతకు ఉగ్రవాదాన్ని నూరి పోస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సత్యసాయి జిల్లా రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన పై వ్యాఖ్యలు చేశారు.



ప్రతికూల భావాలను వదిలించుకోవడమే సగం విజయం

మనం సానుకూల దృక్పథంతో ఉంటే, ఓ పనిని పూర్తి చేయడానికి ఎలాంటి మార్గాలున్నాయా అని మెదడు అన్వేషిస్తుంది. కానీ ప్రతికూల దృక్పథంతో ఉంటే, పని చేయలేకపోవడానికి సాకులు వెతుకుతుంది. అందుకే ఎల్లప్పుడూ సానుకూల ఆలోచనలను పెంపొందించుకోవాలి. ప్రతికూల భావాలను వదిలించుకున్నప్పుడే సగం విజయం సాధించినట్లు.

– క్రిస్టెన్ స్కేట్లర్, సైకియాట్రిస్ట్

త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్‌లు

(మొదటి పేజీ తరువాయి)

అటవీ శాఖలోనే 100 సెక్షన్ ఆఫీసర్ పోస్టులు, అదనంగా ఇతర శాఖలకు చెందిన మరో 75 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌లు ఇవ్వాల్సి ఉంది. అటవీ శాఖలోని సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ మాత్రం వారం రోజుల్లో ఏపీపీఎస్సీ ఇవ్వనుంది.

శాఖల వారీగా పోస్టులు

- మున్సిపల్ శాఖలో జూనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్ కేటగిరీ-2, సీనియర్ ఎకౌంటెంట్ కేటగిరీ-3, జూనియర్ ఎకౌంటెంట్ కేటగిరీ-4 - 11(మూడు కేటగిరీలు కలిపి), టెక్నికల్ అసిస్టెంట్ (భూగర్భ నీటిపారుదల)-04, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ (మత్స్యశాఖ)-03, హార్టికల్చర్ ఆఫీసర్ (ఉద్యానవన) - రెండు వరకు ఉన్నాయి.
- అగ్రికల్చర్ ఆఫీసర్ (వ్యవసాయ శాఖ) - 10, కార్య నిర్వహణ అధికారి (దేవాదాయ)- 07, జిల్లా సైనిక అధికారి-07, గ్రంథ పాలకులు (ఇంటర్ విద్య)-02, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ - 01 (క్యారీ ఫార్వర్డ్), జూనియర్ అసిస్టెంట్ - టైపిస్టు-1 (ప్రిజన్స్) (క్యారీ ఫార్వర్డ్)-1, ఇతర శాఖల్లో ఇంకొన్ని పోస్టులు ఉన్నాయి.

ఉమ్మడి పరీక్ష?: పైన పేర్కొన్న పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లు వెలువడేందుకు కాస్త సమయం తప్పని సరి. ఆయా పోస్టుల భర్తీ సిలబస్‌ను అనుసరించి.. ఉమ్మడిగా పరీక్షలు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలపై పరిశీలన జరుగుతోంది. అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులు, ఇతర పోస్టుల భర్తీలో ఇదే విధానాన్ని ఏపీపీఎస్సీ అనుసరించింది. అయితే.. ఒకే అభ్యర్థి రెండు, మూడు పోస్టుల భర్తీకి దరఖాస్తు చేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి పరీక్ష విధానంలో తలెత్తే సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. దీనిపై స్పష్టత వచ్చిన అనంతరం.. సదరు ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌లు జారీచేస్తారు.

మద్యం ముడుపుల్లో 90% 'బిగ్‌బాస్'కే

(మొదటి పేజీ తరువాయి)

డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని, ఇతరత్రా హవాలా మార్గాల్లో ఈ సొమ్ము రూటింగ్ చేసినట్లు వెల్లడైంది. ఎక్కువ భాగం బెంగళూరు, హైదరాబాద్‌ల్లో భూములపై పెట్టుబడులుగా పెట్టినట్లు, బినామీ కంపెనీలు పెట్టినట్లు సిట్ గుర్తించింది. ఈ మూలాలు వెలికితీస్తోంది.

ఆ ఇద్దరు నేతలకు నెలకు చెరో రూ.5 కోట్లు

'బిగ్‌బాస్' ఆదేశాల మేరకు నూతన మద్యం విధాన రూపకల్పన, ఎంతమేర ముడుపులు వసూలు చేయాలో నిర్ణయించటంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు ముఖ్య నేతలకు నెలకు చెరో రూ.5 కోట్ల చొప్పున వాటాలు అందేవి. వారిద్దరూ అప్పట్లో ఎంపీలే. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తలలో నాలుకలా వ్యవహరించేవారు. రాజ్ కెసిరెడ్డి ద్వారా ఎప్పటికప్పుడు ఈ డబ్బులు వారికి చేరేవి. ఓ నేతకు ముడుపుల వాటా సొమ్ము ఇవ్వటాన్ని మధ్యలో నిలిపేయటంతో విభేదాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఆ ముఖ్య నేత వైకాపాలో లేరు. మరో నేత ప్రస్తుతం ఆ పార్టీ ఎంపీగా ఉన్నారు. ఆయన ముడుపుల సొమ్ములో వాటాలు పొందటంతో పాటు ఓ డిస్టిలరీని గుప్పిట్లో పెట్టుకుని సొంత బ్రాండ్లతో మద్యం తయారు చేయించినట్లు సిట్ గుర్తించింది. ఆ మద్యాన్ని ఏపీఎస్‌బీసీఎల్‌తో ఎక్కువగా కొనుగోలు చేయించి.. భారీగా కొల్లగొట్టారు. వీరితో పాటు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్య స్థానంలో ఉన్న మరో నేతకు నెలకు రూ.50 లక్షల చొప్పున ఇచ్చేవారని సిట్ గుర్తించింది.

ముఖ్య అధికారికి నెలకు రూ.50 లక్షలు..

వైకాపా ముఠా ఏపీఎస్‌బీసీఎల్‌లో ఇద్దరు కీలక అధికారులను నియమించుకుని వారి ద్వారా మద్యం కథ నడిపించింది. ముడుపులు చెల్లించిన కంపెనీలకే అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇవ్వటం, ముడుపులు ఇవ్వని కంపెనీలను మార్కెట్ నుంచి తరిమేయటం వంటివి వీరితో చేయించింది. ప్రతిఫలంగా ఓ ముఖ్య అధికారికి నెలకు రూ.50 లక్షలు, మరో అధికారికి నెలకు రూ.20 లక్షల చొప్పున లంచాలుగా చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఆ ఇద్దరు అధికారులు రాజ్ కెసిరెడ్డి సూచించిన కంపెనీలకు మాత్రమే మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చేవారు.

ఓ కీలక అధికారికి నగదు ప్యాకెట్లు

'ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే.. అన్నీ తెలిసి మౌనంగా ఉన్నందుకు, పరోక్షంగా వాటికి సహకరించినందుకు ఓ కీలక అధికారికి ఈ ముఠా అప్పుడప్పుడూ భారీగా నగదు ప్యాకెట్లు అందజేసేది. ఒక్కో విడతలో రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి చొప్పున అందజేసేదని సిట్ గుర్తించింది. తనకు డబ్బులివ్వట్లేదని, పట్టించుకోవట్లేదని భావించిన ప్రతి సందర్భంలోనూ ఆ అధికారి.. ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ ఏపీఎస్‌బీసీఎల్‌కు ఓ మెమో ఇచ్చేవారు. ఇలా దాదాపు 35 మెమోలు ఇచ్చారు' అని గుర్తించి వాటికి సంబంధించి కీలక ఆధారాల్ని సిట్ సేకరించింది.

కొత్త కంపెనీలతో కొల్లగొట్టిన రాజ్ కెసిరెడ్డి

ముఖ్య నేతలకు వాటాలు, అధికారులకు లంచాలు పోనూ మిగతా సొమ్మును రాజ్ కెసిరెడ్డి ముడుపుల వసూళ్ల వ్యవస్థ నిర్వహించినందుకు కమీషన్‌గా తీసుకునేవారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, ముప్పిడి అవినాష్‌రెడ్డి, బూనేటి చాణక్య, పైలా దిలీప్‌లను ముందు పెట్టి క్యాష్ హ్యాండ్లర్ల వ్యవస్థను నిర్వహించేవారు. అంతేకాకుండా రాజ్ కెసిరెడ్డి.. తన వారితో కొత్తగా కొన్ని మద్యం సరఫరా కంపెనీలను ఏర్పాటు చేయించి.. వాటికి భారీగా సరఫరా ఆర్డర్లు దక్కేలా చేసుకున్నారు. దాదాపు 5 కంపెనీలకు రూ.వందల కోట్లు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి జమయ్యాయి. ఈ డబ్బుతో రాజ్ కెసిరెడ్డి ముఠా కూడా పలుచోట్ల భూములు కొనుగోలు చేసింది.. సినిమాలు తీసింది. స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టింది. దుబాయ్‌లో అనేక కంపెనీలు కూడా ఏర్పాటు చేసింది. ఈ వివరాలన్నీ సిట్ దర్యాప్తులో బయటపడ్డాయి.

ఏసీ బోగీకి నాలుగు కళ్లు!

విజయవాడలో సీసీ కెమెరాలు అమర్చిన రైలు బోగీ ప్రదర్శన

ప్రయాణికుల భద్రతను పెంచేందుకు రైల్వే శాఖ రైళ్లలో సీసీ కెమెరాలు అందుబాటులోకి తెచ్చింది. విజయవాడలోని డీజిల్ లోకోషెడ్‌లో సీసీ కెమెరాలను అమర్చిన ఏసీ బోగీలతో కూడిన రైలును బుధవారం అధికారులు ప్రదర్శించారు. ప్రతి బోగీకి ప్రవేశ మార్గం వద్ద 2, లోపల మరో 2 అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లోనూ స్పష్టంగా వీడియోలను రికార్డు చేసేలా హై క్వాలిటీ డోమ్ కెమెరాలను బిగిస్తున్నారు. ఇవి అన్ని వైపులా తిరుగుతూ వీడియోలను రికార్డు చేయగలవు. ఫుటేజీ పరిశీలనకు మినీ మానిటర్లను బోగీల్లో బిగించారు. వీటిని 24 గంటలూ పర్యవేక్షించడానికి సిబ్బంది ఉంటారు. ప్రయాణికుల గోప్యతకు భంగం కలిగించని ప్రాంతాల్లోనే కెమెరాలు బిగిస్తున్నట్లు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ వెల్లడించారు. బోగీల్లో సీసీ కెమెరాల పనితీరు డీఆర్ఎం పరిశీలించారు.

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్



ఏసీ బోగీ బయట సీసీ కెమెరా

కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ కుట్ర

మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టి సమాజంలో చీలిక తేవాలనే కుట్రతోనే జగన్‌మోహన్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. "జగన్‌కు ఉచిత గ్యాస్ సిలిండర్ అందలేదని.. ఇంకెవరికీ రాలేదంటే ఎలా? ఆయన ఈకేవైసీ చేయించుకోలేదేమో?" అని ఎద్దేవా చేశారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో బుధవారం మనోహర్ విలేకరులతో మాట్లాడారు. "గతేడాది అక్టోబరులో ప్రారంభించిన దీపం పథకం కింద మొదటి విడతలో రూ.846 కోట్లతో 97.59 లక్షల మందికి, రెండో విడతలో ఇప్పటి వరకు రూ.712 కోట్లతో 91.10 లక్షల మందికి ఉచిత సిలిండర్లు అందించాం. కావాలంటే గ్యాస్ కంపెనీల నుంచి వివరాలు తీసుకోండి" అని పేర్కొన్నారు. పోలీసు అధికారులపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. వైకాపా హయాంలో ధాన్యం రైతులకు రూ.1,674 కోట్ల బకాయిలు జగన్ ఎగ్గొట్టారని ఆరోపించారు.

మూడేళ్లలో చంద్రబాబు ఎగిరిపోతాడు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అతి ఉత్తమ పనితీరు, సంస్కరణలతో, పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో తలెత్తుకుని పని చేసే పరిస్థితి ఉండేది. పోలీసులు, కలెక్టర్లు స్పందన కార్యక్రమంలో వైకాపా కంటే తెదేపా వారి సమస్యలనే ఎక్కువగా పరిష్కరించేవారు. ఇప్పుడు చంద్రబాబు మాట వినకపోతే డీజీ స్థాయి అధికారులనైనా కేసులు పెట్టి వేధిస్తున్నారు. జీవితంలో మచ్చలేని అధికారులు కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ఇతర అమాయకులపైనా కేసులు పెట్టారు' అని జగన్ ఆరోపించారు.

డీఐజీలు వసూళ్లు చేస్తున్నారు: 'రాష్ట్రంలో డీఐజీలు మాఫియా డాన్లలా తయారయ్యారు. వారి పరిధిలో జరుగుతున్న అన్ని రకాల కుంభకోణాల్లో సొమ్ము వసూలు చేసే కలెక్షన్ ఏజెంట్లలా మారారు. ఈ డీఐజీలు వసూలు చేసిన దాంట్లో 50 శాతం స్థానిక ఎమ్మెల్యేలు, తన కింద అధికారులకిచ్చి.. మిగిలిన 50 శాతాన్ని పైకి పెదబాబు, చినబాబులకు పంపుతున్నారు' అని ఆరోపణలు గుప్పించారు.

జడ్పీ ఛైర్మన్లతో భేటీ

పలు ఉమ్మడి జిల్లాల వైకాపా జడ్పీ ఛైర్మన్లు పార్టీ అధ్యక్షుడు జగన్‌తో ఆయన నివాసంలో బుధవారం భేటీ అయ్యారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేసుకుందాం' కార్యక్రమం ఎలా జరుగుతోందని జగన్ వారిని ఆరా తీశారు. ఈ కార్యక్రమాన్ని మరింత ఉద్ధృతంగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక సంస్థల్లో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఇటీవల గుడివాడలో జడ్పీ ఛైర్‌పర్సన్ హారికపైన జరిగిన దాడిని ఖండిస్తూ ఆమెకు ఛైర్మన్లు సంఘీభావం తెలిపారని జగన్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.




ఈనాడు

అమానుషత్వానికి పరాకాష్ఠ!

'ప్రతిరోజూ చిన్నారులూ మహిళలూ వృద్ధుల శవాలను పూడ్చిపెడుతున్నాం. లోపలివాళ్లు బయటికి వచ్చేలోపే, వాళ్ల నెత్తిమీదే ఇళ్లన్నీ కూలిపోతున్నాయి'- గాజా నగర శివార్లలో ఇజ్రాయెల్ భీకర దాడిలో మిగిలిన శిథిలాల కింద తన ఇద్దరి పిల్లలకోసం ఒట్టి చేతులతో ఆశగా వెతుకుతున్న ఒమర్‌ను పాత్రికేయులు కదిలిస్తే ఇలా కన్నీటి పర్యంతమయ్యాడు. కళ్లలో దైన్యం, మాటల్లో నిర్వేదంతో జీవచ్ఛవంగా కనిపిస్తున్న అతను- 'మాకంటూ ఇప్పుడేమీ మిగల్లేదు. ప్రాణాలతో ఉన్న బిడ్డలనైనా సాదుకోనివ్వండి. ఈ మారణకాండకు ఏదో ఒక పరిష్కారం చూపించండి' అంటూ వేడుకున్నాడు. ఒమర్ ఒక్కడిదే కాదు- కష్టకోతలను తట్టుకోలేక గుండెలవిసేలా ఏడుస్తున్న కొన్ని లక్షల మంది గాజావాసుల దయనీయ ప్రార్థన ఇది! ఉగ్రవాదంపై యుద్ధం ముసుగులో జాతిహననానికి తెగబడుతూ, మానవత్వాన్ని చితిమంటల్లో తగలబెడుతున్న ఇజ్రాయెల్‌ను నిలువరించడంలో అంతర్జాతీయ సమాజ వైఫల్యానికి సాక్ష్యమిది! నెతన్యాహు నేతృత్వంలో సాగుతున్న నరమేధంలో ఇంతవరకు బలైన 59వేల మంది గాజావాసుల్లో డెబ్బైశాతం మంది పిల్లలు స్త్రీలే. కుటుంబాలకు కుటుంబాలనే కర్కశంగా కాలరాస్తున్న టెల్‌అవీవ్- అత్యంత హేయమైన హింసోన్మాదాన్ని ప్రదర్శిస్తూ మానవ నాగరికతకే మాయనిమచ్చ తెస్తోంది!

గుప్పెడు మెతుకులకోసం, గుక్కెడు నీళ్లకోసం అల్లాడిపోతున్న అభాగ్యుల తలల్లోకి తూటాలు దింపడమెంత రాక్షసత్వం! సాయం చేస్తామని పిలిచి, ఆశగా వచ్చినవారిని మారణాయుధాలకు ఎరవేయడమెంత మహాపాపం! గాజావాసులకు అంతర్జాతీయ మానవతా సాయమేదీ అందకుండా నానా ఆంక్షలు విధించిన ఇజ్రాయెల్- అమెరికాతో కలిసి 'గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్' పేరిట పన్నాగాలకు తెరతీసింది. టెల్‌అవీవ్ సేనలు తిష్ఠవేసిన ప్రాంతాల్లో జీహెచ్ఎఫ్ ఆరంభించిన ఆహార పంపిణీ కేంద్రాల దగ్గర బారులుతీరుతున్న వారిపై బులెట్ల వర్షం కురుస్తోందిప్పుడు. అలా ఆరువారాల్లోనే ఆరొందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మంచినీటి సరఫరా కేంద్రాలు, బావులను పాడుపెడుతున్న ఇజ్రాయెల్ బలగాలు- ఆసుపత్రులనూ కుప్పకూల్చుతూ గాజా ప్రజానీకాన్ని నరకయాతనలకు గురిచేస్తున్నాయి. పాలస్తీనియన్లను పస్తులతో మాడ్చి చంపుతూ, మౌలిక వసతులన్నింటినీ నాశనం చేస్తూ గాజాను మరుభూమిగా మారుస్తున్నాయి. ఆ నేలను నిర్జీవం చేసి మొత్తం స్వాధీనం చేసుకుంటామని టెల్‌అవీవ్ హూంకరిస్తుండటం వెనక అసలు దోషి అమెరికాయే!

అవినీతి, అధికార దుర్వినియోగం కేసుల్లో 2020 నుంచి విచారణలను ఎదుర్కొంటున్న నెతన్యాహు- తన ప్రధాని పదవిని కాపాడుకోవడానికే కావాలని కదనాన్ని పొడిగిస్తున్నారు. అప్పుడప్పుడు ఆయనను తమలపాకుతో కొడుతూ సుద్దులు చెప్పే అమెరికా- లోలోపల మాత్రం ఇజ్రాయెల్‌కు అన్ని విధాలుగా అండదండలు అందిస్తోంది. అంతర్జాతీయ శాంతిభద్రతలకు సంరక్షకురాలిని తానేనని అగ్రరాజ్యం- గాజాపై యుద్ధానికి దిగినప్పటి నుంచి ఏడాది కాలంలో ఇజ్రాయెల్‌కు 1790 కోట్ల డాలర్ల మేర సైనిక సాయం చేసింది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించని రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై వందశాతం సుంకాలు విధిస్తామని వదరుతున్న నాటో- ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనట్లేదు. గాజాలో మారణహోమాన్ని, ఇరాన్‌పై దాడులను ఇటీవల ఖండించిన 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు- మాస్కో యుద్ధపిపాసను గర్హించనే లేదు. వినాశకరమైన సమరాలను ఏకస్వరంతో నిరసించడంలో, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించే ధూర్త రాజ్యాలను అడ్డుకోవడంలో ప్రపంచ దేశాల అనైక్యత- మానవాళి సమష్టి శ్రేయస్సుకే ముప్పుగా పరిణమిస్తోంది. అదే విషాదకరం!




జీవితానికి అర్థం ప్రకృతిలో ఉంది. మనిషి ప్రకృతిని పూజించి ప్రకృతితోనే మమేకమై తన భావోద్వేగాలను ప్రకృతితోనే పంచుకునేవాడు. దాని స్థానంలో ఎప్పుడైతే కులం, మతం లాంటి అంతరాలు వచ్చాయో అప్పుడే మనిషి ప్రకృతికి దూరమయ్యాడు.

– బాబూరావ్ బాగుల్, మరాఠీ రచయిత

సంకల్ప బలం

మాటకు ప్రామాణికత ఉంది. వ్యక్తి సచ్ఛీలుడైతే మాటకు విలువ ఇస్తాడు. దానికి కట్టుబడి ఉండటం ప్రాణం కన్నా ప్రధానమని భావిస్తాడు. జూదంలో ఓడిన ధర్మరాజు రాజ్యాన్ని, సమస్త సంపదను కోల్పోవడమే కాక ప్రియమైన సోదరులను, ప్రాణంతో సమానమైన భార్యను కూడా ఓడిపోతాడు. తనకు వచ్చిన కల ఆధారంగా విశ్వామిత్రుడు, హరిశ్చంద్రుడి నుంచి రాజ్యాధికారంతో పాటు సమస్త సంపదను బాకీగా వసూలు చేయాలనుకుంటాడు. స్వప్న వృత్తాంతాన్ని అంగీకరించి హరిశ్చంద్రుడు రాజ్యాధికారాన్ని మహర్షికి అప్పజెప్పాడు. జీవితాంతం కష్టాల వరదను ఎదుర్కొన్నాడు. అయినా సంకల్పశక్తితో కీర్తి పొందాడు.

సంకల్పం అంటే కేవలం ఒక పదం కాదు. అది మనసులో మనకి మనం మననం చేసుకునేది కావచ్చు, నలుగురికీ తెలిసేలా బయటికి ఉచ్చరించేది కావచ్చు... దానికి అమూల్యమైన శక్తి ఉంది. సంకల్పం చెప్పుకొని ఒక పవిత్ర కార్యానికి ఉద్యుక్తమవుతాం. అనుకున్నంత మాత్రాన జరుగుతాయా, సంకల్పాలకు విలువేముందని విమర్శించవచ్చు! పురాణేతిహాసాలు, చరిత్ర పరిశీలిస్తే సంకల్పాలకు ఎంతో శక్తి ఉందని అర్థమవుతుంది. భగవంతుడి సంకల్పం మేరకు సమస్త సృష్టి జరిగింది. సూర్యచంద్రులు నియమం తప్పకుండా ప్రపంచాన్ని వెలిగిస్తున్నారు. ప్రతిభావంతులైన వ్యక్తుల సంకల్పాలు వారికి వ్యక్తిగతంగానే కాదు, మొత్తం మానవాళికి మేలు చేస్తాయి. మన నాగరికత, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి.. అన్నీ ఎందరో మేధావుల సంకల్పాలు సాకారమైన ఫలితాలే. బలహీనమైన సంకల్పాలు కార్యరూపం దాల్చవు. దుష్టులు కూడా సంకల్పాలు చెప్పుకొంటారు. అవి సమాజానికి హాని చేస్తాయి. అందుకే సంకల్పాలు బలమైనవిగా, పవిత్రమైనవిగా ఉండాలన్నది విజ్ఞుల మాట.



అంతర్యామి

విద్యార్థులు ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులు కావడం, మంచి ఉద్యోగాలు సాధించడం దాకా బలమైన సంకల్పాలు చేసుకోవాలి. సంకల్పాలు దృఢంగా ఉన్నప్పుడు ఆచరణకు కావాల్సిన ప్రేరణ దానికదే అందివస్తుంది. మంచి సంకల్పాలు సానుకూల శక్తికి కేంద్రాలు. సత్సంకల్పాలతో మనసు మంగళకరమై వినూత్న పరిమళంతో శోభిస్తుంది. మనసులో ఆరోగ్యకరమైన ఆలోచనలవల్ల శరీరానికి మేలుచేసే హార్మోన్లు విడుదలవుతాయి. భయాన్ని, ఓటమిని సంకల్పిస్తే ఎడ్రినలిన్ విడుదలవుతుంది. 'ఎదుర్కోలేవు పారిపో' అంటూ పిరికిమందును నూరిపోసే భావనలు చుట్టుముట్టి అపారనష్టం కలగజేస్తాయి. మంచి సంకల్పాలకు ధ్యానంలోనూ ప్రాధాన్యం ఉంది. సృష్టికి మూలం నుంచి ప్రవహించే పవిత్ర దివ్యశక్తి తన రోగాన్ని నయంచేస్తుందన్న బలమైన సంకల్పం, విశ్వాసం వైద్యుల చికిత్సకు తోడైతే ఆ రోగి త్వరగా కోలుకుంటాడు.


కర్మకు అనుగుణంగా ఫలితాలు ఉంటాయి! సంకల్పానికి అనుబంధంగా కర్మలు సాగుతాయి! 'నేను ఆరోగ్యంగా ఉన్నాను. నా జీవితం ఆనందంగా కొనసాగుతుంది' వంటి బలమైన సానుకూల సంకల్పాలు వ్యక్తిగత ప్రగతికి కేంద్రాలు! ఆచరణ, సంకల్పానికి సహజ అనుబంధంగా శోభిస్తుంది. మంచి సంకల్పాలు చెప్పుకోవడం, వాటిని విశ్వసించి ఆచరించడం వ్యక్తి శ్రేయస్సుకు, సమాజ సంక్షేమానికి ఎంతో అవసరం!

– గోపాలుని రఘుపతిరావు

యూపీఐ విప్లవం
సామాన్యులే సారథులు

మన దేశంలో డిజిటల్ లావాదేవీలు పోనుపోను జోరందుకుంటున్నాయి. ముఖ్యంగా కూరగాయలు విక్రయించే వ్యక్తి నుంచి పెద్ద షాపుల వరకు యూపీఐ వినియోగం విస్తృతమైంది. చాలా దేశాలు ఈ విధానాన్ని అందిపుచ్చుకోవడానికి ఆసక్తి చూపుతుండటం విశేషం.

దేశీయంగా ఇమీడియట్ పేమెంట్ సర్వీస్(ఐఎంపీఎస్), రూపే, ఇ-రూపీ వంటి డిజిటల్ చెల్లింపుల వేదికలను భారత జాతీయ చెల్లింపుల సంస్థ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-ఎన్‌పీసీఐ) నిర్వహిస్తోంది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.1,552 కోట్ల లాభాలు ఆర్జించింది. ఈ మొత్తం అంతకుముందు సంవత్సరంకన్నా 42శాతం అధికం. నేడు ఎన్‌పీసీఐ ద్వారా 21,300 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. ఎన్‌పీసీఐ 2016 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన యూపీఐ ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయింది. రోజులో 24 గంటలూ రియల్ టైమ్ యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. వినూత్న డిజిటల్ చెల్లింపుల పద్ధతి అయిన యూపీఐ ఇతర దేశాలకూ అనుసరణీయమవుతోంది. 2025 మే 31 నాటికి ఎన్‌పీసీఐలో 65 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, సహకార బ్యాంకులు, విదేశీ సంస్థాగత మదుపరి సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. 673 బ్యాంకులు యూపీఐ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. 80 యూపీఐ యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. నేడు ఫోన్ పే(47.23 శాతం లావాదేవీలు), గూగుల్ పే(36.66శాతం), పేటీఎం (6.95 శాతం)లు మార్కెట్లో ప్రధాన పాత్రధారులుగా నిలుస్తున్నాయి.



సులువుగా బ్యాంకింగ్ సేవలు

ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 49శాతం ఒక్క భారతదేశంలోనే జరుగుతున్నాయి. యూపీఐ వినియోగంలో హైదరాబాద్, కోల్‌కతాలు అగ్రస్థానంలో ఉన్నాయి. వీసా కార్డుల కన్నా యూపీఐ వినియోగం నాలుగు రెట్లు వేగంగా పెరుగుతోంది. ఏటా నలభై శాతం వృద్ధిరేటు నెలకొంటోంది. యూపీఐ మాస్టర్ కార్డును కూడా మించిపోతోంది. రోజుకు వంద కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగేలా చూడాలని భారత ప్రభుత్వం లక్షిస్తోంది. యూపీఐ లావాదేవీల విలువ, పరిమాణాలు వీసా, మాస్టర్ కార్డులకన్నా ఎక్కువ. ఈ ఏడాది మే నెలలో 1868 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. వాటి విలువ రూ.25 లక్షల కోట్లు. 2025 ఆర్థిక సంవత్సరంలో నిమిషానికి 3.50 లక్షల యూపీఐ లావాదేవీల చొప్పున జరిగాయి. యూపీఐ లావాదేవీలు ఒక శాతం అధికమైతే జీడీపీ 0.03శాతం పెరుగుతుందని అంచనా.

నేడు ఇండియాలో బ్యాంకింగ్, పెట్టుబడులు, చెల్లింపుల వంటి ఆర్థిక కార్యకలాపాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ఎక్కువైంది. ఈ తరహా సేవలు అందించే కంపెనీలను ఫిన్‌టెక్ సంస్థలంటారు. 2032కల్లా భారతీయ ఫిన్‌టెక్ రంగ విలువ 99,045 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇంటర్నెట్ వంటి డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, యువతరంలో సాంకేతికత వినియోగం పెరగడం వల్ల 2024 నుంచి 2032 వరకు ఫిన్‌టెక్ రంగం ఏటా 30.26శాతం చక్రీయ వృద్ధిరేటు చొప్పున నమోదుచేయనుంది. నేడు ప్రభుత్వ ప్రోత్సాహంతో ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు బ్యాంకులకూ మధ్య సంబంధాలు విస్తరిస్తున్నాయి. ఇప్పుడు కొని, తరవాత చెల్లించే పద్ధతి వ్యాపిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) మూలంగా స్మార్ట్ చాట్‌బాట్లు, రోబో సలహాదారులు పెరుగుతున్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ సాంకేతికతలూ విస్తరిస్తున్నాయి. సౌండ్‌బాక్స్, క్యూఆర్ కోడ్, యూపీఐ సర్కిల్, యూపీఐ లైట్, మిస్డ్‌కాల్ పేమెంట్ వంటి పద్ధతులు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. 2024నాటికి భారతదేశంలో పదివేలకు పైగా ఫిన్‌టెక్ సంస్థలున్నాయి. వాటిలో 26 సంస్థలు తలా వంద కోట్ల డాలర్ల నికర విలువను సాధించి యూనికార్న్‌లుగా ఎదిగాయి. ఒక సంస్థ వెయ్యి కోట్ల డాలర్ల డెకా కార్న్‌గా మారింది. ఫోన్‌పేకు నేడు 61 కోట్లమంది వినియోగదారులున్నారు. రేజర్ పే, పైన్‌ల్యాబ్స్ వంటి ఫిన్‌టెక్ సంస్థలు ఇతర దేశాలకూ వ్యాపించాయి.

ఆధార్, డిజిటల్ ఇండియా, జన్‌ధన్ యోజన వంటి పథకాలతో భారత ప్రభుత్వం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. యూపీఐ మీద ప్రజల్లో నమ్మకం పెరిగేలా ప్రభుత్వం వెన్నుదన్ను ఇచ్చింది. రిజర్వు బ్యాంకు ఎన్‌పీసీఐని, ఇన్నొవేషన్ హబ్‌నూ ప్రారంభించి డిజిటల్ లావాదేవీలకు విస్తృతి కల్పించింది. అందుకే యూపీఐ, ఆధార్‌లు డిజిటల్ మౌలిక వసతులకు అత్యున్నత ప్రతీకలని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కీర్తించారు. ఈ రెండింటి వల్ల దేశవ్యాప్తంగా అశేష ప్రజానీకానికి సులువుగా బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయని ప్రపంచబ్యాంకు కూడా ప్రస్తుతించింది. రిలయన్స్ జియో వంటి సంస్థలు చవకగా డేటాను అందించడం, డిజిటల్ ఐడీలు, బ్యాంకింగ్ సేవలు విస్తరించడం వల్ల యూపీఐ సామాన్య ప్రజల్లోకీ చొచ్చుకుపోయిందని ఐఎంఎఫ్ పేర్కొంది. ఫిన్‌టెక్ రంగంలో అమెరికా, బ్రిటన్, ఇండియాలు అగ్రగాములని ప్రపంచ ఆర్థిక వేదిక ప్రకటించింది.

అంతర్జాతీయ స్థాయికి...

నేడు ఫ్రాన్స్, యూఏఈ, సింగపూర్‌లతోపాటు ఏడు దేశాలు యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. 2028కల్లా 20 దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వు బ్యాంకు లక్షిస్తోంది. ముఖ్యంగా బ్రిక్స్‌ప్లస్, సార్క్ సభ్యదేశాలతోపాటు, ఇతర వర్ధమాన దేశాల్లోనూ ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. దీన్ని భారతదేశ ఆర్థిక దౌత్యంగా పరిగణించవచ్చు. డిజిటల్ లావాదేవీలతోపాటు సైబర్ మోసాలూ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2014-24 మధ్య దేశంలో లక్ష రూపాయలు, అంతకుమించిన డిజిటల్ చెల్లింపు మోసాలకు సంబంధించి 63,315 కేసులు నమోదయ్యాయి. మొత్తం రూ.733 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. రిజర్వు బ్యాంకు విధానాల్లో తరచూ మార్పులు జరగడం ఫిన్‌టెక్ సంస్థలకు సమస్యగా ఉంది. డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం అమలులోకి వచ్చిన తరవాత ఫిన్‌టెక్ రంగం మరింత పురోగమించడం వీలవుతుంది. ప్రస్తుతం విస్తరణే ప్రధానంగా సాగుతున్న ఫిన్‌టెక్ సంస్థలు లాభాల్లో పడితేనే ఈ రంగం భవిష్యత్తు పదిలంగా ఉంటుంది.



కొట్నాన రమేష్
సీనియర్ మేనేజర్, సెంటర్ ఫర్ బిజినెస్ ఇన్నోవేషన్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్

భరతజాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఎందరో వీరులు ప్రాణాలొడ్డి పోరాడారు. మరెందరో యుద్ధవిద్యలేమీ తెలియకపోయినా 'నేను సైతం' అంటూ ఉద్యమాలకు జీవితాలను అంకితం చేశారు. అలాంటివారి త్యాగాలను ముందుతరాలకు తెలియజేసేందుకు నిర్మించినవే వార్ మెమోరియల్స్. హైదరాబాద్ నగరానికి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో ఉన్న అనుబంధాన్ని తెలిపే వార్ మెమోరియల్ ఒకటి కోఠి బస్టాండ్ దగ్గరుంది. దానికీ, ఇవాళ్టి రోజుకీ సంబంధం ఏంటంటే...

అమరవీరులకు గుర్తుగా...



ఆరోజుల్లో హైదరాబాద్‌ని నిజాం అఫ్జలుద్దౌలా పాలించేవాడు. ఇప్పుడు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉన్న భవనమే నాటి బ్రిటిష్ రెసిడెంట్ డేవిడ్సన్ నివాసం. మీరట్‌లో ఎగసిన సిపాయిల తిరుగుబాటు తాలూకు జ్వాలలు దక్షిణాదికీ పాకాయి. మహారాష్ట్రలోని బుల్దానాలో కెప్టెన్ అబ్బాట్ ఆధ్వర్యంలో అశ్విక దళం తిరుగుబాటు చేసింది. జమేదార్ చీదాఖాన్ దానికి నాయకుడు. బ్రిటిష్ సైన్యం క్రూరంగా అణచివేసిన ఆ తిరుగుబాటులో ఎందరో పోరాట యోధులు మరణించారు. 15 మంది అనుచరులతో తప్పించుకున్న చీదాఖాన్ హైదరాబాద్ నిజాం రక్షణ కల్పిస్తాడని ఆశించాడు. కానీ ఆయనేమో వారు నగర పొలిమేరల్లోకి ప్రవేశించగానే పట్టుకుని బ్రిటిష్ సైన్యానికి అప్పగించాడు. రెసిడెన్సీలోనే చీదాఖాన్ బృందాన్ని బంధించారు. ఈ దుశ్చర్య హైదరాబాద్ పౌరులను కలచివేసింది. బ్రిటిష్ సైన్యంలో జమేదార్‌గా పనిచేస్తున్న పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ ఆగ్రహోదగ్రుడయ్యాడు. వాళ్లను విడిచిపెట్టమని నిజాంకు ఎంత చెప్పినా వినకపోవడంతో రెసిడెన్సీ మీద దాడిచేసి తిరుగుబాటుదారులను విడిపించాలనుకున్నారు. 1857 జులై 17 సాయంత్రం 5.30 గంటలకు వందలాదిమంది యోధులు ఆయుధాలు ధరించి తుర్రెబాజ్ ఖాన్ నాయకత్వంలో బేగంబజార్ మీదుగా రెసిడెన్సీ వైపు దూసుకెళ్లారు. పెద్దసంఖ్యలో ప్రజలు వీరావేశంతో వారికి మద్దతుగా వచ్చారు. రెసిడెన్సీ చేరుకున్న యోధులు పడమరవైపున్న రెండు పెద్దమేడలపై కెక్కి పొజిషన్ తీసుకున్నారు. ఆ మేడల్లో ఒకటి జైగోపాల్ పిత్తిది కాగా రెండోది అబ్బన్ సాహెబ్‌ది. రెసిడెన్సీ కాపలాదారులకు విప్లవకారులకు మధ్య చాలాసేపు కాల్పులు జరిగాయి. 32 మంది అమరులయ్యారు. బ్రిటిష్ పటాలాలకు పోటీ ఇవ్వలేమని గ్రహించిన విప్లవసైన్యం మృతులను, క్షతగాత్రులను మోసుకుని నిష్క్రమించింది. తుర్రెబాజ్ ఖాన్, మౌల్వి అల్లావుద్దీన్‌లు బ్రిటిష్ సేనలకు చిక్కకుండా తప్పించుకున్నారు. జులై 22న బ్రిటిష్ సైనికులకు దొరికిపోయిన తుర్రెబాజ్ ఖాన్‌కి అండమాన్ ద్వీపాంతరవాస శిక్ష విధించారు. ఈలోపే జైలు నుంచి తప్పించుకుని తూప్రాన్‌లో దాక్కున్న ఆయన్ని జనవరి 24, 1859న పట్టుకుని కాల్చి చంపేశారు తెల్లదొరలు. అదే ఏడాది మౌల్వి అల్లావుద్దీన్‌ని అరెస్టు చేసి అండమాన్‌కు పంపారు. తిరుగుబాటుకు పురికొల్పినందుకు మౌల్వి సయ్యద్‌ను కాల్చిచంపారు. సహకరించిన జైగోపాల్ దాస్ పిత్తి, అబ్బన్ సాహెబ్‌ల మేడలను నేలమట్టం చేశారు.

ఆనాటి పోరాటానికి గుర్తుగా కోఠి బస్టాండ్ సమీపంలో తుర్రెబాజ్‌ఖాన్ మెమోరియల్ స్థూపాన్ని 1957లో నిర్మించింది భారత ప్రభుత్వం. కోఠి బ్యాంక్ స్ట్రీట్ నుంచి జాంబాగ్ చౌరస్తాకు వెళ్లే మార్గానికి తుర్రెబాజ్‌ఖాన్ రోడ్ అని పేరుపెట్టింది.

– బసవరాజు నరేందర్ రావు

గాలే గరళమై

కట్టుతప్పిన పారిశ్రామికీకరణ, శిలాజ ఇంధనాల వినియోగం, జోరుగా సాగుతున్న గృహ నిర్మాణాలు వంటి వాటితో పీల్చే గాలే విషంగా మారుతోంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య భరిత దేశాల జాబితాలో నిరుడు భారత్ అయిదో స్థానంలో నిలిచింది. వాయు నాణ్యత అధ్వానంగా అఘోరిస్తున్న రాజధానుల్లో దిల్లీ అగ్ర భాగాన కొనసాగుతోంది. 'డబ్ల్యూహెచ్‌వో' ప్రమాణాల ప్రకారం ఘనపు మీటరు గాలిలో సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5) అయిదు మైక్రోగ్రాములకు మించకూడదు. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత దేశాలు, వాటిలో సగటు పీఎం 2.5 సాంద్రత...

చాద్	91.8
బంగ్లాదేశ్	78
పాకిస్థాన్	73.7
డీఆర్ కాంగో	58.2
ఇండియా	50.6
తజకిస్థాన్	46.3
నేపాల్	42.8
ఉగాండా	41
రువాండా	40.8
బురుండి	40.3
నైజీరియా	40.1

(ఆధారం: ఐక్యూ-ది వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్-2024)


శాంతి సుస్థిరతలకు సమన్యాయం

అంతర్జాతీయంగా న్యాయ సంరక్షణకు పిలుపిస్తున్న 'జస్టిస్ డే'ను నేడు జరుపుకొంటున్నాం. ఈ నేపథ్యంలో దేశదేశాల్లో బాధితులకు అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) అండగా నిలిచిన వైనాన్ని స్మరించుకోవడం సముచితం. యుద్ధాలు, బలాధిక్యత కోరలు చాస్తున్న తరుణంలో అందరికీ సమాన న్యాయం నేడు సవాలుగా మారింది. రోమ్ ఒప్పందంపై భారత్ సంతకం చేయకపోయినా విశ్వవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబాటు చాటుతోంది.

అన్యాయం ఎక్కడ జరిగినా అది అన్ని చోట్లా న్యాయానికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. గడిచిన పాతికేళ్లలో ప్రపంచం అనేక సాయుధ సంఘర్షణలను, బలాబలాల ప్రదర్శనలను, నిర్వాసితుల ప్రవాహాన్నీ చూసింది. యుద్ధ నేరాలు, అకృత్యాలు, దురాక్రమణలకు పాల్పడినవారిని శిక్షించే బాధ్యత అంతర్జాతీయ నేర న్యాయస్థానానికి (ఐసీసీకి) దఖలుపడింది. జెనీవా ఒప్పందాలు, జనహననం, చిత్రహింసలకు వ్యతిరేకంగా కుదిరిన అంతర్జాతీయ ఒడంబడికలు ఐసీసీకి పునాదిగా నిలుస్తున్నాయి. కానీ, ఐసీసీకి మూలమైన రోమ్ ఒప్పందంపై అమెరికా, రష్యా, చైనా, భారత్ వంటి శక్తిమంతమైన దేశాలు సంతకాలు చేయలేదు. ఇది ఐసీసీ పరిధిని కుదిస్తోంది. ఐసీసీకి మూలాధార ఒప్పందంపై భారత్ సంతకం చేయకపోయినా అంతర్జాతీయ న్యాయ సాధన పట్ల తన నిబద్ధతను ఎప్పటికప్పుడు చాటుకుంటూనే ఉంది. ఉగ్రవాదం, సైబర్ నేరాలు, దేశాల మధ్య సాయుధ సంఘర్షణలు పెరిగిన ఈ కాలంలో ఐసీసీ ఒప్పందంలో భాగస్వామి కావడంపై భారత్ పునరాలోచించాలని కొందరు న్యాయ, విధాన నిపుణులు సూచిస్తున్నారు.

భారత్ మానవతా సాయం

అతిపెద్ద లిఖిత రాజ్యాంగం, చట్టాలు, అంతర్జాతీయ న్యాయ సహకారం ద్వారా మానవ హక్కులు, న్యాయ సాధన పట్ల తన నిబద్ధతను భారతదేశం నిరూపించుకుంది. చట్టం ముందు అందరూ సమానులేనని 14వ రాజ్యాంగ అధికరణ స్పష్టం చేస్తోంది. వ్యక్తి స్వేచ్ఛ, ప్రాణాలకు 21వ అధికరణ భరోసా ఇస్తోంది. ఉచిత న్యాయానికి 39ఏ అధికరణ పూచీగా నిలుస్తోంది. ఇవే సూత్రాలు ఐసీసీ నిబంధనావళిలోనూ ఉన్నాయి. అందువల్ల తాను ప్రత్యేకంగా రోమ్ ఒప్పందంపై సంతకం చేయనక్కర్లేదన్నది భారత్ విధానం. అదీకాకుండా అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం (ఐసీసీపీఆర్), మహిళలపై అన్ని రకాల వివక్ష నిర్మూలన ఒప్పందం(సెడా), బాలల హక్కుల ఒప్పందం, దివ్యాంగుల హక్కులకు రక్షణ కల్పించే ఐక్యరాజ్య సమితి ఒప్పందంపై భారత్ సంతకం చేసిందని గుర్తించాలి. వీటి ఆధారంగా మానవ హక్కుల రక్షణకు భారతీయ న్యాయస్థానాలు పలు తీర్పులు వెలువరించాయి. పనిప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి సెడాకు అనుగుణంగా మార్గదర్శకాలను సుప్రీం ఒక తీర్పులో నిర్దేశించింది. అవి ఇతర వర్ధమాన దేశాలకూ అనుసరణీయమయ్యాయి.




అంతర్జాతీయ నేర న్యాయ వ్యవస్థలో భారత్ చురుకైన పాత్ర పోషిస్తోంది. గూఢచర్యం, ఉగ్రవాద నేరారోపణపై పాకిస్థాన్ సైనిక న్యాయస్థానం 2017లో కుల్‌భూషణ్ జాదవ్‌కు మరణశిక్ష విధించింది. ఆ కేసులో భారతీయ రాయబార కార్యాలయంతో సంప్రదించే అవకాశాన్ని జాదవ్‌కు పాక్ నిరాకరించింది. దాంతో వియన్నా ఒప్పందం కింద జాదవ్ హక్కుల కోసం భారత్ పోరాడగా, ఐసీసీ 2019లో ఇండియాకు అనుకూలంగా తీర్పిచ్చింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ఒప్పందాలను కేవలం నోటిమాటగా గౌరవించడం కాకుండా ఆచరణలో చేసి చూపించిన ఘనత భారతదేశానిది. 2023లో తుర్కియే-సిరియా సరిహద్దులో భూకంపం సంభవించినప్పుడు భారత్ ఆపరేషన్ దోస్త్ కింద మానవతా సహాయం చేసింది. కొవిడ్ సమయంలో వ్యాక్సిన్ మైత్రి పేరిట పేద దేశాలకు ఉచితంగా టీకాలు అందించింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ అరుణాచల్ ప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు చక్మా శరణార్థుల హక్కులను కాపాడింది.


తప్పనిసరి అవసరం

ఐరాస తరఫున సంక్షుభిత దేశాల్లో శాంతి పరిరక్షణకు పెద్ద సంఖ్యలో సైనికులు, పోలీసులను అందిస్తున్నది భారతదేశమే. భారత్ పంపే శాంతి సేనలో మహిళలూ పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఐరాస మానవ హక్కుల మండలి జరిపిన సార్వత్రిక నియతకాల సమీక్షలో భారత్ చురుగ్గా పాల్గొంది. మారుతున్న పరిస్థితుల్లో ఐసీసీ తన నమ్మకాన్ని, ప్రాసంగికతను నిలుపుకోవాలి. అందుకోసం తగిన సంస్కరణలు అవసరం. నేడు ఐరాస మానవ హక్కుల మండలితోపాటు ఐరోపా మానవ హక్కుల కోర్టు, ఆసియాన్ దేశాల మానవ హక్కుల సంస్థ వంటివి సంక్షోభాల నివారణకు కృషి చేస్తున్నాయి. సార్క్ న్యాయ సహకార సంస్థ, జెనీవా మానవ హక్కుల వేదిక వంటివీ నైతిక ప్రమాణాల రక్షణకు కట్టుబడి ఉన్నాయి. అయితే మానవ హక్కుల రక్షణ కేవలం నైతిక బాధ్యత కాదు- 21వ శతాబ్దంలో శాంతిసుస్థిరతలకు అత్యవసరమైన అంశమని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాలి.

– పీవీఎస్ శైలజ

సహాయ ఆచార్యులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల, హైదరాబాద్







కళ పెంచలేరా.. కనిపించలేదా..!



గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త టెర్మినల్ ముందు భాగం ఒకప్పుడు ఎంత అందంగా కనపడేదో.. అలాంటిది ప్రస్తుతం గోడపై మొక్కలు (వాల్ గ్రీనరీ) ఎండిపోయి కళావిహీనంగా మారింది. కింద మొక్కలు ఉండే బాక్సులు కూడా ఊడి పడిపోయాయి. ఒక్క మొక్క లేకుండా పూర్తిగా ఎండిపోయింది. విమానాశ్రయ అధికారులు స్పందించి పచ్చదనం పెంచేలా చర్యలు చేపడితే బాగుంటుంది.

- ఈనాడు, అమరావతి

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.4.37 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. 23 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.4,37,16,236 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. వీటితో పాటు 395గ్రాముల బంగారం, 9.614 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. లెక్కింపును ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.

హమ్మయ్యా.. దారికొచ్చింది..!

ఎన్‌హెచ్-65.. మరో 28 కి.మీ.ల విస్తరణకు ఆమోదం



ఈనాడు, అమరావతి: అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65ని గొల్లపూడి వరకు విస్తరించేందుకు మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అధికారికంగా ధ్రువీకరిస్తూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌కు లేఖ రాశారు. ఎంపీ రహదారిని గొల్లపూడి వరకు విస్తరించాలని పట్టుపట్టడం, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిర్ణయం మార్చుకున్నారు. ప్రస్తుతం పెరిగిన 28 కి.మీ.లతో కలిసి మొత్తం 226 కి.మీ.లకు డీపీఆర్ సిద్ధం చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు సిద్ధమవుతున్నారు.

వివాదాల నుంచి విస్తరణ దాకా: ఎన్‌హెచ్-65 విస్తరణ మొదట ప్రతిపాదనల ప్రకారం మల్కాపురం నుంచి విజయవాడ శివారులోని గొల్లపూడి దగ్గర పశ్చిమ బైపాస్ వరకు ఇప్పుడున్న 226 కిమీ నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించాలి. దీనికి రూ.8000 కోట్లు అవుతుందని అంచనా వేసి..డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గొల్లపూడి వరకు కాకుండా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను ఎన్‌హెచ్ అధికారులు లేవనెత్తారు. దీంతో విస్తరణ 226 కి.మీ. నుంచి 198 కి.మీ. తగ్గింది. ఈ ఆలోచనను ఎంపీ తీవ్రంగా వ్యతిరేకించి..సీఎం దృష్టికి తీసుకెళ్లగా సీఎం సైతం గొల్లపూడి వరకు ఆరు వరుసలు చేయాలని లేఖ రాశారు. ఫలితంగా విస్తరణ సాకారమైంది.

పశ్చిమ బైపాస్‌తో అనుసంధానం

విస్తరణతో పాటు పాత డీపీఆర్‌లో ఉన్న అంశాలు సైతం సాకారం కానున్నాయి. గొల్లపూడి మీదుగా వెళుతున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను ఈ ఎన్‌హెచ్‌కి అనుసంధానం చేస్తారు. దీని వల్ల హైదరాబాద్-విజయవాడతో పాటు, హైదరాబాద్-చెన్నై మార్గాన్ని కూడా అనుసంధానం చేసే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం దిగువ వరకు బైపాస్ వస్తోంది. దీంతో పాటు పరిటాల, ఐతవరం తదితర ప్రాంతాల్లోనూ బైపాస్‌లు వస్తాయి. ఇబ్రహీంపట్నం రింగ్ దగ్గర నిర్మాణానికి సమస్య ఉన్నందున వీటీపీఎస్ కాలువ వరకు ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇబ్రహీంపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే ఎన్‌హెచ్-30 కూడా అనుసంధానం అవుతుంది. ఇలా గొల్లపూడి వరకు రహదారి విస్తరించడం వల్ల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఒనగూరనున్నాయి.

ఏఐ తోడు.. ఏమార్చలేరు చూడు!

డిజిటల్ అరెస్టులను అరికట్టేలా ప్రత్యేక వ్యవస్థ

ఈనాడు, అమరావతి



డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ నేరగాళ్లు అందిన కాడికి దోచేస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించి.. కృత్రిమ మేధ సాయంతో.. వీరి ఆగడాలు అడ్డుకునేలా నగర పోలీసులు ప్రణాళిక సిద్ధం చేశారు. నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు నగదు బదిలీ చేసేందుకు బాధితులు బ్యాంకులకు వెళ్తున్నందున అక్కడే ప్రత్యేక వ్యవస్థ పెట్టనున్నారు. ఇందుకు ఐటీ నిపుణులతో సాంకేతికతను అభివృద్ధి చేయిస్తున్నారు. త్వరలో ఈ వ్యవస్థ దరిచేరనుంది.

నిన్నటి వరకు సిబ్బంది చొరవ... నగదు బదిలీ చేసేందుకు వచ్చే వారిని ఇప్పటి వరకు బ్యాంకు సిబ్బందే వివరాలు అడుగుతున్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు.. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసే వారిని గుర్తించి ప్రశ్నిస్తున్నారు. ఎవరికి పంపిస్తున్నారు? ఎందుకు బదిలీ చేస్తున్నారని? వివరాలు ఆరా తీస్తున్నారు. దీనికి బదులుగా బాధితుడు నేరుగా బ్యాంకుకు వచ్చాక అక్కడ ఉండే ఫోన్ వద్దకు వెళ్లాలి.

భావోద్వేగాలను పసిగట్టేలా... అక్కడ ఏఐతో రూపొందించిన బాట్‌బాట్ ప్రశ్నలు అడుగుతుంది. నగదు పంపాల్సిన బ్రాంచి.. ఐఎఫ్ఎస్‌సీ ఏంటి? ఏ అవసరానికి పంపుతున్నారు? డబ్బు కోసం ఎవరైనా ఒత్తిడి చేస్తున్నారా? ఏదైనా ఆపదలో ఉన్నారా? అని అడుగుతుంది. బాధితుడి భావోద్వేగాలనూ పసిగట్టేలా ప్రోగ్రామింగ్ రూపొందిస్తున్నారు. ప్రశ్నలు పూర్తయ్యాక.. బాధితుడి సమాధానాల మేరకు స్కోర్ ఇస్తుంది. ఆ వివరాలతో క్లర్క్ వద్దకు ప్రింట్ వస్తుంది. ఈ మేరకు అవసరమైతే ఖాతాదారుడికి కౌన్సెలింగ్ చేసి.. నిజంగా డిజిటల్ అరెస్టు బారిన పడితే లావాదేవీ జరగకుండా చూస్తారు.


విదేశాల నుంచి కాల్స్: డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్ కాల్స్ చేసే వారు.. భారత్‌లోని సిమ్‌లను వాడుతున్నట్లు తేలింది. ఇక్కడి సిమ్‌లను వారి ఏజెంట్ల ద్వారా యాక్టివేట్ చేయించి.. వాట్సాప్‌తో కనెక్ట్ అవుతున్నారు. తర్వాత ఆ నెంబర్లతో ఫోన్లు చేస్తూ నేరం చేశావనీ, అరెస్టు చేస్తున్నామని భయపెడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికి 210 నెంబర్ల నుంచి ఫోన్లు వచ్చినట్లు గుర్తించారు. వీటిని రకరకాల ఫోన్లలో వేసి మార్చి చేస్తున్నారు. సుమారు 1,210 ఐఎంఈఐ నెంబర్లను గుర్తించారు. నెంబర్లు కూడా తెలియకుండా వీపీఎన్ (వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్) ద్వారా బెదిరిస్తున్నారు. వీటి ఐపీ చిరునామాలు దొరక్కుండా మాస్క్ వేస్తున్నారు. ఎక్కువగా కంబోడియా, టాంజానియా, మలేషియా, సింగపూర్ నుంచి కాల్స్ వస్తున్నాయి.

బ్యాంకర్ల పాత్ర కీలకం... ఈ ఏడాది ఇప్పటికి 6 డిజిటల్ కేసులు నమోదయ్యాయి. నిరుడు 19 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టరయ్యాయి. ఈ తరహా నేరాలపై విస్తృత ప్రచారంతో 68 మంది మోసగాళ్ల నుంచి తప్పించుకున్నారు. వీటికి పూర్తిగా అడ్డుకట్ట వేయడంలో బ్యాంకర్లే కీలకం. ఇప్పటికి పోలీసులు మూడుసార్లు బ్యాంకర్లతో సమావేశాలు పెట్టారు. అన్ని బ్యాంకుల్లో డిజిటల్ అరెస్టు, పెట్టుబడి పేరుతో మోసాలు, తదితర నేరాల ఫ్లెక్సీలు, గోడపత్రాలు ప్రదర్శించాలి. ఎవరైనా ఆర్టీజీఎస్‌తో రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాన్ని పొదుపు ఖాతా నుంచి కరెంటు ఖాతాకు బదిలీ చేస్తే ఖాతాదారును ప్రశ్నించి అప్రమత్తం చేయాలి. ఈప్రక్రియ కొన్నాళ్లు బాగానే నడిచినా ఇటీవల పూర్తిగా సాగడం లేదు. లోపాలను అధిగమిస్తేనే మోసాలను నియంత్రించే వీలుంది.

తిరుపతమ్మ ఆలయంపై 70% సంతృప్తి

భక్తుల అభిప్రాయ సేకరణలో వెల్లడైన ఫలితం


అంశాల వారీగా..	సంతృప్తి శాతం
దర్శనం బాగా జరిగిందా?	71.4
మౌలిక వసతులు బాగున్నాయా?	62.6
ప్రసాదాలు తాజాగా, రుచిగా ఉన్నాయా?	75.5
పారిశుద్ధ్యం పరిస్థితి ఎలా ఉంది..?	67.9



పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: దేవాలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. తిరుపతమ్మ ఆలయంలో కీలక అంశాలపై భక్తుల అభిప్రాయాలకు పెద్దపీట వేస్తున్నారు. అమ్మవారి దర్శనాలు, మౌలిక వసతులు, పారిశుద్ధ్య చర్యలు, ప్రసాదాలు వంటి విషయాల్లో 70 శాతం భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయంలో విశాలమైన క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో ఒకేసారి వేల మంది దర్శనానికి వచ్చినా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లో రెండు ఉచిత క్యూలైన్లు నడుపుతున్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య లడ్డూ ప్రసాదాల నాణ్యతను స్వయంగా సమీక్షించి మెరుగుపరచాలని ఆదేశించారు. 25 మంది ప్రత్యేక సిబ్బంది ఆలయ పరిసరాల్లో నిత్యం పారిశుద్ధ్య సేవలు చేస్తున్నారు. విశాల కేశఖండనశాల, భక్తుల విశ్రాంతి మందిరం, ప్రత్యేక మరుగుదొడ్లను ఐదు నెలల కిందటే అందుబాటులోకి తీసుకురావడంతో కొంతమేర ఇబ్బందులు తీరాయి.

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం...

– కిశోర్‌కుమార్, ఈవో



ఐవీఆర్ కాల్స్ ద్వారా భక్తులు ఇస్తున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నాం. భక్తులకు నూరుశాతం సంతృప్తి కలిగేలా కృషి చేస్తున్నాం. ఇంకా ఏ అంశాల్లో సంతృప్తి తక్కువగా ఉందో వాటిపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటాం.

చివరి రోజు కౌన్సెలింగ్‌కు 218 మంది హాజరు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. చివరి రోజు 218 మంది కౌన్సెలింగ్‌కు వచ్చి తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఆర్మీ విభాగంలో 1,50,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు పిలవగా.. 28 మంది, దివ్యాంగుల విభాగంలో 129 మంది వచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో ఒకటి నుంచి ఆఖరి ర్యాంకు వరకు పిలవగా 61 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు.

కాలువలకు 13,464 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు బుధవారం 13,464 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 9,958 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,506 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,717, ఏలూరు 1,404, బందరు 2,311, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,526 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పసిగట్టేస్తుంది.. పనిపట్టేస్తుంది!

ప్రధాన రైలు బోగీలన్నింటా సీసీ కెమెరాలు



అమర్చిన సీసీ కెమెరా

ఈనాడు, అమరావతి – రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

'విజయవాడ డివిజన్ పరిధిలో ఇటీవల రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, దాడులు విపరీతంగా పెరిగాయి. వీటితోపాటు వేలుడు కలిగించేవి... మత్తు పదార్థాల రవాణా శ్రుతిమించిపోతోంది. ప్రధానంగా మహిళల భద్రతపైనా సందేహాలు పెరిగాయి. ఒంటరిగా మహిళల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. అయితే రైల్వే శాఖ తాజా నిర్ణయంతో రైళ్లలో నేరాలకు అడ్డుకట్ట పడనుంది. రైలు బోగీలో ప్రయాణికులు ఎక్కే మార్గం, లోపల వైపున అధునాతన సీసీ కెమెరాలను బిగిస్తున్నారు. తాజాగా విజయవాడ డీజిల్ లోకోషెడ్‌లో.. సీసీ కెమెరాలు అమర్చిన రెండు అధునాతన బోగీలను ప్రదర్శనకు ఉంచారు.'



కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న డీఆర్ఎమ్ నరేంద్ర పాటిల్

దేశీయంగా 74 వేల ప్రయాణికుల, 15 వేల సరకు రవాణా బోగీల్లో సీసీ కెమెరాలను తొలి దశలో భాగంగా అమర్చనున్నారు. వీటిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని రైళ్లలో కెమెరాలను బిగించారు. వాటిలో విజయవాడ డీజిల్ లోకో షెడ్‌లోనూ రెండు బోగీలను సిద్ధం చేశారు. ఈ కెమెరాల పనితీరు ఎలా ఉందనేది.. డీఆర్ఎం సహా అధికారులు బుధవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు నమోదు చేస్తున్న ఫుటేజీ చాలా స్పష్టంగా, రైలు ఎంత వేగంలో ఉన్నా.. ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా రికార్డు చేసేలా ఉందని అధికారులు వెల్లడించారు. విజయవాడ డివిజన్‌లోని అన్ని ప్రధాన రైళ్లలోని బోగీల్లోనూ సీసీ కెమెరాలను త్వరలోనే బిగించనున్నట్లు డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ తెలిపారు.

★ విజయవాడ రైల్వేస్టేషన్ మీదుగా.. నిత్యం రాకపోకలు సాగించే రైళ్లు: 250
★ ప్రయాణికుల సంఖ్య: 1.5 నుంచి 2 లక్షలు
★ సీసీ కెమెరాలు అమర్చే బోగీలు: 1000పైనే

డివిజన్ పరిధిలో చోరీలు.. ★ 2023: 398 ★ 2024: 388 ★ 2025: 146 (ఇప్పటికి)

దొంగతనాలకు ఇక అడ్డుకట్ట... రైలులో చోరీలు పెరిగాయి. కానీ.. దొంగలను పట్టుకోవడం కష్టంగా మారుతోంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో దీనికి అడ్డుకట్ట పడనుంది. మహిళలు బంగారం ధరించి కనిపిస్తే చాలు.. వారిని వెంబడిస్తూ అదనుచూసి దోపిడీ చేసే ముఠాలు పెరిగాయి. అందుకే రాత్రి వేళ మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయడం ప్రమాదకరంగా మారింది. ల్యాప్‌టాప్‌లు, బ్యాగ్‌లు దోచేస్తున్నారు. ఇవన్నీ ఎక్కువగా రాత్రుళ్లే జరుగుతున్నాయి. అందుకే.. ఉదయం, రాత్రి ఒకేలా రికార్డు చేయగల సామర్థ్యం ఉన్న స్టాండర్డైజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ (ఎస్‌టీయూసీ) ధ్రువపత్రం పొందిన అధునాతన సీసీ కెమెరాలను బిగించారు. రైలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న సమయంలోనూ ఇవి స్పష్టంగా రికార్డు చేయగలవని అధికారులు చెబుతున్నారు.

ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కేసులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని ఎరువులు, పురుగు నివారణ మందుల విక్రయ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేయాలని, ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కేసులు నమోదు చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని 15 నుంచి 20 శాతం తగ్గించాలని, ప్రకృతి సాగు విధానాల అమలు దిశగా అన్నదాతలు అడుగులు వేసేలా చూడాలని పేర్కొన్నారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని, భూసారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కలెక్టరేట్ నుంచి బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మంగళ, బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో యూరియా 12,737 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,729 టన్నులు, ఇలా మొత్తం 33,479 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నట్టు అధికారులు వివరించారు. కలెక్టరేట్‌లో డీఏవో విజయకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, క్షేత్ర స్థాయిలో ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయాధికారులు తదితరులున్నారు.



కలెక్టర్ లక్ష్మీశ

మీరు ఆక్రమించండి.. మేము చూస్తుంటాం

నష్టపరిహారం చెల్లించి తీసుకున్న స్థలాల్లో కట్టడాలు ★ బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా స్పందించని అధికారులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కనకదుర్గా పైవంతెన నిర్మించారు. అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించారు. స్థలాలు తీసుకున్నారు. రూ.లక్షల్లో నష్టపరిహారం చెల్లించారు. పరిహారం అందుకున్న వారిలో కొందరు ప్రస్తుతం అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ వైకాపా కార్పొరేటర్ కుటుంబ సభ్యుడు, కూటమిలోని ఓ పార్టీలో చేరిన వైకాపా కార్పొరేటర్ కాసులు దండుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. పైవంతెన నిర్మాణం.. రహదారి విస్తరణకు స్థలాలు తీసుకున్న సమయంలో చదరపు గజానికి రూ.54 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం కింద చెల్లించింది. ఆ సొమ్ము అందుకున్న వారిలో కొందరు వెళ్లిపోగా, కొందరు అక్కడే తిష్ఠ వేశారు. వాస్తవానికి విస్తరణ తరువాత మిగిలిన కొద్దిపాటి స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఇవ్వరు. వైకాపా అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుడొకరు సొమ్ములు తీసుకుంటూ. . భవనాలు, దుకాణాల నిర్మాణానికి సహకరిస్తున్నారని, మరో వైకాపా కార్పొరేటర్ కూడా కాసులు దండుకుంటూ అక్రమ కట్టడాలు కూల్చకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా పైవంతెన కింద రహదారికి ఇరువైపులా అనేక అక్రమ కట్టడాలు వెలిశాయి.



విస్తరణ తరువాత మిగిలిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

పరిరక్షణలో విఫలం

★ విస్తరణ తర్వాత కొంతమేర డ్రెయిన్లు నిర్మించి చప్టాలు వేశారు. మిగిలిన డ్రెయిన్లపై చప్టాలు వేసి అనుబంధంగా ఫుట్‌పాత్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. కానీ వాటిని సైతం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలన్న ప్రతిపాదన అటకెక్కింది.

★ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మిగులు స్థలాలను రక్షించలేకపోయారు. ఉద్యాన విభాగం అధికారులు పచ్చదనంతో అభివృద్ధి చేయలేకపోయారు. ఇంజినీరింగ్ అధికారులు ఇనుప కంచె అమర్చలేకపోయారు. ★ ప్రస్తుతం కొద్దిపాటి స్థలాల్లోనూ దుకాణాలు, లాడ్జీలు, వివిధ కార్యాలయాలు, వాణిజ్య భవనాలు అనుమతి లేకుండా కట్టేస్తున్నారు. వాటిని అద్దెకు ఇచ్చి రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

పన్ను విధించాలని ఒత్తిడి

అక్రమ కట్టడాలకు అధికారులు పన్ను వేయడం లేదు. పన్ను వేసేలా కార్పొరేటర్ల ద్వారా నగరపాలక సంస్థ అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నారు. విస్తరణలో మిగిలిన స్థలాలను తమకు అప్పగించాలని ఉన్నతాధికారులకు వినతులు సమర్పిస్తున్నారు. ప్రజాప్రయోజనం కోసం సేకరించిన స్థలాలకు నష్టపరిహారం చెల్లించినా.. తిరిగి ఆక్రమిస్తుంటే సంబంధిత అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అక్రమ కట్టడాలను అడ్డుకుంటాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. చిన్నపాటి నిర్మాణాలు జరుగుతున్నాయని పట్టించుకోలేదు. ఇకపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. - మురళీగౌడ్, ప్రణాళికాధికారి

వైద్య కళాశాలల్లో పరిశోధనలకు ఊతమిచ్చేలా ప్రత్యేక నిధి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధనలను ప్రోత్సహించేలా 'రీసెర్చ్ ఫండ్' ఏర్పాటుపై సిఫార్సుల కోసం కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలక మండలి నిర్ణయించింది. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ పాలక మండలి సమావేశం బుధవారం జరిగింది. వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ప్రభుత్వ ప్రైవేటు వైద్య కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా బోధన నైపుణ్యాలు, పరిశోధనలు పెంచాలని సూచించారు. విమర్శలకు తావు లేకుండా పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధకుల వృత్త్యంతర ప్రమాణాలపైనా దృష్టిపెట్టాలన్నారు. వర్సిటీ సొంత ప్రాంగణం, నూతన వైద్య కళాశాల నిర్మాణానికి అమరావతిలో భూమి కేటాయింపు ప్రతిపాదన తాజా పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాలల్లోని అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటుచేయాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు. సెప్టెంబరులో 27, 28వ స్నాతకోత్సవం నిర్వహించాలని, పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ కోర్సుల ప్రారంభించే అవకాశాలపై మార్గదర్శకాలు రూపొందించడానికి కమిటీ వెయ్యాలని నిర్ణయించారు. వీసీ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి, డీఎంఈ నరసింహం, ప్రజారోగ్య శాఖ సంచాలకులు కె.పద్మావతి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కీలక ఏజెంట్లు దొరక్క... రూ.45 కోట్ల లెక్క తేలక

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట: అద్వైక ట్రేడింగ్ కంపెనీ ఎండీ ఆదిత్యకు అత్యంత సన్నిహితుడైన కిరణ్‌కుమార్ నుంచి పోలీసులు వివరాలు రాబడుతున్నారు. అతను బుధవారం న్యాయవాదులతో విచారణకు హాజరయ్యారు. ఇతను అద్వైక ట్రేడింగ్ కంపెనీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. పెట్టుబడుల సేకరణలో కంపెనీ సీఈవో పొట్టి రవికిరణ్, డైరెక్టర్ కిరణ్ కీలకపాత్ర పోషించారు. ఆదిత్యతోపాటు రవికిరణ్ పోలీసుల అదుపులో ఉన్నారు. కిరణ్ మాత్రం అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్నారు.



కిరణ్‌కుమార్ బిజినెస్ వీసా

ఫస్ట్ ఛాయిస్ ట్రేడర్స్ పేరుతో... కిరణ్ రూ.40-50 కోట్ల మేర పెట్టుబడులు సేకరించాడు. వీటితో ఫస్ట్ ఛాయిస్ ట్రేడర్స్ పేరుతో కిరణ్ ఓ కంపెనీ ప్రారంభించాడు. కంపెనీ పేరు మీద బ్యాంకు ఖాతా తెరిచి.. రూ.10 కోట్లుపైగా పెట్టుబడిదారులతో నగదు జమ చేయించినట్లు తెలిసింది. ఇప్పటికీ ఫస్ట్ ఛాయిస్ ట్రేడర్స్ ఖాతా గురించి బయట పడకుండా ఆదిత్య, కిరణ్‌లు జాగ్రత్తపడినట్లు సమాచారం. మొదట్లో కిరణ్.. రూ.15 వేల జీతానికి మోతీలాల్ కంపెనీలో చిరుద్యోగిగా చేరాడు. అద్వైకలో డైరెక్టర్ అయినప్పటి నుంచి స్పోర్ట్స్ కారులో తిరుగుతున్నట్లు అతని పరిచయస్థులు పేర్కొంటున్నారు. జంగారెడ్డిగూడెంలో రూ.కోట్లు పెట్టి పెద్ద ఎత్తున పొలాలు కొన్నట్లు గుర్తించారు. ఏజెంట్ల నియామకంలోనూ కిరణ్ ప్రధానపాత్ర పోషించాడు. ఆదిత్య ఇప్పించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ బిజినెస్ వీసాతో దుబాయిలో సాన్వి కన్సల్టెంట్స్ అనే కంపెనీ ప్రారంభించాడు. దీనిద్వారా లావాదేవీలు జరిగాయా? లేదా? అనేది తేలాలి. నెల కిందట దుబాయిలోని మల్టీబ్యాంకు నుంచి పెట్టుబడిదారులకు చెందిన రూ.2 కోట్లు విత్‌డ్రా చేసి ఆదిత్యకు అందజేసినట్లు తేలింది.

పరారీలో ఐదుగురు ఏజెంట్లు... అద్వైక ట్రేడింగ్ కుంభకోణంలో 25 వేల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించగా.. 800 లావాదేవీల లెక్క తేలలేదు. ఇవి పరారీలో ఉన్న ఐదుగురు కీలక ఏజెంట్లవే. ఏజెంట్లు నాగసురేష్, రామ్మోహన్‌లు భవానీపురంలో కార్యాలయం తెరిచి తమ కార్యకలాపాలను నిర్వహించారు. వీరి లావాదేవీలను వారి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. వీరు దొరికితే లెక్కలన్నీ కొలిక్కి వచ్చినట్లే. ఇప్పటికే పోలీసులు ఏజెంట్లు, డైరెక్టర్ల పేర్ల మీద ఉన్న ఆస్తులను గుర్తించేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ లేఖ రాశారు. వారి కుటుంబ సభ్యుల పేరున ఉన్నవీ బయటకు తీస్తున్నారు. వీరి ఆధార్ వివరాలను పోలీసులు సేకరించారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వివరాలు వచ్చాక వాటిని అటాచ్ చేయనున్నారు.

మార్గదర్శకులే బంగారు కుటుంబాలకు వెలుగు రేఖ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పేదరిక నిర్మూలనకు పీ-4 విధానాన్ని అమలులో భాగంగా జిల్లాలో ఇంటింటా సర్వే ద్వారా 86,398 బంగారు కుటుంబాలను గుర్తించాం. వీరిలో 18,373 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఇప్పటికే 2,557 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. రెడ్ క్రాస్, విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, అమ్మా అసోసియేషన్‌ల వంటి సంస్థలు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. వారు చూపిన బాటే.. బంగారు కుటుంబాలకు వెలుగు రేఖ అవుతుందని చెప్పారు. నగరంలోని కలెక్టరేట్ వీసీ హాలులో వివిధ పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు, అసోసియేషన్ల ప్రతినిధులతో పీ-4 విధానంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పైస్థాయిలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను అన్నివిధాలా పైకి తీసుకువచ్చేందుకు వినూత్నంగా పీ-4 విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, సీపీవో వై.శ్రీలత, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

? కనకదుర్గనగర్‌లో నిర్మాణ సామగ్రి, వాహనాలను అడ్డదిడ్డంగా ఉంచుతున్నారు. ఇబ్బందులు పడుతున్నాం. - శివకుమార్, చిట్టినగర్
ఈవో: అభివృద్ధి పనులతో కొంత ఇబ్బంది ఏర్పడుతోంది. వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేస్తాం. వేసవి తీవ్రత నేపథ్యంలో భక్తుల పాదాలకు వేడి తగలకుండా.. నీటితో రోడ్డును తడుపుతున్నాం. ఇబ్బందిలేకుండా చేస్తాం.

? దసరాలో వినాయక ఆలయం నుంచి వేసే తాత్కాలిక క్యూలైన్లను శాశ్వతం చేసి ఏడాదంతా ఉంచితే బాగుంటుంది. - వై.సూర్యప్రసాద్ (పటమట), సత్యనారాయణ (బెజవాడ)
ఈవో: దుర్గగుడి అభివృద్ధికి రూపొందించిన బృహత్తర ప్రణాళికలో దీనిని పొందుపర్చాం. శాశ్వత క్యూలైన్లు ఏర్పాటు చేస్తాం.

? దుర్గమాల్‌లో మెట్లకు పాచిపట్టడంతో భక్తులు జారి పడుతున్నారు. నీళ్లు కూడా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. - శివప్రసాద్ (విజయవాడ), (ప్రసాదరావు (సత్యనారాయణపురం)
ఈవో: దుర్గమాల్ రూపురేఖలు పూర్తిగా మార్చే

దుర్గగుడి సమగ్రాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

✦✦ ఆలయంలో భక్తులు కేంద్రంగానే సౌకర్యాల కల్పన ✦✦ 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో ఈవో వీకే శీనానాయక్

ఈనాడు, అమరావతి - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

'దుర్గగుడి సమగ్రాభివృద్ధికి బృహత్తర ప్రణాళికను సిద్ధం చేశాం. భక్తులకు అవసరమైన సౌకర్యాలకే పెద్దపీట వేస్తున్నాం. క్యూలైన్లు, మాల్‌లోని, కనకదుర్గానగర్‌ను అభివృద్ధి చేస్తున్నాం. వయోవృద్ధులు, దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను అందుబాటులో తీసుకొచ్చాం. దశాబ్దాలుగా ఉన్న ఆక్రమణలు తొలగించి.. రహదారులను సుందరంగా మార్చాం. దుర్గఘాట్‌లోనే మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాలు, దుస్తులు మార్చుకునే గదులు, క్లోక్‌రూం కూడా ఏర్పాటు చేస్తున్నాం.' అని దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ వెల్లడించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈవోతో బుధవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. భక్తులు తమ సమస్యలను ఈవో దృష్టికి తీసుకొచ్చారు.

ఈనాడు మీతోడు


భక్తులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

స్తున్నాం. భక్తులకు సకల సౌకర్యాలు అక్కడే రాబోతున్నాయి. త్వరలో సమస్య తీరుతుంది.

? రూ.500 టికెట్ కొనే భక్తులకు దర్శనం టికెట్టో పాటు అమ్మవారి కనకదుర్గ ప్రత్తి, లడ్డు ప్రసాదం గతంలో ఇచ్చేవారు. ప్రస్తుతం ఆపేశారు. - శ్రీనివాసరావు, కానూరు
ఈవో: మళ్లీ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తాను.

? చండీహోమానికి యాగశాల సామర్థ్యానికి మించి టిక్కెట్లు ఇస్తుండటంతో.. భక్తులు చాలా మంది బయటే ఉండిపోతున్నారు. కనీసం కూర్చునే స్థలం కూడా లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నాం. - సింధూ, బెంజిసర్కిల్
ఈవో: నూతన యాగశాలను నిర్మించాం. సామర్థ్యం మేరకే టిక్కెట్లను ఇవ్వాలని ఆదేశిస్తా. ఎక్కువ రద్దీకి అనుగుణంగా రెండు యాగశాలల్లో చండీహోమానికి ఏర్పాటు చేస్తాం.

? దేవస్థానంలో పార్కింగ్‌లు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. వాహనాలు ఎక్కువదీకే ఆక్కడ నిలుపుతున్నారు. - శ్రీనివాస్, గాంధీనగర్
ఈవో: దుర్గగుడిలో స్థలాభావం వల్ల పార్కింగ్ సమస్య వస్తోంది. మల్టీలెవల్ కార్ పార్కింగ్‌కు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పాదరక్షలను ఉంచే కౌంటర్లు మరిన్ని పెంచుతాం.

? గిరిప్రదక్షిణ మార్గంలో సరైన సౌకర్యాలు లేవు. - సత్యనారాయణప్రసాద్, నాలుగు స్తంభాల సెంటర్
ఈవో: గిరిప్రదక్షిణ మార్గంలో అన్ని సౌకర్యాలు కల్పించేలా బృహత్తర ప్రణాళికలో పొందుపరిచాం. మరుగుదొడ్లు, మంచినీరు, సరైన మార్గం ఇలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

? ఘాట్ రోడ్డు మార్గం అధ్వానంగా మారిందని, భీటలు వారింది. - శ్రీనివాసరావు, అజిత్‌సింగ్‌నగర్
ఈవో: ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తూనే ఉన్నాం. మళ్లీ పరిశీలించి బాగు చేయిస్తాం.

? అంతరాలయ టిక్కెట్టు దేశంలోని ఏ ప్రముఖ ఆలయంలోనూ లేనంతగా రూ.500కు పెంచారు. తగ్గించండి. - శ్రీనివాసరావు, కృష్ణలంక
ఈవో: ఈ విషయాన్ని ప్రభుత్వం, దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

? సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో సిబ్బంది తక్కువ ఉండటంతో ఆలస్యం అవుతోంది. కొండపై దర్గా పొన్ను కొండపైకి తీసుకెళ్తున్నారు. - జి.వి.నరసింహారావు, జి.కొండూరు
ఈవో: సిబ్బంది సంఖ్య పెంచే ఏర్పాటు చేస్తాం. అలాగే విధిగా ఫోన్లను కౌంటర్‌లో పెట్టేలా చర్యలు తీసుకుంటాం. నిఘా పెడతాం.

? ఆలయ పరిసరాల్లో యాచకులు, హిజ్రాల సమస్య ఎక్కువగా ఉంది. - జయరామ్, విజయవాడ
ఈవో: ఇప్పటికే దాలావరకూ అదుపు చేశాం. సమస్య పరిష్కారానికి మరింత దృష్టి సారిస్తాం.

కసితీరా నరికేశాడు..

హోటల్ కార్మికుల దారుణ హత్య

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: సరదాగా ముగ్గురూ ఒకేచోట కూర్చున్నారు. మద్యం తాగారు. చిన్నపాటి వివాదం తలెత్తింది. మద్యం మత్తు.. వాదులాట.. కత్తి తీశారు. వెంటనే.. ఇద్దరిని కసితీరా నరికేశాడు. వారి ప్రాణాలు తీసి, పారిపోయాడు. విజయవాడ నగరంలో బుధవారం జరిగిన జంట హత్యల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా యనమలకుదురుకు చెందిన గాదె వెంకట నారాయణ (40), విజయవాడకు చెందిన ఎం.రాజు(40)లు గవర్నర్‌పేట‌లో రామ్ అనే వ్యక్తి వద్ద క్యాటరింగ్ పనులకు వెళుతుంటారు. అక్కడే డీబీ రావు వీధిలోని ఒక భవనంలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. కొత్తపేట పీఎస్ పరిధిలో ఉండే జమ్ము కిషోర్ అనే రౌడీషీటర్ కూడా క్యాటరింగ్ పనులకు వెళుతుంటాడు. అప్పుడప్పుడు వీరి గదికి వస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం ముగ్గురూ కలిసి మద్యం తాగారు. కొద్ది సేపటికి వారి గదిలో నుంచి కేకలు వినిపించాయి. పక్క గదుల్లో ఉండే వారు చెబుతున్నారు. తర్వాత కిషోర్ కంగారుగా బయటకు వెళ్లిపోతుండగా చూశానని.. అక్కడే ఉన్న బాషా అనే వ్యక్తి చెప్పాడు. ఆ గదిలోకి వెళ్లి చూడగా.. రాజు, వెంకట నారాయణలు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే ఆయన గవర్నర్‌పేట పోలీసులకు తెలియజేయగా సీఐ అడపా నాగమురళి హుటాహుటిన వచ్చారు.


క్యాటరింగ్ మేస్త్రి రామును ప్రశ్నిస్తున్న డీసీపీ సరిత, చిత్రంలో సీఐ నాగమురళి


మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

ముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించింది. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని పోలీసులు వెల్లడించారు. నిందితుడు పారిపోయిన డీటీ రావు లైనులోని సీసీ పుటేజీలు సేకరిస్తున్నారు. సౌత్ ఏసీపీ డి.పావన్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. డీసీపీ కె.జి.వి.సరిత విచ్చేసి వివరాలు సేకరించారు.

ఆధారాలు లేకుండానే గదుల అద్దెకు..?

చిన్న చిన్న ఇరుకు గదుల్లో పదుల సంఖ్యలో ప్రజలు అద్దెకు ఉండటం చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. దీని వ్యాపారులు అనేక మంది ఇక్కడే ఉండటం గుర్తించారు. ఆ గదిలో ఎవరు ఉంటారు? వారి వివరాలు ఏంటని అడిగితే.. కొంత మంది చెప్పలేకపోయారు. హతుల ఆధార్ కార్డులు ఏవి? అని క్యాటరింగ్ మేస్త్రి రామును అడిగితే లేవని చెప్పడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన వారి నుంచి వివరాలు తెలుసుకోవడంతో.. హతుల పేర్లు తెలిశాయి. హతుడు రాజు విజయవాడలో ఎక్కడ ఉంటాడో కూడా చెప్పలేకపోయారు. చిరునామా లేని వారికి గదులు ఎలా అద్దెకు ఇస్తారని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. నిందితుడు దొరికితే తప్ప.. గొడవకు కారణం తెలుస్తుందని వెల్లడిస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

గదంతా రక్తపు మడుగే..

వెంకట నారాయణ నేలపై పడి చనిపోయి ఉండగా.. రాజు కుర్చీలో ప్రాణాలు కోల్పోయాడు. నేలపైనంతా రక్తపు మడుగు కట్టి ఉంది. పదునైన ఆయుధంతో దాడిచేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరూ మద్యం మత్తులో ఉండటంతో.. గొడవ జరిగి కత్తితో దాడి చేస్తున్నా ఏం చేయలేకపోయారని ఒక నిర్ధారణకు వచ్చారు. క్లూస్ టీమ్ వేలి

విస్తృత గాలింపు

నిందితుడు కిషోర్‌ను పట్టుకోవాలన్న పట్టుదలతో

24 ఏళ్లకే నేరాల బాట..

జైలుశిక్ష అనుభవించినా అదే తీరు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలో జంట హత్యలు కలకలం రేపిన కేసులో నిందితుడు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ జమ్ము కిషోర్(45)గా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతను గొల్లపాలెంగట్టు ప్రాంతంలో ఉంటున్నాడు. అతను 24 ఏళ్ల వయసులోనే మహంతిపురం ప్రాంతానికి చెందిన నరసింహా కుమార్ అలియాస్ కుమారెడ్డిని పాత గొడవల, జూదం కారణంగా రేగిన వివాదంలో 2001 జనవరిలో కత్తితో పలుచోట్ల పొడిచి హత్య చేశాడు. ఆ కేసులో పదేళ్లు జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. అనంతరం ఆయుధాలు పట్టుకుని బెదిరించగా అతనిపై కేసు నమోదైంది. కొట్లాట కేసు ఒకటి ఉంది. పలు బైండోవర్ కేసులు ఉన్నాయి. 2011 అమ్మాయిలను వేధించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతనిపై కేసులు లేవు. భార్య పిల్లలను వదిలేశాడు. ప్రస్తుతం క్యాటరింగ్ చేస్తూ ఆదే మండలాల తీసుకుని పనుకోకుండా, ఒక్కొక్కసారి తెలిసిన వారి వద్ద ఉంటున్నాడు.


నిందితుడు కిషోర్ (పాత చిత్రం)

సౌత్ ఏసీపీ పావన్‌కుమార్ అన్ని విభాగాల పోలీసులతో కలసి నిఘా ఏర్పాటు చేశారు. గవర్నర్‌పేట, కొత్తపేట పోలీసులు, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడి బంధువుల సమాచారం ఆరా తీశారు. లాడ్జిలు, హోటళ్లు, మఠం మండలాలు అద్దెకు ఉన్న లాడ్జిలను జల్లెడ పడుతున్నారు. నేరం ఎందుకు జరిగిందని అనే దానిపై ఆరా తీస్తున్నారు. వీరి మధ్య ఏమైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా? గతంలో ఎప్పుడైనా గొడవ పడ్డారా? అనే విషయాలపై దృష్టి పెట్టారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా!

చెరువులో మునిగి ఇద్దరు బాలుర దుర్మరణం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం: ఈత సరదా ఇద్దరి పిల్లల ప్రాణాలు బలితీసుకుంది. వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఘటన గన్నవరం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొత్తపేటకు చెందిన పొట్టు సతీష్(15), నక్కా చైతన్యకుమార్(12), మరో బాలుడు తెండం గట్టు చెరువు దగ్గరకు సరదాగా ఈతకు వెళ్లారు. నీటిలోకి దిగగానే ఒక్కసారిగా చైతన్య ఊబిలో కూరుకుపోయాడు. అతడ్ని బయటకు లాగే క్రమంలో సతీష్ ప్రమాదంలో చిక్కుకున్నాడు. ఇద్దరూ కలిసి వెళ్లిన బాలుడు ఇరువురిని గాలి నుంచి భయంతో ఇంటికి పరుగులు తీశాడు.


మృతులు సతీష్, చైతన్య

ఈ విషయాన్ని స్థానికులు, తల్లిదండ్రులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలికి వచ్చేసరికి సతీష్, చైతన్యలు మునిగిపోయారు. చెరువులో గాలించగా మునిగిన చోటే కలుకుండా పడిపోయారు. బయటకు తీయగా అప్పటికే మృతి చెందారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆశలు ఆవిరయ్యాయి.. నక్కా చైతన్యకు తల్లి తండ్రి దుర్గారావు ఆటో డ్రైవర్, తల్లి కార్మికురాలిగా పనిచేస్తుంటారు. దుర్గారావు దంపతులకు చైతన్యతో పాటు ఓ అమ్మాయి సంతానం. పదో తరగతి చదివి బాలికగా ఉన్న సతీష్ తండ్రి నరసింహారావు గన్నవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. నరసింహారావు దంపతులకు సతీష్ ఏకైక సంతానం. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబాల్లో ఎక్కిలిపోవడంతో, సాయంత్రం పిల్లలతో సరదాగా మాట్లాడుతూ.. గడిపేటే సమస్యలన్నీ మరచిపోయేవారు. ఇక నుంచి తమ ఆశలు ఎవరికోసమని గుండెలు బాదుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారులు విగతజీవులుగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'జగన్ వల్లనే అధికారులు జైలుకు'

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ చేసిన పాపాల కారణంగానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పార్టీ నాయకులు జైలు పాలయ్యారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అధికారులు, నాయకులను జైలు పాల్జేసి తిరిగి అధికారంలోకి వస్తామంటూ జగన్ పగటి కలలు కంటున్నారని పేర్కొన్నారు. రూపాయలను దోచుకుని రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ పడవ గుండాలను వారి, ఉద్యోగులను నరకం చూపించిన జగన్ కు.. ఇప్పుడు వారి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

ఆర్థిక మోసం కేసులో నిందితుడి 14 ఎకరాల జప్తు

ఈనాడు, హైదరాబాద్: కొత్త నేర న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత సైబరాబాద్ పోలీసు తొలిసారిగా ఓ ఆర్థిక నేరంలో నిందితుడు అక్రమంగా కూడబెట్టిన ఆస్తుల్ని జప్తు చేశారు. కూకట్‌పల్లి కోర్టు న్యాయమూర్తి రాచర్ల శాలిని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాలోని వీర్లపాడు మండలంలో ఉన్న 14 ఎకరాల భూమిని జప్తు చేశారు. ఆర్థిక నేరంలో ఇంత మొత్తంలో భూమి జప్తు చేయడం ఇదే మొదటిసారి. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సైబరాబాద్‌లోని గచ్చిబౌలి రాజా ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అభినందించారు. మాదాపూర్ డీసీపీ జి.వినీత్ బుధవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

గచ్చిబౌలి పరిధిలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసే ఉద్యోగి తన స్నేహాన్ని ఉపయోగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు. మరికొందరితో కలిసి సరకు రవాణా ఛార్జీలు పెంచినట్లు నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడు. ఫలితంగా ప్రైవేటు కంపెనీకి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఈ అక్రమార్జనతో వచ్చిన డబ్బును నిందితుడు తన బంధువులు, స్నేహితుల బ్యాంకు ఖాతాల ద్వారా బదిలీ చేసి ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలంలోని కలగర, చంద్రుపట్ల, విస్సన్నపేట గ్రామాల్లోని వీర్లపాడు ప్రాంతాల్లో 14 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఈ ఆస్తులను ఆధారాల పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన సదరు ప్రైవేటు కంపెనీ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, ఎస్సై అనిల్‌కుమార్ దర్యాప్తు చేశారు. నిందితుడు అక్రమంగా సంపాదించిన డబ్బును తన పేరుతో కాకుండా ఇతరుల పేర్ల మీద పెట్టుబడులు పెట్టాడని తేలింది. వచ్చిన డబ్బుతో ఏయే ప్రాంతాల్లో స్థిరాస్తులు కొనుగోలు చేశాడో గుర్తించి ఆధారాలతో సహా కూకట్‌పల్లి కోర్టుకు నివేదించారు. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 107 ప్రకారం.. ఆ ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి ఇందుకు అనుమతిస్తూ తాజాగా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పోలీసులు భూమి జప్తును పూర్తిచేశారు. ఆర్థిక నేరాలకు సంబంధించి ఆస్తుల జప్తునకు ఆదేశించడం కీలక పరిణామమని డీసీపీ తెలిపారు.

30 రోజుల్లో ప్లాట్లు అప్పగించాలి

కేతనకొండ లేఅవుట్ ప్రాజెక్టుపై ఏపీ రెరా కీలక తీర్పు

ఈనాడు, అమరావతి: విజయవాడ సమీపంలోని కేతనకొండ లేఅవుట్ ప్రాజెక్టుపై ఏపీ రెరా కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సభ్యుల నుంచి మొదట మహులు చేసిన ధరకే 30 రోజుల్లోగా ప్లాట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని ఆదేశించింది. సభ్యుల నుంచి అధిక వసూళ్లకు ప్రయత్నించడం, సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడంపై ఆక్షేపణ తెలిపింది. అదనంగా సభ్యులు చెల్లించిన మొత్తంపై 11% వడ్డీని వారికి చెల్లించాలని తీర్పులో రెరా కోర్టు పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్వర్యంలో విజయవాడ సమీపంలో వేసిన కేతనకొండ లేఅవుట్‌లో దాదాపు 650 మంది ఉద్యోగులు ఇళ్ల స్థలాలు (ప్లాట్లు) కొని 2020-21 మధ్య రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. స్థలాలు కేటాయించినా 2023 వరకు లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఆ తర్వాత చదరపు గజానికి అదనంగా మరో రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని సొసైటీ అధ్యక్షుడు ఎ.సుబ్బరాజు కొనుగోలుదారులకు సూచించడంతో వివాదం మొదలైంది. అదనపు మొత్తాలు చెల్లించేందుకు కొనుగోలుదారులు అంగీకరించలేదు. దీంతో లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులు నిలిపివేయాలని.. దీనిపై బాధితుల్లో 20 మంది 2025 జనవరిలో రెరా కోర్టును ఆశ్రయించారు.

సీఆర్‌డీఏకు తనఖా పెట్టిన ప్లాట్లు అమ్మేశారు.. లేఅవుట్‌లో సీఆర్‌డీఏకు తనఖా పెట్టిన 10% కామన్ ఏరియాలో ప్లాట్లు కూడా సొసైటీ పాలకవర్గం విక్రయించడంపైనా కోర్టు ఆక్షేపణ తెలిపింది. ప్లాట్ల విషయంలో చేసే వసూళ్లు వాటిని అమ్మినందుకు కొనుగోలుదారులు చెల్లించిన మొత్తంపైనా ప్రతి నెలా 11% చొప్పున వడ్డీని చెల్లించాలని సొసైటీని ఆదేశించింది.

నర్సింగ్ ప్రిన్సిపల్‌ని విచారించిన కమిటీ

విజయవాడ వైద్యం: విజయవాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరమ్మను కమిటీ సభ్యులు బుధవారం విచారించారు. ఆమెను పలు అంశాలపై ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. ఆమెపై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మంగళవారం కొంత మంది విద్యార్థులను కమిటీ సభ్యులు విచారించారు.

చదువుల ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థి బలవన్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: చదువుల ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ వద్ద ఓ బాలుడు (17).. కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తండ్రి ఓ గుత్తేదారు వద్ద గుమస్తాగా, తల్లి నెల్లూరులో గార్డెన్ పని చేస్తున్నారు. చెల్లి పదో తరగతి చదువుతోంది. బాలుడు భవానీపురంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నుంచి తాను కళాశాలకు వెళ్లనని తల్లిదండ్రులతో చెప్పాడు. మార్కులు సరిగా రాలేదని అధ్యాపకులు కొడుతున్నారని తల్లిదండ్రులతో చెప్పగా వారు సర్దిచెప్పారు. గత నెలలో ఒకసారి కళాశాలకు వెళ్లనంటూ ఇంట్లో నుంచి పారిపోయాడు. ఆ తర్వాత తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులు ఇంటికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు విధులకు వెళ్లగా 8.30 సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఆ విషయాన్ని గమనించిన అమ్మమ్మ.. అల్లుడికి చెప్పింది. తల్లిదండ్రులిద్దరూ ఇంటికి వచ్చి కుమారుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా.. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లుగా తెలిపారు. దీంతో భవానీపురం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు విడ్డూరం'

పటమట, న్యూస్‌టుడే: జగన్ తన ఐదేళ్ల పాలనలో ఏనాడూ రాష్ట్రం గురించి పట్టించుకోలేదని అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ప్రజాప్రతినిధులు, నాయకుల వద్ద ప్రజలు కూటమి పాలనపై ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ తన ఉనికి కోసం ఏదో రకంగా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తూ.. బెట్టింగ్‌లో చనిపోయిన వ్యక్తులను పరామర్శించేందుకు వెళ్తున్న జగన్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. జగన్ అంటే విధ్వంసమనే విషయం ప్రజలు తెలుసుకున్నారని విమర్శించారు.


మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

ధర వరలు

వంకాయలు-24/26, టమాటా-32, బెండ-20, పచ్చిమిర్చి-72, కాకర-35, బీర-24/30, క్యాబేజీ-24, క్యారెట్-32/44, దొండ-26, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరు చిక్కుడు-32, దోస-16, సొర-12/10, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-30, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-3, కంద-54, బీట్ రూట్-32, కీరదోస-50, బీన్స్-95, క్యాప్సికం-95(నున్నలో). - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

పాఠశాల నిర్లక్ష్యం.. అందని తల్లికి వందనం

మైలవరం, న్యూస్‌టుడే: ఓ పాఠశాల ఉద్యోగుల నిర్లక్ష్యంతో వందలాది మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం దూరమైంది. వివరాల్లోకి వెళ్తే మైలవరంలోని నారాయణ పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. గతంలో పథకం అందుకున్న వారిలో ఈ ఏడాది తల్లికి వందనం నగదు జమకాగా.. ఇంకా 172 మందికి అందలేదు. దీంతో పిల్లల తల్లిదండ్రులు అడిగినా సరైన సమాధానం లేకపోవడంతో బుధవారం ఎంతమంది బాలలు ఫిర్యాదు చేయగా.. ఆయన సమక్షంలో పాఠశాల ఏజీఎం, ప్రిన్సిపల్‌తో సమావేశమయ్యారు. ఆన్‌లైన్ వివరాల నమోదులో జరిగిన పొరపాటుతోనే ఇబ్బంది కలిగినట్లు యాజమాన్యం సమాధానమిచ్చింది. దీంతో ఫిర్యాదును ప్రభుత్వ గమనిక మేరకు, ఈ విధి నష్టపోయారిలేదా అని తల్లిదండ్రులు ప్రశ్నించారు. .. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని, ఉదరకోశాలు యాజమాన్యం చేశారు. పేర్ల జాబితాలో వచ్చేలా ప్రయత్నిస్తామని, తప్పకుండా ప్రభుత్వం హామీ ఇవ్వడంతో శాంతించారు. దీనిపై ఎంతమంది బాలలు పాఠశాల యాజమాన్యం హామీ ఇచ్చినందున ఇబ్బంది ఉందని పేర్కొన్నారు.


పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశమైన స్కూల్ ప్రతినిధులు, ఎంతమోని బాలు, నాయకులు

క్షయ నివారణపై అవగాహన

కరెన్సీనగర్, విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో టీబీ వ్యాధిపై అవగాహన, నిర్ధారణ చర్యలు, ఉచిత మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పలు లింక్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం టీబీ డివిజన్ బృందం సభ్యుడు డాక్టర్ భావానిసింగ్ కుశ్వాహా వచ్చారు. నగరంలోని ఏపీఐఐసీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. వైద్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారంతా సిద్ధార్థ వైద్య కళాశాలలోని సీడీఎస్‌టీబీ ల్యాబ్‌ను సందర్శించారు. అక్కడి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉపయోగిస్తున్న పరికరాలను పరిశీలించారు. బృందంలో టీబీ అధికారి డి. ధర్మారావు, గంగాధర్ దాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. వివరిగా టీబీ వ్యాధిపై అప్రమత్తత, అవగాహనకు సంబంధించి గోడపత్రిక ఆవిష్కరించారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న భావానిసింగ్ కుశ్వాహా తదితరులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

గురుకులంలో భోజనంపై ఆర్డీవో ఆగ్రహం


క్యాబేజీ నాణ్యత పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొండపర్వలో గల గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో ఆహారం తయారీ, నాణ్యతపై తిరువూరు ఆర్డీవో కె. మాధురి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆమె సందర్శించి భోజనశాలతోపాటు..వంట గదిని పరిశీలించారు. కూరగాయలు నాణ్యత లేకపోవడం, మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందించకపోవడాన్ని గుర్తించారు. స్టాక్ రిజిస్టర్లో నమోదు లేదా ఉన్నట్లు గమనించి మండి పడ్డారు. నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో పేదల నివేశన స్థలాల క్రమబద్ధీకరణను పరిశీలించారు.

భవన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో దర్జీల సంఘం భవన నిర్మాణానికి సహకరిస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి భవనం లేక పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లామని, బైపాస్‌లో 5 సెంట్ల స్థలంలో భవనాన్ని నిర్మిస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించినట్లు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిపై ఆయన స్పందించి వీలైనంత త్వరలోనే ఏర్పాటుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షుడు శివపార్వతి, దర్జీలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రీనివాసరావుతో దర్జీల సంఘం

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 17న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

వృద్ధురాలి నేత్ర దానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెంలోని చెందిన వృద్ధురాలు కొత్త రాదమ్మ(75) అనారోగ్యంతో బుధవారం మరణించగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు న్యూ వారి గోనిరెడ్డి కృష్ణారెడ్డి సహకారంతో విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు అందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసబాబు, శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

జి.కొండూరు, న్యూస్‌టుడే: వర్షాభావ పరిస్థితుల్లో పత్తి, పైరు రక్షణకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీఏ మానీషా సూచించారు. చెవుటూరు, వెంకటాపురం గ్రామాల్లో ఆమె బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సూరిబాబు, వీఏఏ శిరీష, రఘు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

ఇబ్రహీంపట్నం: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు బుధవారం ఇబ్రహీంపట్నం 16వ డివిజన్ మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు వివిధ రకాల మిఠాయిలతో ఊరేగింపుగా దుర్గగుడికి చేరుకుని సారె సమర్పించి దర్శనం చేసుకున్నారు.

పత్రాలు చూపిస్తేనే పనులు..?

అనుమతుల్లేని లేఔట్ నిర్వహణ నిలుపుదల

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే

మండలంలోని కొత్త చంద్రగూడెంలో ప్రధాన రహదారి పక్కన కడుతున్న ప్రయివేటు లేఔట్ పనులను బుధవారం పంచాయతీ, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో భారీగా ప్లాట్లు వేసేందుకు కొందరు వ్యక్తులు గత రెండు నెలలుగా పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అంతర్గత రహదారుల ఏర్పాటులో నిమగ్నమై, జి.కొండూరు మండలం నుంచి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్నారు. సదరు లేఔట్‌కు అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా పనులు చేస్తున్నారన్న ఫిర్యాదుతో, బుధవారం పంచాయతీ కార్యదర్శి మీరాసాహెబ్, వీఆర్వో రవిలు అక్కడకు చేరుకుని అనుమతులపై ప్రశ్నించారు. తాము సీఆర్‌డీఏ నుంచి అనుమతులు తీసుకున్నామని, విజయవాడలో కాగితాలు ఉన్నాయని లేఔట్ ప్రతినిధులు చెప్పుకొచ్చారు. అయితే ఆ పత్రాలను చూపే వరకు పనులు చేయడానికి వీల్లేదంటూ అధికారులు ఆదేశించారు. దీనిపై నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చినంత వరకు పనులు చేసుకోవచ్చని సాయంత్రం వరకు తమకెటువంటి పత్రాలు అందజేయలేదని కార్యదర్శి మీరాసాహెబ్ తెలిపారు.


గ్రావెల్ తరలించిన టిప్పరు

మట్టి రవాణా వెనుక ఎవరి హస్తం..?

సహజంగా లేఔట్‌లకు అనుమతి ఉన్న క్వారీల నుంచే గ్రావెల్ రవాణా చేయాల్సి ఉంటుంది. కానీ జి.కొండూరు మండలంలోని చేగిరెడ్డిపాడు, వెలగలేరు తదితర గ్రామాల్లో అక్రమ గ్రావెల్ తరలింపులు జరుగుతున్న క్వారీల నుంచి చంద్రగూడేనికి తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున టిప్పర్లతో పగలు, రాత్రీ తేడా లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. జి.కొండూరు మండలంలో అక్రమ తవ్వకాలపై పదేపదే కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేస్తున్నా, రవాణా ఆగకపోవడం వెనుక ఎవరి పాత్ర ఉందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కుళాయిలు ఉన్నా నీటి సరఫరాకు ఇబ్బందే..!

చెవుటూరు గ్రామంలోని లొద్ది కాలనీలో కొన్ని రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేదని.. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలు, బక్కెట్లు చూపుతూ బుధవారం నిరసన తెలిపారు. ఇక్కడ పంచాయతీ కుళాయిలు ఉన్నా నీటి సరఫరా లేకపోవడంతో మరో ప్రాంతానికి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. పంచాయతీ అధికారులు నిర్వహణ సరిగా లేకపోవడంతోనే ఈ అవస్థలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**


చెవుటూరు లొద్ది కాలనీలో మహిళల నిరసన

అదృశ్యమైన బాలిక శక్తిసదన్‌కు తరలింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నమోదైన కేసులో బాలికను తిరువూరులో శక్తిసదన్ హోంకు తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మండలంలోని తాతకుంట్లకు చెందిన 17 ఏళ్ల బాలిక, 14వ తేదీ నుంచి కనిపించడంలేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆమె హైదరాబాదులో ఉందన్న సమాచారంతో ఆమెను అదే రోజు సాయంత్రానికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. దత్తత తండ్రి అత్యాచారం చేశాడని బాలిక తల్లి ఆరోపిస్తున్నారని, బాలిక నుంచి వాంగ్మూలం తీసుకుని, తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని వివరించారు. అనంతరం శక్తిసదన్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కొండపల్లి పురపాలిక తొలి కౌన్సిల్ సమావేశం నేడు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక సంఘం కౌన్సిల్ తొలి సమావేశం గురువారం జరగనుంది. నాలుగు సంవత్సరాల పురపాలిక ఏర్పాటు అనంతరం మొదటి కౌన్సిల్ సమావేశం ఆసక్తిని సంతరించుకోనుంది. ఇప్పటికే నూతన పాలకులు సమావేశ మందిరాన్ని, అధికారిక కార్యాలయాలను ముస్తాబు చేసుకున్నారు. అయితే మొదటి సమావేశంలో ప్రధానమైన విషయాలను ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌లతో చర్చించాలని కౌన్సిలర్లు భావిస్తున్నారు. మొత్తం 29 మంది కౌన్సిలర్లకు గానూ వైకాపా నుంచి నలుగురు కౌన్సిలర్లు మాత్రమే యాక్టివ్‌గా ఉండడంతో మిగిలిన 25 మంది తీర్మానాలకు ఆమోదం తెలుపనున్నారు. ఉదయం 11 గంటలకు కార్యాలయ ప్రారంభం అనంతరం సమావేశానికి ముహూర్తం సిద్ధం చేసినట్లు ఛైర్మన్ సీహెచ్ చిట్టిబాబు తెలిపారు.

రాజీ మార్గం ఎంచుకోవడమే మేలు


ద్విచక్రవాహన ర్యాలీలో జడ్జి సింధూర, న్యాయవాదులు, పోలీసులు

తిరువూరు, న్యూస్‌టుడే: సివిల్, క్రిమినల్ కేసుల్లో మధ్యవర్తుల ద్వారా రాజీపడే అవకాశం ఉన్న కేసుల్లో సమస్య పరిష్కారం కోసం రాజీమార్గం ఎంచుకోవడం ఇరువర్గాలకు మేలని తిరువూరు న్యాయస్థానం జూనియర్ సివిల్ జడ్జి ఎ.సింధూర సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు జడ్జి తెలిపారు. బుధవారం ఉదయం పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలపై నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. రికార్డుల నిర్వహణ సరిగాలేని తిరువూరు మండలంలోని జీవీఎల్ రవీంద్రబాబు దుకాణంలో రూ. 25,44,990 విలువ గల, నాళ్ల గాంధీ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో రూ. 7,62,550ల విలువైన ఎరువుల అమ్మకాల నిలుపుదలకు ఆదేశాలిచ్చారు. ఆయా దుకాణాల నిర్వాహకులు రెండ్రోజుల్లో రికార్డులను సరిచేసుకుని, అన్ని అనుమతులు తీసుకోవాలని సూచించారు. గంపలగూడెం మండలం పెదకొమెరలో నవ్యశ్రీ మెన్యూర్స్‌లో రూ.1,38,480ల విలువైన సూక్ష్మ పోషకాల విక్రయాలను నిలిపివేశారు. విజిలెన్స్ బృందంలో ఏడీఏ వి.హనుమంతరావు, ఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, స్థానిక ఏడీఏ ఏవీఎస్ రంగారావు, ఏవోలు పద్మ, హరీష్‌కుమార్, టెక్నికల్ ఏవో టిప్పు సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

స్థల కేటాయింపుపై హర్షం

తిరువూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు స్మృతీవనం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడంపై ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ సురేంద్ర, సంఘం మండల అధ్యక్షుడు మురళి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు రాము, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీ4 విధానం విజయవంతానికి కృషి

రెడ్డిగూడెం: గ్రామాల్లో పీ4 విధానం విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు కలిసి కృషి చేయాలని తహసీల్దార్ జె.సుశీలాదేవి అన్నారు. బుధవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో పీ4 విధానం గురించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో టి.కె.వి.రమణ తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వర రెడ్డి, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా ప్రతి ఒక్కరికీ అవసరం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరి దిన చర్యలో యోగా భాగం కావాలని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం ఎస్వీసీటీ మండపంలో యోగా తరగతులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయో భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని.. దాన్ని అధిగమించడానికి యోగా మంచి ఔషధమన్నారు. కార్యక్రమంలో యోగా గురువు లంకే జనార్దన్, ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

అయోమయంలో విద్యార్థులు

కొండపల్లి: ప్రభుత్వ వైఖరితో విద్యార్థులు అయోమయంలో ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గోపి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశ గోడ పత్రికను కొండపల్లిలో బుధవారం ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు మహేష్, జవివే జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ పాల్గొన్నారు.

తెదేపా మండల శాఖ కార్యవర్గం నియామకం

ఎ.కొండూరు: తెదేపా మండల శాఖ కార్యవర్గాన్ని నియమించినట్లు నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా భరోతు పీక్లానాయక్ (కేశ్యాతండా), ప్రధాన కార్యదర్శిగా గోగులమూడి రామ్‌ప్రసాద్‌రెడ్డి (పోలిశెట్టిపాడు), ఉపాధ్యక్షుడిగా వేములకొండ సాంబశివరావు (కోమటికుంట) ఎన్నికయ్యారన్నారు. మండల పరిధిలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా 19 గ్రామాలకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం పూర్తయినట్లు పేర్కొన్నారు.

కోల్ ప్లాంటులో ముగ్గురు కార్మికులకు గాయాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ముగ్గురు పీస్ వర్క్ కార్మికులు ప్రమాదవశాత్తూ గాయపడిన సంఘటన ఎన్టీటీపీఎస్ కోల్ ప్లాంటులో బుధవారం చోటుచేసుకుంది. ప్లాంటులోని స్టేజ్ 1, 2కు సంబంధించిన కోల్ ప్లాంటు క్రస్టర్ హౌస్‌లో దుర్గాప్రసాద్, నానీబాబు, మంగులు బొగ్గు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ స్టేజ్‌లో పైనున్న సూట్ జారడంతో వాళ్లు అక్కడి నుంచి పరిగెత్తడంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించాలని చూడగా అందుబాటులోకి రాలేదు.

చేతివాటం.. తప్పుని చెప్పండి!


తప్పులు తెలియని వయసు.. నచ్చిన వస్తువు ఎలాగైనా పొందాలనే మనసు.. స్నేహితుల ప్రలోభమో.. ఇంకేదైనా ఆలోచనో.. కొంతమంది పిల్లల్లో చేతివాటం కనిపిస్తుంది! అంతమాత్రాన వారిపై దొంగ అనే ముద్ర వేయొద్దు! జాగ్రత్తగా వారిని సరిదిద్దే బాధ్యత తల్లిదండ్రులదే!

పిల్లలు చిన్నప్పటి నుంచి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలిస్తూ అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు. తెలిసీ తెలియని తనంతో కొన్నిసార్లు తోటివారి వస్తువుల అపహరిస్తూ ఉంటారు. పిల్లల్లో ఈ ప్రవర్తన గమనించినప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందడం సహజం. అయితే, దీని వెనుక కారణాలను అర్థం చేసుకోవడం, సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా ఈ అలవాటును మాన్పించవచ్చంటున్నారు నిపుణులు.

ఎందుకు...

- ఇంట్లో, పాఠశాలలో వారిపై తగినంత శ్రద్ధ లేనప్పుడు ఇలాంటి పనులకు అలవాటు పడొచ్చు.
- స్నేహితులు ఇలా చేయడం చూసి వాళ్లు కూడా అదే పనిని చేయడానికి ప్రయత్నించొచ్చు.
- ఇంట్లో ఆర్థిక సమస్యలు ఉంటే.. కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయలేక అపహరణలకు పాల్పడవచ్చు. ఇది సాధారణంగా కౌమారదశలో జరుగుతుంది.
- చిన్నారులు తప్పొప్పుల మధ్య తేడాలను అర్థం చేసుకోలేరు. తమకు ఇష్టమైన వస్తువును చూసినప్పుడు అది కావాలనే కోరికతో కొంతమంది ఇలా చేస్తారు.

- ఈనాడు, అమరావతి



ఇలా మార్చండి..!

పిల్లలతో ప్రేమగా, ఓర్పుతో మాట్లాడాలి.
- ఏ కారణాల వల్ల వారు ఇతరుల వస్తువులు తీసుకున్నారో తెలుసుకోవాలి. ఏది తప్పో? ఏది ఒప్పో... అర్థమయ్యేలా చెప్పాలి.
- తప్పులను సరిదిద్దుకోవడానికి పిల్లలకు అవకాశం ఇవ్వాలి.

చిన్నారులు ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ప్రభావం వల్ల వారు మారిపోకుండా గమనిస్తూ ఉండాలి.
- ఏదైనా వస్తువును దొంగిలించినప్పుడు వారిని శిక్షించడం, ఇష్టం వచ్చినట్లు తిట్టడంలాంటివి చేయకూడదు. వారిని పదే పదే దొంగ అని నిందించొద్దు.

దొంగతనం ఆమోదయోగ్యమైనది కాదని... నమ్మకం, విశ్వసనీయత చాలా ముఖ్యమని తెలియజెప్పాలి.
- ఈ ప్రవర్తన వల్ల ఇతరులు ఎలా బాధపడతారో, ముందుముందు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో వివరించాలి.

చదువు, క్రీడల్లో నిమగ్నం చేయడం ద్వారా వారిలో సానుకూల ఆలోచనలు పెరుగుతాయి. ఇది పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

"నీతి కథలు చెప్పాలి. ఒకవేళ పిల్లల ప్రవర్తన ఆందోళనకరంగా ఉంటే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

-ప్రసన్న కుమార్, మానసిక వైద్య నిపుణులు, విశాఖపట్నం

ఒంటికాలిపై బతుకు సవారీ



అవయవాలన్నీ సరిగ్గా ఉండి, పనిచేయగల సామర్థ్యమున్నా కొందరు... "అది నా చదువుకు తగ్గ ఉద్యోగం కాదు. ఇలాంటి పని చేయబోను" అనే సాకులతో ఉపాధికి దూరంగా ఉంటారు. కానీ, ఓ దివ్యాంగుడు హైదరాబాద్‌లోని ట్రాఫిక్‌ను ఛేదించుకుంటూ బైక్‌పై నిత్యం 25 ప్రదేశాలకు ఫుడ్ డెలివరీ చేస్తూ ఔరా...! అనిపిస్తున్నారు. ఆయనను 'ఈనాడు' పలకరించగా... "నా పేరు నాగరాజు. మాది సూర్యాపేట జిల్లా నడిగూడెం. పుట్టుకతోనే ఒక కాలు లేదు. డిగ్రీ వరకు చదివా. ఊర్లో ఉపాధి లేకపోవడంతో మూడేళ్ల కిందటే భార్య, ఇద్దరు చిన్నపిల్లలను తీసుకుని బాలానగర్‌కు వచ్చేశా. కుటుంబ పోషణ కోసం ఫుడ్ డెలివరీ సంస్థలో చేరా. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, పంజాగుట్ట, మూసాపేట, ఖైరతాబాద్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో ఆహార పదార్థాలను చేరవేస్తున్నా. ప్రతిరోజూ 100 కి.మీ. తక్కువ కాకుండా ప్రయాణిస్తున్నా. ఎవరైనా బ్యాంకు రుణం ఇప్పిస్తే స్వయం ఉపాధిని పొందుతా" అంటూ వివరించారు. - ఈనాడు, హైదరాబాద్

వదిలేస్తే వ్యర్థాలు.. పట్టించుకుంటే లక్షలు



ఒక్కరుగా చేయలేని పనిని బృందంగా చేయొచ్చు. గ్రామాలనూ సమూహంగా ఏర్పాటుచేసి.. ఓ విషయంలో విజయం సాధించారు నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీడీవో) అబ్దుల్ అజీజ్‌ఖాన్. పంచాయతీలకు సమస్యగా మారుతున్న చెత్తను.. పంచాయతీ కార్యదర్శులు, కార్మికుల సహకారంతో ఆదాయ వనరుగామార్చారు. ఈ మండలంలో నాలుగు మినహా మిగిలిన 28 పంచాయతీలను నాలుగు సముదాయాలుగా విభజించారు. ప్రతి సముదాయానికి ఒక 'చెత్త నుంచి సంపద సృష్టి' కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. వారం, రెండు వారాలకో సారి ఆయా పంచాయతీల్లో పోగవుతున్న తడి, పొడి చెత్తను ఈ సముదాయ కేంద్రాలకు తీసుకొస్తున్నారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారుచేసి రైతులకు, పొడి చెత్తను సంబంధిత వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో జూన్ నెలలో రూ.99,960 ఆదాయం సమకూరింది. ఆ మొత్తాన్ని ఆయా పంచాయతీలకు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే, సారంగాపూర్

మహాత్ముడి... చిత్రమూ అపురూపమే!



రూ.1.75 కోట్లకు వేలం

లండన్: మహాత్మాగాంధీ స్వయంగా కూర్చొని వేయించుకున్న ఏకైక ఆయిల్ పెయింటింగ్ ఇది. ఎంతో అపురూపమైన ఈ చిత్రరాజం లండన్‌లోని బోన్హామ్స్ వేలంలో రూ.1.75 కోట్లకు అమ్ముడైంది. రెండో రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు 1931లో గాంధీ లండన్‌కు చేరుకున్న సమయంలో క్లేర్ లీటన్ అనే చిత్రకారిణి ఈ పెయింటింగ్‌ను గీశారు. క్లేర్ లీటన్ 1989లో మరణించేవరకూ ఇది ఆమె వద్దే ఉంది. 1931 నవంబరులో క్లేర్ తొలిసారిగా గాంధీ చిత్రపటాన్ని లండన్‌లోని అల్బానీల్ గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని అభినందిస్తూ.. క్లేర్‌కు గాంధీ వ్యక్తిగత కార్యదర్శి మహదేవ్ దేశాయ్ అప్పట్లో లేఖ రాశారు. అయితే ఈ పెయింటింగ్‌పై 1974లో ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. దీంతో లైమాన్ అల్లిన్ మ్యూజియం కన్జర్వేషన్ ల్యాబొరేటరీ పెయింటింగ్‌ను పునరుద్ధరించింది.



నీ కోసమే బడి.. రాకుంటే ఎలామరి?



విద్యార్థులు బడికి రాకుంటే ఉపాధ్యాయులు ఆరా తీస్తారు. మరుసటి రోజు కారణాలను తెలుసుకుంటారు. కానీ, తెలంగాణలోని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అదేరోజు నేరుగా పిల్లల ఇళ్లకు వెళ్లి ఆశ్చర్యపరిచారు. బుధవారం కొల్చారం మండలం దేశ్యతండా ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించగా 55 మందిలో ఎనిమిది మంది గైర్హాజరైనట్లు గుర్తించారు. తర్వాత నేరుగా ఎనిమిది మంది ఇళ్లకు వెళ్లి విద్యార్థులను పాఠశాలకు ఎందుకు పంపలేదని తల్లిదండ్రులను ప్రశ్నించారు. వారు వివిధ కారణాలు చెప్పగా... వ్యవసాయ పనులు, పండగల పేరిట పిల్లలను తీసుకెళ్లొద్దని విన్నవించారు. విద్యార్థులతోనూ మాట్లాడి... చక్కగా చదివితేనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలకు ఎగ్గొట్టవద్దని సూచించారు.

- న్యూస్‌టుడే, కొల్చారం

సరికొత్తగా ఛాయాచిత్రాల పొత్తం!

● వన్నెతగ్గని ఫొటో ఆల్బమ్‌లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తనువు అలసినపుడు... మనసు గాయపడినప్పుడు... అయినవారు గుర్తొచ్చినప్పుడు... జీవితంలోకి కొత్తవారు ప్రవేశించినప్పుడు... కుటుంబం విస్తరించినప్పుడు... ఆత్మీయులు వదిలి వెళ్లిపోయినప్పుడు... అందరికీ గుర్తొచ్చేది ఆల్బమ్. సాంత్వన చేకూర్చేది ఆల్బమ్. స్మార్ట్‌ఫోన్లు, క్లౌడ్ స్టోరేజ్‌లు విస్తృతంగా వినియోగిస్తున్న ప్రస్తుత తరుణంలోనూ వీటికి ఆదరణ తగ్గడంలేదు. మారుతున్న తరానికి అనుగుణంగా సాంకేతికత సొబగులను అద్దుకుంటూ సరికొత్తగా వస్తున్నాయి.

ప్రత్యేక కొరియోగ్రాఫర్లతో రీక్రియేషన్

■ గతంలో పెళ్లికి మాత్రమే ఫొటోలు తీసేవారు. ప్రస్తుతం సీమంతం వేడుక, పిల్లల పుట్టిన రోజుల నుంచి తాతాఅవ్వల షష్టిపూర్తి వరకు అన్ని జ్ఞాపకాలను కెమెరాల్లో బంధిస్తున్నారు. ప్రత్యేకంగా కొరియోగ్రాఫర్లతో వినూత్న స్టైల్స్‌లో ఫొటోలు తీయించుకుంటున్నారు.



■ కరోనా సమయంలో కొద్ది మంది సమక్షంలోనే ఫంక్షన్లను చేసుకున్నారు. ప్రస్తుతం మళ్లీ నాటి పరిస్థితులను రీక్రియేషన్ చేస్తూ ఆనందం పొందుతున్నారు. అప్పుడు దిగిన ఫొటోలను ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగా మార్పులు చేయించి, ఆల్బమ్‌లను తీసుకుంటున్నారు.

■ విదేశాల్లో చదువుల కోసం వెళ్లిన యువతీ యువకుల్లో కొందరు అక్కడే పెళ్లి చేసుకుంటున్నారు. సమయం, అవకాశం దొరక్క పిల్లలు పుట్టాక తల్లిదండ్రుల వద్దకు వస్తున్నారు. ఇక్కడ మరోసారి పెళ్లి చేసుకుంటున్నారు. పెరిగిన వయసు తమ ముఖాల్లో కనిపించకుండా ఏఐతో రీక్రియేషన్ చేయించుకోవడానికి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్ల సేవలు వాడుకుంటున్నారు.

ఇవీ ట్రెండింగ్...

కాన్వెరా త్రీడీ ఎంబోజింగ్ (ఫొటోలో కొంత భాగం పైకి పొంగి చేతికి తగిలేలా ఉండటం), కరిజ్మా (ఒకే పేజీలో రెండు, మూడు ఫొటోలు వచ్చేవి), వింటేజ్, రెట్రో, మినిమలిస్ట్, లెదర్, రీసైక్లింగ్ కాగితాలతో తయారైనవి, మ్యాగజైన్ శైలి, స్పైరల్, క్యాలెండర్ల తరహావి.

ప్యాకేజీలకు అనుగుణంగా ఖర్చులు

సంప్రదాయ స్టిల్ ఫొటోగ్రఫీ, క్యాండిడ్ ఫొటోగ్రఫీ, డ్రోన్ షూటింగ్... వంటి ప్యాకేజీలు ఉన్నాయి. మనం ఎంచుకునే ప్యాకేజీకి అనుగుణంగా రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. పెళ్లిళ్లలోనూ దాదాపు రూ.2.50 లక్షల వరకు ఫొటోలు, ఆల్బమ్‌లకు కేటాయిస్తున్నారు.

కృష్ణమ్మ... నల్లమలకు వాలుజడ!

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని పెద్దపులుల అభయారణ్యంలో కృష్ణమ్మ వంపులు చూసేందుకు రెండు కళ్లు చాలవు. వజ్రాల మడుగు వీక్షణ కేంద్రం వద్ద నుంచి నది సోయగాలు కట్టిపడేస్తున్నాయి. లోయల్లో నుంచి నీలి రంగులో నది పారుతుంటే... పచ్చటి చీర కట్టుకున్న నల్లమలకు వాలుజడలా మరింత సుందరంగా కనిపిస్తోంది. ఇక్కడి వాతావరణం మనసుకు ఎంతో హాయి గొలుపుతోంది. దోమలపెంట నుంచి 10 కి.మీ., శ్రీశైలం ప్రధాన రహదారి నుంచి రెండు కి.మీ. దూరంలో వజ్రాల మడుగు దారిలో ఈ అద్భుతం కనువిందు చేస్తోంది. అక్కమహాదేవి టూరిజం ప్యాకేజీలో వెళ్లే పర్యాటకులను మాత్రమే ఇక్కడికి అనుమతిస్తారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

చక్రాల కుర్చీ.. ఇక తేలిగ్గా!



9 కిలోల బరువుతో ఆవిష్కరించిన ఐఐటీ మద్రాస్

వడపళని, న్యూస్‌టుడే: చక్రాల కుర్చీ.. దివ్యాంగులు ఎటైనా వెళ్లడానికి ఇది అత్యంత అనుకూలం. అయితే, దాన్ని మడిచి ఎత్తి ఏదైనా వాహనంలో పెట్టాలంటే మాత్రం కాస్త కష్టమే! మామూలు చక్రాల కుర్చీలన్నీ 14 నుంచి 23 కిలోల వరకు బరువు ఉంటాయి. అయితే, దివ్యాంగుల కోసం సులువుగా కార్లు, ఆటోలు, బస్సుల్లోకి తీసుకెళ్లగలిగేలా 9 కిలోల బరువు మాత్రమే ఉండే కుర్చీని ఐఐటీ మద్రాస్ ఆవిష్కరించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 'వైడీ వన్' పేరిట దీన్ని రూపొందించింది. ఈ కుర్చీ దివ్యాంగుల శరీర ఆకృతి, భంగిమ, రోజువారీ అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఉంటుందని ఐఐటీఎం డైరెక్టర్ ఆచార్య వి.కామకోటి తెలిపారు. వైడీ వన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు ఐఐటీ పరిశోధనా బృందం థ్రైవ్ మొబిలిటీ అనే స్టార్టప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అందరికీ అందుబాటు ధరతో అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సంస్థ సహ వ్యవస్థాపకుడు, పరిశోధన, అభివృద్ధి అధ్యక్షుడు డాక్టర్ రెజిన్‌జాన్ వర్గీస్ తెలిపారు. ఐఐటీ మద్రాస్‌లో బుధవారం జరిగిన చక్రాల కుర్చీ ఆవిష్కరణకు సాయుధ దళాల జనరల్ హాస్పిటల్ సర్వీసెస్ సర్జన్ వైస్ అడ్మిరల్ అనుపమ్ కపూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో 15% మంది ఏదో ఒక అంగవైకల్యంతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొందని తెలిపారు.

బస్సును పాతి... బంకరుగా మార్చి!



పేదరికం ఆలోచనలకు అడ్డుకాదు. కుటుంబాన్ని రక్షించుకునేందుకు ప్రతి వ్యక్తి తనదైన శైలిలో పోరాటం చేస్తారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అహ్మద్ అబు గనిమా అందుకు ఉదాహరణ. దక్షిణ ఇజ్రాయెల్‌లోని నెగెవ్ ఎడారిలోని ఖాషెం జనేహ్ అతని ఊరు. తమ దేశంపై శత్రుదేశాలు చేస్తున్న క్షిపణి దాడుల నుంచి కుటుంబాన్ని రక్షించుకునేందుకు అతను వినూత్నంగా పాత మినీ బస్సును భూమిలో పాతిపెట్టాడు. దానిపైన ఎత్తుగా మట్టిని నింపి బస్సునే బంకర్‌గా మలచుకున్నాడు. దాని కిటికీ నుంచి అతని కుటుంబ సభ్యులు లోపలికి బయటకు వెళ్తూ వస్తుంటారు.

ఏడు కుటుంబాలకు ఒక లారీ!



ఇక్కడ లారీల వరస చూస్తుంటే... ఏదో ధర్నా, రాస్తారోకో కారణంగా నిలిచిపోయాయని అనుకుంటే పొరబడినట్లే. ఇవన్నీ తెలంగాణలోని కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామస్థులకు చెందిన సొంత వాహనాలు. ఈ ఊళ్లో సగటున ఏడు కుటుంబాలకు ఒక లారీ యజమాని ఉన్నారు. మొదటి నుంచీ స్థానికుల్లో అత్యధికులు వాహనరంగంపైనే ఆసక్తి చూపుతున్నారు. తండ్రి డ్రైవరుగా పనిచేస్తుంటే డిగ్రీ చదివిన పిల్లలు సైతం అదే వృత్తిని ఎంచుకుంటున్నారు. ఈ గ్రామంలో 288 కుటుంబాలుండగా జనాభా 1,240. వీరిలో 42 కుటుంబాలకు సొంత లారీలున్నాయి. వీటి కారణంగా 250 మంది ఉపాధి పొందుతున్నారని, వ్యవసాయ సీజన్ మొదలైతే ఆ సంఖ్య రెట్టింపు అవుతుందని స్థానిక లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాలక్‌రావు పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

సంక్షిప్తంగా..

తెల్ల చొక్కా, నల్ల ప్యాంటుతో రావొద్దు!

దిల్లీ: జిల్లా కోర్టు సముదాయానికి తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించి రావొద్దని వ్యాజ్యదారులు, గుమాస్తాలు, సాధారణ ప్రజలకు దిల్లీలోని రోహిణి కోర్టు బార్ అసోసియేషన్ నిషేధాజ్ఞలు విధించింది. పలువురు దళారులు తమను తాము న్యాయవాదులుగా, న్యాయవాదుల గుమాస్తాలుగా పరిచయం చేసుకుంటూ వ్యాజ్యదారులను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వృత్తిపరమైన గుర్తింపు, గౌరవం కోసం కోర్టు సముదాయంలో తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించేలా న్యాయవాదులకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు బార్ అసోసియేషన్ తెలిపింది.

ఎన్‌సీసీ కేడెట్లకు గరిష్ఠంగా 15% గ్రేస్ మార్కులు

ఈనాడు, అమరావతి: ఎన్‌సీసీ ఈవెంట్లలో అవార్డులు సాధించిన అభ్యర్థులకు డిప్లొమా, యూజీ, పీజీ కోర్సుల్లో 1% కోటా సీట్ల భర్తీకి సవరించిన ఉత్తర్వులను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం జారీచేశారు. సాంకేతిక-ఉన్నత విద్య, వ్యవసాయం-సహకార, పశుసంవర్ధక-పాడి పరిశ్రమాభివృద్ధి- మత్స్యశాఖల్లోని అన్ని డిప్లొమా, యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌సీసీ కేడెట్లకు ప్రవేశ పరీక్షల్లో స్కోర్ చేసిన మార్కుల్లో గరిష్ఠంగా 15% వరకు గ్రేస్ మార్కులను కలపాలని ఉత్తర్వులిచ్చారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షలో అర్హత మార్కులు సాధించిన వారికే గ్రేస్ మార్కులు ఇస్తారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లోనూ ఎన్‌సీసీ కేడెట్లకు ప్రవేశపరీక్షల్లో అభ్యర్థి సాధించిన మొత్తం మార్కుల్లో గరిష్ఠంగా 15% వరకు గ్రేస్ మార్కులు ఇస్తారు.

వినరో గానము.. వీనుల విందుగా!

● అంతరాయాల్లేకుండా శ్రీవారి కీర్తనలు..



ఈనాడు, తిరుపతి: యూట్యూబ్‌లోనో మరే ఇతర యాప్‌లలోనో శ్రీవారి కీర్తనలు వింటుంటే మధ్యలో ప్రకటనలు వచ్చి విసుగు తెప్పిస్తాయి. పంటికింద రాయిలా మారి ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. ఇలాంటి అసౌకర్యాలు లేకుండా, అంతరాయాల్లేని భక్తిగీతాలను వినే వెసులుబాటును తిరుమల తిరుపతి దేవస్థానం అందుబాటులోకి తెచ్చింది. తితిదే అధికారిక వెబ్‌సైట్‌లోనే కీర్తనలు అప్‌లోడ్ చేసింది. శ్రీవేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్టు కింద ప్రతినెలా రికార్డయిన పాటలను విడుదలైన రోజే అందులో పెడుతోంది. ప్రస్తుతం అందులో 21,725కు పైగా కీర్తనలున్నాయి. తాళపత్ర గ్రంథాల్లో పొందుపరిచిన అరుదైన గేయాలూ వినొచ్చు.

పాటల తోటలోకి ఎలా వెళ్లాలంటే!

- తితిదే అధికారిక వెబ్‌సైట్ (www.tirumala.org) ఓపెన్ చేయాలి.
- మొదటిసారి ఈ సైట్ ఓపెన్ చేస్తే ఒక్కోసారి మొబైల్ నంబరుతో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. పేజీ ఓపెన్ అయ్యాక, అందులో 'ఆన్‌లైన్ బుకింగ్స్' కింద కావాల్సిన 'అన్నమయ్య పాటకు పట్టాభిషేకం', 'శరణాగతి గద్యము', 'శ్రీరామానుజ సహస్రాబ్ది', 'శ్రీ అన్నమాచార్య, ఇతర వాగ్గేయకారులు' అనే శీర్షికలు కనిపిస్తాయి.
- ఒక్కో దానిపై క్లిక్ చేస్తే వందల పాటలు వస్తాయి. వాటిలో కావాల్సిన దాన్ని ఎంచుకుంటే సరి! అంతరాయం లేకుండా వినొచ్చు. డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు.
- ఇప్పటి వరకు పదిన్నర లక్షలకుపైగా కీర్తనలు డౌన్‌లోడ్ అయ్యాయి.

వరి వంగడాల పరిశోధనలో 'ఊతకర్రలు'



పెద్దసంఖ్యలో వెదురు కర్రలకు రంగుపూసి వివరాలు రాసి పొలంలో నాటిన ఈ చిత్రం తెలంగాణలోని జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోనిది. నాటిన ఒక్కో కర్ర ఒక్కో రకం వరి విత్తనం వివరాలను తెలుపుతుంది. సుడిదోమలు, ఉల్లికోడు, హిస్పా, కంకినల్లి తదితర పురుగులు... అగ్గితెగులు, పాముపొడ తదితర తెగుళ్లను తట్టుకొని.. గింజ నాణ్యత బాగుండి.. పైరు ఎత్తు తక్కువగా ఉండడంతోపాటు.. అధిక దిగుబడినిచ్చే లక్షణాలు కలిగిన విత్తనాలను శాస్త్రవేత్తలు పేరంటల్స్ (ఆడ, మగ)గా ఎన్నుకుంటారు. ఆయా విత్తనాలను వరుసల్లో విత్తుతారు. వాటి వివరాలను ఈ కర్రలపై నమోదు చేసి పాతుతారు. తర్వాత తాము కోరుకున్న అదనపు లక్షణాలు వచ్చేలా.. ఆయా పేరంటల్స్‌ను సంకరీకరించి నూతన వంగడాన్ని సృష్టిస్తారు. ఒక సీజన్‌లో క్రాసింగ్ మొదలుపెడితే దాదాపు ఎనిమిదేళ్లు వచ్చేసరికి నాలుగైదు రకాలు మాత్రమే సంతృప్తికరంగా తయారవుతాయి. వాటిని ఇతర పరిశోధన స్థానాలు, రైతుల క్షేత్రాలకు మినీకిట్లుగా పంపిస్తారు. ఆయా విత్తనాలు కనీసం మూడేళ్లు క్షేత్ర పరీక్షలో విజయవంతమైతేనే.. భారత వ్యవసాయ పరిశోధన మండలి సదరు వంగడానికి పేరు పెట్టి అధికారికంగా విడుదల చేస్తుంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

బావిలోంచి భద్రంగా..!





బావిలో పడిన ఆవును బయటకు తీసేందుకు యత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది ◆ క్రేన్ సాయంతో బయటికి తీస్తూ..

తిరుపతి జిల్లా చెందోడు పొలిమేరలో మేతకెళ్లిన ఆవు ప్రమాదవశాత్తు 40 అడుగుల లోతైన బావిలో పడిపోయింది. బావిలో కొద్దిగా నీరు ఉండడంతో అది సగం వరకు మునిగి అరవ సాగింది. గుర్తించిన రైతు చంద్రమోహన్ వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు సిబ్బందితో వచ్చి.. 2 గంటలు కష్టపడి తాళ్లు, క్రేన్ సాయంతో ఆ మూగజీవిని సురక్షితంగా బయటికి తీశారు.

- న్యూస్‌టుడే, కోట



డ్రైవింగ్ వీడియోలతో వాహనం నడపడం వస్తుందా?

కారు డ్రైవింగ్ వీడియోలు ఎన్ని చూసినా వాహనం నడపడంలో నిష్ణాతులు కాలేం. భయాన్ని వదిలి కారును స్టార్ట్ చేసి ముందుకు కదిలించినప్పుడే నిజంగా డ్రైవింగ్ నేర్చుకొనే ప్రక్రియ మొదలవుతుంది. అలాగే ఏ విషయంలోనైనా పట్టు సాధించాలంటే, పుంఖానుపుంఖాలుగా సమాచార సేకరణ చేస్తూ గడపొద్దు. ఆ విషయాన్ని ఆచరణాత్మకంగా సాధన చేయడం ప్రారంభించండి.

- డేనియల్ జహీద్, కాపీరైటర్

1971 యుద్ధంలో వీరమరణం.. 54 ఏళ్ల తర్వాత గౌరవం



ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని చంబల్ ప్రాంతానికి చెందిన ఎందరో యువకులు సైన్యంలో చేరి దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో జరిగిన భారత్-పాకిస్థాన్ యుద్ధంలోనూ భిండ్‌కు చెందిన 12 మంది జవాన్లు వీరమరణం పొందారు. అందులో రామ్‌లఖన్ గోయల్ ఒకరు. రెండు రోజుల క్రితం ఒక సైనిక వాహనం భిండ్ నగరంలోని సైనిక్ కాలనీకి వచ్చి ఆగింది. స్థానికురాలైన లీలాదేవి(70)ని అమరుడు రామ్‌లఖన్ భార్యగా నిర్ధారించుకున్నాక... ఇద్దరు సైనికులు ఆమె పాదాలను తాకారు. గోయల్‌కు చెందిన ఒక పెట్టె, వస్తువులను లీలాదేవికి ఇచ్చారు. వాటిలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన గార్డ్ ఆఫ్ ఆనర్ షీల్డు, ఒక లేఖ ఉన్నాయి. లేఖను 2018 నాటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ సంయుక్తంగా పంపారు. 1971 యుద్ధంలో అమరుడైన భారత సైనికుడిని బంగ్లాదేశ్ ప్రభుత్వం సత్కరిస్తున్నట్లు లేఖలో ఉంది. "భర్త మరణవార్త నాకు ఉత్తరం ద్వారా తెలిసింది. నాటి నుంచి ఒంటరిగా జీవిస్తున్నా. పెళ్లయిన కొత్తలోనే భర్తను కోల్పోవడంతో పిల్లలు లేరు. మేనల్లుడిని దత్తత తీసుకున్నా" అంటూ లీలాదేవి వెల్లడించారు. ఏడేళ్ల ఆలస్యంగా ఈ గౌరవం అందజేయడంపై అధికారులు వివరణ ఇవ్వలేదు.



'కొంచెం ముందు తీసుకొచ్చుంటే ప్రాణాలు కాపాడి ఉండేవాళ్లం...' చాలాసార్లు వైద్యుల నుంచి ఈ మాట వింటుంటాం. నిజానికి ఏదైనా ప్రమాదం జరగ్గానే ఒక్కరు తేరుకున్నా... అలా ప్రాణం పోకుండా కాపాడొచ్చు. అంతటి మహాత్మ్యం కార్డియో పల్మనరీ రిసుసిటేషన్ (సీపీఆర్)ది. దీనిపై అవగాహన కల్పించడమే కాదు, వేలమందికి శిక్షణనిస్తున్నారు డాక్టర్ దివ్య బన్న.

ఒక్క నిమిషం... ప్రాణం కాపాడొచ్చు!



దివ్య

గత ఏడాది... చార్‌ధామ్ యాత్రలో ఒకతను ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న కొడుకు వెంటనే ఆయనకి సీపీఆర్ చేసి, ఆసుపత్రికి తరలించాడు. ఆ క్షణం అతను చేసిన ప్రయత్నం తన తండ్రిని కాపాడింది. అంతటి శక్తి సీపీఆర్‌ది. అందుకే దీనిపై అవగాహన కల్పిస్తున్నా. దీని ద్వారా సంబంధిత వ్యక్తినే కాదు, మొత్తం కుటుంబాన్నీ రక్షించిన వాళ్లం అవుతాం. పైగా రూపాయి ఖర్చూ కాదు. నిజానికి యూరప్ దేశాల్లో అయిదో తరగతి విద్యార్థులకే దీన్ని నేర్పిస్తారు. చాలా దేశాల్లో దీన్నో ప్రాథమిక నైపుణ్యంగానూ భావిస్తారు. పిల్లలే నేర్చుకున్నప్పుడు మిగతావాళ్లు నేర్చుకోవడానికేముంది అనిపించింది. అందుకే శిక్షణనిస్తున్నాం.

మాది విశాఖపట్నం. పుదుచ్చేరిలో ఎంబీబీఎస్, నెల్లూరులో ఎండీ చేశా. నాలుగేళ్లుగా గీతంలో ఎమర్జెన్సీ మెడిసన్ విభాగాధిపతిగా పనిచేస్తున్నా. అత్యవసర పరిస్థితుల్లో మా దగ్గరికి వచ్చే ఎంతోమందికి వైద్యం చేశా. ఎప్పుడైనా నా వాళ్లు, స్నేహితులకు అనుకోనిదేదైనా జరిగి, నేను అందుబాటులో లేకపోతే పరిస్థితేంటి అన్న ఆలోచన వచ్చింది. నిజానికి ఏ వ్యక్తయినా కుప్పకూలితే ఎమర్జెన్సీ విభాగానికి తరలించడానికి కొన్ని నిమిషాలైనా పడుతుంది. కానీ తను పడిపోయిన 5 నిమిషాల్లో మెదడు పనితీరు 70 శాతానికిపైగా తగ్గిపోతుంది. ఒక్కోనిమిషం గడిచేకొద్దీ కోలుకునే అవకాశం క్షీణిస్తూ పోతుంది. ఇంతవరకూ రావొద్దంటే సీపీఆర్ తెలిసుండటమే మార్గం. ప్రతి ఒక్కరికీ దీనిపై అవగాహన కల్పిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడొచ్చు. దీనికి వైద్యవిద్య చదవాల్సిన అవసరమూ లేదు. రక్షించాలన్న ఉద్దేశం, సీపీఆర్ మీద అవగాహన ఉంటే చాలు.

ఆలోచన రాగానే గీతం విశ్వవిద్యాలయం నుంచే మొదలుపెట్టాం. వైద్యులతోపాటు హౌస్‌కీపింగ్ స్టాఫ్, హాస్పిటాలిటీ, సెక్యూరిటీ, జూనియర్ అసిస్టెంట్లు, ల్యాబ్ సిబ్బంది... ఇలా 70 శాతానికిపైగా ఉద్యోగులకు శిక్షణనిచ్చాం. క్యాంపస్‌లో ఎవరికైనా సీపీఆర్ అవసరమైతే నిమిషాల్లో ఎవరో ఒకరు అందుబాటులో ఉంటారని ఉద్దేశం. అత్యవసర సమయాల్లో పనికొస్తుందని అంబులెన్స్ డ్రైవర్లకీ నేర్పించాం. గత ఏప్రిల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభించాం. జిమ్ ట్రైనర్లు, పోలీసులు, సెక్యూరిటీ గార్డులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు... ఇలా గత ఏడాది వెయ్యి మందికిపైగా శిక్షణనిచ్చాం. ఏటా ఆ సంఖ్య మరింత పెంచాలన్నది లక్ష్యం. నెలలో మూడు రోజులు శిక్షణకు కేటాయిస్తున్నాం. ప్రొఫెసర్లు, విద్యార్థులనూ భాగస్వాములు చేయాలనుకుంటున్నాం. కేవలం నేర్పడమే కాదు, పరీక్షనీ నిర్వహిస్తాం. సరైన మార్కులు రాకపోతే మళ్లీ నేర్చుకోవాలి. ఏడాది వ్యాలిడిటీతో సర్టిఫికెట్‌నీ ఇస్తాం. గడువు పూర్తయ్యాక తిరిగి శిక్షణ తీసుకునేలా చూస్తున్నాం.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

వసుంధర

vasundhara@eenadu.in

నాన్న ప్రేమ తెలియకపోయినా... అమ్మ కష్టం చూసి పెరిగిందామె. పట్టుదలతో నాలుగు సర్కారు కొలువులు సాధించింది. ఇప్పుడు తెలంగాణలో తొలి మహిళా ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారిణిగానూ నిలిచింది కావేటి సంతోషి. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

అమ్మ కష్టం.. లెఫ్టినెంట్‌గా నిలిపింది!



సంతోషి

నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. నాన్న లేకపోవటంతో ఊహ తెలిసినప్పటి నుంచి అమ్మ పద్మ వస్త్ర వ్యాపారం చేస్తూ ముగ్గురు కూతుళ్లను చదివించింది. ఆ కష్టం తెలుసు కాబట్టే, పట్టుదలతో చదివాను. ఎంటెక్ చేశాను. 2009లో ఉమ్మడి రాష్ట్రంలోని ఎగువ సీలేరులోని పవర్ ప్లాంట్‌లో సబ్ ఇంజినీర్‌గా నా ప్రభుత్వ ఉద్యోగ ప్రయాణాన్ని మొదలుపెట్టా. జాబ్ చేస్తూ... మరిన్ని ప్రభుత్వ కొలువుల కోసం నాలుగేళ్లు ప్రయత్నించా. ఇందుకు నా భర్త సన్యాసి రావు ప్రోత్సాహమూ ఎంతో. 2013లో జీహెచ్‌ఎంసీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జలమండలి శాఖ, పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ప్రభుత్వ కొలువులు పొందా. విద్యార్థులకు పాఠాలు చెప్పడమన్నా, వాళ్లను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమన్నా నాకు ఇష్టం. దాంతో లెక్చరర్ ఉద్యోగాన్ని ఎంచుకుని, జహీరాబాద్‌లో చేరా. రామంతాపూర్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ విద్యార్థులకు అధ్యాపకురాలిగా పనిచేశా. 2018లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇవ్వడంకోసం మొదటిసారిగా కేర్ టేకర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టా. ఆ తరవాత గ్వాలియర్‌లో మూడు నెలలపాటు శిక్షణ తీసుకున్నా. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొట్ట మొదటి మహిళా ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టా. ప్రస్తుతం జహీరాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా విభాగంలో ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణనిస్తున్నా. 2018, 2022, 2023ల్లో దిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన థల్ సైనిక్ క్యాంపులకు ఇక్కడి ఎన్‌సీసీ విద్యార్థులను పంపించా. నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినప్పటి కంటే ఈ బాధ్యత మరింత ఆనందాన్నిస్తోంది. అంతేకాదు, ఎంటెక్‌తో చదువు ఆపాలనుకోలేదు. అందుకే, పీహెచ్‌డీ కూడా చేస్తున్నా. సరైన ప్రణాళికతో ఏదైనా సాధించొచ్చనే నమ్మకం నాది.

– కొంకటి రాజు, హబ్సిగూడ

ఏ నూనె మంచిది?

డీప్ ఫ్రైకీ, వేపుళ్లకీ ఆలివ్, వేరుశనగ వీటిలో ఏ నూనె మంచిది?

– ఓ సోదరి



డియర్ వసుంధర

డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

ఆలివ్ నూనె ఇప్పుడిప్పుడే మనదేశంలో అందుబాటులోకి వస్తోంది. అందరికీ అందుబాటు ధరలో ఉండేది వేరుశనగ నూనె మాత్రమే. అంతేకాదు, డీప్ ఫ్రై, వేపుళ్లలో మనం నూనెను ఎక్కువసేపు మరిగిస్తాం. వేరుశనగ ఆయిల్‌కి స్మోకింగ్ పాయింట్ (ఆయిల్ మరిగి పొగలు వచ్చే సమయం) ఎక్కువ. అందుకే డీప్ ఫ్రై, ఇంకా వేపుళ్లకి ఇదే అనువైనది. దీనిలో శాచురేటెడ్ ఫ్యాట్స్ తక్కువగానూ, మోనోశాచురేటెడ్, పాలీశాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగానూ ఉండి మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే మన శరీరానికి అవసరమయ్యే ఒమేగా - 6 కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆలివ్ నూనెలోనూ ఉంటాయి. కానీ, ప్రాసెస్ చేసిన నూనెలు మాత్రమే ఎక్కువ స్మోకింగ్ పాయింట్‌ని కలిగి ఉంటాయి. అయితే ఇక్కడ మీరు గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే వంటకు ఏ నూనెను వాడినా ఒక్కసారి మాత్రమే వినియోగించాలి. డీప్ ఫ్రై, వేపుళ్లు చేసిన నూనెలను మళ్లీ మళ్లీ వాడకూడదు. ఎందుకంటే ఎక్కువసార్లు ఆయిల్ వేడి చేయడం వల్ల శరీరానికి హాని చేసే ట్రాన్స్ ఫ్యాటీ ఆమ్లాలు తయారవుతాయి. అందువల్ల వేపుళ్లు, డీప్ ఫ్రైలకు వీలైనంత దూరంగా ఉంటేనే మంచిది.

బంగారం - వెండి



16న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,320	91,400	1,13,771
విజయవాడ	97,535	91,000	1,14,300
ప్రొద్దుటూరు	97,800	89,980	1,12,800
రాజమహేంద్రవరం	99,280	91,000	1,24,000
విశాఖపట్నం	98,920	91,000	1,20,000
తమిళనాడు	-----	91,000	1,24,000

పిల్లల్ని పాఠం చెప్పమనండి!



ఇంట్లో అమ్మ బాధ్యతలు అనంతం. వాటిల్లో ఒకటి పిల్లల్ని చదివించడం కూడా. సాధారణంగా పిల్లలు పాఠాల్లోని ప్రశ్నలకు జవాబుల్ని చూడకుండా చెబుతూ తమని పరీక్షించమంటారు. అయితే ఈసారి మీరు విద్యార్థిగా, పిల్లలు టీచర్లుగా మారిపోయి చూడండి. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్, సోషల్... సబ్జెక్టు ఏదైనా ప్రశ్నల రూపంలో కాకుండా ఆ పాఠంలోని అంశాల్ని మీకు వివరించమనండి. దీన్నే ఫెయిన్‌మాన్ టెక్నిక్‌గా చెబుతారు. ఇదో రకమైన అధ్యయన విధానం. నోబెల్ గ్రహీత రిచర్డ్ ఫెయిన్‌మాన్ దీన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఒక అంశాన్ని పూర్తిగా బోధించగలిగితే దాన్ని లోతుగా నేర్చుకున్నట్టేనంటారు ఫెయిన్‌మాన్. కాన్సెప్టులు ఎక్కువగా ఉండే సైన్స్, మ్యాథ్స్‌లో దీని ఉపయోగం మరింత ఎక్కువట. ఏదైనా అంశాన్ని సరిగ్గా వివరించలేకపోతే, దాని మీద మళ్లీ దృష్టి పెట్టమనాలి. పిల్లలు చెప్పింది మీకు పూర్తిగా అర్థమైతే, వాళ్లకూ వచ్చేసినట్టే. బాగుంది కదా ఈ పద్ధతి! దీనివల్ల పిల్లల్లో పఠనాశక్తితోపాటు, బోధనపైన ఆసక్తి కూడా పెరుగుతుంది. పిల్లలకే కాదు, పరీక్షలకు సిద్ధమయ్యే వాళ్లెవరైనా ఇలా పాఠాల్ని వివరిస్తే బాగా నేర్చుకోవచ్చుట. ఎవరూ లేకపోతే, తమకుతాముగా చెబుతూ కూడా ప్రాక్టీసు చేయొచ్చు.

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

అయినా... తగ్గట్లేదు!



బరువు తగ్గడానికి ఎన్నెన్ని చేస్తున్నానో! ఆరోగ్యకరమైన ఆహారం తింటున్నా, వాకింగ్‌కీ వెళ్తున్నా... అయినా తగ్గట్లేదు అంటారు కొందరు. మీరూ అదే బాపతా? అయితే ఈ పొరపాట్లు చేస్తున్నారేమో!

- 'రాత్రుళ్లు ఆహారం మానేసి పండ్లే తింటున్నా' చాలామంది చెప్పే మాటే ఇది. కానీ ఇవి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తికి కారణమవుతాయి. అది పెరిగి కొవ్వు పేరుకోవడానికి దారితీస్తాయి. కాబట్టి, కేవలం పండ్లే పరిష్కారం కాదు. కావాలంటే వాటిని స్నాక్స్‌గా తీసుకోండి పర్లేదు. కానీ ప్రొటీన్, ఆరోగ్యకమైన కొవ్వులు ఉండే ఆహారానికీ చోటివ్వాలి. ఉదయాన్నే జీరా, మెంతులు నానేసిన నీటిని తాగుతున్నారా? ఇవి జీర్ణప్రక్రియకు సాయపడతాయి. కేవలం వీటితోనే తగ్గుతారన్నదీ అపోహే.
- ఏదైనా తినాలనిపిస్తే ఆరోగ్యమని నట్స్‌ని ఎంచుకుంటారు చాలామంది. కానీ వీటితో వచ్చే కెలోరీలూ తక్కువేమీ కాదు. కాబట్టి, గుప్పెడు అన్న నియమం మాని, తలా రెండు తినడానికే మొగ్గు చూపండి. ఆరోగ్యకరమైన స్నాక్స్ ఇవి అని తినేవాటిల్లోనూ ఎక్కువశాతంలో ఉప్పు, ప్రిజర్వేటివ్స్ ఉండొచ్చు. కాబట్టి, ఇంట్లోవాటికే ప్రాధాన్యమివ్వండి. కావాలంటే బఠాణీలు, శనగలు, మరమరాలు వంటివి ప్రయత్నించవచ్చు.
- రోజూ తప్పకుండా వాకింగ్ చేస్తున్నా! మంచి వ్యాయామమే. అయితే కొవ్వు కరగడానికి నడక ఒక్కటే సరిపోదు. దాంతోపాటు కనీసం రెండు రోజులు స్ట్రెంత్ ట్రైనింగ్, బాడీ వెయిట్ వర్కవుట్లనీ చేయండి. త్వరిత ఫలితం ఉంటుంది.
- ఉదయాన్నే లేవగానే టీ, కాఫీలనూ తాగొద్దు. ఇవి కార్టిసాల్ విడుదలకు కారణమవుతాయి. అంతేకాదు, హార్మోన్లపై ప్రభావం చూపి పొట్ట దగ్గర కొవ్వు పేరుకోవడానికీ దారి తీస్తాయి. వేడినీళ్లు తాగడం, ఆపై ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకున్నాక అరగంట ఆగి అప్పుడు టీ, కాఫీల జోలికి వెళ్లండి. ముఖ్యంగా డైట్ ఏదైనా సొంతంగా నిర్ణయించుకోవద్దు, ఎవరినీ అనుసరించొద్దు. మీ శరీర తీరుకు తగ్గ డైటేంటో నిపుణులను అడిగి తెలుసుకోండి. వారి సూచనల మేరకు అనుసరించండి.



భారత్ మహిళా నాయకత్వం దిశగా త్వరితగతిన అడుగులు వేస్తోంది. దేశానికి కావాల్సిన అసలైన మార్పు ఇదే. రాజకీయ, అధికార యంత్రాంగంలో, ప్రైవేట్ రంగంలో, గ్రామస్థాయిలో మహిళల నాయకత్వం పెరగడంవల్ల శ్రామిక వర్గంలోకి స్త్రీల రాక వేగం పుంజుకుంటోంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం... ఎక్కడైనా సరే, మహిళలకు అవకాశం వచ్చినప్పుడు తమ పూర్తి సామర్థ్యాలను చూపాలి.

- వైశాలీ నిగమ్ సిన్హా, సహ-వ్యవస్థాపకులు, రిన్యూ, ఛైర్‌పర్సన్, సస్టెయినబిలిటీ

అందరికీ వైద్యం అందాలని..!



తబస్సుమ్

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. అయినా డాక్టర్ కావాలని కలలుకంది బిహార్‌కి చెందిన తబస్సుమ్ జహన్. ఇందుకు చిన్నప్పుడు తనకెదురైన పరిస్థితులే కారణమంటోంది. తాను కోరుకున్నట్టుగానే ఇటీవల విడుదలైన నీట్ యూజీ పరీక్షల్లో 550 మార్కులు తెచ్చుకుని డాక్టర్ సీటు సంపాదించుకుంది. కటిక పేదరికం నుంచి వైద్య విద్య అభ్యసించే వరకూ సాగిన తన ప్రయాణం నెట్టింట్లో వైరల్ అవుతోందిప్పుడు..!

'రోజు గడవాలంటే ఇంటిల్లిపాదీ కష్టపడాల్సిందే. అందుకే నేను ఓ ఇంట్లో హెల్పర్‌గా పనిచేసేదాన్ని ఓ రోజు సామాన్లు సర్దుతుండగా కిందపడి చేతికి గాయం అయ్యింది. దాంతో మోచేతిలోని నరం కుంచించుకుపోయింది. చికిత్స కోసం అమ్మ పట్నాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రి బిల్లు కట్టడానికీ డబ్బుల్లేవు. అతికష్టం మీద రూమ్ అద్దె, మందుల ఖర్చులు చెల్లించేది అమ్మ. ఏడు నెలలు అయినా నా పరిస్థితిలో మార్పు రాలేదు. దాంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే నయం అవుతుందని తెలిసిన వారు చెప్పారు. కానీ, అంత ఆర్థికస్థోమత లేదు మాకు. అయినా అమ్మ వెనకడుగు వేయలేదు. డబ్బుల కోసం నన్ను ఆసుపత్రిలో ఉంచి బట్టలు కుట్టడానికి వెళ్లేది. ఆమె రేయింబవళ్లు కష్టపడినా ఆ మొత్తం నా మందులకే సరిపోయేవి. తెలిసినవాళ్లని అప్పు అడిగితే, డబ్బులు ఇవ్వకపోగా మా పేదరికాన్నీ, అమ్మనూ చులకన చేసి మాట్లాడేవారు. ఆ సమయంలో నా చెయ్యి నొప్పికన్నా... వాళ్లు అమ్మను అన్న మాటలే నన్ను ఎంతగానో బాధించాయి' అనే తబస్సుమ్ వాళ్లన్న ఆసుపత్రి రూమ్ ఫీజు కట్టలేకపోవడంతో వాళ్లని హాస్పిటల్ నుంచి బయటికి పంపేశారు. చేసేదిలేక తల్లీకూతుళ్లిద్దరూ మూడురోజులపాటు గోరఖ్‌పుర్ రైల్వేస్టేషనులోనే గడిపారు. అప్పుడే తబస్సుమ్ నిర్ణయించుకుందట వైద్యం కోసం తను పడిన కష్టం ఇంకెవరూ పడకూడదని.

చదువుకు దూరమైనా...

అనారోగ్య కారణాల వల్ల ఏడాదిన్నర చదువుకి దూరమైనా తబస్సుమ్ తన విద్యను కొనసాగించాలనుకుంది. డాక్టర్ కావాలన్న ఆమె ఆశయానికి ఫిజిక్స్ వాలా(పీడబ్ల్యూ) విద్యాపీఠ్ సంస్థ తోడైంది. మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ఆఫ్‌లైన్ ద్వారా ప్రశ్నా పత్రాలు, మాడ్యూల్స్ ఇస్తుంటుందీ సంస్థ. వీటి సహాయంతో నీట్ యూజీ 2025 పరీక్షలో అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించింది తబస్సుమ్. అంతేకాదు, ఫ్రీ సీటు కూడా సంపాదించుకుంది. దీంతో పీడబ్ల్యూ వ్యవస్థాపకుడు అలఖ్ తన పైచదువుకి ఉపయోగపడేలా రూ.4లక్షల స్కాలర్‌షిప్, ల్యాప్‌టాప్‌ను అందించారు. 'అమ్మాయి ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడకూడదు. తన కాళ్లమీద తనే నిలబడాలి. డబ్బు పుస్తకాలను కొనుక్కోవడానికి పనికొస్తుంది. కానీ, జ్ఞానాన్ని కాదు. అది పొందాలంటే మన ప్రయత్నంతోనే సాధ్యం అవుతుంది. ముఖ్యంగా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి అనుకున్నప్పుడు ప్రతి ఒక్కరూ సొంతంగా, కొత్తగా ప్రయత్నించాలి' అనే తబస్సుమ్ ఆలోచన నేటి యువతకు స్ఫూర్తిదాయకమే కదా!

మీకు తెలుసా?



సాధారణంగా శిశువు గర్భంలో తొమ్మిది మాసాలు ఉంటుంది. అయితే, కాలిఫోర్నియాకు చెందిన బ్యూలా హంటర్... గర్భధారణ సమయం మాత్రం 375 రోజులట. అంటే మామూలు కంటే 100రోజులు ఎక్కువ. ఇదే 'లాంగెస్ట్ హ్యూమన్ ప్రెగ్నెన్సీ' గా రికార్డులకెక్కిందట.

ఎందుకీ నిర్లక్ష్యం..?



పిల్లలకు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా... హాస్పిటల్‌కు పరుగు పెడతారు. వాళ్ల ఇబ్బంది దూరమయ్యేదాకా కంటి మీద కునుకే రాదు తల్లులకు. రేయింబవళ్లు వాళ్ల సేవల్లోనే మునిగిపోతారు. పెద్దవాళ్ల విషయంలోనూ ఇంతే. మరి అందరినీ కంటికి రెప్పలా కాచుకునే మనకు అనారోగ్య సమస్య వస్తే... 'ఈ రోజేగా వచ్చింది రేపు మందులు వేసుకుంటాలే' 'జ్వరమేగా ఇప్పుడే డాక్టర్ దగ్గరకు ఎందుకు? ఓ ట్యాబ్లెట్ వేసుకుంటే తగ్గిపోద్దిలే అంటూ... ఎంత నిర్లక్ష్యమో. ముప్పై దాటాయంటే నడుము, కీళ్లు, పళ్ల నొప్పులు వేధిస్తున్న రోజులివి. పైగా ఆహారం, నీళ్ల మీద శ్రద్ధ లేకపోవడంతో కిడ్నీ సమస్యలు కూడా ఎక్కువగా వస్తాయట ఈ దశలో. మరి ఇలాంటి దశలో చిన్న నొప్పులే అంటూ వాటిని పట్టించుకోకుండా వదిలేస్తే ఎంత ప్రమాదం? కొందరైతే నొప్పిని తట్టుకోలేక పెయిన్ కిల్లర్స్ కూడా వాడుతుంటారు. ఇవి సమస్యకు పరిష్కారం కాదు. నొప్పిని కప్పి ఉంచడానికి మాత్రమే పనికొస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అయినా వాటినే ఆశ్రయిస్తున్నాం. మన దేశంలో పదిమంది మహిళల్లో ఎనిమిది మంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని 'పియర్స్ హెల్త్ కేర్' అధ్యయనం వెల్లడించింది. ప్రసవం తర్వాత రెండు మూడేళ్లకు దాదాపు 40శాతం మంది ఏదోక విధంగా అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారట. వారిలో వైద్యుల్ని ఆశ్రయిస్తున్న వారు 30 శాతమే. అది కూడా జబ్బు లక్షణాలు ఎక్కువయ్యాకే. ఇదే పరిస్థితి కొనసాగితే... మీ వృత్తి, వ్యక్తిగత జీవితాలకు అంతరాయం తప్పదు. ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని ఆశ్రయిస్తారు కదూ..!

అన్నదమ్ములకు రాఖీ పువ్వు!



పెద్ద పెద్ద రేకలు... చుట్టూ సన్నటి కేసరాలతో అందంగా విచ్చుకున్న పేషన్ ఫ్లవర్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. అన్నదమ్ములకు కట్టే రక్షా బంధన్‌ని పోలి ఉండే ఈ తీగను ఇంటి ముందు పెంచుకుంటే ఎంతందమో!

మరి దీన్ని ఎలా సంరక్షించుకోవాలో తెలుసా!

రాఖీ పూల మొక్కనే... ప్లాసిఫోరా, క్రిషన్ కమల్, పేషన్ ఫ్లవర్ అంటూ ప్రాంతానికో పేరుతో పిలుస్తున్నారు. ఇది పాసిఫ్లోరేసి కుటుంబానికి చెందినది. అందమైన పువ్వులు, రుచికరమైన పండ్లు, ఆహార అవసరాలు, సంప్రదాయ ఔషధ ఉపయోగాలకోసం ఈ మొక్కను ఎక్కువగా పెంచుతారు. ఇందులో 500 కంటే ఎక్కువ జాతులు ఉన్నాయట. ప్లాసిఫోరాలోని కొన్ని ఆర్నమెంటల్ హైబ్రిడ్స్ రకాలు... రాయల్ హార్టికల్చర్ సొసైటీ అవార్డ్స్‌ని కూడా అందుకున్నాయి. ఈ పూలు ఊదా, నీలం, గులాబీ, ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ వంటి రంగుల్లో పెద్ద పెద్ద నక్షత్రాల్లా విచ్చుకుంటాయి. ఇవి చూడ్డానికి రక్షాబంధన్‌ని పోలి ఉండటంతో కొందరు రాఖీలుగానూ ఉపయోగిస్తున్నారు. కానుకలుగానూ ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

సువాసనతో పండ్లు...

ఈ మొక్క సాధారణంగా ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాలతోపాటు... సమశీతోష్ణ వాతావరణాల్లోనూ పెరుగుతుంది. పోర్టికోలు, బాల్కనీలు, గోడలు, పందిరి... వంటి ఆధారం ఉంటే 30 మీటర్ల ఎత్తువరకూ ఎగబాకుతుంది. పేషన్ మొక్కకు కనీసం 4-6 గంటలపాటు ఎండ తగిలేలా చూసుకోవాలి. ఈ పూలు మకరందాన్ని కలిగి ఉండి... తేనెటీగలు, హమ్మింగ్ బర్డ్ వంటి పక్షులను ఆకర్షిస్తాయి. తక్కువ నిర్వహణతో చక్కగా పెరిగే ఈ పేషన్ తీగను... కాండంతోపాటు విత్తనాల ద్వారానూ మొలకెత్తించవచ్చు. ఇది రాళ్లు, పొడి నేలల్లోనూ పెరిగినా... ఎక్కువ పూలతో ఆరోగ్యంగా ఉండాలంటే మాత్రం సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. నెలకోసారి ఎన్‌పీకే సమగ్ర ఎరువుని ఇవ్వాలి. ఏడాదికోసారి చుట్టూ ఉన్న మట్టిని పెకిలించి మల్చింగ్ చేయాలి. మొక్క పెరుగుదల, ఆకారాన్ని నియంత్రించడానికి ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. స్పైడర్ మైట్స్, మిలీబగ్స్ వంటి తెగుళ్లను అరికట్టడానికి వేపనూనె, బేకింగ్ సోడా మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

ఇంటి తోట

పేషన్ తీగకు పండ్లూ వస్తాయి. మంచి సువాసనతో, తీపి, పులుపు సమ్మేళన రుచితో ఇవి ఆకట్టుకుంటాయి. అంతేకాదు, ఈ మొక్కకు ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయట. ముఖ్యంగా అనాల్జిసిక్, యాంటీస్పాస్మోడిక్ లక్షణాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లూ, ఖనిజాలు, విటమిన్లూ ఉండటంతో సంప్రదాయ వైద్యంలో విరివిగా వాడతారట.



ఛాంపియన్



ఒకప్పుడు వెస్టిండీస్ అంటే అరివీర భయంకరమైన జట్టు. ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నం. ఆ జట్టుతో టెస్టు మ్యాచ్ అంటే ముందే జావగారిపోయేవి ప్రత్యర్థి జట్లు. ఇటు బ్యాటింగ్‌లో వీర విజృంభణతో.. అటు బౌలింగ్‌లో ముప్పేట దాడితో.. అవతలి జట్లను వణికించేది. కానీ ఇప్పుడు పసికూనలే నయం అనిపించే ఆట. సుదీర్ఘ ఫార్మాట్లో ఇప్పటికే పతనావస్థను చూస్తున్న ఆ జట్టు.. ఇప్పుడు 27 పరుగులకే ఆలౌటై పాతాళానికి పడిపోయింది. ఈ స్థితి నుంచి విండీస్ పుంజుకుంటుందన్న సంకేతాలేమీ కనిపించడం లేదు.

ఈ పతనం ఎక్కడిదాకా?

ఈనాడు క్రీడావిభాగం

గ్యారి సోబర్స్, డెస్మండ్ హేన్స్, వివ్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, మాల్కమ్ మార్షల్, జోయెల్ గార్నర్, కర్ట్లీ ఆంబ్రోస్, కోట్నీ వాల్ష్, బ్రియాన్ లారా దిగ్గజ ఆటగాళ్లతో అలరారిన జట్టు వెస్టిండీస్. 70, 80 దశకాల్లో ప్రపంచ క్రికెట్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన ఆ జట్టు.. 90వ దశకం మధ్య నుంచి పతనం దిశగా అడుగులు వేసింది. చూస్తుండగానే ఆ జట్టు ప్రమాణాలు పడిపోయాయి. ముందుతరం దిగ్గజ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసే క్రికెటర్లు రాలేదు. దీనికి తోడు బోర్డు అస్తవ్యస్త పాలనతో విండీస్ క్రికెట్ మరింతగా దెబ్బ తింది. నెమ్మదిగా అభిమానుల్లో జట్టు మీద ఆశలు తగ్గిపోతూ వచ్చాయి. అయినా సరే.. చందర్‌పాల్, క్రిస్ గేల్, శర్వాన్ లాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో ఓ మోస్తరుగా అయినా ఉండేది విండీస్. కానీ కాంట్రాక్టుల విషయంలో బోర్డుతో చెలరేగిన తీవ్ర వివాదం ఆ దేశ క్రికెట్లో సంక్షోభానికి దారి తీసింది. అదే సమయంలో ప్రపంచ క్రికెట్లో టీ20 విప్లవం మొదలై లీగ్‌లకు ఆదరణ పెరగడంతో ఆటగాళ్లు వాటికే ప్రాధాన్యం ఇవ్వడం మొదలు పెట్టారు. గేల్, సునీల్ నరైన్, కీరన్ పొలార్డ్ లాంటి మేటి ఆటగాళ్లు చాలామంది లీగ్‌లకే ప్రాధాన్యం ఇవ్వడం మొదలు పెట్టారు. వాళ్లకు వీలున్నప్పుడు, సెలక్టర్లు ఆసక్తి ఉన్నప్పుడు మాత్రమే జాతీయ జట్టుకు ఆడడంతో విండీస్ జట్టులో నిలకడ తప్పింది. టీ20 జట్టులో ఎవరున్నా ఆ ఫార్మాట్లో విండీస్ బాగానే ఆడుతోంది కానీ.. వన్డేల్లో, ముఖ్యంగా టెస్టుల్లో ఆ జట్టు ప్రదర్శన దారుణంగా పడిపోతూ వచ్చింది. 2023 వన్డే ప్రపంచకప్‌కు ఆ జట్టు అర్హత సాధించలేదు. టెస్టుల్లో అయితే విండీస్ ఆట నానాటికీ తీసికట్టుగా మారుతోంది. టెస్టు జట్టులో పేరున్న ఆటగాళ్లే ఉండట్లేదు. ఉన్న వాళ్ల మీదా టీ20ల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. వారికి కొన్ని సెషన్ల పాటు నిలవడం, మ్యాచ్‌ను 4, 5 రోజులకు తీసుకెళ్లడం శక్తికి మించిన పని అవుతోంది. కాసేపు ధనాధన్ షాట్లు ఆడమంటే ఆడతారు కానీ.. ప్రతికూల పరిస్థితుల్లో ఓపిగ్గా నిలబడి ఆడమంటేనే కష్టం. కాబట్టే గులాబీ టెస్టులో 204 పరుగుల లక్ష్యం ముందు నిలిస్తే.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్‌ల ధాటికి తాళలేక కేవలం 14.3 ఓవర్లలో 27 పరుగులకే కుప్పకూలిపోయారు.

మార్పు వస్తుందా?

కింగ్‌స్టన్‌లో కరీబియన్ జట్టుకు ఘోర పరాభవం ఎదురవగానే.. ఆ దేశ క్రికెట్ బోర్డు మాజీ ఆటగాళ్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. విండీస్ క్రికెట్‌ను చక్కదిద్దడం కోసం. కానీ టెస్టుల్లో ఆ జట్టు ప్రదర్శనను మెరుగుపరచడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా లేదు. ఒకప్పుడు అభిమానులతో నిండుగా కళకళలాడిన స్టేడియాలు.. ఇప్పుడు విండీస్ ఆడుతుంటే ఖాళీగా కనిపిస్తున్నాయి. జట్టు ప్రదర్శన పడిపోవడం, స్టార్ ఆటగాళ్ల ప్రాతినిధ్యం తగ్గిపోవడం, స్టేడియాల నిర్వహణ దెబ్బ తినడంతో కరీబియన్ అభిమానులు స్టేడియాలకు రావడం తగ్గించేశారు. విండీస్ జట్టుకు స్పాన్సర్‌షిప్, ఆ జట్టు మ్యాచ్‌లకు ప్రసార ఆదాయం పడిపోయింది. దీంతో దేశవాళీ క్రికెట్ నిర్వీర్యం అయిపోయింది. యువ ప్రతిభావంతులను తీర్చిదిద్దే ప్రక్రియ దెబ్బ తింది. విండీస్ క్రికెటర్లు ఇప్పుడు ఐపీఎల్ సహా ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లలో వారి కెరీర్లు ఆదరువుగా మారుతున్నాయి. జాతీయ జట్టులో చోటు సంపాదిస్తున్నది కూడా వాళ్లే. టెస్టు జట్టులోనూ ఎక్కువగా టీ20 స్పెషలిస్టులే కనిపిస్తున్నారు. వాళ్లు సుదీర్ఘ ఫార్మాట్లో ఎదురయ్యే సవాళ్లకు నిలవలేక పోతున్నారు. ఫలితమే.. 27 ఆలౌట్ లాంటి పరాభవాలు. మరి ఈ పతకం ఇంకా ఎక్కడిదాకా వెళ్తుందో చూడాలి.

భారత్ శుభారంభం

- రాణించిన దీప్తి
- ఇంగ్లాండ్‌పై తొలి వన్డేలో విజయం



దీప్తి శర్మ

సౌతాంప్టన్: ఇంగ్లాండ్ పర్యటనలో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. టీ20 సిరీస్‌ను గెలుచుకున్న టీమ్ఇండియా.. మూడు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. బుధవారం ఆసక్తికరంగా సాగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌సేన 4 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ మొదట 6 వికెట్లకు 258 పరుగులు చేసింది. సోఫియా డంక్లీ (83; 92 బంతుల్లో 9×4), అలైస్ రిచర్డ్స్ (53) రాణించడంతో ఆ జట్టు స్కోరు 250 దాటింది. క్రాంతి గౌడ్ (2/55), స్నేహ్ రాణా (2/31) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. తెలుగమ్మాయి శ్రీచరణి ఒక వికెట్ తీసింది. అనంతరం భారత్ 48.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అయిదో వికెట్‌కు 90 పరుగులు జోడించిన దీప్తి శర్మ (62 నాటౌట్; 64 బంతుల్లో 3×4, 1×6), జెమీమా రోడ్రిగ్స్ (48) జట్టును విజయపథంలో నడిపించారు. జెమీమా ఔటైనా దీప్తి ఆఖరి వరకు నిలిచి జట్టును గెలిపించింది. ప్రతీక రావల్ (36), స్మృతి (28) రాణించారు.

జపాన్ ఓపెన్

సింధు నిష్క్రమణ



సింధు

ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ, లక్ష్యసేన్

టోక్యో: భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు వైఫల్యం కొనసాగుతోంది. జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలోనూ సింధు తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. బుధవారం మహిళల సింగిల్స్ పోరులో సింధు 15-21, 14-21తో సిమ్ యు జిన్ (కొరియా) చేతిలో పరాజయం చవిచూసింది. ఈ ఏడాది సింధు తొలి రౌండ్లోనే ఓడిన అయిదో టోర్నీ ఇది. మరోవైపు లక్ష్యసేన్, అనుపమ ఉపాధ్యాయ.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాత్విక్- చిరాగ్ జోడీ 21-18, 21-10తో కాంగ్ మిన్ హ్యుక్- డాంగ్ జు (కొరియా) జంటను చిత్తుచేసింది. మంచి ఫామ్‌లో ఉన్న భారత జంట 42 నిమిషాల్లో ప్రత్యర్థి టీమ్‌ను మట్టికరిపించింది. మొదట్లో రెండు జోడీలు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. షటిల్‌పై నియంత్రణకు కొద్దిగా సమయం తీసుకున్న సాత్విక్- చిరాగ్ అనంతరం చెలరేగారు. లయను దొరకబుచ్చుకుని వరుస పాయింట్లతో హోరెత్తించారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21-11, 21-18తో వాంగ్ జెంగ్ షింగ్ (చైనా)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ 21-15, 18-21, 21-18తో రష్మికశ్రీపై గెలుపొందింది. ఉన్నతి హుడా 8-21, 12-21తో పోర్న్‌పావీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్- రుబన్ కుమార్ 15-21, 9-21తో కిమ్ వాన్- సియో సూంగ్ (కొరియా) చేతిలో.. మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం- సిమ్రన్ సింఘి 6-21, 5-21తో ల్యూ లోక్- సాంగ్ యాన్ (హాంకాంగ్) చేతిలో పరాజయం చవిచూశారు.

దివ్య విజయం



దివ్య

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్

బటుమి (జార్జియా): ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో భారత ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ సత్తా చాటింది. ఆమె ప్రిక్వార్టర్స్ తొలి గేమ్‌లో రెండో సీడ్ జినర్ జు (చైనా) షాకిచ్చింది. రెండో గేమ్‌ను డ్రాగా ముగించినా దివ్య క్వార్టర్స్‌లో ప్రవేశిస్తుంది. అలెగ్జాండ్రా కోస్టెనుక్ (స్విట్జర్లాండ్)తో తొలి గేమ్‌ను హంపి డ్రాగా ముగించింది. మరోవైపు హారిక కూడా డ్రాతో సరిపెట్టుకుంది. కేతరినా లాగ్నోను ఆమె నిలువరించింది. పోటీలో ఉన్న మరో భారత అమ్మాయి వైశాలికీ డ్రా తప్పలేదు.

క్రికెట్ అగమాగం

- సీఏసీ లేదు.. సెలెక్టర్లు లేరు
- జట్ల ఎంపికపై అనిశ్చితి
- సందిగ్ధంలో యువ క్రికెటర్ల భవిష్యత్తు

ఈనాడు - హైదరాబాద్

ఐపీఎల్ ముగిసిందో లేదో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో లీగ్‌లతో సందడి నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, ముంబయి, మహారాష్ట్ర, రాజస్థాన్, బెంగాల్, దిల్లీ, ఆంధ్రతో సహా ప్రధాన రాష్ట్రాల్లో నిర్వహించిన లీగ్‌లలో కుర్రాళ్లు హోరెత్తించారు. ఆయా రాష్ట్ర జట్లలో చోటు కోసం పోటీపడుతున్నారు. కానీ హైదరాబాద్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు మార్గనిర్దేశనంలో లీగ్ మ్యాచ్‌లు జరుగుతున్నా.. ఎందుకు ఆడుతున్నామో తెలియని దుస్థితి క్రికెటర్లది! ఇప్పటి వరకు సెలెక్టర్లను నియమించకపోవడమే ఇందుకు కారణం.

అవినీతి, అక్రమాల వ్యవహారంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, కోశాధికారి సి.జె.శ్రీనివాస్ జ్యుడిషియల్ రిమాండులో ఉండగా.. కార్యదర్శి దేవరాజ్ అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సంయుక్త కార్యదర్శి బసవ రాజు, కౌన్సిలర్ సునీల్‌కుమార్ అగర్వాల్ మాత్రమే ఎపెక్స్ కౌన్సిల్‌లో మిగిలారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ ప్రతినిధి రాజశేఖర్ సహాయంతో కోరమ్ ఏర్పాటు చేసుకున్న హెచ్‌సీఏ ఎపెక్స్ కౌన్సిల్.. ప్రస్తుత ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా శనివారం ఎంపిక చేసుకుంది. మంగళవారం జరిగిన మరో భేటీలోనూ ముఖ్యమైన నిర్ణయమేదీ తీసుకోకపోవడం హెచ్‌సీఏ అశక్తతకు నిదర్శనం. అత్యంత కీలకమైన క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) నియామకంపై ఎపెక్స్ కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జస్టిస్ లోధా కమిటీ సిఫార్సుల ప్రకారం కోచ్‌లు, సెలక్టర్లను సీఏసీ మాత్రమే ఎంపిక చేయాలి. కానీ అవినీతి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌లో మునిగిపోయిన అధ్యక్షుడి బృందం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అధ్యక్షుడు, కోశాధికారి అరెస్టు తర్వాత రెండు సార్లు సమావేశమైన ఎపెక్స్ కౌన్సిల్ సైతం సీఏసీని నియమించకపోవడం క్రికెటర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఎ-డివిజన్, బి-డివిజన్ మ్యాచ్‌లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. వందల సంఖ్యలో కుర్రాళ్లు ప్రతిభ కనబరుస్తున్నారు. హైదరాబాద్ రంజీ ట్రోఫీ, అండర్-23, అండర్-19 జట్ల ఎంపికకు ఈ లీగ్‌లలో ప్రదర్శనే ప్రాతిపదిక. మరి ఆటగాళ్ల ప్రదర్శనను ప్రత్యక్షంగా చూసి.. వారిని హైదరాబాద్ జట్లకు ఎంపిక చేయాల్సిన సెలెక్టర్లు ఎక్కడ? కుర్రాళ్లను సానబెట్టి మార్గనిర్దేశనం చేయాల్సిన కోచ్‌ల ఎంపిక ఎప్పుడు? లీగ్ మ్యాచ్‌లన్నీ పూర్తయ్యాక స్కోర్లు చూసి జట్లను ఎంపిక చేస్తారా? బ్యాటర్లు, బౌలర్ల నైపుణ్యాల్ని ప్రత్యక్షంగా చూడాల్సిన అవసరమే లేదా? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేవు.

ఆగస్టులో చెన్నైలో అఖిల భారత బుచ్చిబాబు క్రికెట్ టోర్నీ జరగనుంది. దేశవాళీ క్రికెట్లో మొదటి టోర్నీ ఇది. రంజీ ట్రోఫీకి సన్నాహంగా భావించే బుచ్చిబాబు టోర్నీలో దాదాపు అన్ని ప్రధాన జట్లు బరిలో దిగుతాయి. ఇప్పటి దాకా సెలెక్టర్లను నియమించకపోవడంతో అత్యంత కీలకమైన బుచ్చిబాబు టోర్నీలో హైదరాబాద్ పాల్గొంటుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ హైదరాబాద్ బరిలో దిగినా.. జట్టును ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నదీ ప్రశ్నే. మరోవైపు హెచ్‌సీఏ రోజువారీ నిర్వహణపైనా ఎపెక్స్ కౌన్సిల్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. నిబంధనల ప్రకారం హెచ్‌సీఏ అధ్యక్షుడు, కోశాధికారికి చెక్ అధికారం ఉంటుంది. కార్యదర్శి వోచర్ సంతకం చేస్తే.. అధ్యక్షుడు, కోశాధికారి నిధులు విడుదల చేస్తారు. కానీ ఈ ముగ్గురు లేకపోవడంతో హెచ్‌సీఏ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. చెక్ పవర్‌పై నిర్ణయం తీసుకోకపోతే సిబ్బంది జీతాలు, మైదానాల నిర్వహణ, బిల్లుల చెల్లింపులపై తీవ్ర ప్రభావం తప్పకపోవచ్చు. మరి ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నది అంతుబట్టని ప్రశ్న. ప్రస్తుతం రిమాండులో ఉన్నవాళ్లే తిరిగి పాలన చేపడతారా.. కొత్త కమిటీకి బాధ్యతలు అందుతాయా అన్నది చూడాలి.

దక్షిణాఫ్రికాపై కివీస్ విజయం

ముక్కోణపు టీ20 సిరీస్

హరారె: ముక్కోణపు టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా.. బుధవారం 21 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలైంది. మొదట టిమ్ రాబిన్సన్ (75; 57 బంతుల్లో 6×4, 3×6), బెవాన్ జాకబ్స్ (44; 30 బంతుల్లో 1×4, 3×6) మెరుపులు మెరిపించడంతో కివీస్ 5 వికెట్లకు 173 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మఫాకా (2/38), సెనురన్ ముత్తుస్వామి (1/19), ఎంగిడి (1/28) రాణించారు. అనంతరం మ్యాట్ హెన్రీ (3/34), జాకబ్ డఫీ (3/20), ఇష్ సోధి (2/34) విజృంభించడంతో దక్షిణాఫ్రికా 18.2 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైంది. డెవాల్డ్ బ్రెవిస్ (35), జార్జ్ లిండే (30), లువాన్ ప్రిటోరియస్ (27) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు.

భారత్-ఇంగ్లాండ్ అండర్-19 టెస్టు డ్రా

బెకెన్‌హామ్: ఇంగ్లాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన భారత అండర్-19 జట్టు.. రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఇంగ్లిష్ జట్టుకు 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్.. విజయం కోసం గట్టిగానే ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరిదైన నాలుగో రోజు ఆట చివరికి ఇంగ్లాండ్.. 7 వికెట్లకు 270 పరుగులు చేసింది. హంజా షేక్ (112; 140 బంతుల్లో 11×4, 2×6), బెన్ మేయస్ (51), థామస్ ర్యూ (50) రాణించారు. భారత బౌలర్లలో అంబ్రిష్ (2/48) ఆకట్టుకున్నాడు. అంతకుముందు 128/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. 248కు ఆలౌటైంది. అంబ్రిష్ (53) అర్ధశతకం సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు 540 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 439కి ఆలౌటైంది. సిరీస్‌లో చివరిదైన రెండో యూత్ టెస్టు ఆదివారం మొదలవుతుంది.

నంబర్‌వన్‌గా రూట్



రూట్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మళ్లీ అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. బుధవారం ప్రకటించిన బ్యాటింగ్ జాబితాలో ఒక స్థానం మెరుగైన రూట్ నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ 5, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ 8, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 9వ స్థానాల్లో నిలిచారు. బౌలింగ్‌లో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

మా దృష్టంతా ఫిట్‌నెస్‌పైనే



సాత్విక్

టోక్యో: గాయాలతో ఎదురుదెబ్బలు తగిలినా ఇటీవల కొన్ని సానుకూల ఫలితాలు రావడం పట్ల భారత అగ్రశ్రేణి షట్లర్ సాత్విక్ సాయిరాజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వచ్చే ప్రపంచ ఛాంపియన్‌షిప్ నేపథ్యంలో తమ దృష్టంతా ఫిట్‌గా ఉండడంపైనేనని, ఎలాంటి దీర్ఘకాలిక లక్ష్యాలు లేవని అన్నాడు. సాత్విక్, చిరాగ్ శెట్టి జోడీ ఈ సీజన్‌లో మూడు టోర్నీల్లో సెమీఫైనల్స్‌కు చేరింది. ఓ టోర్నీలో క్వార్టర్స్ వరకు వెళ్లింది. జనవరిలో మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీఫైనల్ చేరాక భారత ద్వయం అనేక వారాలు ఆటకు దూరమైంది. సాత్విక్ అనారోగ్యం, చిరాగ్ వెన్ను గాయమే అందుకు కారణం. ఈ జంట పునరాగమనంలో సింగపూర్ ఓపెన్‌లో సెమీఫైనల్, ఇండోనేసియా ఓపెన్‌లో క్వార్టర్స్ చేరింది. బుధవారం జపాన్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. ఈ నేపథ్యంలో సాత్విక్ స్పందిస్తూ.. "మా దృష్టి 100 శాతం ఫిట్‌గా ఉండడంపైనే. కొన్నాళ్లు మేం ఇబ్బందిపడ్డాం. చిరాగ్ బాగుంటే.. నేను చిన్న చిన్న గాయాలతో ఇబ్బంది పడేవాణ్ని. నేను బాగుంటే అతడికి ఏదో సమస్య ఎదురయ్యేది. గత ఏడాదిగా మేం గాయం లేకుండా ఆడలేదు. చిన్న చిన్న గాయాలతో ఇబ్బందిపడుతున్నాం. అయినా నాణ్యమైన గేమ్‌లు ఆడగలిగాం. అది మాకు సానుకూలాంశం. ప్రస్తుతం మా దృష్టి గాయం లేకుండా, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండడంపైనే" అని అన్నాడు. జపాన్ ఓపెన్ తర్వాత చైనా ఓపెన్, ఆ తర్వాత ఆగస్టు 25 నుంచి పారిస్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ఉంటాయి. "మేం ఇప్పుడు ఎక్కువ దూరం ఆలోచించట్లేదు. మాకు ఎలాంటి లక్ష్యాలూ లేవు. బాగా రాణించాలని అనుకుంటున్నామనుకోండి. కానీ అదే సమయంలో ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నాం. ప్రస్తుతం మేం ఫిట్‌గా ఉన్నాం" అని సాత్విక్ చెప్పాడు.

ఇంగ్లాండ్ గెలిచినా.. పాయింట్లలో కోత

లండన్: భారత్‌తో మూడో టెస్టులో విజయం సాధించినప్పటికీ.. ఇంగ్లాండ్‌కు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్స్ పాయింట్లలో కోత తప్పలేదు. లార్డ్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టుకు రెండు డబ్ల్యూటీసీ పాయింట్ల కోత పడింది. అంతే కాక జట్టులోని ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులోనూ 10 శాతం కోత విధించారు. దీంతో డబ్ల్యూటీసీలో రెండో స్థానంలో ఉండాల్సిన ఇంగ్లాండ్.. మూడుకు పడిపోయింది. పాయింట్లు 24 నుంచి 22కు, గెలుపు శాతం 66.67 నుంచి 61.11కి తగ్గింది. పట్టికలో 100 గెలుపు శాతంతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక (66.67) రెండో స్థానానికి ఎగబాకింది. భారత్ (33.33) నాలుగో స్థానంలో ఉంది.

బంగ్లాదేశ్‌దే సిరీస్

మూడో టీ20లో శ్రీలంకపై విజయం

కొలంబో: శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకుంది. బుధవారం మూడో టీ20లో బంగ్లా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మెహదీ హసన్ (4/11) విజృంభించడంతో మొదట శ్రీలంక 7 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. నిశాంక (46) టాప్ స్కోరర్. దసున్ శానక (35 నాటౌట్) రాణించాడు. లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 16.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తంజిద్ హసన్ (73 నాటౌట్) చెలరేగిపోయాడు. అతను లిటన్ దాస్ (32)తో రెండో వికెట్‌కు 74, హృదోయ్ (27 నాటౌట్)తో అభేద్యమైన మూడో వికెట్‌కు 59 పరుగులు జోడించాడు.

దీపికకు మ్యాజిక్ స్కిల్ అవార్డు




దీపిక

దిల్లీ: భారత మహిళల హాకీ జట్టు స్ట్రైకర్ దీపిక పోలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును గెలుచుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ (2024-25)లో నెదర్లాండ్స్‌పై అద్భుతంగా ఫీల్డ్ గోల్ చేసినందుకు ఆమె ఈ పురస్కారానికి ఎంపికైంది. ప్రొ లీగ్‌లో అత్యంత సృజనాత్మక, నిపుణతగల సందర్భాన్ని గుర్తించడం కోసం ఈ పురస్కారాన్ని ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల ఓట్ల ఆధారంగా ఎంపిక జరిగింది. "ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నా. నెదర్లాండ్స్ వంటి బలమైన ప్రత్యర్థిపై గోల్ చేయడం నాకు ఎంతో ప్రత్యేకమైంది. నా సహచరులు, కోచ్‌లు, కుటుంబం, స్నేహితులకు కృతజ్ఞతలు. వాళ్లు నాకెంతో మద్దతిచ్చారు" అని 21 ఏళ్ల దీపిక వ్యాఖ్యానించింది.


భారత ఫుట్‌బాల్‌లో అనిశ్చితి ఆందోళనకరం

దిల్లీ: భారత ఫుట్‌బాల్‌లో ప్రస్తుత అనిశ్చితి ఆందోళన కలిగిస్తోందని మాజీ కెప్టెన్, స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రి అన్నాడు. దేశంలో ఫుట్‌బాల్ భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ తనకు చాలా మంది సందేశాలు పంపిస్తున్నారని తెలిపాడు. "భారత్‌లో ఫుట్‌బాల్ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఆటగాళ్లు, సిబ్బంది, ఫిజియోల నుంచి నాకు ఎన్నో సందేశాలు వస్తున్నాయి. భారత ఫుట్‌బాల్ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. బాధపడుతున్నారు. ప్రస్తుత అనిశ్చితిపై భయపడుతున్నారు" అని చెప్పాడు. ఐఎస్ఎల్ 2025-26 సీజన్ నిలుపుదలలో ఉంది. ఈవెంట్ నిర్వాహకులు, అఖిలభారత ఫుట్‌బాల్ సమాఖ్య మధ్య ఒప్పందం పునరుద్ధరణపై అనిశ్చితి నెలకొనడమే అందుకు కారణం. సమస్య త్వరలో పరిష్కారమవుతుందన్న ఆశాభావాన్ని ఛెత్రి వ్యక్తం చేశాడు. వరుస ఓటములతో సతమతమవుతోన్న భారత జట్టును బలోపేతం చేయడానికి ఛెత్రి రిటైర్మెంట్‌ను వీడి మళ్లీ ఆట ఆడుతున్న సంగతి తెలిసిందే. "అన్ని ప్రశ్నలకు నా వద్ద జవాబులు లేకపోవచ్చు. కానీ భారత ఫుట్‌బాల్‌తో ముడిపడి ఉన్న ప్రతి ఒక్కరూ.. ముఖ్యంగా ఈ ఆట జీవనాధారంగా ఉన్న ఆటగాళ్లు, సిబ్బంది, కిట్‌మెన్, మసాజర్లు, వైద్య బృందాలు, ప్రొడక్షన్ సిబ్బంది ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నా" అని ఛెత్రి అన్నాడు.



ఛెత్రి

వాళ్లిద్దరి నిష్క్రమణతో..




రవిశాస్త్రి

లండన్: తొలి ఇన్నింగ్స్‌లో పంత్ నిష్క్రమణ, రెండో ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ వికెట్ మూడో టెస్టులో కీలకమయ్యాయని టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. లార్డ్స్ టెస్టులో 22 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లాండ్.. సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. "రిషబ్ పంత్ ఔట్ (తొలి ఇన్నింగ్స్) కావడమే నా దృష్టిలో మూడో టెస్టులో మలుపు" అని ఓ కార్యక్రమంలో శాస్త్రి చెప్పాడు. పంత్‌ను తెలివిగా రనౌట్ చేసినందుకు ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్‌ను అతడు మెచ్చుకున్నాడు. "బెన్ స్టోక్స్ సమయస్ఫూర్తితో వ్యవహరించి పంత్‌ను రనౌట్ చేశాడు. లేదంటే భారత్ ఆధిక్యం సంపాదించి, బలమైన స్థితిలో నిలిచేది" అని శాస్త్రి అన్నాడు. కరుణ్ నాయర్, రాహుల్ నిలవడంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఓ దశలో 41/1తో నిలిచింది. కానీ కార్స్ బౌలింగ్‌లో కరుణ్ వికెట్ల ముందు దొరికిపోవడంతో భారత్ ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ జట్టు అక్కడి నుంచి చకచకా వికెట్లు కోల్పోయింది. "భారత్ 40/1తో ఉన్నప్పుడు కరుణ్ నాయర్ ఏకాగ్రత కోల్పోయాడు. నేరుగా వచ్చే బంతిని వదిలేసి ఎల్బీగా వెనుదిరిగాడు. దీంతో ఇంగ్లాండ్‌కు తలుపు తెరిచినట్లయింది. కరుణ్ నిష్క్రమణ మ్యాచ్‌ను మలుపు తిప్పింది" అని రవిశాస్త్రి చెప్పాడు. టాప్ ఆర్డర్ కాస్త మెరుగైన ప్రదర్శన చేసి ఉంటే మూడో టెస్టులో భారత్ గెలిచేదని అతడు అభిప్రాయపడ్డాడు.

నిద్ర, వ్యాయామంతో మెదడుకు రక్షణ

• సరికొత్త అధ్యయన సారం



దిల్లీ: దీర్ఘకాలం పాటు తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో గడిపిన వ్యక్తి మెదడు తన శరీర దర్శాన్ని, పరిసరాలను అర్థం చేసుకునే గ్రహణశక్తిని కోల్పోతుందని ఒక అధ్యయనంలో తేలింది. దక్షిణ ధ్రువ ప్రాంతంలోని పరిశోధన కేంద్రంలో ఏడాదిపాటు పనిచేసి వచ్చిన సిబ్బంది మెదడు స్కాన్‌లను అధ్యయనం చేయడం ద్వారా ఈ విషయాన్ని కనుగొన్నారు. ఈ అధ్యయన వివరాలను 'ఎన్‌పీజే మైక్రోగ్రావిటీ' జర్నల్ ప్రచురించింది. దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఏడాది గడిపిన వ్యక్తుల మెదళ్లలో జ్ఞాపకశక్తి, భాషా, పరసరాలపై అవగాహనను నియంత్రించే భాగాలు క్షీణించినట్లు అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు చెందిన పరిశోధకుల బృందం గుర్తించింది. అయితే ఇంతటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ చాలినంతగా నిద్రించి, వ్యాయామం తగినంతగా చేసిన వారి మెదడు సామర్థ్యంలో తరుగుదల ఎక్కువగా లేనట్లు గుర్తించారు. క్రియాశీలమైన మేలు జీవనశైలి మనిషి మెదడును పరిరక్షిస్తుందని ఈ అధ్యయనం తెలియజేస్తోంది. ఈ అధ్యయనంలో భాగంగా మిషన్‌కు ముందు, ఆ తర్వాత 25 మంది సిబ్బంది మెదళ్లను ఎమ్మారై స్కాన్ చేశారు. ఈ స్కాన్‌లను పోల్చి చూడగా మెదడులోని పారెయిటల్ లోబ్, హిప్పోక్యాంపస్, థాలమస్ ప్రాంతాల్లోని బూడిద రంగు పదార్థం(గ్రే మ్యాటర్)లో తరుగుదల గమనించారు. మొత్తం మీద మెదడులోని శ్వేత కణజాలంతో కూడిన పదార్థంలో కూడా క్షీణత సంభవించినట్లు గుర్తించారు.

జ్ఞాన నేత్రం

పార్కిన్సన్స్ వ్యాధిని శునకాలు పసిగట్టేస్తాయ్!



దిల్లీ: వృద్ధాప్యంలో కొందరికి పార్కిన్సన్స్ వ్యాధి వస్తుంది. దాని రాకను ముందుగానే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు. కానీ ఇంతవరకూ అటువంటి పరీక్షా విధానమేదీ అందుబాటులో లేదు. అయితే బ్రిటన్‌లోని బ్రిస్టల్, మాంచెస్టర్ విశ్వవిద్యాలయాలు, మెడికల్ డిటెక్షన్ డాగ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనంలో... పార్కిన్సన్స్ వ్యాధిని ముందే గుర్తించే అపూర్వ శక్తి శునకాలకు ఉందని రుజువైంది. ఈ వ్యాధి వచ్చినవారితోపాటు సాధారణ వ్యక్తుల చర్మం మీద జిడ్డును శాంపిల్ తీసి శునకాలకు వాసన చూపించినప్పుడు అవి 80 శాతం కచ్చితత్వంతో వ్యాధిగ్రస్తులెవరో గుర్తించాయి. వ్యాధిగ్రస్తులు కానివారిని 90 శాతం కచ్చితత్వంతో కనిపెట్టాయి.

విద్యార్థుల ఆరోగ్యం కోసం 'ఆయిల్ బోర్డులు'

పాఠశాలలకు సీబీఎస్ఈ లేఖ



దిల్లీ: పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో మధుమేహ బోర్డులు ఏర్పాటు చేయాలని గతంలో ఆదేశించిన సీబీఎస్ఈ తాజాగా మరో కొత్త ఉత్తర్వు జారీ చేసింది. తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో 'ఆయిల్ బోర్డుల' ఏర్పాటు చేయాలని సూచిస్తూ సీబీఎస్ఈ డైరెక్టర్ (అకడమిక్) డా.ప్రజ్ఞా ఎం.సింగ్ లేఖ రాశారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేందుకు గాను వివిధ ఆహార పదార్థాల్లో ఉండే నూనె, చక్కెర శాతాన్ని వివరించేలా బోర్డులు అమర్చాలని కోరారు. ఇదే అంశంపై ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కార్యాలయాలకు లేఖ రాసిన నేపథ్యంలో సీబీఎస్ఈ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, పెద్దల్లో ఊబకాయం గణనీయంగా పెరుగుతున్న విషయాన్ని ఆ లేఖలో సీబీఎస్ఈ పేర్కొంది. ఊబకాయం అనేక వ్యాధులకు కారణమవుతున్నందున తీసుకునే ఆహారం, తినే చిరుతిళ్లపై విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని, పండ్ల వినియోగం పెంచాలని, శారీరక శ్రమను ప్రోత్సహించాలని తెలిపింది.



ఇకపై ఆఫీసు లిఫ్టు వాడకండి

ఇక నుంచి పైఅంతస్తులోని మీ కార్యాలయానికి చేరుకునేందుకు లిఫ్ట్ వాడకండి. మెట్లపైనే నడిచి వెళ్లండి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. ప్రత్యేకించి ఊపిరితిత్తులకు అవసరమైన వ్యాయామం చేసినట్లవుతుంది. కాళ్ల కండరాలు బలిష్ఠమవుతాయి.

– కెన్ బెర్రీ, ఫిజీషియన్

నేటి విజయానికి రేపటి పరిజ్ఞానం కావాలి

• సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలు



దిల్లీలో జరిగిన కార్యక్రమంలో అనిల్ చౌహాన్

దిల్లీ: యుద్ధతంత్రంలో కొత్త సాంకేతిక పరిజ్ఞాన ఆవశ్యకతను సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ అనిల్ చౌహాన్ నొక్కి చెప్పారు. "నేటి యుద్ధతంత్రం ఎంతగా పరిణతి చెందిందంటే నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధంలో విజయం సాధించడం అసాధ్యంగా మారింది. రేపటి సాంకేతికతతో పోరాడితేనే నేటి యుద్ధం గెలవగలం" అని ఆయన బుధవారం ఇక్కడి మానెక్ షా సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడటం మన యుద్ధ సన్నద్ధతను బలహీనపరుస్తుందని, మన ఆయుధ ఉత్పత్తి సామర్థ్యాన్ని పరిమితం చేస్తుందని, విడిభాగాల కొరతకు దారితీస్తుందని ఆయన అన్నారు. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా జరిగిన యుద్ధాలు డ్రోన్ల ప్రాధాన్యతను తెలియజెప్పాయని అన్నారు. యుద్ధంలో వ్యూహాత్మక సమతుల్యత డ్రోన్ పరిజ్ఞానంపై పట్టు కలిగిన వారి వైపే మొగ్గు చూపుతుందని నిరూపితమైందని ఆయన అన్నారు. ప్రస్తుతం డ్రోన్లు ఒక సైనిక సాధనంగా మారాయని వివరించారు. మన అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన మానవ రహిత వైమానిక వాహనాలు, కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్‌లు యుద్ధ తంత్రంలో కీలకంగా మారాయన్నారు. డ్రోన్ల ధర, ఆకారం చిన్నవే అయినా వాటి వల్ల కలిగే వ్యూహాత్మక ప్రయోజనాలు చాలా ఎక్కువని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న గుణపాఠాలను, సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. సమావేశంలో మాట్లాడిన పలువురు వక్తలు ఈ విషయాన్నే వక్కాణించారు. సమీకృత రక్షణ బలగాల ప్రధానాధికారి ఆశుతోష్ దీక్షిత్, బ్రిగేడియర్ (రిటైర్డ్) అన్షుమన్ నారంగ్ తదితరులు ఈ కార్యక్రమంలో తమ సందేశం వినిపించారు.

రష్యాతో వ్యాపారం చేస్తే భారత్‌పై 100% సుంకం: నాటో

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా ప్రయత్నిస్తోంది. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై బెదిరింపులకు పాల్పడింది. మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం సుంకం విధిస్తామని భారత్, చైనా, బ్రెజిల్‌లను నాటో హెచ్చరించింది. అమెరికా సెనెటర్లతో సమావేశానంతరం నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు, సహజవాయువులను చైనా, భారత్, బ్రెజిల్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. 'మాస్కోలోని ఆ వ్యక్తి (వ్లాదిమిర్ పుతిన్) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. మా చర్యలు ఈ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. పుతిన్‌కు వెంటనే ఫోన్‌చేసి శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని ఒత్తిడి తీసుకురావాలి. లేదంటే మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయ్' అని హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు గగనతల రక్షణ వ్యవస్థలు మాత్రమే కాకుండా భారీగా క్షిపణులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సరఫరా చేయనున్నారని వెల్లడించారు.

■ రష్యాపై ట్రంప్ చర్యలను రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రశంసించారు. 50 రోజుల సమయం ఇవ్వడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఈ సమయంలో పుతిన్ పలువురి ప్రాణాలు తీసి, మరింత భూభాగాన్ని కాజేసి ఆ తర్వాత శాంతి చర్చలకు ముందుకొస్తారన్నారు.

వచ్చే నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటన!

గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి

దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్‌లో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణతో స్తంభించిన భారత్-చైనా దౌత్య సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. భారత ప్రధాని మోదీ త్వరలో చైనా పర్యటనకు వెళ్లనున్నట్లు సమాచారం. వచ్చే నెలలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 31-సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సు జరగనుంది. మోదీతో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇతర దేశాధినేతలు పాల్గొంటారని భావిస్తున్నారు. బీజింగ్ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేతలిద్దరూ గతేడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ముఖాముఖి సమావేశమైన సంగతి తెలిసిందే. 2020 తర్వాత ప్రధాని మోదీ చైనాకు వెళ్లనుండడం ఇదే తొలిసారి. 2015 నుంచి ఇప్పటి వరకు ఆయన ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. తాజాగా భారత విదేశీవ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ చైనాలో పర్యటించి జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల గురించి చర్చించారు.

ఝార్ఖండ్‌లో ఎదురుకాల్పులు

• కీలక మావోయిస్టు నేత హతం
• సీఆర్‌పీఎఫ్ జవానుతోపాటు ఓ పౌరుడి మృత్యువాత

బొకారో, రాంచీ: ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లా బిర్హోర్దెరా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య బుధవారం తెల్లవారుజామున భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో కీలక మావోయిస్టు నేత కున్వర్ మాంఝీ హతమయ్యాడు. అతడిపై రూ.5 లక్షల రివార్డు ఉండటం గమనార్హం. మావోయిస్టుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాను పర్నేశ్వర్ కోచ్ నేలకొరిగారు. ఓ సామాన్య పౌరుడు సైతం కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు.


క్రియాశీలకంగా కోట్ల మంది మృతుల ఆధార్ కార్డులు!



ఇంటర్నెట్ డెస్క్: ఆధార్ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి కేవలం 1.15 కోట్ల కార్డు నంబర్లను మాత్రమే క్రియారహితం (డీయాక్టివేట్) చేసినట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) వెల్లడించింది. ఇప్పటివరకు కోట్ల మంది చనిపోయినా.. నిలిపివేసిన కార్డు నంబర్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉండటం గమనార్హం. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా ఈ విషయం వెల్లడైందని ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. 14 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది జూన్ నాటికి దేశంలో 142.39 కోట్ల మందికి ఆధార్ కార్డులు ఉన్నాయి. మరోవైపు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ డేటా ప్రకారం.. 2007 నుంచి 2019 మధ్యలో సగటున ఏటా 83.5 లక్షల మంది మృతిచెందారు. ఇలా 14 ఏళ్లలో కోట్లమంది మరణించినా.. యూఐడీఏఐ డీయాక్టివేట్ చేసిన కార్డు నంబర్ల సంఖ్య 1.15 కోట్లే. కేవలం 10 శాతం మృతుల ఆధార్‌లను మాత్రమే అది క్రియారహితం చేసింది. ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణపత్రం, కుటుంబసభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని దరఖాస్తుదారుడికి ఉడాయ్ సమాధానం ఇచ్చింది. దీంతో ఈ వ్యత్యాసంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తులు చనిపోయినప్పటికీ యాక్టివ్‌గా ఉన్న ఆధార్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయని.. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఈ ఐడీ లింక్ ఉన్న ఇతర సర్వీసులపైనా ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీలను నివారించేందుకు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల నిర్వహణలో సమన్వయం ఉండాలని వెల్లడించారు. మరోవైపు- మృతుల ఆధార్ కార్డుల తొలగింపు ప్రక్రియను ఉడాయ్ ప్రారంభించిందని, ఇప్పటికే 1.17 కోట్ల ఆధార్‌లను తొలగించిందని వివరిస్తూ బుధవారం అధికారిక ప్రకటన వెలువడింది.

సిరియాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్

• సాయంత్రానికి మళ్లీ రాజీ



ఇజ్రాయెల్ దాడితో బుధవారం సిరియాలోని డమాస్కస్‌లో కమ్ముకున్న పొగ

డమాస్కస్: సిరియాలో ప్రభుత్వ దళాలకు, డ్రూజ్ రెబల్ గ్రూపునకు మధ్య జరుగుతున్న ఘర్షణను ఆసరాగా చేసుకుని ఆ దేశ రాజధాని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. డ్రూజ్ గ్రూపునకు మద్దతు పేరుతో బుధవారం ఉదయం, సాయంత్రం వేళల్లో.. సిరియా రక్షణశాఖ కార్యాలయం ప్రధాన ద్వారంవద్ద, అధ్యక్ష కార్యాలయానికి సమీపంలో బాంబుల వర్షం కురిపించింది. సిరియా సైనిక దళాల కాన్వాయ్‌పైనా బాంబులేసింది. ఈ ఘటనల్లో ముగ్గురు మరణించగా 34 మంది గాయపడ్డారు.

మరోవైపు సిరియాలోని దక్షిణ ప్రాంత నగరం స్వెయిదాలో ప్రభుత్వ దళాలకు, డ్రూజ్ రెబల్ గ్రూపులకు మధ్య బుధవారం ఉదయం మళ్లీ ఘర్షణలు తలెత్తాయి. రెండు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘర్షణలు జరగడం గమనార్హం. స్వెయిదాలో స్థానిక సున్నీ బెదోయిన్ గిరిజన తెగలు, డ్రూజ్ వర్గాల మధ్య కిడ్నాప్‌లు, దాడులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ బలగాలు.. డ్రూజ్ సభ్యులను భారీగా హతమార్చడంతోపాటు వారి ఇళ్లను తగలబెట్టాయి. అయితే డ్రూజ్‌కు మద్దతుగా ఇజ్రాయెల్ రంగంలోకి దిగడంతో రెండు వర్గాలు సాయంత్రానికి దిగివచ్చాయి. మళ్లీ కాల్పుల విరమణను ప్రకటించాయి. ఇప్పటిదాకా ఘర్షణల్లో 250 మంది వరకూ మృతి చెందినట్లు బ్రిటన్ కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల పరిశీలక సంస్థ వెల్లడించింది. ఇందులో 138 మంది సైనికులున్నారని తెలిపింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

• ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ

దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ ప్రధాని మోదీకి రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ బుధవారం సంయుక్తంగా లేఖ రాశారు. ఇందుకోసం వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు పరిధిలోకి తీసుకురావాలనీ తమ లేఖలో ప్రధానికి విన్నవించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామంటూ మోదీ గతంలో పలుమార్లు ఇచ్చిన హామీలను, సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం చేసిన ఉద్ఘాటనలను వారు గుర్తుచేశారు. రాష్ట్ర హోదా కోసం జమ్మూకశ్మీర్ ప్రజలు ఐదేళ్లుగా డిమాండ్ చేస్తున్నారని.. వారి డిమాండ్ రాజ్యాంగబద్ధమైనదేనని పేర్కొన్నారు.

హిమంత తనను తాను రాజుగా భావిస్తున్నారు: రాహుల్

గువాహటి: అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తనను తాను రాజుగా భావిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. కానీ అవినీతి కేసుల్లో ఆయన జైలుకెళ్లడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ కాకుండా.. ప్రజలే ఆయన్ను కారాగారానికి పంపిస్తారని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో కలిసి రాహుల్ బుధవారం అస్సాంలో పర్యటించారు. గువాహటికి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని చయ్‌గావ్‌లో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం అస్సాం సీఎంగా ఉన్న హిమంత 2015లో కాంగ్రెస్ నుంచి భాజపాకు పారిపోయిన వ్యక్తేనంటూ ఖర్గే ఎద్దేవా చేశారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఖర్గే, రాహుల్‌ల తాజా పర్యటనతో కాంగ్రెస్ ప్రచార పర్వాన్ని ప్రారంభించినట్లయింది.



చయ్‌గావ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ

విద్యుత్తు స్తంభాలను మధ్యలో వదిలి రోడ్డు నిర్మాణం





శిమ్లా: బిహార్‌లోని పట్నా - గయా ప్రధానమార్గంలో జహానాబాద్ వద్ద ఇటీవల మధ్యలో ఉన్న చెట్లను అలాగే వదిలేసి రోడ్డు వేసినట్టే.. మరో ఉదంతమిది. ఈసారి చెట్లు కాదు.. ఏకంగా విద్యుత్తు స్తంభాలనే వదిలి రోడ్డు వేసిన ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. జాతీయ రహదారిపై ఉన్న పారిశ్రామిక పట్టణం పాంటా సాహిబ్ వద్ద కొత్తగా నిర్మించిన రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభాలను అలాగే వదిలేయడం చూసి వాహనదారులు విస్తుపోతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను వాహనదారులు తప్పించుకొంటూ వెళ్తున్న దృశ్యాలను వీడియోలో చూపిస్తూ.. డ్రైవింగు శిక్షణ కోసం దేశంలోని ప్రఖ్యాత ఇంజినీర్లు ఇటువంటి రోడ్లను నిర్మిస్తున్నారంటూ ఓ ఇన్‌ఫ్లుయెన్సరు వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

చిన్నారిని గొంతునులిమి సముద్రంలోకి విసిరేశాడు

• ఫోను చూస్తోందని సవతి తండ్రి ఘాతుకం



ముంబయి: నాలుగేళ్ల చిన్నారి అదే పనిగా ఫోను చూస్తోందని సవతి తండ్రి ఆమెను కిరాతకంగా హత్య చేసిన ఘటన ముంబయిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తమ కుమార్తె అమయార కనిపించట్లేదని నాజియా అనే మహిళ తన రెండో భర్త ఇమ్రాన్ షేక్‌తో కలిసి ఇటీవల ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కేసు నమోదుచేసిన పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తు సమయంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి.. బాలిక తన సవతి తండ్రితో కలిసి ఉన్నట్లు గుర్తించారు. చిన్నారి అదృశ్యం వెనుక అతడి ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో విచారిస్తుండగా.. ముంబయి ససూన్ డాక్‌లోని అరేబియా సముద్రంలో తేలియాడుతున్న పాప మృతదేహం దొరికింది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఫోను స్విచ్‌ఆఫ్ చేయడమే కాకుండా, పరారీలో ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అమయార తెల్లవారుజామున 3 గంటల వరకు నిద్రపోకుండా ఫోనులో గేమ్‌లు ఆడుతోందని, అందుకే విసుగెత్తి గొంతునులిమి హత్య చేశానని ఇమ్రాన్ అంగీకరించాడు. హత్యానంతరం మృతదేహాన్ని సముద్రంలో పడేశానని చెప్పాడు. దంపతుల మధ్య వివాదం తలెత్తడం వల్లే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

గాజాలో ఆహార కేంద్రం వద్ద తొక్కిసలాట.. 19 మంది మృతి



తొక్కిసలాటలో చనిపోయిన వారి భౌతికకాయాలు

టెల్ అవీవ్: గాజాలోని ఖాన్ యూనిస్‌లో బుధవారం గాజా మానవతా నిధి (జీహెచ్‌ఎఫ్) ఆహార పంపిణీ కేంద్రంవద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది మరణించారు. మరొకరు కత్తిపోట్లకు గురై చనిపోయారు. హమాస్ మిలిటెంట్ గ్రూపు భయాందోళనలను సృష్టించడంతోపాటు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఈ తొక్కిసలాట జరిగిందని ఇజ్రాయెల్ మద్దతున్న అమెరికా సంస్థ జీహెచ్‌ఎఫ్ ఆరోపించింది. ప్రత్యక్ష సాక్షులు, గాజా ఆరోగ్య సంస్థ ప్రతినిధులు మాత్రం.. జీహెచ్‌ఎఫ్ సిబ్బంది బాష్పవాయు గోళాలను ప్రయోగించడంతో భయాందోళనలు నెలకొని తొక్కిసలాట జరిగిందని తెలిపారు. తమ ఆహార పంపిణీ కేంద్రంవద్ద తొక్కిసలాట జరిగి మరణాలు సంభవించడాన్ని జీహెచ్‌ఎఫ్ ధ్రువీకరించడం ఇదే తొలిసారి. గతంలో అనేకసార్లు ఇలా జరిగి మరణాలు సంభవించినా ఎప్పుడూ ప్రకటించలేదు.

■ గాజాలో బుధవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 39 మంది మృతి చెందారు. గాజా సిటీలో 22 మంది చనిపోయారు. వారిలో 11 మంది చిన్నారులున్నారు. ఖాన్‌యూనిస్‌లో జరిగిన మరో దాడిలో 19 మంది మృతి చెందారు. 24 గంటల్లో తాము 120 లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

హూతీ రెబల్స్‌పై ఎన్‌ఆర్‌ఎఫ్ తొలి విజయం

దుబాయ్: యెమెన్‌లోని హూతీ రెబల్స్‌పై ప్రవాస ప్రభుత్వ అనుకూల నేషనల్ రెసిస్టెన్స్ ఫోర్స్ (ఎన్‌ఆర్‌ఎఫ్) ఫైటర్లు తొలి విజయం సాధించారు. ఇరాన్ నుంచి హూతీ రెబల్స్‌కు అందజేసేందుకు తరలిస్తున్న 750 టన్నుల క్షిపణులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 2014 నుంచి యెమెన్ రాజధాని సనాను స్వాధీనం చేసుకుని అధికారం చెలాయిస్తున్న హూతీలకు ఇది పెద్ద దెబ్బగానే పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటిదాకా ఇరాన్ నుంచి హూతీలకు అందుతున్న ఆయుధాలను అమెరికా అడ్డుకునేది. ఇప్పుడు గతంలో యెమెన్‌ను పాలించిన అలీ అబ్దుల్లా సలేహ్ మేనల్లుడైన తారిక్ సలేహ్ ఆధ్వర్యంలోని ఎన్‌ఆర్‌ఎఫ్ ఫైటర్లు.. ఆయుధ సరఫరాను అడ్డుకోవడం గమనార్హం. జూన్ నెలాఖరులో వాటిని స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఆర్‌ఎఫ్ ఫైటర్లు బుధవారం ప్రకటించారు. అందుకు సంబంధించిన వీడియోలను విడుదల చేశారు.

వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటు ముందుకు 8 బిల్లులు

దిల్లీ: ఈ నెల 21న ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. జాతీయ క్రీడా పాలన బిల్లు, భౌగోళిక వారసత్వ కట్టడాలు, అవశేషాలు(సంరక్షణ, నిర్వాహణ) బిల్లు, గనులు, ఖనిజాలు(అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, జాతీయ యాంటీ డోపింగ్(సవరణ) బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రణాళిక సిద్ధమైంది. మణిపుర్ వస్తు, సేవల పన్ను(సవరణ) బిల్లు, జన విశ్వాస్(నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(సవరణ) బిల్లు సహా పన్ను చట్టాల సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాల్లో కేంద్రం ఆదాయపు పన్ను 2025 బిల్లును కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లును ఫిబ్రవరిలో లోక్‌సభలో ప్రవేశపెట్టి సెలెక్ట్ కమిటీకి పంపించారు. దీనిని బుధవారం కమిటీ ఆమోదించడంతో సోమవారం లోక్‌సభకు సమర్పించొచ్చు. మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపుపై కేంద్రం పార్లమెంటు ఆమోదం తీసుకోనుంది. వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరగనున్నాయి.


రాగి ఇడ్లీ, జొన్నల ఉప్మా.... పార్లమెంటులో కొత్త మెనూ



దిల్లీ: పార్లమెంటును సందర్శించే వారి కోసం పళ్లెం నిండా పోషకాలతో నిండిన ఆహారాన్ని అందించేలా కొత్త మెనూ తయారైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచనలతో రుచికరమైన, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకువస్తున్నారు. పార్లమెంటు క్యాంటీన్‌లో తయారు చేస్తున్న ఈ కొత్త మెనూను బుధవారం ప్రకటించారు. ఇందులో రాగి ఇడ్లీ, జొన్నల ఉప్మా, మూంగ్‌దాల్ చిల్లా, కాల్చిన చేప వంటి రకరకాల వంటలను ఉంచారు. చిరుధాన్యాలతో తయారు చేసిన భోజనం, పీచు పదార్థాలు అధికంగా ఉండే సలాడ్లు, ప్రొటీన్‌లతో నిండిన సూప్‌లను మెనూలో ఉంచారు. ఈ మెనూను ఎంపీలకు మాత్రమే కాకుండా అధికారులకు, పార్లమెంటు సందర్శకులకు సైతం అందించనున్నారు.

ఇజ్రాయెల్ క్యాన్సర్ కణితిలాంటిది

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వ్యాఖ్య



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్ ఓ క్యాన్సర్ కణితిలాంటిదని పేర్కొన్నారు. అది చేస్తున్న నేరాల్లో అమెరికా భాగస్వామి అంటూ మండిపడ్డారు. వాషింగ్టన్ చెప్పుచేతల్లో టెల్ అవీవ్ నడుచుకుంటుందని ధ్వజమెత్తారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకొని, అమెరికాతో అణు చర్చలు జరిపేందుకు ఇరాన్ సిద్ధమవుతున్న వేళ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ప్రఖ్యాత కాశీ మహాక్షేత్రంలో బుధవారం దశాశ్వమేధఘాట్ వద్ద ప్రమాదకరస్థాయిలో గంగా నది [illegible]

ఫౌజాసింగ్ మృతి కేసులో నిందితుడి అరెస్టు

చండీగఢ్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మారథాన్ రన్నర్‌గా గుర్తింపు పొందిన ఫౌజా సింగ్ మృతి కేసులో నిందితుణ్ని అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు బుధవారం వెల్లడించారు. నిందితుణ్ని అమృత్‌పాల్ సింగ్ దిల్లాన్(26)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పంజాబ్‌లోని కర్తార్‌పుర్‌కు చెందిన అమృత్‌పాల్ టూరిస్ట్ వీసాపై కెనడా వెళ్లాడు. మూడు వారాల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. అతివేగంగా కారులో వచ్చిన అమృత్‌పాల్.. ఫౌజాసింగ్‌ను ఢీకొట్టి భయంతో అక్కడి నుంచి పరారైనట్లు విచారణలో అంగీకరించాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వాహనాన్ని గుర్తించి, నిందితుణ్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కోర్టు అతడికి రెండు వారాలపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించిందని తెలిపారు. ఫౌజా సింగ్ సోమవారం సాయంత్రం పంజాబ్‌లోని జలంధర్‌లో కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై మరణించిన సంగతి తెలిసిందే.

ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు

భారతీయులకు రాయబార కార్యాలయం సూచన

టెహ్రాన్: ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు చేయకూడదని అక్కడి భారత రాయబార కార్యాలయం భారతీయులకు సూచించింది. అత్యవసరమైతేనే ఆ దేశానికి రావాలని పేర్కొంది. కొన్ని వారాలుగా ఇరాన్‌లో నెలకొన్న భద్రతా పరిణామాల దృష్ట్యా.. ప్రయాణాలకు ముందు అక్కడి పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలించాలని 'ఎక్స్' వేదికగా తెలిపింది.

సకల హంగుల.. శతాబ్ది భవనం

- ఏఎంసీ పూర్వ విద్యార్థుల దాతృత్వం
- రూ.50 కోట్లతో నిర్మాణం
- 18న భవనం అప్పగింతకు ఏర్పాట్లు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: దేశ, విదేశాల్లో వైద్యులుగా స్థిరపడ్డ వారంతా ఏకమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన కళాశాల ఉన్నతికి ముందడుగు వేశారు. సకల సౌకర్యాలతో అధునాతన భవనం నిర్మించాలని తలపెట్టారు. అలా రూ.50 కోట్లతో ఆంధ్ర వైద్య కళాశాలలో(ఏఎంసీ) 'శతాబ్ది అలుమ్నీ భవనాన్ని' సిద్ధం చేశారు. నాలుగు నెలల క్రితం సీఎం చంద్రబాబు ప్రారంభించిన భవనాన్ని ఈ నెల 18న అధికారికంగా కళాశాలకు అప్పగించనున్నారు. 2023లో ఆంధ్ర వైద్య కళాశాల వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మారుతున్న సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని వైద్య విద్యార్థులు, పీజీలు, పరిశోధకులకు ఉపయోగపడేలా ఓ భవనం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం 'ఏఎంసీ సెంటినరీ అకడమిక్ బ్లాక్(క్యాబ్)' పేరిట నిధులు సేకరించారు. మొత్తం 1300 మంది పూర్వ విద్యార్థులు భాగస్వాములయ్యారు. మొత్తం రూ.50 కోట్లు సమకూర్చారు.

'క్యాబ్‌లో' ఏమేమి ఉన్నాయంటే?

50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు బ్లాకులతో భవనాన్ని నిర్మించారు. తూర్పు వైపు బ్లాక్‌లో నాలుగు అంతస్తులు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో హాల్ ఆఫ్ డోనర్స్, లాంజ్, ఇతర వసతులు ఉన్నాయి. మొదటి అంతస్తులో క్యాబ్ కార్యాలయం, ప్రముఖ వైద్యుల చిత్రపటాలు, వారు అందించిన సేవలతో హాల్ ఆఫ్ లెజెండరీస్, ఇతర సౌకర్యాలు కల్పించారు. రెండో అంతస్తులో గ్రంథాలయం, ఈ-గ్రంథాలయం, లెక్చర్ హాళ్లు ఉన్నాయి. మూడో అంతస్తులో కెఫేటేరియా, ఇండోర్ గేమ్స్‌కు ఏర్పాట్లు చేశారు.

★ వెస్ట్‌బ్లాక్‌లో 658 మంది సామర్థ్యంతో కూడిన ఇండోర్ ఆడిటోరియాన్ని నిర్మించారు. దీనికి డాక్టర్ అంబేడ్కర్ ఆడిటోరియంగా నామకరణం చేశారు. కళాశాల ఆవరణలోనే వెన్నెల పేరుతో ఓపెన్ ఆడిటోరియాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.


నూతనంగా నిర్మించిన శతాబ్ది భవనం


ఈ-గ్రంథాలయం


అంబేడ్కర్ ఆడిటోరియం

ట్రస్టు ఏర్పాటు..

భవన నిర్వహణ కోసం ఆరుగురు వైద్యులతో ఏఎంసీ అలుమ్నీ ట్రస్టు ఏర్పాటు చేశారు. సేకరించిన మొత్తంలో రూ.45 కోట్లను భవన నిర్మాణం, వసతుల కల్పనకు ఖర్చు చేశారు. మిగిలిన రూ.5 కోట్లతో కార్పస్ ఫండ్ నెలకొల్పారు. ఈ మొత్తంపై వచ్చే ఆదాయంతో నిర్వహణ చేపట్టనున్నారు. ఈ నెల 18న జరిగే కార్యక్రమానికి ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అధ్యక్షులు డాక్టర్ ప్రబీర్ రాయ్ చౌదరి హాజరుకానున్నట్లు ట్రస్టు ఛైర్మన్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పూర్వ ఉపకులపతి డాక్టర్ టి.రవిరాజు తెలిపారు.

ముత్తుకూరులో వైకాపా మూకల వీరంగం

తెదేపా సానుభూతిపరులపై దాడులు.. 10 మందికి గాయాలు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాళెంలో బుధవారం వైకాపా శ్రేణులు వీరంగం సృష్టించారు. రాడ్లు, కర్రలతో తెదేపా సానుభూతిపరులపై దాడులకు తెగబడ్డారు. ఇళ్లల్లోకి చొరబడి గృహోపకరణాలు, వాహనాలు ధ్వంసం చేశారు. కొందరు వైకాపా నేతలు స్థానిక తెదేపా నాయకులతో అంటకాగుతూ పనులు చక్కదిద్దుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసినట్లు తిరిగి గ్రామంలో తమ ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీన్ని తెదేపా సానుభూతిపరులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో తమకు అడ్డు వస్తున్నారని భావించిన వైకాపా నేతలు వారిపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 మందికి గాయాలు కాగా నెల్లూరు శీనయ్య అనే వృద్ధుడి కాలు విరిగింది. క్షతగాత్రులను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవినాయక్ తెలిపారు.


వైకాపా శ్రేణుల దాడిలో ధ్వంసమైన వాహనాలు


గాయపడిన శీనయ్య

నేతలు కలిసే.. నవ్వులు విరిసే!



రాజకీయంగా మాటల తూటాలతో ఒకరిపై ఒకరు విరుచుకుపడే తెదేపా సీనియర్ నేత, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైకాపా సీనియర్ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఇలా ఆప్యాయంగా పలకరించుకున్నారు. వీరిద్దరూ ఆప్యాయంగా, నవ్వుతూ మాట్లాడుకోవడాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు. విశాఖపట్నం వాల్తేర్ క్లబ్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో వీరిద్దరూ పాల్గొన్నారు.

– ఈనాడు, విశాఖపట్నం

రవాణా వాహనాలకు హరిత పన్ను తగ్గింపు

- గత ప్రభుత్వంలో గరిష్ఠంగా రూ.20 వేలు
- ఇప్పుడు రూ.1,500, రూ.3 వేలతో 2 స్లాబ్‌లు మాత్రమే
- ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సరకు, ప్రజా రవాణా వాహనాలపై హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) రూపంలో ఉన్న భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం బుధవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్ఠంగా రూ.20 వేల వరకు హరిత పన్ను విధించగా, కూటమి ప్రభుత్వం దీన్ని సవరించి ఏడాదికి రూ.1,500, రూ.3 వేలు చొప్పున 2 స్లాబ్‌ల్లో వసూలు చేసేలా కొత్త విధానం తీసుకొచ్చింది.

సరకు రవాణా (లారీలు, వ్యాన్‌లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించాలని దీన్ని పెంచుకునేలా కేంద్రం వెసులుబాటు ఇచ్చింది. దీన్ని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం.. 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. 7 నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను విలువ, 10 నుంచి 12 ఏళ్ల వాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. గతంలో 2018-19, 2019-20లలో హరిత పన్ను కింద ఏడాదికి రూ.5 కోట్ల వరకు రవాణాశాఖ రాబడి ఉంటే, జగన్ ప్రభుత్వంలో 2022-23లో రూ.89.96 కోట్లు, 2023-24లో రూ.102.94 కోట్లకు రాబడి పెరిగింది.

వాహనదారుల గోడు విన్న ప్రభుత్వం

పెంచిన హరిత పన్ను తలకుమించిన భారమైందని.. దీనిని తగ్గించాలంటూ ఏపీ లారీ యజమానుల సంఘం.. పాదయాత్రలో లోకేశ్‌కు విజ్ఞప్తి చేసింది. అధికారంలోకి వచ్చాక పన్ను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత విధానం తీసుకొచ్చారు. హరిత పన్ను తగ్గించడం వల్ల ప్రభుత్వానికి ఈ ట్యాక్స్ ద్వారా వచ్చే రాబడిలో ఏటా రూ.50.53 కోట్ల తగ్గనుంది. హామీ ఇచ్చినట్లుగా హరిత పన్ను తగ్గించడంతో ఎంతో ఊరట కలిగిందని ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబుకు, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని అధ్యాపకురాలి దుర్మరణం

ప్రమాదం జరిగిన వెంటనే తన కారులో ఎయిమ్స్‌కు తరలించిన మంత్రి సత్యకుమార్

మంగళగిరి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితి చేరుకున్న అధ్యాపకురాలిని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తన కారులో వైద్యశాలకు తరలించారు. కానీ, అప్పటికే ఆమె మృతి చెందడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. కర్నూలుకు చెందిన గణిత అధ్యాపకురాలు కె.పద్మావతి(42) గుంటూరు జిల్లా మంగళగిరిలోని విద్యా పరిశోధనా మండలిలో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు మరో మహిళతో కలిసి ఆత్మకూరు వద్ద జాతీయ రహదారి దాటుతున్నారు. విజయవాడ వైపు నుంచి గుంటూరు వెళుతున్న కారు ఆమెను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ గమనించి.. తన వాహనం దిగి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. బాధితురాలిని తన కారులో మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఎయిమ్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆసుపత్రికి వెళ్లే సమయానికే పద్మావతి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన నిందితులు కారును కొద్ది దూరంలో ఆపి పరారైనట్లు తెలిసింది.


ఘటనా స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్


పద్మావతి గుర్తింపు కార్డు

ఆమె.. ఆక్రందన ఇది!

- 2024లో భర్త చేతిలోనే ఘోర పరాభవం
- శిరోముండనం చేసి ఊరేగించి కిరాతకం
- కేసు పెడితే వైకాపా నేతల బెదిరింపులు


నాడు క్రూరంగా భార్య ఆషా జుత్తు కత్తిరించి చూపిస్తున్న భర్త

సీతానగరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకం బాధితురాలు ఒకామె నేటికీ న్యాయం జరగక రోదిస్తోంది. వైకాపా నాటి ఎమ్మెల్యే, ఆమె తల్లి అండ చూసుకుని భర్త ఆమెకు శిరోముండనం చేసి వీధిలో ఊరేగించాడు. ఆమెకు అండగా నిలిచిన వారిని వైకాపా మూకా బెదిరించింది. నాటి ఘోరం ఇప్పటికీ ఆమెకు శాపంగానే మిగిలింది. జీవితం అస్తవ్యస్తమైంది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలు ఉన్న ఆమె ఫోనును భర్త లాక్కున్నాడు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన బాధితురాలు తన గోడు వెళ్లబోసుకుంది. ఆమె పేరు షేక్ ఆషా (27). ఆమెది నెల్లూరు. భర్త పేరు కర్రి రాంబాబు ఎలియాస్ అభిరామ్. అతడిది తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పెదకొండేపూడి. హైదరాబాద్‌లో జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేసే క్రమంలో 2018లో ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆమె చిన్న చిన్న ఈవెంట్లు చేసేది. కుమారుడు పుట్టిన తర్వాత భర్త ముఖం చాటేశాడు. బిడ్డను తీసుకుని పెదకొండేపూడిలోని అత్తమామల వద్దకు వెళ్లగా, వారు బయటకు గెంటేశారు. ఆమె పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టగా దానిని ఉపసంహరించుకోవాలంటూ వైకాపా నాయకులు బెదిరించారు. వైకాపా అప్పటి ఎమ్మెల్యే, ఆయన తల్లి సైతం ఫోన్లు చేసి హెచ్చరించారు. ఓ విద్యాధికుడు ఆమెకు అండగా నిలవగా ఆయనను తీవ్రంగా అవమానించి బెదిరించారు. 2024 ఫిబ్రవరిలో రాంబాబు రెండో పెళ్లి చేసుకోబోతుండగా ఆషా అడ్డుకోవడంతో భర్త రాంబాబు ఆమెను ఇంట్లో బంధించి శిరోముండనం చేశాడు. ఆ జుత్తు ఒక చేత్తో పట్టుకుని ఆమెను మరో చేత్తో బయటకు ఈడ్చుకు వచ్చి వీధంతా తిప్పాడు. దీనిపై కేసు నమోదై ఛార్జిషీట్ కూడా దాఖలైంది.


2024 ఫిబ్రవరిలో పెదకొండేపూడిలో శిరోముండనం చేయడంతో.. బిడ్డతో కలిసి బోరున విలపిస్తున్న బాధితురాలు ఆషా

ఫోన్ ఇప్పించమని కోరుతున్నా..

అత్తింటివారి అనాదరణతో ఆషా జీవనం అస్తవ్యస్తమైంది. 'భర్త నా ఫోను లాక్కున్నాడు. ఎమ్మెల్యే తల్లి బెదిరించిన సంభాషణల రికార్డులన్నీ అందులో ఉన్నాయి. నేను చేసే ఈవెంట్లకు సంబంధించిన వ్యక్తుల ఫోను నంబర్లు కూడా అందులోనే ఉన్నాయి. అవి లేక ఉపాధి కరవైంది. ఆ ఫోను స్వాధీనం చేసుకుని నాకు ఇప్పించమని కోరుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు' అని ఆషా ఆవేదన వ్యక్తం చేస్తోంది. 'చేతిలో చిల్లిగవ్వ లేక కొడుకును పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నా. నాకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వం విచారణ చేయించాలి' అని ఆమె కోరుతోంది. దీనిపై సీతానగరం ఎస్.ఐ. రామ్‌కుమార్‌ను వివరణ కోరగా నిందితుడు రాంబాబును పిలిచి మరోసారి విచారిస్తామని, ఫోను సంగతి తెలుసుకుంటామని చెప్పారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించి నిబంధనలు సవరిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఆఫ్‌లైన్‌లో కళాశాలల్లో నేరుగానూ దరఖాస్తులు ఇవ్వవచ్చని అందులో పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో తీసుకునే దరఖాస్తులకు కళాశాలల ప్రిన్సిపాల్స్ రసీదులు ఇవ్వాలి. వాటిని తర్వాత విద్యార్థి ఆధార్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మొదటి ప్రాధాన్య ఎంపికల ఆధారంగా కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ రిజర్వేషన్‌ను మూడు కేటగిరీలుగా విభజించి అమలు చేయనున్నారు.

'డిగ్రీలో మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలి'

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా విధానం-2020 వల్ల డిగ్రీ విద్యా వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. డిగ్రీ విద్యార్థులకు గతంలోలా మూడు సబ్జెక్టుల విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

లీజుల మంజూరుకు ముడుపుల డిమాండ్

- గాలికి ఆర్థిక లబ్ధి చేకూర్చడం అవినీతి చర్యే
- ఓఎంసీ కేసులో ఐఏఎస్ శ్రీలక్ష్మి పాత్రపై తెలంగాణ హైకోర్టులో సీబీఐ వాదన

ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో ఆరో నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి, అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కంటే ముందు లీజుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి పెద్ద ఎత్తున ముడుపులు డిమాండు చేశారంటూ తెలంగాణ హైకోర్టుకు సీబీఐ నివేదించింది. 3 ప్రాస్పెక్టింగ్ లైసెన్సుల కోసం శశికుమార్ అనే వ్యక్తి దరఖాస్తు చేస్తే అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్‌తో కలిసి పెద్దఎత్తున ముడుపులు డిమాండు చేశారని తెలిపింది. గాలి జనార్దనరెడ్డి అండ్ కోకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారని, అందువల్ల ఇది అవినీతి నిరోధక చట్ట పరిధిలోకే వస్తుందని పేర్కొంది. ఓబుళాపురం మైనింగ్ కేసులో డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడంతో శ్రీలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. గతంలో సీబీఐ వాదన వినకుండా శ్రీలక్ష్మికి అనుకూలంగా తీర్పు రావడంతో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ఇరుపక్షాల వాదనలను విని తేల్చాలంటూ సుప్రీం పిటిషన్‌ను తిరిగి హైకోర్టుకే పంపింది. శ్రీలక్ష్మి పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టగా సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ.. 'ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి తగినన్ని ఆధారాలున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి మంజూరు చేసిన లీజులను అడ్డుపెట్టుకొని గాలి జనార్దనరెడ్డి, బి.వి.శ్రీనివాసరెడ్డిలు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. 68.5 హెక్టార్లు, 39.5 హెక్టార్లకు సంబంధించిన లీజుల మంజూరులో ఓఎంసీకి లబ్ధి చేకూర్చేలా శ్రీలక్ష్మి నిర్ణయాలు తీసుకున్నారు. లీజుల కోసం 30 దరఖాస్తులు వస్తే అన్నింటినీ ఒకే రోజు తిరస్కరించి.. గాలికి చెందిన రెండింటినే పరిగణనలోకి తీసుకున్నారు. అదే రోజు ఓఎంసీకి లీజులు మంజూరు చేశారు. ఓఎంసీ క్యాప్టివ్ మైనింగ్ కోసం వినియోగిస్తుందంటూ కొన్ని దరఖాస్తులను శ్రీలక్ష్మి తిరస్కరించారు. కానీ, ఆ 'క్యాప్టివ్ మైనింగ్' అన్నదాన్ని జీఓలో విస్మరించారు' అని వివరించారు.

రహదారులను ఆక్రమించిన వీధి వ్యాపారులపై హైకోర్టు కన్నెర్ర

- కొత్త లైసెన్సులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- విచారణ ఆగస్టు 13కు వాయిదా

ఈనాడు, అమరావతి: రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులపై హైకోర్టు ఆగ్రహం చెందింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో వీధి వ్యాపారులకు కొత్తగా లైసెన్సులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇష్టానుసారంగా వీధి వ్యాపారులకు అనుమతులిస్తే నగరాలు మురికివాడలుగా మారతాయని వ్యాఖ్యానించింది. వీధి వ్యాపారుల జీవనోపాధి ముఖ్యమైనా.. ఆ వ్యాపారం ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఉండకూడదని పేర్కొంది. వీధి వ్యాపారుల వెనుక వ్యవస్థీకృత దళారుల పాత్రను కొట్టిపారేయలేమని, అలాంటి వారిని అధికారులు ఎందుకు అదుపుచేయలేకపోతున్నారని ప్రశ్నించింది. అనుమతులు ఇచ్చేముందు ఆ ప్రాంతం వీధి వ్యాపారానికి అనువైనదా కాదా అనే విషయాన్ని పరిశీలించాలని తేల్చిచెప్పింది. వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ, విక్రయాల నియంత్రణ చట్టానికి అనుగుణంగా మౌలిక వసతులు, వ్యాపార నిర్వహణకు జోన్లు ఏర్పాటు చేసే ప్రక్రియను చేపట్టాలని ఆదేశించింది. విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. విజయవాడ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.వెంకట విజయప్రసాద్, విశాఖపట్నం జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ హైకోర్టులో వేర్వేరుగా పిల్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది.

ఏరోస్పేస్ పరిశ్రమను మేం వదులుకోం

మంత్రి లోకేశ్ వ్యాఖ్యలకు బదులిచ్చిన కర్ణాటక మంత్రి

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏరోస్పేస్ పరిశ్రమ కోసం నువ్వా నేనా అంటూ పోటీ పడుతున్నాయి. కర్ణాటకలోని దేవనహళ్లి ప్రాంతంలో ఏరోస్పేస్ పార్క్ స్థాపించేందుకు జారీ చేసిన భూసేకరణ ఆదేశాన్ని కర్ణాటక రద్దు చేసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఏరోస్పేస్ పరిశ్రమ తమ రాష్ట్రానికి తరలిరావాలంటూ బహిరంగంగా ఆహ్వానించారు. వినియోగానికి సిద్ధంగా ఉన్న 8 వేల ఎకరాల స్థలంతో పాటు అత్యుత్తమ ప్రోత్సాహకాలతో ఆకర్షణీయమైన ఏరోస్పేస్ విధానం ఉన్న ఏపీని ఎందుకు ఎంపిక చేసుకోకూడదని పరిశ్రమ పెద్దలను ప్రశ్నిస్తూ మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌కు కర్ణాటక భారీ పరిశ్రమల మంత్రి ఎం.బి.పాటిల్ బదులిస్తూ ప్రస్తుతానికి దేవనహళ్లి వద్ద భూసేకరణ ప్రక్రియను నిలిపివేసినా, మరో చోట అంతకుమించిన భూములు సిద్ధం చేశామని వివరించారు. కేవలం భూములనే కాదు, అంతకు మించిన బలమైన ఏరోస్పేస్ ఎకోసిస్టమ్‌ను తమ రాష్ట్రం అందించగలదని వెల్లడించారు. దేశ వైమానిక ఉత్పాదనలో 65 శాతం వాటాతో ఉన్న కర్ణాటక ఏ పరిశ్రమనూ అంత సులువుగా కోల్పోదని ప్రకటించారు. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య (భాజపా) స్పందిస్తూ ఏపీ మంత్రి లోకేశ్‌ను చూసి పరిశ్రమలు ఎలా సాధించాలో నేర్చుకోవాలని, లోకేశ్ ఓ తెలివైన వ్యాపారవేత్త అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాసేపటికే దాన్ని తొలగించారు.

ఆ చిన్నారుల తండ్రి ఇజ్రాయెలీ

గుహలో నివాసం ఉన్న రష్యా మహిళ కేసులో మలుపు

కార్వార, న్యూస్‌టుడే: కర్ణాటకలోని గోకర్ణ సమీపంలో ఓ గుహలో తన ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటూ వార్తల్లోకెక్కిన రష్యా పౌరురాలు నీనా కుటినా (40) స్వదేశానికి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. గోవాలోనే పరిచయమైన ఇజ్రాయెల్ జాతీయుడు డ్రోర్ గోల్డ్‌స్టెనిన్ (38) తన ఇద్దరు ఆడబిడ్డలకు తండ్రి అని అధికారులకు ఆమె వివరించారు. 2017లో వీసా గడువు ముగిసినప్పటికీ ఆమె గోవా, తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఉంటున్నట్లు దర్యాప్తులో ఇప్పటికే వెల్లడైంది. మరోవైపు పోలీసులు నీనా, ఇద్దరు చిన్నారులను కార్వార నుంచి బెంగళూరు తరలించారు. వీరిని రష్యా పంపించేందుకు నెల సమయం పడుతుందని అధికారులు తెలిపారు.



అమ్మాయిలూ.. జాగ్రత్త!

అమ్మాయిలను వలలో వేసుకోవడానికి మోసపూరిత వ్యక్తులు అవకాశం కల్పించుకొని పొగడ్తలతో ముంచెత్తడం, తరచూ బహుమతులివ్వడం చేస్తుంటారు. వీటికి లొంగిపోతే ఆ తర్వాత వారి అసలు స్వరూపం చూపిస్తారు. తమతో మాత్రమే మాట్లాడాలని, తమకు చెప్పకుండా ఏ పనీ చేయకూడదని ఒత్తిడి చేస్తారు. అప్పుడు ఇబ్బంది పడటం కన్నా అలాంటి పరిచయాలను మొగ్గలోనే తుంచెయ్యండి.

– ఇజ్రాయెల్ మొంటనో, మైండ్‌సెట్ కోచ్

దయనీయ స్థితిలో విద్యార్థులు

- ప్రభుత్వ వసతిగృహాల్లో సదుపాయాలపై హైకోర్టు ఆందోళన



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల లేమిపై హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. 'విద్యార్థులు దయనీయ స్థితిలో ఉన్నారు. పడుకోవడానికి పరుపులు, మంచాలు, దుప్పట్లు, దిండ్లు లేవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు లేవు. కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు హాస్టళ్లలో ఉండటం కంటే తల్లిదండ్రుల వద్దకు వెళ్లడం ఉత్తమం" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల అధికారులు నుంచి నివేదికలు తెప్పించుకుని పరిశీలించాక ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో 228 మంది విద్యార్థినులు ఉండగా.. అందరికీ కలిపి 8 మరుగుదొడ్లే ఉన్నాయి, వాటిలోనూ వినియోగానికి అనువుగా ఉన్నది ఒక్కటే. విజయనగరంలోని అంధుల ప్రభుత్వ పాఠశాలలో 33 మంది ఉంటే.. వారికి సహాయకుల పోస్టులన్నీ ఖాళీ. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 168 మంది ఉంటే 10 గదులే ఉన్నాయి. వసతిగృహాల్లో పరిస్థితులు మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరణ ఇచ్చేందుకు ప్రతిపాదనలతో ఈ నెల 21న మా ముందు ఆన్‌లైన్ విధానంలో హాజరుకావాలి" అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన కేఏఎస్ గురుతేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలుచేశారు. ఇటీవల ఈ పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. ఉమ్మడి 13 జిల్లాల్లో జిల్లాకు ఐదు వసతిగృహాలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థల అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారు హైకోర్టుకు నివేదికలు అందజేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపిస్తూ.. మరుగుదొడ్లు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల నిష్పత్తికి తగినన్ని స్నానపు గదులూ లేవని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి హాస్టళ్ల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.633 కోట్లు కేటాయించిందని చెప్పారు.

వెబ్‌సైట్‌లో గ్రూప్-1 'స్పోర్ట్స్' జాబితా

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో భాగంగా క్రీడల కోటా కింద అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాల పరిశీలన జాబితాను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టింది. దీనిపై అభ్యంతరాలు ఉన్నవారు ఈ నెల 21లోగా తెలియజేయాలని కార్యదర్శి రాజబాబు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గడువు ముగిసిన అనంతరం జాబితాను 'శాప్'కు పంపిస్తారు. దానిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలించిన అనంతరం తుది జాబితా ఖరారవుతుంది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ వెల్లడిస్తుంది.

'మాచ్‌ఖండ్' గేట్లు ఎత్తలేం.. దించలేం!



పూర్తిగా పనిచేయని ఒకటో నంబరు గేటు ★ సరిగా పనిచేయని డుడుమ పవర్‌గేటు మోటారు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మాచ్‌ఖండ్ విద్యుత్తు కేంద్రానికి కీలకమైన జలాశయాల నిర్వహణపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ఫలితంగా రెండు రాష్ట్రాలకు వెలుగులు అందిస్తున్న విద్యుత్తు ప్లాంటు సమస్యల కోరల్లో చిక్కుకుంది. కొన్నాళ్లుగా ప్లాంటుకు నీరందించే డుడుమ జలాశయ(డైవర్షన్ డ్యాం) గేట్లు, స్పిల్‌వే గేట్లు సరిగా పని చేయడం లేదు. డుడుమ నుంచి టీపీ(టెయిల్ పాండ్) డ్యాంకు అక్కడి నుంచి విద్యుత్తు ప్లాంటుకు నీరిస్తారు. ఈ క్రమంలోనే పూర్తి విదేశీ పరిజ్ఞానంతో చేసిన 2 పవర్‌గేట్లు, 8 స్పిల్‌వే గేట్లు ఉన్నాయి. రోజూ ప్లాంటుకు నీరివ్వడంలో పవర్ గేట్లే కీలకం. అలాంటి గేట్లు సరిగా పనిచేయడం లేదు. డుడుమకు ఉన్న 8 స్పిల్‌వే గేట్లలో నాలుగే పనిచేస్తున్నాయి. ఒకటో గేటు వద్ద 6 అడుగుల మేర మట్టి పేరుకుపోయింది. గతంలో పవర్ గేట్ల మరమ్మతులకు 10 రోజులపాటు ప్లాంటు నిలిపివేశారు. కానీ సమస్యలు పరిష్కరించలేదు.

* 'డుడుమ'కు జోలాపుట్ జలాశయం నుంచి నీటిని ఇస్తారు. జోలాపుట్‌లో నీళ్లుంటేనే ఏడాదంతా విద్యుత్తు ఉత్పత్తి సాధ్యం. కానీ, ఈ రిజర్వాయర్ గేట్లకు కనీసం పెయింటింగ్ కూడా వేయడం లేదు. గ్రీజు పెట్టడం లేదు. దీని నిర్వహణ లేకపోతే ఈ ప్రభావం మాచ్‌ఖండ్‌తోపాటు దిగువన సీలేరు కాంప్లెక్స్‌పైనా పడుతుంది.

జెన్‌కో దృష్టికి తీసుకెళ్లాం: శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల గేట్ల మరమ్మతులు చేపడుతున్నారు. పనిలోపనిగా మాచ్‌ఖండ్ ప్లాంటు మరమ్మతులకూ అధికారులు చొరవ చూపాల్సిన అవసరముంది. ఇదే విషయాన్ని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ కె.వి.రాజారావు వద్ద ప్రస్తావించగా, జలాశయాల గేట్ల మరమ్మతుల విషయాన్ని జెన్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

EENADU Vol: 51, Issue: 338 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కాక్‌పిట్‌లో 'బ్లాక్‌బాక్స్' ఒకే..
కెమెరాలపై అభ్యంతరాలు ఎందుకు?

- విమాన ప్రమాదాల నేపథ్యంలో చర్చ

ఇంటర్నెట్ డెస్క్: ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వల్లే అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్లాక్‌బాక్స్‌లో నిక్షిప్తమైన పైలట్ల మధ్య సంభాషణ ఆధారంగా దర్యాప్తు నిపుణులు ఈ అంచనా వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, కాక్‌పిట్ లోపల ఏం జరిగిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో కాక్‌పిట్‌లో వీడియో కెమెరాలు, రికార్డర్ల ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కార్లు, ట్రక్కుల తరహా వాహనాల్లో వీడియో కెమెరాలు అమర్చుతున్న ఈ కాలంలో విమానాల కాక్‌పిట్‌లో అవి లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. విమానంలో ప్రతిక్షణం ఏం జరిగిందనేది బ్లాక్‌బాక్స్ ద్వారా తెలుస్తోంది. దీనికి అదనంగా కాక్‌పిట్‌లో వీడియో రికార్డర్లను కొన్ని విమానయాన సంస్థలు మాత్రమే వినియోగిస్తున్నాయి. దశాబ్దాలుగా వీటి ఏర్పాటుపై భిన్న వాదనలు ఉన్నప్పటికీ.. అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వంటివి మాత్రం తప్పనిసరి చేయడం లేదు.

పైలట్లు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

కాక్‌పిట్‌లలో వీడియో రికార్డింగ్‌లపై పైలట్ల సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలిగించడంతో పాటు ఆ వీడియోలను దుర్వినియోగం చేస్తారనే వాదనా ఉంది. క్రమశిక్షణ చర్యల కోసం విమానయాన సంస్థలు ఈ దృశ్యాలను వినియోగించుకోవడం, ప్రమాదాలు జరిగిన తర్వాత వాటిని బహిర్గతం చేయడం వంటివి పైలట్ల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయనే ఆందోళనలు ఉన్నాయి. కాక్‌పిట్‌లలో వీడియో రికార్డర్లను అమర్చాలనే బలమైన వాదన పరిశ్రమలో ఉందని 'ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ)' చీఫ్ విల్లీ వాల్ష్ తెలిపారు. పైలట్లపై పర్యవేక్షణకు కెమెరాలు సహాయపడతాయన్నారు. అయితే, వీటిని ఎందుకు నిరాకరిస్తున్నారనే విషయాన్ని ఓ మాజీ పైలట్‌గా అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. వాణిజ్య విమానాల కాక్‌పిట్‌లో కెమెరాలు ఏర్పాటు అవసరం ఉందని యూఎస్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ఛైర్‌పర్సన్ జెన్ హోమ్ గతంలోనే సిఫార్సు చేశారు. ఈజిప్ట్ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 767 విమానాన్ని పైలట్ ఉద్దేశపూర్వకంగా కూల్చిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు.

హెలికాప్టర్ ప్రమాదంలోనూ..

ఆస్ట్రేలియాలో ఇటీవల సముద్రంలో హెలికాప్టర్ కూలిపోయిన ఘటనలో పైలట్ చనిపోగా.. ఆ దర్యాప్తులో వీడియో రికార్డింగ్ కీలకంగా నిలిచింది. ఆటోమోడ్‌లో ఉన్నప్పుడు మొబైల్ చూడటం, ఆహారం, శీతలపానీయాలు తీసుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించినట్లు నివేదికలో తేలింది. హెలికాప్టర్‌లో ఉన్న కెమెరాల వల్ల ఈ విషయం తేలడంతో ఇతర తయారీ సంస్థలు కూడా వీటి వాడకాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆస్ట్రేలియన్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బ్యూరో సూచించింది.



భాజపా పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే పౌరులపై వేధింపులను నిరసిస్తూ కోల్‌కతాలో బుధవారం నిర్వహించిన భారీ ర్యాలీలో ఆందోళనకారులతో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

మరింతగా బెంగాలీ మాట్లాడతా..
చేతనైతే నిర్బంధించుకోండి: మమత

కోల్‌కతా: భాజపా పాలిత రాష్ట్రాల్లో ఉంటున్న బెంగాలీలపై వేధింపులను వెంటనే అడ్డుకట్ట వేయాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ డిమాండ్ చేశారు. బెంగాలీలను వేధించడం, ఆ భాష మాట్లాడే వారిని బాధపెట్టడం భాజపా విధానమని విమర్శించారు. ఇకపై తాను మరింతగా బెంగాలీ మాట్లాడతానని, చేతనైతే నిర్బంధించుకోవాలని సవాల్ విసిరారు. భాజపా రాష్ట్రాల్లో బెంగాలీలను వేధిస్తుండటానికి నిరసనగా బుధవారం కోల్‌కతాలో వర్షంలోనే నిర్వహించిన నిరసన ప్రదర్శనను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. కమలనాథులు తమ చర్యలకు స్వస్తిచెప్పకపోతే రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రాల్లో రాజకీయ ఆకాంక్షల్ని నెరవేర్చుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వం ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. ఏమాత్రం అనుమానం ఉన్నా ఎలాంటి విచారణ లేకుండా నేరుగా జైలుపాలు చేసేందుకు కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటన వెలువరించిందని, ఇది అత్యయిక పరిస్థితి కంటే ఘోరమని అన్నారు. వీటిని తాను సవాల్ చేయనున్నట్లు తెలిపారు. బెంగాలీ మాట్లాడేవారిని వలస కార్మికులుగా, రోహింగ్యాలుగా లేదా బంగ్లాదేశ్ చొరబాటుదారులుగా చూస్తున్నారని మండిపడ్డారు. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం మరోసారి ఆటాడేందుకు (ఖేలా హోబేకు) భాజపా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. బెంగాల్ విపక్ష నేత సువేందు అధికారి మరో ర్యాలీలో పాల్గొంటూ బెంగాల్ ఓటర్ల జాబితాలో రోహింగ్యాలు లేకుండా చేయాలని ఈసీని కోరారు. వారిని కాపాడేందుకే మమత తాపత్రయపడుతున్నారని విమర్శించారు.

ఖగోళంలో గ్రహ బీజాలను
కనుగొన్న శాస్త్రవేత్తలు

కేప్ కెనవెరల్: అంతరిక్షంలో ఇప్పుడిప్పుడే పుట్టుకొస్తున్న ఒక పసి నక్షత్రం చుట్టూ ఉన్న వాయువుల నుంచి గ్రహాలుగా మారే రాతి శకలాలు ఏర్పడుతున్న దశలను ఖగోళ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇది మన సౌర వ్యవస్థ ఆవిర్భావ రహస్యాల్ని ఛేదించేందుకు శాస్త్రజ్ఞులకు వీలుకల్పిస్తుంది. కొత్త ప్రపంచాలు ఆవిర్భవించే క్షణాలు ఇలాగే ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇప్పుడిప్పుడే మొగ్గతొడిగిన పసి నక్షత్రం చుట్టూ ఉండే వేడి వాయువుల్లో, అండలో కొత్త గ్రహాల బీజాలను తాము ప్రత్యక్షంగా చూశామని లెయిడెన్ అబ్జర్వేటరీకి చెందిన మెలిస్సా మెక్ క్లూర్ తెలిపారు. ఖగోళంలో గ్రహ ఆవిర్భావానికి సంబంధించి తొలి అడుగులు పడుతున్నాయని కచ్చితంగా చెప్పవచ్చని ఆమె అన్నారు. ఒక గ్రహ వ్యవస్థ ఆవిర్భావంలో అంతర్గతంగా సంభవిస్తున్న పరిణామాల దృశ్యాన్ని తొలిసారిగా చూశామని శిశువుల ఏర్పాటు అధ్యయనానికి చెందిన ఫ్రెడ్ సియెస్లా అన్నారు. "ఇన్నాళ్లుగా ఖగోళ శాస్త్రవేత్తలందరూ ఈ క్షణం కోసమే ఎదురుచూశారు. గ్రహ వ్యవస్థలు ఎలా ఏర్పడుతాయన్నది శాస్త్రవేత్తలు ఊహిస్తూ వచ్చారే తప్ప ఎన్నడూ చూడలేదు, ఇప్పుడు ఆ అవకాశం దొరికింది" అని చెప్పారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, చిలీ దేశానికి చెందిన యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ (ఈఎస్ఓ)లు ఈ పరిశోధనలో పాలుపంచుకున్నాయి. దాదాపు 1,370 కాంతి సంవత్సరాల దూరంలో ఒకటి నుంచి రెండు లక్షల సంవత్సరాల వయసున్న పసి నక్షత్రం "హెచ్‌ఓపీఎస్-315" చుట్టూ ఉన్న వేడి గాలుల వాతావరణంలో గ్రహ వ్యవస్థ ఆవిర్భావ పరిణామాలు సంభవిస్తున్నట్టు గుర్తించారు. నక్షత్రం చుట్టూ సిలికాన్ మోనాక్సైడ్ వాయువుతోపాటు, స్ఫటికాకృతి కలిగిన సిలికేట్ ఖనిజాలు ఘనీభవిస్తున్నట్టు మెక్ క్లూర్ బృందం గుర్తించింది. ఈఎస్ఓకి చెందిన అల్మా టెలిస్కోప్ నెట్‌వర్క్ ఈ దృశ్యాన్ని చిత్రీకరించింది. హెచ్‌ఓపీఎస్ - 315 చుట్టూ ఎన్ని గ్రహాలు ఏర్పడతాయని ఇప్పుడే చెప్పలేం. ఆ గ్రహ వ్యవస్థ పూర్తిగా ఏర్పడటానికి 10 లక్షలు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు పట్టనున్నాయని మెక్ క్లూర్ తెలిపారు.

అప్పుడే పుట్టిన పసికందును
బస్సు కిటికీలోంచి విసిరేసిన దంపతులు




ముంబయి: బస్సులోనే ప్రసవించి.. ఆ వెంటనే పసికందును కిటికీలోంచి విసిరేసిన ఘటన మహారాష్ట్రలోని పర్భణీ జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం నిండు గర్భిణీ అయిన రితికా ధేరే (19) తన భర్త అల్తాఫ్ షేక్‌తో కలిసి పుణె నుంచి పర్భణీ వెళ్లేందుకు స్లీపర్ కోచ్ బస్సు ఎక్కారు. కాసేపటికే ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో అదే బస్సులో ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కానీ కొద్దిసేపటికే ఆ పసికందును తల్లిదండ్రులు ఒక వస్త్రంలో చుట్టి బస్సు కిటికీలోంచి బయటకు విసిరేశారు. అయితే కిటికీలోంచి ఏదో విసిరేసినట్లు గమనించి అల్తాఫ్‌ను బస్సు డ్రైవర్ ప్రశ్నించగా.. అతడు సమాధానం దాటవేశాడు. బస్సు కిటికీ నుంచి ఏదో కిందపడడాన్ని గమనించిన స్థానికులు వెళ్లి చూడగా.. వస్త్రంలో చుట్టి ఉన్న చిన్నారి మృతి చెంది కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. తమకు ఆ బిడ్డను పెంచే స్తోమత లేదని, అందుకే వదిలేయాలనుకున్నామని నిందితులు తెలిపారు. వారిద్దరు భార్యాభర్తలని చెప్పేందుకు ఎలాంటి ఆధారాల్లేవని పోలీసులు వెల్లడించారు.

21న అమెరికా నుంచి
వాయుసేనకు అపాచీ హెలికాప్టర్లు

దిల్లీ: భారత వాయుసేనకు రావాల్సిన ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లలో మూడు ఈ నెల 21న అమెరికా నుంచి అందనున్నాయి. ఈ ఏడాది చివరిలోగా మరో మూడు రానున్నాయి. గగనతల యుద్ధ ట్యాంకులు (ట్యాంక్-ఇన్-ఎయిర్)గా పిలిచే ఈ అధునాతన హెలికాప్టర్లను పాకిస్థాన్ సరిహద్దుల్లో మోహరించే అవకాశాలున్నాయి. మన సైన్యానికైతే అపాచీ హెలికాప్టర్లు 15 నెలల క్రితమే అందగా వాటిని రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ స్థావరంలో మోహరించారు. వాయుసేనకు రావాల్సిన వాటికోసం మాత్రం నిరీక్షణ తప్పలేదు. 2015లో అమెరికా ప్రభుత్వంతో, బోయింగ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు భారత వాయుసేన 22 అపాచీ హెలికాప్టర్లు కొనుగోలు చేసింది. అవి 2020 జులై నాటికి వచ్చాయి. డొనాల్డ్ ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా మన దేశ పర్యటనకు వచ్చినప్పుడు ఆరు ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను 60 కోట్ల డాలర్లతో కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరింది. అవి గతేడాది మే-జూన్ మధ్యే రావాల్సి ఉన్నా ప్రపంచంలో వివిధ దేశాల్లో కల్లోల పరిస్థితుల వల్ల ఆలస్యమైంది. అపాచీ హెలికాప్టర్లు ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించగలవు. మూడోకంటికి తెలియకుండా పనిని చక్కబెట్టి రాగలిగేలా చిమ్మచీకట్లోనూ చూడగల వ్యవస్థలతోపాటు ఆధునిక కమ్యూనికేషన్, ఆయుధ వ్యవస్థలు వాటిలో ఉంటాయి. శత్రువుపై దాడికి మాత్రమే కాకుండా భద్రత, నిఘా, శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లోనూ ఈ హెలికాప్టర్లను ఉపయోగించవచ్చు.

కోర్టులు సెక్షన్ 319ని జాగ్రత్తగా ఉపయోగించాలి: సుప్రీం



దిల్లీ: ఒక నేరానికి సంబంధించి పోలీసులు నిందితునిగా పేర్కొనకపోయినప్పటికీ ఆ కేసులో దోషిలా అనిపిస్తున్న వ్యక్తిపై కోర్టు న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చని చెబుతున్న సీఆర్‌పీసీ 319 సెక్షన్ కింద చర్యలు తీసుకునేటప్పుడు కోర్టులు అత్యంత జాగరూకత వహించాలని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. ఒక కేసులో నిందితునిగా పేర్కొనని వ్యక్తిపై సైతం అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని కోర్టులకు ఈ సెక్షన్ కల్పిస్తోందని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగచీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ సెక్షన్‌ను న్యాయం కోసం మాత్రమే ఉపయోగించాలి తప్ప వ్యక్తిని వేధించే సాధనంగా కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2017లో జరిగిన హత్యకు సంబంధించిన కేసులో కౌశాంబీలోని ఒక కోర్టు ఓ వ్యక్తికి సెక్షన్ 319 కింద సమన్లు జారీ చేసింది. తర్వాత అలహాబాద్ హైకోర్టు వాటిని కొట్టివేసింది. దీనిపై ఫిర్యాది చేసిన అప్పీలు మేరకు సుప్రీంకోర్టు హైకోర్టు ఆదేశాలను రద్దుచేసి కింది కోర్టు చర్యను సమర్థించింది. కేంద్ర ప్రభుత్వం సీఆర్‌పీసీని రద్దు చేసి దాని స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) అనే కొత్త చట్టాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2024 జులై 1కి ముందు నమోదైన కేసులన్నిటిపై సీఆర్‌పీసీ పరిధిలోనే విచారణ జరుగుతుంది.

మిమ్మల్ని మీరు తప్పుదోవ పట్టించుకుంటున్నారు

- అశోక వర్సిటీ ప్రొఫెసర్ కేసులో సిట్ తీరుపై సుప్రీం అసహనం

దిల్లీ: హరియాణాలోని అశోక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ బృందంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసు దర్యాప్తులో సిట్ తనను తానే తప్పుదోవ పట్టించుకుంటోందని పేర్కొంది. దర్యాప్తు జరుగుతున్న తీరును జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. అలీఖాన్‌పై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లపై మాత్రమే విచారణ జరపాలని ఇప్పటికే సుప్రీం ఆదేశించినప్పటికీ... అలీఖాన్ ఎలక్ట్రానిక్ పరికరాలను సిట్ ఫోరెన్సిక్‌కు పంపించిందని ప్రొఫెసర్ తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ధర్మాసనానికి తెలిపారు. దీనిపై స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం.."మీరు చేయాల్సిందల్లా ఆయన పోస్టులను పరిశీలించడమే. పోస్టుల్లో ఆయన భాష, వ్యక్తీకరణ తీరు, ఎఫ్ఐఆర్‌లో ఆరోపించినవి ఏవైనా నేరాలుగా ఉన్నాయా? లేదా అన్న దిశగానే దర్యాప్తు చేయాలి. దానికోసం మీకు నిఘంటువు, లేదా ఆయన పరికరాల అవసరం లేదు. ఆయన గ్యాడ్జెట్లను ఏ ప్రయోజనం కోసం స్వాధీనం చేసుకున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం" అని ధర్మాసనం సిట్ తరఫు న్యాయవాది, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ఉద్దేశించి పేర్కొంది. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా అలీఖాన్ చేసిన వ్యాఖ్యలపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి మాత్రమే దర్యాప్తును పరిమితం చేయాలని సిట్ బృందానికి స్పష్టం చేసింది. నేరం జరిగిందో లేదో పరిశీలించి నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

లైవ్‌లో ఉండగా
బాంబు దాడి

- పరుగెత్తిన లేడీ యాంకర్

ఇంటర్నెట్ డెస్క్: సిరియా రాజధాని డమాస్కస్‌లో బుధవారం దాడులకు దిగిన ఇజ్రాయెల్.. సిరియా అధికారిక మీడియా కేంద్రం ఉన్న భవనంపైనా బాంబులేసింది. లైవ్ కొనసాగుతున్న సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ దాడులతో ఉలిక్కిపడిన ఓ మహిళా యాంకర్.. అక్కడ నుంచి పరుగెత్తడం కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో పోస్టు చేసిన ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కట్జ్.. ఇప్పటివరకూ చేసిన హెచ్చరికలు ముగిశాయని తెలిపారు. 'డమాస్కస్‌కు హెచ్చరికలు ముగిశాయి. ఇక బాధాకరమైన దాడులు తప్పవు. డ్రూజ్ వర్గంపై దాడి చేసిన బలగాలను ఉపసంహరించుకునే వరకు స్వెయిదాలో ఐడీఎఫ్ దళాలు ఆపరేషన్‌ను కొనసాగిస్తాయి. ఇజ్రాయెల్‌లో ఉన్న డ్రూజ్ సోదరులారా.. సిరియాలో ఉన్న మీ సోదరులను రక్షించడానికి ఐడీఎఫ్ దళాలు పని చేస్తాయి. ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రిగా నేను.. మీకు హామీ ఇస్తున్నాం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం' అని కట్జ్ పేర్కొన్నారు.

మహా నగరాలకు ఉపరితల ఓజోన్ ముప్పు

దిల్లీ: ఈ ఏడాది వేసవిలో కోల్‌కతా, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లో భూ ఉపరితల ఓజోన్ స్థాయులు అధిక మొత్తంలో ఉన్నట్లు నమోదైందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) వెల్లడించింది. ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. మార్చి 1 నుంచి మే 31 మధ్య ముంబయిలో 32 రోజుల పాటు ఉపరితల ఓజోన్ పరిమితి సురక్షిత స్థాయులని దాటి నమోదైంది. మార్చి 29న గరిష్ఠంగా క్యూబిక్ మీటర్‌కు 90 మైక్రోగ్రాముల ఓజోన్ ఉన్నట్లు తేలింది. కోల్‌కతాలో 22 రోజులు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. బెంగళూరులో ఏకంగా 45 రోజుల పాటు ఓజోన్ స్థాయులు సురక్షిత స్థాయులను దాటిపోయాయి. గత ఏడాది కంటే ఇది 29 శాతం అధికం. హైదరాబాద్‌లో 20 రోజుల పాటు ఓజోన్ కాలుష్యం సురక్షిత స్థాయులను దాటి నమోదైంది. ఒకానొక సమయంలో క్యూబిక్ మీటర్‌కు గరిష్ఠంగా 51 మైక్రోగ్రాముల ఓజోన్ ఉన్నట్లు వెల్లడైంది. చెన్నైలో గత ఏడాది ఉపరితల ఓజోన్ ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు నమోదు కాలేదు. అయితే ఈ ఏడాది 15 రోజుల పాటు ఇక్కడ ఓజోన్ స్థాయులు సురక్షిత స్థాయిని దాటి వాతావరణంలో ఉన్నట్లు సీఎస్ఈ నివేదిక వెల్లడించింది. దిల్లీలో ఈ సీజన్‌లో కొన్ని రోజులు ధూళి కణాల కన్నా ఓజోన్ కారణంగానే ఎక్కువ కాలుష్యం నమోదైనట్లు అక్కడి వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) లెక్కలు చెబుతున్నాయి. "ఇతర కాలుష్య కారకాల్లా ఓజోన్ నేరుగా విడుదల కాదు. వాహనాలు, విద్యుత్కేంద్రాలు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే నైట్రోజన్ ఆక్సైడ్‌లు, అస్థిర కర్బన సమ్మేళనాలు (వీఓసీ), కార్బన్ మోనాక్సైడ్ తదితర వాయువులు సూర్యరశ్మిలో సంయోగం చెంది ఓజోన్ తయారవుతుంది. దీనిని పట్టించుకోకపోతే ప్రజల ఆరోగ్యం సంక్షోభంలో పడుతుంది. అతి తక్కువ సమయం దాని ప్రభావానికి గురైనా తీవ్ర దుష్పరిణామాలు తప్పవు" అని సీఎస్ఈలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమిత రాయ్‌చౌధురి వెల్లడించారు. ఓజోన్ స్థాయులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను మ్యాపింగ్ చేసి అక్కడ స్థానికంగా నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు సూచించారు.

రాష్ట్రపతితో మోదీ భేటీ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్ సోషల్ మీడియా వేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. మోదీ ఇటీవల తన ఐదు దేశాల పర్యటనను ముగించుకొని వచ్చిన దరిమిలా రాష్ట్రపతిని లాంఛనంగా కలిశారు. మోదీ ఇటీవల ఘనా, ట్రినిడాడ్ - టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటించి వచ్చిన విషయం విదితమే. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి కొన్ని రోజుల ముందు ఈ సమావేశం జరగడం గమనార్హం.

ఉక్రెయిన్‌పై ఆగని రష్యా దాడులు

- 15 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరమైన ఖర్కీవ్, దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణమైన క్రివీ రిహ్, పశ్చిమ ఉక్రెయిన్‌లోని వినిత్సియా, దక్షిణ భాగంలోని ఒడెసా నగరాలపై మాస్కో బలగాలు డ్రోన్లు, బాంబులతో మంగళవారం రాత్రి, బుధవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 15 మంది గాయపడ్డారు. ప్రధానంగా ఇంధన సంబంధిత మౌలిక వసతులను తాజా దాడుల్లో రష్యా లక్ష్యంగా చేసుకుంది.

లోకమాన్య తిలక్ మునిమనవడు దీపక్ కన్నుమూత

పుణె: లోకమాన్య బాల గంగాధర తిలక్ మునిమనవడు, మరాఠీ పత్రిక కేసరి ఎడిటర్ దీపక్ తిలక్ (78) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో పుణెలోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీపక్ తిలక్‌కు కుమారుడు, కుమార్తె, మనవళ్లు, మనవరాళ్లున్నారు. తిలక్ 1881లో ప్రారంభించిన కేసరి పత్రికకు దీపక్ ట్రస్టీ ఎడిటర్‌గా, తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్‌కు వైస్ ఛాన్సలర్‌గా పని చేశారు. తిలక్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ.. విద్య, జర్నలిజం, సామాజిక సేవా రంగాల్లో దీపక్ తిలక్ విశేష కృషి చేశారు.

బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్లండి

- మాజీ ప్రొఫెసర్ హనీ బాబుకు సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: ఎల్గార్ పరిషద్-మావోయిస్టుల సంబంధాల కేసులో నిందితుడిగా జైలులో ఉన్న మాజీ ప్రొఫెసర్ హనీ బాబు బెయిల్ కోసం బాంబే హైకోర్టు లేదా ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం సూచించింది. ఇదివరకు సుప్రీంకోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌ను మే 3న హనీ బాబు వెనక్కి తీసుకున్నారు. ఇది హైకోర్టులో బెయిల్ అభ్యర్థన విచారణకు ఆటంకంగా మారుతుందా అనే విషయమై హనీ బాబు స్పష్టత కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. అయితే, దీనిని జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనం బుధవారం తోసిపుచ్చింది. హైకోర్టుకు ఎలాంటి ఆదేశాలివ్వలేమని తెలిపింది.

క్షమాధనానికి అంగీకరించం..
నిమిష ప్రియకు శిక్ష పడాల్సిందే

- మృతుడి కుటుంబం స్పష్టీకరణ

ఇంటర్నెట్‌డెస్క్: కేరళ నర్సు నిమిష ప్రియకు విధించిన మరణశిక్షను యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసినా మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడుతోంది.



ఆమె నేరానికి క్షమాపణ ఉండదని తలాల్ సోదరుడు అబ్దుల్ ఫతా మెహది స్పష్టంచేశారు. ''నిమిష ప్రియకు శిక్ష పడాల్సిందే. క్షమాధనానికి అంగీకరించబోం. మధ్యవర్తిత్వం, సయోధ్యల కోసం జరుగుతోన్న ప్రయత్నాలు కొత్తవేమీ కావు. ఇవి మాకు ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. మాపై వస్తున్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. శిక్ష వాయిదాను మేం ఊహించలేదు. డబ్బుతో మనిషి ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే" అని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. దోషిని బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని హితవుపలికారు.

టాయిలెట్ల నిర్మాణ
ఆదేశాల అమలుపై నివేదికలు ఏవీ?

- 20 హైకోర్టులపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం
- చివరి అవకాశంగా 8 వారాల గడువు విధింపు

దిల్లీ: దేశంలోని అన్ని న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లలో టాయిలెట్ల సదుపాయం కల్పించి, స్థాయీ నివేదికలు సమర్పించాలన్న తమ ఆదేశాలు పాటించకపోవడంపై బుధవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. నివేదికలు సమర్పించని 20 హైకోర్టులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థాయీ నివేదికలు సమర్పించేందుకు ఎనిమిది వారాల సమయం ఇస్తున్నామని, ఇదే చివరి అవకాశమని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తెలిపింది. ఈ ఆదేశాలు పాటించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు వెలువరించింది.

జనవరి 15నాటి ఆదేశాల్లో...

రాజ్యాంగ అధికరణ 21 ప్రకారం సరైన పారిశుద్ధ్యం పౌరుల ప్రాథమిక హక్కని జనవరి 15న ఇచ్చిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు గుర్తు చేసింది. దేశంలోని అన్ని న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్ల ప్రాంగణాల్లో పురుషులు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు విడివిడిగా టాయిలెట్లను ఏర్పాటు చేయాలని హైకోర్టులు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. ఇది కార్యరూపం దాల్చేలా చూసే బాధ్యతను హైకోర్టులకు అప్పగించింది. దీనికోసం ప్రతి హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేసిన జడ్జి అధ్యక్షతన న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వం, న్యాయవాదుల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించింది. అవసరమైన నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులకు టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పింది. తమ ఆదేశాల అమలుపై నాలుగు నెలల్లో నివేదిక సమర్పించాలని చెప్పింది.

అయితే, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, కలకత్తా, దిల్లీ, పట్నా హైకోర్టులు మాత్రమే చర్యల నివేదికలను సమర్పించాయని సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం పేర్కొంది. ఇంకా 20 హైకోర్టులు తమ అఫిడవిట్లు దాఖలు చేయలేదని, చివరి అవకాశంగా ఎనిమిది వారాల సమయం ఇస్తున్నట్లు చెప్పింది. గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయకపోతే హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్ వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాలని స్పష్టం చేసింది.

న్యాయవాదుల ప్రత్యేక హక్కుల పరిరక్షణ పిటిషన్ విచారణకు స్వీకరణ

దిల్లీ: న్యాయవాదుల ప్రత్యేక హక్కులను పరిరక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం బుధవారం నోటీసులు జారీ చేసింది. వివిధ సంస్థలకు న్యాయ సలహాలు అందించిన లాయర్లకు దర్యాప్తు విభాగాలు సమన్లు జారీచేయడంపై సమోటోగా చేపట్టిన కేసుతో ఈ వ్యాజ్యాన్ని జత చేసింది.

యూపీ మతమార్పిళ్ల చట్టంపై పిటిషన్

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ రూపొందించిన చట్టవిరుద్ధ మతమార్పిళ్ల నిరోధక సవరణ చట్టం (2024)లోని కొన్ని నిబంధనలపై దాఖలైన పిటిషనుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను తెలపాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. లఖ్‌నవూకు చెందిన విద్యావేత్త రూప్‌రేఖా వర్మ ప్రభృతులు ఈ పిటిషను దాఖలు చేశారు. ఇలాంటి అంశాలపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. సవరణ చట్టంలోని 2, 3 సెక్షన్లు ఈ చట్టం కింద అసలు నేరమేమిటో తేల్చలేనంత అస్పష్టంగా ఉన్నాయని పిటిషనర్లు తెలిపారు. అస్పష్టమైన చట్టాలు దుర్వినియోగానికి ఆస్కారమిస్తాయని, పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తాయని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ చట్టం మతమార్పిళ్లు అన్నీ దురుద్దేశంతో జరుగుతున్నట్లు భావిస్తోందని, వయోజనులను అనుమాన దృష్టితో చూస్తోందన్నారు. మతపరమైన అస్తిత్వాలను కాపాడే సాకుతో ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కుల్లో జోక్యం చేసుకోవడానికి అవకాశమిస్తోందని వాదించారు. పౌరులు తమకు నచ్చిన మతాన్ని ఎంచుకోకుండా ఈ చట్టం నిరోధిస్తోందని పేర్కొన్నారు. మహిళలంతా అక్రమ మతమార్పిళ్లకు తేలిగ్గా లొంగిపోతారనే అపోహను చట్టం వ్యక్తం చేస్తోందని ఆరోపించారు. పై చట్టానికి చేసిన సవరణను మాత్రమే తాము తప్పు పడుతున్నామని వివరించారు.

ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ముంబయి: దిల్లీ నుంచి గోవాకు వెళ్తున్న ఇండిగో విమానం ముంబయిలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగానే ఇంజన్ విఫలం కావడంతో దాన్ని ముంబయి నగరానికి మళ్లించారు. ఈ ఎయిర్‌బస్ ఎ320 నియో విమానం ఉదయం 9.52 గంటలకు అత్యవసరంగా ల్యాండ్ అయిందని అధికారులు తెలిపారు. ఇది జరిగిన సమయంలో విమానంలో ఎందరు ప్రయాణిస్తున్నారన్నది వెంటనే తెలియలేదు.

✦ మరోవైపు ముంబయి నుంచి దుబాయ్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బోయింగ్ విమానాన్ని బుధవారం రద్దు చేశారు. విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడమే ఇందుకు కారణమని తెలిసింది.

నాటి హింసకు నేడెవరూ బాధ్యులు కారు

- ఎన్‌సీఈఆర్‌టీ చరిత్ర పుస్తకంలో ఆసక్తికర వ్యాఖ్యలు

దిల్లీ: నరజాతి చరిత్ర సమస్తం రణ రక్త ప్రవాహ సిక్తం అన్న మహాకవి శ్రీశ్రీ మాటలు మానవ చరిత్రలో హింస పోషించిన ప్రధాన పాత్రను తెలియజేస్తున్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి చరిత్ర పాఠ్య పుస్తకం కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తోంది. ఈ పుస్తకంలో మొగల్ చక్రవర్తులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్బర్ పాలనను క్రూరత్వం, సహనాల మేళవింపుగా అభివర్ణించిన ఈ పాఠ్యపుస్తకం.. బాబర్‌ను విజయం కోసం నిర్దాక్షిణ్యంగా పోరాడిన వ్యక్తిగా, ఔరంగజేబును సైనిక పరిపాలకునిగా పేర్కొంది. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ, ఇండియా అండ్ బియాండ్' అనే శీర్షికతో ఇదే వారంలో విడుదల చేసిన ఈ పుస్తకం విద్యార్థులకు దిల్లీ సుల్తానుల పాలనను, మొగలాయిలు, మరాఠాలు, బ్రిటిషర్ల పాలనను పరిచయం చేస్తోంది. సున్నితమైన హింసాత్మక ఘటనల్ని, యుద్ధాన్ని, రక్తపాతాన్ని గురించి సమాచారాన్ని ఈ పుస్తకం తెలియజేస్తుందని పుస్తక ప్రారంభంలో ఒక సూచన చేశారు. గతంలో జరిగిన ఘటనలకు ఈనాడు ఎవరినీ బాధ్యుల్ని చేయరాదని సూచించారు. చిత్తోర్‌గఢ్ కోటను జయించాక అక్బర్ చక్రవర్తి 30 వేల మంది సామాన్యుల్ని చంపాలని ఆదేశించినట్టు పుస్తకం పేర్కొంది. ముస్లిమేతరులపై విధించిన 'జిజియా'' పన్నును ప్రస్తావించింది. ఛత్రపతి శివాజీ, తారాబాయ్, అహల్యాబాయి హోల్కర్ వంటి పాలకులను దార్శనికత కలిగిన నాయకులుగా ప్రస్తుతించింది. ఈ పుస్తకంలో మొగలాయిలను ధూర్తులుగా చిత్రీకరించే ప్రయత్నం జరగలేదని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యక్రమ విభాగ అధిపతి మైకేల్ డ్యానిమో చెప్పారు.

దురుద్దేశంతో పిల్ వేసినవారికి రూ.1.40 కోట్ల జరిమానా

అహ్మదాబాద్: చిత్తశుద్ధి లేకుండా ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన ఏడుగురు పిటిషనర్లకు గుజరాత్ హైకోర్టు మొత్తం రూ.1.40 కోట్ల జరిమానా విధించింది. ఒక బిల్డరుకు ప్రైవేటు భూమిలో నివాస - వాణిజ్య సముదాయం నిర్మాణానికి మంజూరైన అనుమతిని రద్దు చేయించడానికే పిటిషనర్లు పిల్‌ను దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ భూమి విషయంలో బిల్డరు నుంచి డబ్బు గుంజడానికి గతంలో ప్రయత్నించినవారే పిల్‌ను వేశారని, వారిపై చార్జిషీటు కూడా దాఖలైందని బిల్డరు తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. పిల్‌ను కొట్టివేస్తూ, దాన్ని దాఖలు చేసిన ఏడుగురు పిటిషనర్లు తలా రూ.20 లక్షల చొప్పున జరిమానా చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది.



షార్క్ బే డాల్ఫిన్ రిసెర్చ్ ప్రాజెక్టు విడుదల చేసిన ఈ ఫొటోలో కనిపిస్తున్నది బాటిల్ నోస్ డాల్ఫిన్. ఆస్ట్రేలియాలోని షార్క్ బేలో తన ముక్కు వద్ద మెరైన్ స్పాంజ్‌ను పెట్టుకుని ఆహార అన్వేషణ చేస్తోంది. మెరైన్ స్పాంజ్‌తో తమ ముక్కుకు రక్షణ కలుగుతుందని డాల్ఫిన్లు భావిస్తుండవచ్చనేది ఓ అంచనా

మకరందం

makarandam@eenadu.in

గురువారం జులై 17, 2025

ఈనాడు

14

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

మోక్షం ప్రసాదించే కామిక ఏకాదశి

జులై 21 కామిక ఏకాదశి




ఆషాఢ మాసంలో వచ్చే కృష్ణ పక్ష ఏకాదశిని కామిక ఏకాదశి అంటారు. పేరుకు తగ్గట్లే ఈ ఏకాదశి మనసులోని కోరికలను సిద్ధింపచేస్తుంది. ఇది శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లిన తర్వాత వచ్చే మొదటి ఏకాదశి కావడం వలన పవిత్రంగా భావించి స్వామిని పూజిస్తారు. కామిక ఏకాదశి నాడు పాలు ఇచ్చే గోవును దానం చేస్తే సహా, గ్రామం కలిపి దానం చేసే సమస్త దేవతల ఆశీర్వాదం లభిస్తుంది. ఈ రోజు ఉపవాసం ఉండటం, జాగరణ చేయడం, వెన్నను దానం చేయడం, తులసిమొక్క వద్ద నేతిదీపం వెలిగించటం శ్రేష్ఠం. కామిక ఏకాదశి విశిష్టత గురించి బ్రహ్మదేవుడు నారదుడికి, శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించినట్లు పౌరాణిక కథనాలున్నాయి. ఈ రోజు తులసి ఆకులతో విష్ణువును పూజిస్తే సర్వపాపాల నుంచి విముక్తులవుతారు, మోక్షం లభిస్తుంది- అన్నది పురాణ వచనం.

సత్కార్యాలతో స్వర్గవాసం


ఇస్లాం సందేశం

మనం సంఘజీవులం. అందరితో సామరస్యంగా ప్రవర్తిస్తూ, మంచి పనులు చేస్తుంటే జీవనం సాఫీగా సాగుతుంది. అందుకే ఖురాన్‌లో 'మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి. విశ్వాసులందరూ సోదరులే' అని అల్లాహ్ సెలవిచ్చాడు. ఇస్లాం ప్రకారం ప్రతినిత్యం మంచిపనులు చేస్తుండాలి. ఎవరైనా ప్రయాణిస్తున్నప్పుడు వారిని వాహనంలో కూర్చోబెడితే.. ఆ చిన్న పని కూడా సత్కార్యమే అవుతుంది. నమాజ్ కోసం మసీదుకు వెళ్లడం, భార్యాభర్తలు లేదా మరెవరి



మధ్య అయినా విభేదాలు తలెత్తితే.. సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ మంచి పనులే. మనం ఎవరికైనా అప్పు ఇచ్చి ఉంటే.. ఆ రుణగ్రస్తుల పట్ల సౌమ్యంగా వ్యవహరించాలి. వారి పరిస్థితిని గమనించి అవసరమైతే అప్పు తీర్చడానికి వారికి మరికొంత గడువు ఇవ్వాలి. తీర్చలేని పరిస్థితి ఉంటే.. రుణమాఫీని ప్రకటించాలి. ఎవరైనా గొడవ పడుతుంటే వారి సమస్యను పరిష్కరించేందుకు చూడాలి. మర్గణ పడేవారు కూడా మధ్యవర్తులతో సహకరించి తమ సమస్యను పరిష్కరించుకోవాలి. అలాగే అవసరమైన సందర్భాల్లో ఒకరికి సిఫారసు చేయడమూ పుణ్యకార్యమే. అందువల్ల మనకు చేతనైనంత తోడ్పాటు అందించాలి. ఎదుటివారిలో ఏమైనా లోటుపాటు ఉంటే.. అందరి ముందూ ప్రస్తావించి వారిని అవమానించకూడదు. వారి తప్పులను ఒంటరిగా ఉన్నప్పుడు తెలియజెప్పి, సంస్కరించేందుకు ప్రయత్నించాలి. ఇలా చేయడం వల్ల వారిలో పరివర్తన కలిగే అవకాశముంది. ఇతరులకు సాయం చేయడాన్ని అల్లాహ్ పుణ్యకార్యంగా పరిగణిస్తాడు. ధనం, హోదా, సంపదలతో నిమిత్తం లేకుండా నిజాయితీ, పరోపకారబుద్ధి, భక్తి, విశ్వాసాలు ఉన్నవారు స్వర్గవాసానికి అర్హత కలిగుంటారు. కనుక ఇహలోక సౌఖ్యాల పట్ల ఆరాటానికి బదులు దైవాన్ని ధ్యానిస్తూ సహృదయంతో నడచుకోవాలని ఖురాన్ ఉద్బోధిస్తోంది.

చెప్పడానికేమీ లేదు...




ఒకసారి రామకృష్ణపరమహంస తన శిష్యులతో ముచ్చటిస్తూ 'ఒక జాలరి నదిలో వల విసిరాడు. కొన్ని చేపలు ఆ వలను చూస్తూనే ప్రమాదాన్ని శంకించాయి. వల తమను సమీపించక ముందే దూరంగా ఈదుకుంటూ వెళ్లిపోయాయి. ఈ చేపలు నిత్యముక్త జీవులు. మరికొన్ని చేపలు వలను గుర్తించకపోవడం వల్ల అందులో చిక్కుకున్నాయి. అందుకు పశ్చాత్తాపపడుతూ తీవ్రంగా ప్రయత్నించి అందులోంచి బయటపడ్డాయి. ఇవి ముక్తజీవులు. ఇంకొన్ని చేపలు వల నుంచి బయటపడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ చేపలు ముముక్షువులు. ఇక మిగిలినవి వల నుంచి బయట పడేందుకు కనీసం ప్రయత్నం కూడా చేయవు. పైగా ముఖాన్ని దాచేసుకుని.. తమకెలాంటి ప్రమాదం లేదు, రాదు అని నిశ్చింతగా ఉంటాయి. కొంతసేపటికి మృత్యువు కబళిస్తుందన్న గ్రహింపే ఉండదు. వీటి గురించి చెప్పడానికేమీ లేదు. లోకంలో అధికశాతం ఈ చేపల కోవకు చెందినవారే. దైవ చింతన లేక అలా జీవితం గడిపేస్తుంటారు' అంటూ చెప్పారు.

వందే విష్ణుం!



విశ్వయోనిః

విష్ణు సహస్ర నామావళిలో 148వది. 'విశ్వయోనిః' అంటే విశ్వం మొత్తానికీ ఆ స్వామి జన్మ స్థానం లాంటివాడని భావం. ఈ ప్రపంచం ఉనికికి కారణం ఆయనేనన్నది అంతరార్థం. ఒక్క మాటలో చెప్పాలంటే సకల చరాచర సృష్టికీ ఆయనే మూలం. ఆయన వల్ల ఉత్పన్నమైన ఈ విశ్వంలో ఆ స్వామికి నిరంతరం కృతజ్ఞతగా ఉండాలని తెలియచెబుతుందీ నామం.







శివ రక్ష రుద్రాక్ష


జీవితంలో ఏవో జటిల సమస్యలు ఎదురవుతుంటాయి. మనసులో అలజడి సృష్టించి తీరని ఆవేదన కలిగిస్తుంటాయి. అలాంటి మనోభారాలు సమసిపోయి, ఆశలూ, ఆశయాలూ నెరవేరడానికి భగవంతుడు అందించిన అద్భుత కానుక రుద్రాక్ష అన్నది పురాణ వచనం.

దేవీభాగవతం, రుద్రాక్షోపనిషత్తు, రుద్ర జాబాలి ఉపనిషత్తు, లింగ, శివ, పద్మ, స్కాంద పురాణాల్లో రుద్రాక్ష గురించి విస్తారమైన వివరణ ఉంది. ఆ కథనాల ప్రకారం- త్రిపురాసురుణ్ణి సంహరించేందుకు అవసరమైన శక్తి కోసం శివుడు కళ్లు తెరిచి తపస్సు చేశాడు. దీక్ష పూర్తయ్యాక ఒక్క క్షణం కళ్లు మూయగానే ఆ నయనాల్లోంచి కన్నీటి చుక్కలు జారిపడి మొక్కలు మొలిచాయి. అవే రుద్రాక్ష మొక్కలు.

రుద్రుని కన్నీటి నుంచి ఉద్భవించినందువల్ల రుద్ర, అక్ష.. రుద్రాక్ష అనే పేరొచ్చింది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. పరమశివుణ్ణి ఆరాధించేవారు రుద్రాక్షను ధరిస్తారు. వీటిని దర్శించినా, స్పృశించినా సత్ఫలితాలు కలుగుతాయని విశ్వసిస్తారు. తమ కోరికలు సాకారం కావాలని ఆశించేవారు, అనారోగ్యంతో బాధపడేవారు, మోక్షం పొందాలనుకునేవారు- ఇలా వివిధ ప్రయోజనాల కోసం రుద్రాక్షను ధరిస్తారు. 'బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస.. ఇలా ఏ ఆశ్రమంలోనైనా; స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా ఎవరైనా రుద్రాక్షను ధరించవచ్చు. ఓంకారాన్ని పఠిస్తూ ధరించడం ఉత్తమం'- అని శివపురాణం పేర్కొంది.

రుద్రాక్షను సాక్షాత్తూ శివుడి స్వరూపంగా భావిస్తారు. ఇదొక అపురూప గింజ. ఇది ఉద్వేగాలను నియంత్రించి అంతర్గత శాంతి, ఆనందాలకు ఆలవాలమవుతుంది. తద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుంది. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాలు చేకూరతాయి. అదృష్టాన్ని పండించి.. ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతోషం, శ్రేయస్సులను అందిస్తుందని చెబుతారు.

నుదుట విభూతి రేఖలు, కంఠంలో రుద్రాక్షలు, మనసులో శివనామ జపం- ఈ మూడింటికీ పరస్పర అనుబంధం ఉంది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. అందుకే ఈ మూడు లక్షణాలూ ఉన్న వ్యక్తిని దర్శించుకుంటే త్రివేణీ సంగమంలో స్నానం చేసినంత పుణ్యఫలం కలుగుతుంది- అన్నది పౌరాణికులు చెబుతున్న మాట. రుద్రాక్షలు ధరించడానికి జాతి, లింగ, వయో భేదాలు లేవు. మానసిక, శారీరక స్థితితో సంబంధం లేదు. పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా ధరించవచ్చు.



ధారణ నియమాలు

రుద్రాక్ష ధరించదలచిన వారు కొన్ని నియమాలను తప్పనిసరిగా పాటించాలి.
- మద్యమాంసాలు సేవించకూడదు.
- ఇంద్రియ నిగ్రహం పాటించాలి.
- దాంపత్య సమయంలో రుద్రాక్షలు కూడదు.
- ఒకరు ధరించిన రుద్రాక్షను మరొకరు ధరించకూడదు.
- స్నానం చేసేటప్పుడు, నిద్రించే సమయంలో, అంత్యక్రియల్లో పాల్గొనేటప్పుడు రుద్రాక్షలు తీసేయాలి.
- మైలపడిన వారు రుద్రాక్షలను తాకకూడదు.
- ఏదైనా మంత్రాన్ని ఉచ్చరిస్తూ, భక్తిశ్లోకాన్ని పఠిస్తూ ధరించడం మంచిది. ఓంకార స్మరణ ఉత్తమం.
- మహిళలు నెలసరి సమయంలో ధరించకూడదు.
- రుద్రాక్షను ఉంగరంలో చేర్చి ధరించకూడదు.

ఆరోగ్య ప్రయోజనాలు

- రుద్రాక్షలు ధరించడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నిరాశ, నిస్పృహలు దరిచేరవు.
- హృదయ స్పందనను స్థిరీకరిస్తాయి. గుండె జబ్బులు, అధిక రక్తపోటులను నివారిస్తాయి.
- భయాందోళనలు తొలగి, ధైర్య స్థైర్యాలు పెరుగుతాయి.
- రుద్రాక్ష ధారణతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.
- మధుమేహం, నరాల సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది- అని ఆయుర్వేదం చెబుతోంది.

ఎక్కడ.. ఏమిటి..

రుద్రాక్షలు మనదేశంలో కేరళ రాష్ట్రంలో, నేపాల్, ఇండోనేషియా దేశాలు, జావాద్వీపంలోనూ లభిస్తాయి. నేపాల్‌లో దొరికే రుద్రాక్షలను అత్యుత్తమ శ్రేణివిగా పరిగణిస్తారు. రుద్రాక్ష అనగానే ముఖాల గురించిన ఆలోచన మొదలవుతుంది. కాయల్లోంచి తీసిన గింజలకు ఉపరితలంలో ఉండే గీతలనే ముఖాలు అంటారు. ఎన్ని గీతలు కలిగుంటే అన్ని ముఖాల రుద్రాక్ష అంటారు. ఈ ముఖాలు సహజంగానే ఏర్పడతాయి. ఇవి ఒకటి నుంచి పద్నాలుగు వరకూ ఉంటాయి. వీటిలో దాదాపు మూడొంతులు ఐదు ముఖాల పంచముఖి రుద్రాక్షలే ఉంటాయి.

ముఖాలు.. ఫలితాలు..

రుద్రాక్ష ముఖాల సంఖ్యను బట్టి వేర్వేరు ఫలితాలను కలిగి ఉంటాయని పురాణేతిహాసాలు పేర్కొన్నాయి. వీటిలో ఒకే ముఖం ఉండే ఏకముఖి రుద్రాక్ష దొరకడం ఇంచుమించు అసాధ్యం. ఇండోనేషియాలో అరుదుగా లభించే ఏకముఖి అర్ధచంద్రాకారంలో ఉంటుంది. దీన్ని 'చంద్రాక్ష', 'చంద్రముఖి' అని కూడా అంటారు. ద్విముఖి రుద్రాక్షలు గుండ్రంగా, బద్దలా ఉంటాయి. ఇవి కూడా అరుదైనవే.

రుద్రాక్షలు మిరియపు గింజ పరిమాణం నుంచి, పెద్ద ఉసిరికాయ పరిమాణం వరకూ లభిస్తాయి. హిందువులు, బౌద్ధులు వీటిని పరమ పవిత్రంగా భావిస్తూ మెడలో మాలలుగా, చేతులకు కంకణాలుగా ధరిస్తారు. శివుణ్ణి ఆరాధించేవారే కాకుండా విష్ణు భక్తులు కూడా రుద్రాక్షలు ధరిస్తారు.

సంఖ్య సంగతి

జపమాలగా 108, లేదా 54 రుద్రాక్షల హారాలుంటాయి. ఆ సంఖ్య పూర్తయిన గుర్తు కోసం చివర్లో ఒక పెద్ద పూస అదనంగా ఉంటుంది. దీన్ని 'మేరువు' అంటారు. ఇది పూసగా పరిగణనకు రాదు. మెడలో ధరించేవారు 9, 18, 27, 36, 54, 108 వంటి సంఖ్యతో మాలగా కూర్చి ధరిస్తారు. చేతులు, మోచేతులకు పదకొండు, మణికట్టు చుట్టూ ఐదు రుద్రాక్షలు ధరించవచ్చు.

ఒక్క మాటలో చెప్పాలంటే.. రుద్రాక్షలో ఔషధ గుణాలున్నాయి. అందువల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రతికూల శక్తుల నుంచి రక్షణ కలిగి మానసిక ప్రశాంతత చేకూరుతుంది. మెదడులో అలజడి తగ్గించి మేలైన ఆలోచనలను అందిస్తుంది. ఇన్ని సుగుణాలతో భగవంతుడు ఇచ్చిన అపురూప కానుక రుద్రాక్ష.

– అయ్యగారి శ్రీనివాసరావు

బంగారుచేప దుర్భర వాసన!

గౌతమబుద్ధుడు తపస్సు చేసుకుంటున్న వేణువనం సమీపంలో జాలరులున్నారు. ఒకరోజు ఓ బెస్తవాని వలకు బంగారు రంగులో మెరుస్తున్న చేప చిక్కింది. ఎంతో ఆశ్చర్యపోయిన జాలరులు ఆ అరుదైన చేపను మహారాజుకు బహూకరించారు. గౌతముడి శిష్యుడైన రాజు జాలరులు వెంట రాగా.. ఆ చేపను తీసుకుని ఆయన వద్దకు వెళ్లారు. చూడముచ్చటగా ఉన్న చేప కొంతసేపటికి నోరు తెరిచింది. అంతే.. ఒక్కసారిగా విపరీతమైన దుర్వాసన ఆ ప్రాంతమంతా వ్యాపించింది. అక్కడున్న అందరూ ఆశ్చర్యపోయారు. ఇంత అందమైన బంగారు చేప ఇలా దుర్వాసన రావడమేంటో ఎవరికీ అర్థం కాలేదు. ఆ సంశయంతోనే సిద్ధార్థుణ్ణి ఉద్దేశించి 'అయ్యా! ఇది ఇంత మిరుమిట్లు గొలిపే స్వర్ణమత్స్యం కదా! దీని నుంచి దుర్గంధం ఎలా వస్తోంది?' అనడిగాడు రాజు. గౌతముడు తన దివ్యదృష్టితో చేప జన్మ వృత్తాంతం తెలుసుకున్నాడు. 'పూర్వ జన్మలో ఈ మత్స్యం తర్క మీమాంసలు తెలిసిన కపిలుడనే మహా పండితుడు. తన విద్వత్తుతో ఎంతో పేరు ప్రతిష్ఠలు పొందాడు. కానీ అందరూ తనను గౌరవించటం వల్ల అహంకారం కలిగింది. గర్వాతిశయంతో పట్టపగ్గాలు లేకుండా ప్రవర్తించేవాడు. పండితులతో సహా అందరినీ చులకనగా చూసేవాడు. ఎవరి సలహాలనూ స్వీకరించేవాడు కాదు. తాను సర్వజ్ఞుడననే అతిశయంతో గురువులను కూడా ధిక్కరించేవాడు. అయితే ఉదాత్తమైన ధర్మాన్ని ప్రవచన రూపంగా అందించాడు. అలా శరీరంలో జ్ఞానబోధ చేశాడు కాబట్టి చేపజన్మ ఎత్తినా పసిడి శరీరం లభించింది. కానీ పరులను చులకనగా చూడటం, అహంభావంతో అవమానకరంగా మాట్లాడటం వల్ల లోపల దుర్గంధంతో కూడిన దుర్గతి పట్టింది' అంటూ వివరించాడు. పాండిత్యమే కాదు అందుకు అనుగుణమైన వినయం, విధేయత, మృదుస్వభావం, సత్ప్రవర్తన ఉండాలని మహారాజుతో పాటు అక్కడ ఉన్న అందరికీ గౌతమబుద్ధుడు ప్రబోధించాడు.



భీష్ముడు ధర్మపక్షపాతి



మహాభారతంలో ఒక ప్రధానమైన, శక్తిమంతమైన పాత్ర భీష్ముడిది. సత్యవర్తనుడిగా, పరాక్రముడిగా భీష్ముని పాత్ర ఉత్కృష్టమైంది. తండ్రి శంతనుడికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి జీవితాంతం బ్రహ్మచర్యాన్ని పాటించిన ఆయన త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. గంగాదేవి కుమారుడైనందున భీష్ముణ్ణి 'గాంగేయుడు' అని కూడా పిలుస్తారు. భీష్ముడు వృద్ధుడైనప్పటికీ కురుక్షేత్ర సంగ్రామంలో అపార శౌర్యంతో కౌరవుల తరపున పోరాడుతూ యుద్ధరంగాన్ని శాసించాడు. వయసు మీద పడ్డా ఆయుధాలపై అతని పట్టు, పూర్వశక్తి, ధైర్యస్థైర్యాలను కోల్పోలేదు. భీష్ముని ఓడించకపోతే విజయం సాధ్యం కాదని గ్రహించిన ధర్మరాజు.. అతని ఆశీర్వాదాన్ని పొంది మార్గదర్శనం కోరాలని నిర్ణయించాడు. శత్రు పక్షాన ఉన్నప్పటికీ ధర్మరాజు చూపిన మర్యాద, మన్ననలను గౌరవించిన భీష్ముడు ఒక నిగూఢ మార్గాన్ని సూచించాడు. మహిళలు బాణాలు సంధిస్తే తాను ప్రతిఘటించనన్నాడు. తన యోధస్ఫూర్తిని దెబ్బతీయగలిగితే మాత్రమే గెలుపు సాధ్యమవుతుందన్న సంకేతం ఇచ్చాడు. యుద్ధం పదో రోజుకు చేరుకున్నప్పుడు పాండవులు వ్యూహాత్మకంగా శిఖండిని అర్జునుడితోపాటు ముందుకు పంపారు.

శిఖండి బాణాల వర్షం కురిపించగా.. భీష్ముడు ఆమెను మహిళగా భావించి ఆయుధం తీయలేదు. సరిగ్గా అప్పుడే అర్జునుడు కూడా దాడిచేశాడు. ఇక శక్తి కోల్పోయిన భీష్ముడు రథం నుంచి కిందకు దిగాడు. అయితే భూమిని తాకలేదు. బాణాలను శయ్యగా చేసుకుని పవళించాడు. అర్జునుడు మూడు బాణాలతో భీష్ముడికి తలదిండు ఏర్పరిచాడు. మరో బాణంతో భూమిని ఛేదించి స్వచ్ఛమైన నీటిని ప్రవహింపజేశాడు. అది భీష్ముడి దాహాన్ని తీర్చింది. తన మరణాన్ని తానే ఎంచుకునే వరం కలిగిన భీష్ముడు ఉత్తరాయణం వచ్చేంతవరకూ జీవించాడు. ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం తన శరీరాన్ని విడిచాడు. చివరి శ్వాస వరకూ ధర్మాన్ని బోధించాడు. తన మరణ సమయాన్ని తానే నిర్ణయించుకుని స్వర్గప్రయాణమైన యోగి, యోధుడు, ధర్మతత్వవేత్తగా భీష్ముడి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయింది.

– డా.కృష్ణకుమార్ వేపకొమ్మ

స్వయంపాకంలో ఏం సమర్పించాలి..

హిందూధర్మంలో పూజలు, పండగలు, వివాహాది శుభకార్యాలు వంటి సందర్భాల్లో స్వయంపాకం ఇవ్వడం ఆచారం. స్వయంపాకం అంటే.. స్వయంగా వంట చేసుకోవటానికి అవసరమైన సామగ్రి సమకూర్చడం- అని అర్థం. స్వయంపాక దానంతో ఆరోగ్యం, వంశవృద్ధి కలుగుతాయని మనుస్మృతి పేర్కొంది. స్వయంపాకంలోని పదార్థాలు ఆరోగ్యాన్ని సమకూర్చేవి కావడం వల్ల ఇచ్చినవారికి పుణ్యం దక్కుతుంది. ఇంతకీ అలాంటప్పుడు ఏమేం ఇవ్వాలంటే.. తోటకూర, దోసకాయలు, వంకాయలు మొదలైన ఐదు రకాల కూరగాయలు, బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, చింతపండు, కొబ్బరికాయ, అరటిపండ్లు, తమలపాకులు, వక్క, బెల్లం, ఉప్పు, మిరపకాయలు, పాలు, పెరుగు, నూనె, నెయ్యి, తేనె, గుమ్మడికాయ, అల్లం, కొత్తిమీర.. ఇలా కుటుంబమంతటికీ ఒకపూట వంటకు సరిపోయే సరకులను అరిటాకు లేదా విస్తరిలో ఉంచి.. సమర్పించాలి. అలాగే తమ స్తోమతకు తగినట్లు దక్షిణ కూడా జతచేసి ఇవ్వాలి. వారంతా తృప్తిగా భోజనం చేసి.. 'అన్నదాతా సుఖీభవ' అని ఆశీర్వదిస్తే.. అది శుభప్రదమని, తమ కుటుంబం ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవిస్తామని విశ్వసిస్తారు.



జెన్ కథ

విధి బలీయం..



జపాన్‌లో గొప్ప యుద్ధ వీరుడిగా పేరు తెచ్చుకున్నాడు నోబునగా. ఒకసారి అతడి బృందం శత్రుసేనపై దాడికి బయల్దేరింది. తన నాయకత్వం మీద నమ్మకమే గాక ప్రత్యర్థుల సంఖ్య కూడా స్వల్పంగా ఉండటంతో.. గెలుపు తమదేనని నమ్మకంతో ఉన్నాడు. కానీ అతని బెటాలియన్‌లోని సైనికులు మాత్రం ఫలితం ఎలా ఉంటుందోనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. వాళ్లు పయనిస్తున్న దారిలో షింటో మందిరం ఉంది. దాన్ని చూడగానే నోబునగా- 'ముందు నేను దర్శించుకుని వస్తాను. ఆలయం లోంచి రాగానే నాణెం విసిరేస్తాను. తల (హెడ్) అయితే గెలిచితీరతాం, తోక (టెయిల్) అయితే విధి మనకు అనుకూలంగా లేదు, నష్టపోతామని అర్థం. నాణెం అలా పడితే.. ఏం చేయాలో అప్పుడాలోచిద్దాం' అన్నాడు. వారంతా సరేనన్నారు. నోబునగా మందిరంలోకి వెళ్లి చాలాసేపు ప్రార్థించాడు. బయటకు రాగానే టాస్ వేశాడు. హెడ్ కనిపించటంతో సైనికుల ముఖాలు వికసించాయి. ఉత్సాహంగా ముందుకు సాగారు. యుద్ధంలో సులభంగా గెలిచారు. 'విధి బలీయం' అన్నాడు టీ కప్పుతో వచ్చిన అటెండర్. 'కృషి మరింత బలీయం. పట్టుదలతో పనిచేస్తే దేవుడు తప్పక కరుణిస్తాడు' అంటూ నోబునగా జేబులోంచి నాణెం తీసి చూపాడు.. దానికి రెండు వైపులా తలే ఉంది.

పూజలందుకునే తుకారాం చెట్టు



మహారాష్ట్ర దేహూ గ్రామంలో తుకారాం చెట్టును ఆరాధిస్తారు. ఈ చెట్టుకింద భక్త తుకారాం అభంగాలు (భక్తిగీతాలు) రచించాడు. అందుకే చెట్టుకు ఆ పేరొచ్చింది. భక్తులు ఈ చెట్టుకు ప్రదక్షిణలు చేస్తారు. ప్రచారంలో ఉన్న కథనాల ప్రకారం.. తుకారాం రచించిన అభంగాలు చట్టబద్ధమైనవిగా లేవని, వాటిని నదిలో పారేయమని ఆదేశించారు పండితులు. అందుకు తుకారాం దుఃఖించినప్పటికీ విఠలునిపై నమ్మకంతో వాళ్లు చెప్పినట్లే చేశాడు. ఆశ్చర్యంగా ఆ రచనలు నదిలో మునిగిపోక.. తేలియాడుతూ తుకారాం చెట్టు వద్దకు వచ్చి ఆగాయి. ఆర్తితో తుకారాం పిలిస్తే చెలికాడుగా వచ్చి కబుర్లు చెప్పేవాడు పాండు రంగస్వామి. ఒకరోజు తుకారాంకు స్వామి కలలో కనిపించి ఫాల్గుణమాసం కృష్ణపక్ష విదియ నాడు అతడికోసం పుష్పకవిమానం పంపుతానని చెప్పాడు. ఆ స్వప్నం సంగతి విని గ్రామస్థులు హేళన చేశారు. కానీ నిజంగానే ఆ రోజున తుకారాం తుది శ్వాస విడిచాడు. తుకారాం స్వామి సన్నిధి చేరాడని, ఆ చెట్టును పూజిస్తే స్వామి ఆశీర్వదిస్తాడని భక్తులు విశ్వసిస్తారు.

ఈనాడు సినిమా

అన్నా అంటేనే.. ఉన్నానంటూనే..



సత్యదేవ్, విజయ్ దేవరకొండ

'మరిచిపోవడానికి వాడేమైనా గోడమీద ఉన్న దేవుడా... గుండెల్లో ఉన్న నా అన్న...' అంటూ తన సోదరుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు ఓ చిన్నోడు. మరి ఈ అన్నదమ్ముల కథేమిటో తెలియాలంటే 'కింగ్డమ్' చూడాల్సిందే. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. భాగ్య శ్రీ బోర్సే కథానాయిక. సత్యదేవ్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'అన్న అంటేనే... ఉన్నానంటూనే...' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. 'చిన్నతనమే ఏమైపోయే... నన్ను వదిలే నీదే చేయే...' అంటూ మొదలయ్యే ఈ గీతాన్ని కృష్ణకాంత్ రచించగా, అనిరుధ్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అన్నదమ్ములుగా నటించారు. ఆ ఇద్దరి నేపథ్యంలో సాగే పాటే ఇది. "సోదర భావానికి ఓ వేడుకలాంటి గీతమిది. బంధాన్ని ఆవిష్కరిస్తూనే, మనసుల్ని తాకుతుంది. అద్భుతమైన కథని ఎంచుకుని, అంతే అద్భుతంగా దర్శకుడు ఈ సినిమాని తెరపైకి తీసుకొచ్చారు. ప్రేక్షకులకు ఓ గొప్ప అనుభూతిని పంచుతుంద"ని చిత్రవర్గాలు చెప్పాయి.

వెంకీ చిత్రం.. ఆగస్టు నుంచే!

అగ్ర కథానాయకుడు వెంకటేశ్ చేతిలో ఉన్న సినిమాల జాబితా చాలా పెద్దదే. బ్లాక్‌బస్టర్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత ఆయన కోసం కథలు వరుస కట్టాయి. సీనియర్ హీరోల్లో ఎక్కువ సినిమాలకి సంతకాలు చేసింది ఆయనే. ఇటీవలే అమెరికాలోనూ ఆ సినిమాల జాబితాని స్వయంగా ప్రకటించారు వెంకటేశ్. అందులో త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా వచ్చే నెలలోనే పట్టాలెక్కనుంది. అందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక పక్క తుదిదశ స్క్రిప్ట్ పనులు జరుగుతుండగానే, మరోవైపు పూర్వ నిర్మాణ పనులు సాగుతున్నాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న తొలి సినిమా ఇదే. అయితే ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలు త్రివిక్రమ్ రచనలో రూపొందినవే.



వెంకటేశ్



సాయి కొర్రపాటి, సెంథిల్, కిరీటి, రాజమౌళి, రాధాకృష్ణ, శ్రీలీల, దేవిశ్రీప్రసాద్, జెనీలియా

బన్నీకి ఆర్యలా.. కిరీటికి జూనియర్

– దేవిశ్రీప్రసాద్

ప్రేక్షకుల్లో చూడాలనే ఆసక్తి కలగడంతోనే 'జూనియర్' వెయ్యికిపైగా థియేటర్లలో విడుదలవుతోందన్నారు అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. ఆయన ముఖ్య అతిథిగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'జూనియర్' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శ్రీలీల కథానాయిక. జెనీలియా ముఖ్యభూమిక పోషించారు. రాధాకృష్ణ దర్శకుడు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో బిగ్ టికెట్‌ని ఆవిష్కరించారు దర్శకుడు రాజమౌళి. అనంతరం ఆయన మాట్లాడుతూ "సాయి కొర్రపాటి ఈ సినిమాని మొదలు పెట్టినప్పుడు... ఒక మంచి కథతో, చిన్న సినిమా తీస్తున్నారనుకున్నా. కానీ శ్రీలీల, జెనీలియా, రవిచంద్రన్, దేవిశ్రీప్రసాద్, సెంథిల్, పీటర్ హెయిన్స్ ఇలా ప్రముఖ నటులు, సాంకేతిక నిపుణులు తోడవుతూ ఓ పెద్ద సినిమాలా మారిపోయింది. ఒక చిన్న సినిమాని ఈ స్థాయికి తీసుకొచ్చిన నిర్మాత సాయి కొర్రపాటికి అభినందనలు. ఎన్నేళ్లయినా జెనీలియా అదే అందంతో, అంతే హుషారుగా ఉంది. ఇందులో కొత్త జెనీలియాని చూస్తారని సెంథిల్ ప్రామిస్ చేశారు. అందుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. దేవిశ్రీప్రసాద్ తన పాటతో సినిమాల్ని ఎలివేట్ చేస్తుంటారు. వైరల్ వయ్యారితోపాటు, ఇతర పాటలు సినిమాపై ఎంతో ఆసక్తిని పెంచాయి. ఛాయాగ్రాహకుడు సెంథిల్ రాజీపడని సాంకేతిక నిపుణుడు. ఈ సినిమాకి పెద్ద బలం. సినిమాకి ఇంకా ఏదో చేయాలని కష్టపడుతుంటాడు పీటర్ హెయిన్స్. అలాంటి ఇద్దరు సాంకేతిక నిపుణులు కిరీటి బాగా చేశాడని మెచ్చుకున్నారు. అది మామూలు విషయం కాదు. పరిశ్రమలో కిరీటి అందుకున్న అత్యుత్తమమైన అభినందనలు ఇవి. శ్రీలీల మరో స్థాయికి చేరుకుంటుంది. రాధాకృష్ణ గత మూడేళ్ల నుంచి తన కుటుంబాన్ని బెంగళూరులో వదిలేసి ఈ సినిమాకోసం కష్టపడ్డాడు. ఒక మంచి సినిమాని బయటికి తీసుకొచ్చాడు. ప్రేక్షకుల హృదయాల్లోనూ, పరిశ్రమలోనూ తను స్థానం సంపాదిస్తాడు. అందరూ థియేటర్లలో చూడండి. పైసా వసూల్ చిత్రమిది" అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ "నాకు వైరల్ వయ్యారి ట్యాగ్ వచ్చిందంటే కారణం సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్. ఆయన వైరల్ అయితే, నేను వయ్యారిని. ఒక పాట ఇచ్చి వదిలేయకుండా, అది తెరపై ఎలా ఉండాలో సెట్‌కి వచ్చి చెప్పారు. ఛాయాగ్రాహకుడు సెంథిల్ నా మార్గదర్శి. జీవితంలో ఏ బాధ ఉన్నా, రెండు నిమిషాలు ఆయనతో మాట్లాడితే చాలు. జెనీలియా ఇందులో నటించడం ఆనందంగా ఉంది. ఆమె ఓ బ్రాండ్. సినిమా తప్ప వేరే ధ్యాస లేని వ్యక్తి కిరీటి. నేను భయపడినప్పుడు కూడా కొన్ని స్టెప్పులు వేయడానికి కావల్సిన ఉత్సాహాన్నిచ్చారు. ఈ సినిమాతో ఈ నెల 18న ఓ స్టార్‌ని చూడబోతున్నాం" అన్నారు. దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ "బన్నీకి 'ఆర్య'... ఎలా అయ్యిందో, కిరీటికి 'జూనియర్' అలా. డాన్స్, ఫైట్స్, హాస్యం, భావోద్వేగాలు.. ఇలా అన్నీ కుదిరాయి. కిరీటికి తగ్గ కథ ఇది. థ్రిల్ అయ్యేలా తను పోరాట సన్నివేశాల్లో నటించాడు. వైరల్ వయ్యారి పాట చిత్రీకరణ, అందులో నృత్యాలు నాకెంతో సంతృప్తినిచ్చాయి. శ్రీలీల ఉన్నత స్థాయికి చేరుకుంటుంది" అన్నారు. కథానాయకుడు కిరీటి మాట్లాడుతూ "మూడేళ్ల కష్టం ఈ సినిమా. కష్టపడి నిష్ఠతో పనిచేస్తే తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు, వాళ్లని పైకి తీసుకొస్తారు. నాకోసమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, ఇతర నటుల కోసం ఈ సినిమాని ప్రోత్సహించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో సెంథిల్‌కుమార్, సందీప్‌రాజ్, హర్ష చెముడు, రేవంత్, పీటర్ హెయిన్స్, సాయి కొర్రపాటి, రచయితలు శ్రీమణి, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


రవితేజకు పితృవియోగం



తండ్రితో రవితేజ

ప్రముఖ కథానాయకుడు రవితేజ ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి భూపతిరాజు రాజగోపాల్ రాజు (90) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. వయోభారంతోపాటు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రవితేజ నివాసంలో తుదిశ్వాస విడిచారు. తూర్పు గోదావరి జిల్లాలో జన్మించిన రాజగోపాల్‌రాజు ఫార్మసిస్ట్‌గా పనిచేశారు. ఆయన ఉద్యోగరీత్యా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో గడిపారు. తనపై అమితాబ్ బచ్చన్ సినిమాల ప్రభావం ఎక్కువగా ఉండటానికి కారణం అదే అని రవితేజ పలు సందర్భాల్లో చెప్పారు. రాజగోపాల్ రాజుకి రవితేజ, భరత్ రాజు, రఘు కుమారులు. భార్య రాజ్యలక్ష్మి. భరత్‌రాజు 2017లో కారు ప్రమాదంలో మరణించారు. రఘు పలు సినిమాల్లో నటుడిగా మెరిశారు. భూపతిరాజు రాజగోపాల్ రాజు మృతిపట్ల అగ్ర కథానాయకులు చిరంజీవి, పవన్‌కల్యాణ్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియల్ని నిర్వహించారు.

'సత్యం సుందరం' దర్శకుడితో విక్రమ్



విక్రమ్

'96' సినిమాతో ఓ సరికొత్త ప్రేమ కథను పరిచయం చేసి ప్రేక్షకుల హృదయాల్ని గెల్చుకున్నారు దర్శకుడు సి.ప్రేమ్ కుమార్. ఇటీవలే ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సత్యం సుందరం' ఎంతో మంది సినీప్రియుల్ని కదిలించింది. ఇప్పుడాయన మరో ప్రాజెక్టు కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో తమిళ హీరో విక్రమ్ ఓ సినిమాను చేయబోతున్నారు. 'చియాన్ 64' (వర్కింగ్ టైటిల్)గా రూపొందుతున్న ఈ సినిమాను బుధవారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫొటోలను పంచుకుంది నిర్మాణ సంస్థ వేల్స్‌ఫిల్మ్స్ ఇంటర్నేషనల్. "మా తదుపరి ప్రాజెక్టును విక్రమ్, దర్శకుడు ప్రేమ్ కుమార్ కలయికలో చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. త్వరలో మీరు తెరపై మ్యాజిక్‌ను చూడబోతున్నార"నే వ్యాఖ్యల్ని జోడించింది. యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది.

నువ్వు నదివే...



రష్మిక, దీక్షిత్‌శెట్టి

రష్మిక ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. ఇందులో రష్మికకు జోడీగా దీక్షిత్‌శెట్టి నటిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలోని 'నదివే నువ్వు నదివే... నీ మార్పే రానుంది వినవే' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ఈ గీతాన్ని ఆయనే ఆలపించారు. రాకేందు మౌళి సాహిత్యం అందించారు. కవితాత్మకంగా సాగే ఈ పాట, చిత్రీకరణ మనసుల్ని హత్తుకునేలా ఉంటుందని సినీ వర్గాలు తెలిపాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కృష్ణన్ వసంత్, ప్రొడక్షన్ డిజైన్: ఎస్.రామకృష్ణ, మౌనిక నిగోత్రి.

సజీవ పాత్రలతో... 'కొత్తపల్లిలో ఒకప్పుడు'



ప్రవీణ, రానా దగ్గుబాటి, మనోజ్

"మనందరికీ తెలిసిన వ్యక్తులే అనిపించేలా సజీవమైన పాత్రలతో రూపొందిన సినిమానే 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ఇలాంటి సినిమాలు ప్రేక్షకులకు చేరువ కావల్సిన అవసరం ఎంతో ఉంద"న్నారు ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి. ఆయన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా సమర్పణలో ఈ నెల 18న వస్తోన్న చిత్రమే 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. మనోజ్‌చంద్ర, మోనికా ప్రధాన పాత్రధారులు. పరుచూరి ప్రవీణ దర్శకత్వం వహించారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ సంస్థ నిర్మించింది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శన అనంతరం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా రానా దగ్గుబాటి మాట్లాడుతూ "మంచి విజన్‌తో తీసిన సినిమాల్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంటా. ఈ సినిమాని తొలిసారి చూసినప్పుడు పాత్రలన్నీ మన చుట్టూ ఉన్నవే అనే అనుభూతి కలిగింది. ఒక సినిమా చేయాలంటే అన్నీ వదిలేసుకుని రావాలనే ఆలోచనకి భిన్నంగా.. . వైద్యురాలైన ప్రవీణ, ఉద్యోగం చేస్తూనే మనోజ్ ఈ సినిమాని చేశారు. ఇలాంటి మంచి సినిమాల్ని ఇకముందు కూడా చేయాలని కోరుకుంటున్నా" అన్నారు. దర్శకురాలు ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ "నా తొలి సినిమా 'కేరాఫ్ కంచరపాలెం'ను ప్రోత్సహించడంతోనే, ఇప్పుడు ఈ చిత్రాన్ని చేయగలిగా. రానా కారణంగానే 'కేరాఫ్ కంచరపాలెం' సినిమా ప్రేక్షకుల్లోకి వెళ్లింది. ఈ సినిమానీ ఆయనే విడుదల చేస్తున్నారు. ప్రేక్షకులపై నమ్మకంతోనే ఈ సినిమా చేశా. రామకృష్ణ, అప్పన్న, రెడ్డి... ఇలా ప్రతి పాత్ర చాలా బాగా తెరపైకి వచ్చింది. థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా ఇది" అన్నారు. నిజాయతీగా ఒక సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే విషయం మరోసారి రుజువు చేయనుందీ చిత్రమని, ముందస్తు ప్రదర్శనల్లో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందని చెప్పారు మనోజ్ చంద్ర. ఈ కార్యక్రమంలో నటులు రవీంద్ర విజయ్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.




ప్రియాంక అరుల్ మోహన్

ప్రియాంక కొత్త సినిమా


త్వరలో అగ్రహీరో పవన్ కల్యాణ్‌తో కలిసి 'ఓజీ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనుంది కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్న ఈ తార ఇప్పుడు మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రియాంక, తమిళ హీరో కవిన్ జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. కెన్ రాయ్‌సన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. 'కొత్త ప్రయాణం.. కొత్త సినిమా' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోలను పంచుకుంది చిత్రబృందం. థింక్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు రొమాంటిక్ కామెడీ చిత్రంగా తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమాతో ప్రియాంక తొలిసారి కవిన్‌తో తెరను పంచుకోనుండటం విశేషం.

అడవిలో హత్యకు కారకులెవరు?



కథాంశం: కుటుంబంతో కలిసి సరదాగా గడపడానికి పార్క్‌కి వెళ్లాడు ఓ వ్యక్తి. కానీ అనుకోని కారణాల వల్ల అతను మరణిస్తాడు. దీంతో ఆ వ్యక్తి మృతి వెనుక రహస్యాన్ని తెలుసుకోవడానికి రంగంలోకి దిగుతాడు ఏజెంట్ కైల్ టర్నర్. మరి ఆయన ఈ మిస్టరీని ఎలా ఛేదించారు? ఆ వ్యక్తి చనిపోవడానికి అడవి జంతువులు కారణమా? లేకపోతే మనుషులా? అనే ఆసక్తికర ప్రశ్నలకు సమాధానమే 'అన్‌టేమ్డ్'. ఎల్లే, మార్క్ ఎల్.స్మిత్ దీన్ని రూపొందించారు. ఈ మర్డర్ మిస్టరీలో ఎరిక్ బానా, సామ్ నీల్, విల్సన్ బెథెల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో కైల్ టర్నర్ అనే కాలిఫోర్నియాలోని యోస్మైట్ నేషనల్ పార్క్ సర్వీస్ ఏజెంట్‌గా కనిపించనున్నారు ఎరిక్ బానా. వృత్తిలో నిజాయతీ పరుడైన ఆయన దట్టమైన అడవితో కూడిన పార్క్‌లో చనిపోయిన సందర్శకుడి హత్య గురించి నిజాల్ని తెలుసుకొని హంతకులకు శిక్ష వేయాలని ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతాడు. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి అరణ్యంలో జరిగిన ఈ హత్యకు గల కారణాలను కనిపెట్టే తీరుతానని సవాల్ విసురుతున్న ఈ కైల్ టర్నర్ కథేంటో మీరూ చూసేయ్యండి.

సిరీస్ : 'అన్‌టేమ్డ్'
నటీనటులు : ఎరిక్ బానా, సామ్ నీల్
విడుదల : గురువారం
ప్లాట్‌ఫామ్ : నెట్‌ఫ్లిక్స్



'ఉదయ్‌పూర్ ఫైల్స్' కేసు విచారణను వాయిదా వేసిన సుప్రీం కోర్టు

'ఉదయ్ పూర్ ఫైల్స్: కన్హయ్య లాల్ టైలర్ మర్డర్' చిత్ర విడుదలపై బుధవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇటీవలే ఈ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ పిటీషన్ దాఖలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పిటీషన్‌పై విచారించిన ధర్మాసనం.. ఈ కేసును ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ సినిమా అంశంలో కేంద్ర నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు.. కేంద్రం ఏర్పాటు చేసిన ప్యానెల్ దీనిపై త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తుందని.. అప్పటి వరకు వేచి ఉండాలని కోర్టు నిర్మాతలను కోరింది.

రాష్ట్రపతి భవన్‌లో 'కన్నప్ప' ప్రదర్శన




విష్ణు మంచు

విష్ణు మంచు ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'కన్నప్ప' అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకి చెందిన పలువురు ప్రముఖులు ఈ ప్రదర్శనకు హాజరైనట్టు సినీ వర్గాలు తెలిపాయి. భక్తి, వారసత్వం మేళవింపుగా రూపొందిన ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన లభించిందని, రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనతో సినిమాకి జాతీయస్థాయిలో ప్రత్యేకమైన గుర్తింపు లభించిందని పేర్కొన్నాయి. శివభక్తుడైన భక్తకన్నప్ప జీవితం ఆధారంగా రూపొందిన చిత్రమిది. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా, మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, శరత్‌కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

తల్లిదండ్రులైన కియారా, సిద్ధార్థ్

బాలీవుడ్ హిట్ జోడీల్లో కియారా అడ్వాణీ, సిద్ధార్థ్ మల్హోత్రాల జంట ఒకటి. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించారీ దంపతులు. తాజాగా కియారా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 'మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. ఇప్పుడు మా ప్రపంచం పూర్తిగా మారిపోయింద'నే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. 2021లో విడుదలైన లెఫ్టినెంట్ విక్రమ్ బాత్రా జీవితాధారంగా రూపొందిన 'షేర్షా' సినిమాలో కలిసి నటించి ప్రేమ ప్రయాణాన్ని ప్రారంభించారు సిద్ధార్థ్, కియారా. 2023లో పెద్దల అంగీకారంతో వీరిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. ప్రస్తుతం కియారా నటించిన 'వార్ 2' విడుదలకు సిద్ధంగా ఉంది. 'పరమ్ సుందరి' సినిమాతో సిద్ధార్థ్ బిజీగా ఉన్నారు.





కాంట్రాక్టు అభివృద్ధి, పరిశోధనలకు ఆకాశమే హద్దు

- 2030 నాటికి రూ.23 లక్షల కోట్ల మార్కెట్
- మంచి భాగస్వామ్యాలు, అవకాశాలు లభిస్తున్నాయ్
- దివీస్ లేబొరేటరీస్ ఎండీ మురళి కె.దివి





ఈనాడు, హైదరాబాద్: ఔషధ రంగంలో మనదేశానికి చెందిన కంపెనీలకు సీడీఎంఓ (కాంట్రాక్టు అభివృద్ధి), సీఆర్ఓ (కాంట్రాక్టు పరిశోధన) అతిపెద్ద అవకాశంగా మారుతోంది. చైనా ప్లస్ వన్ విధానం వైపు వివిధ దేశాలు మొగ్గుచూపడం దీనికి ప్రధాన కారణం. వ్యయాలు, విశ్వసనీయత, నాణ్యత.. తదితర సమీకరణాలూ ఉన్నాయి. దీంతో అమెరికా, ఐరోపా దేశాలకు చెందిన బహుళ జాతి ఫార్మా కంపెనీలు పెద్దఎత్తున ఇటువంటి కాంట్రాక్టులను మనదేశంలోని ఫార్మా కంపెనీలకు ఇస్తున్నాయి. ఫలితంగా సీడీఎంఓ విభాగానికి చెందిన ఫార్మా కంపెనీలకు సమీప భవిష్యత్తులో మెరుగైన ఆదాయాలు ఆర్జించే అవకాశాలు వస్తాయని పరిశ్రమ వర్గాల అంచనా. దివీస్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ మురళి కె.దివి ఇదే విషయంలో ధీమాగా ఉన్నారు. సీడీఎంఓ/సీఆర్ఓ వ్యాపారం గత ఏడాది 140 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12 లక్షల కోట్లు) స్థాయిలో ఉండగా, ఇది 2030 కల్లా 270 బిలియన్ డాలర్ల (సుమారు రూ.23 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా. బహుళ జాతి ఫార్మా కంపెనీలు తమ సరఫరా వ్యవస్థలను విస్తరిస్తున్నాయని, ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతున్నాయని, అందువల్ల తమకు కొత్త కస్టమర్లు లభించడమే కాక, భాగస్వామ్యాలు కుదురుతున్నట్లు మురళి కె.దివి వెల్లడించారు. 'కస్టమ్ సింథసిస్' విభాగంలో ఈ సానుకూలత కనిపిస్తున్నట్లు ఆయన దివీస్ లేబొరేటరీస్ 2024-25 వార్షిక నివేదికలో వివరించారు.

పెప్టైడ్ ఏపీఐ మార్కెట్

పెప్టైడ్ ఔషధాల విభాగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ విభాగంలో పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయి. దీనివల్ల ఎంతో బాగా పనిచేసే ఔషధాలను ఆవిష్కరించే అవకాశం కలుగుతోంది. ముఖ్యంగా జీఎల్‌పీ-1, జీఎల్‌పీ-2, జీఐపీ ఔషధాల వినియోగం ప్రపంచ వ్యాప్తంగా బాగా పెరుగుతోంది. ఫలితంగా పెప్టైడ్ ఏపీఐ ఔషధాలకు డిమాండ్ విస్తరిస్తోంది. వీటి ఉత్పత్తి వ్యయం అమెరికా, ఐరోపా దేశాల్లో ఎంతో ఎక్కువ. అందువల్ల మనదేశానికి చెందిన ఫార్మా కంపెనీలకు పెద్దఎత్తున ఉత్పత్తి కాంట్రాక్టులు లభిస్తున్నాయి. ఈ అవకాశాన్ని దివీస్ లేబొరేటరీస్ సొమ్ము చేసుకుంటోంది. దీనికోసం ప్రత్యేకంగా యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్‌పీపీఎస్ (సాలిడ్ ఫేజ్ పెప్టైడ్ సింథసిస్), ఎల్‌పీపీఎస్ (లిక్విడ్ ఫేజ్ పెప్టైడ్ సింథసిస్) సామర్థ్యాలను పెంచుకోవడం కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది.



దీర్ఘ కాలిక ప్రణాళిక, కార్యాచరణ

సమీప భవిష్యత్తులో సాధించాల్సిన వృద్ధి, అందుకు అనుసరించాల్సిన ప్రణాళిక, దాన్ని అమలు చేయడంపై తమకు స్పష్టమైన ఆలోచన ఉన్నట్లు మురళి కె.దివి స్పష్టం చేశారు. 'ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవడం, అందుకు తగిన పెట్టుబడులు పెట్టడం, తమ వినియోగదార్లకు సమర్థ సేవలు అందిస్తూ బలమైన సంబంధాలు కొనసాగించడం' అనేవి తమ భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా ఉన్నట్లు తెలిపారు. కస్టమ్ సింథసిస్ విభాగంలో కాంట్రాక్టులు పెరుగుతున్నాయని, అదే సమయంలో జనరిక్ ఔషధాల విభాగంలో స్థిరత్వం వస్తోందని అన్నారు. పెప్టైడ్ ఔషధాల్లో స్పష్టమైన అవకాశాలు కనిపిస్తున్నట్లు వివరించారు. దీనివల్ల దీర్ఘకాలంలో స్థిర వృద్ధి సాధించగలమని విశ్వాసం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. దివీస్ లేబొరేటరీస్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.9,550 కోట్ల ఆదాయాన్ని, రూ.2,209 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. ఈపీఎస్ రూ.83.20గా నమోదైంది. కాకినాడలో యూనిట్-3 మొదటి దశ ప్రారంభం కావడం, కొత్త ఔషధాల ఉత్పత్తి కాంట్రాక్టులు లభించడంతో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగైన ఫలితాలు వస్తాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జీప్ కంపాస్, మెరిడియన్ కొత్త వెర్షన్లు



దిల్లీ: జీప్ ఇండియా తమ ఎస్‌యూవీ మోడళ్ల కంపాస్, మెరిడియన్‌లలో పరిమిత కాల ట్రయల్ ఎడిషన్లను దేశీయ విపణిలోకి తీసుకొచ్చింది. సరికొత్త డిజైన్, అధునాతన ఫీచర్లతో కంపాస్ లాంగిట్యూడ్ (ఓ), మెరిడియన్ లిమిటెడ్ (ఓ) వేరియంట్లపై ఈ మోడళ్లను రూపొందించింది. కంపాస్ ట్రయల్ ఎడిషన్ ధర రూ.25.41 లక్షలు, కంపాస్ ట్రయల్ ఏటీ ధర రూ.27.41 లక్షలు, కంపాస్ ట్రయల్ ఏటీ ధర రూ.31.27 లక్షలు, మెరిడియన్ ట్రయల్ ఏటీ ధర రూ.35.27 లక్షలు, మెరిడియన్ ట్రయల్ ఏటీ 4x4 ధర రూ.37.27 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు.

ఎర్టిగా, బాలెనో ధరలు పెంచిన మారుతీ

దిల్లీ: ఆరు ఎయిర్‌బ్యాగులను తప్పనిసరిగా అమర్చాలన్న నిబంధన వల్ల, తయారీ వ్యయాలు పెరగడంతో.. ఎర్టిగా, బాలెనో మోడళ్ల ధరలను 1.4% వరకు పెంచినట్లు మారుతీ సుజుకీ ప్రకటించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. దేశీయంగా ఎర్టిగా మోడల్, ఎక్స్‌షోరూమ్ ధర సగటున 1.4%, బాలెనో ధర 0.5% పెరిగినట్లు తెలిపింది.

బోనస్ షేర్లపై 19న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిర్ణయం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బోనస్ షేర్లు, ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ జారీ చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఆమోదించేందుకు డైరెక్టర్ల బోర్డు ఈ నెల 19న సమావేశం కానుంది. ఈ సమావేశంలోనే ఏప్రిల్-జూన్ ఫలితాలనూ ఆమోదించనున్నారు.

గనుల్లో నియంత్రిత పేలుళ్ల సాంకేతికత

ఎన్ఐఆర్ఎంతో సిబీ మైనింగ్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: గనులు, మౌలిక సదుపాయాల రంగంలో నియంత్రిత పేలుళ్ల (కంట్రోల్డ్ బ్లాస్టింగ్) సాంకేతికతను ఉపయోగించేందుకు కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం), హైదరాబాద్ సంస్థ సిబీ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ రెండు సంస్థలకూ ఉన్న సాంకేతికత నైపుణ్యంతో, దేశవ్యాప్తంగా కీలక ప్రాజెక్టులకు 'సురక్షితం-కచ్చితమైన, సృజనాత్మక' బ్లాస్టింగ్ పరిష్కారాలను చూపిస్తాయి. సిబీ మైనింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సిబీ లూకోస్ మాట్లాడుతూ.. దేశంలో బొగ్గు తవ్వకాలు, మౌలిక సదుపాయాల రంగాల్లో కంట్రోల్డ్ బ్లాస్టింగ్ అవసరాలు పెరుగుతున్నాయని వివరించారు.

టెక్ మహీంద్రా లాభంలో 34% వృద్ధి



దిల్లీ: ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో రూ.1,140.6 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.851.5 కోట్లతో పోలిస్తే ఇది 34% ఎక్కువ. కమ్యూనికేషన్స్, ఆర్థిక సేవల విభాగాలు రాణించడం ఇందుకు కలిసొచ్చింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.13,005.5 కోట్ల నుంచి 2.65% వృద్ధితో రూ.13,351.2 కోట్లకు చేరింది. 2024-25 జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే లాభం 2.2%, ఆదాయం 0.2% చొప్పున పెరిగాయి.

రూ.6,900 కోట్ల విలువైన ఒప్పందాలు: సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 809 మిలియన్ డాలర్ల (రూ.6900 కోట్లు) విలువైన కొత్త ఒప్పందాలను కుదుర్చుకుంది. 50 మి.డాలర్లకు పైగా ఆదాయ విభాగంలో ఇద్దరు ఖాతాదారులు జతచేరారు. ఖాతాదారులు ఐటీ వ్యయాలు తగ్గించుకుంటున్నందున తమ ఆదాయంపై ప్రభావం పడిందని, కొత్త ఆర్డర్ల ప్రభావం రెండో త్రైమాసికం నుంచి కనిపిస్తుందని టెక్ మహీంద్రా తెలిపింది. 'గత త్రైమాసికంలో మా పనితీరు బలపడింది. ప్రాజెక్టులు, వ్యూహాత్మక ప్రణాళికలను క్రమశిక్షణతో పూర్తి చేశాం. గత 12 నెలల ప్రాతిపదికన చూస్తే ఆర్డర్లు 44% పెరిగాయి. అన్ని విభాగాల్లో, భౌగోళిక ప్రాంతాల్లో కంపెనీ పటిష్ఠ పనితీరు కనబరచడం ఇందుకు దోహదపడింద'ని టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ మోహిత్ జోషి పేర్కొన్నారు. కంపెనీ ఐరోపా వ్యాపారం 11.7% పెరగ్గా, అమెరికాలో 5.9% తగ్గింది. మిగతా ప్రపంచ దేశాల్లో వ్యాపారం 2.9% వృద్ధి చెందింది.

కొత్త ఉద్యోగులకు సాఫ్ట్‌స్కిల్స్ నేర్పుతాం: 2025 జూన్ 30 నాటికి కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య ఏడాది క్రితంతో పోలిస్తే 897 పెరిగి 1,48,517కు చేరింది. వార్షిక వలసల రేటు 12.6 శాతంగా నమోదైంది. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారికి సాఫ్ట్‌స్కిల్స్ పెంపుదలపై దృష్టి సారించినట్లు టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి వెల్లడించారు. కళాశాల ప్రాంగణాల్లో ఎంపిక చేసుకున్న వారికి పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు కృత్రిమమేధ (ఏఐ)తో పాటు ఇతర అధునాతన సాంకేతికతల్లో శిక్షణ జరుగుతోందన్నారు. ఇప్పటికే 77,000 మంది ఏఐ, జెనరేటివ్ ఏఐ సామర్థ్యాలను నేర్చుకున్నారని వివరించారు.

✦ బీఎస్ఈలో షేరు 1.94% లాభంతో రూ.1,609 వద్ద ముగిసింది. బుధవారం మార్కెట్ ముగిసిన తర్వాత కంపెనీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది.

లండన్ కాదు.. మన ధరలే ప్రామాణికం

మ్యూచువల్ ఫండ్ల బంగారం, వెండిపై సెబీ



దిల్లీ: మ్యూచువల్ ఫండ్ కంపెనీలు అందిస్తున్న ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) ద్వారా నిర్వహించే భౌతిక బంగారం, వెండి విలువలను నిర్ణయించే పద్ధతులను సమీక్షించాలని సెబీ ఆలోచిస్తోంది. ఈ లోహాల విషయమై దేశీయ మార్కెట్ ధరలతో మెరుగైన అనుసంధానం ఉండేలా చూడటంతో పాటు, స్థిరత్వాన్ని పెంచేందుకు వీలవుతుందని భావిస్తోంది. ఇందుకోసం ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది.

- ప్రస్తుతం బంగారం, వెండి విలువల నిర్ణయం కోసం మ్యూచువల్ ఫండ్ సంస్థలు లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్‌బీఎంఏ) ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. దీనికి బదులుగా దేశీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలు ప్రకటించే స్పాట్ ధరలను అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఉపయోగించాలని ప్రతిపాదించింది.
- దేశీయ బెంచ్‌మార్క్‌ను గుర్తించడం, స్పాట్ ధరను నిర్ణయించేందుకు వివరణాత్మక పోలింగ్ విధానాన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని సెబీ లక్ష్యంగా పెట్టుకుంది.
- ప్రస్తుతం గోల్డ్ ఈటీఎఫ్ పథకంలో 995.0 స్వచ్ఛత బంగారంపై ఎల్‌బీఎంఏ ద్వారా ఔన్స్ (31.10గ్రా)ధరను అమెరికా డాలర్లలో లెక్కిస్తున్నారు. ఇదే విధంగా 999.0 స్వచ్ఛతతో ఉన్న వెండి ధరనూ గణిస్తున్నారు.
- ఈటీఎఫ్‌లలో ఎల్‌బీఎంఏ ధరల ఆధారంగా బంగారం, వెండి విలువలను లెక్కిస్తుండగా, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమొడిటీ డెరివేటివ్స్ (ఈటీసీడీ) ఈ లోహాల ఫ్యూచర్స్ ట్రేడింగ్ ముగింపు ధరలను ఉపయోగిస్తున్నాయి. ఈ రెండింటి విలువ నిర్ణయ పద్ధతులు మారుతున్నాయి. ఇందులో ఏకరూపత సాధించే లక్ష్యంతో సెబీ ఈ ప్రతిపాదనలు తీసుకొచ్చింది.

అవేంటంటే: ఏఎంసీలు నేరుగా దేశీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలు ప్రచురించే స్పాట్ ధరలను బంగారం, వెండి ధరలను నిర్ణయించేందుకు వాడాలని పేర్కొంది. ప్రతిపాదిత మార్పు వల్ల గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో చేసిన పెట్టుబడులు దేశీయ మార్కెట్‌కు మరింత దగ్గరగా ఉంటాయని సెబీ తెలిపింది. ఈ ప్రతిపాదనలపై ఆగస్టు 6 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనుంది.

ఎస్‌బీఐ రూ.45,000 కోట్ల సమీకరణ

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), 2025-26లో రూ.45,000 కోట్ల నిధులను ఈక్విటీ, రుణాల ద్వారా సమీకరించనుంది. ఇందులో రూ.25,000 కోట్ల నిధుల సమీకరణ నిమిత్తం బుధవారం అర్హులైన సంస్థాగత మదుపర్లకు షేర్ల కేటాయింపు (క్యూఐపీ)ను ప్రారంభించింది. ఒక్కో ఈక్విటీ షేరు కనీస ధరను రూ.811.05గా నిర్ణయించింది. బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలో ఎస్‌బీఐ షేరు ముగింపు ధర రూ.831.55తో పోలిస్తే ఇది 2.46% తక్కువ.



కోడి గుడ్లు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	515
గోదావరి	496
విశాఖపట్నం	540
చిత్తూరు	583

ఎంసీఎల్ఆర్ తగ్గించిన ఐఓబీ

చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ).. నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అన్ని కాల వ్యవధుల రుణాలకూ ఇది వెంటనే వర్తిస్తుందని వెల్లడించింది. సవరించిన రేట్ల ప్రకారం ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.15 శాతానికి చేరింది. నెల వ్యవధి రుణాల వడ్డీ రేటు 8.40%, మూడు నెలలకు 8.55%, ఆరు నెలలకు 8.80%, ఏడాదికి 9 శాతంగా నిర్ణయించింది.

ఎల్‌టీటీఎస్ లాభం రూ.315.7 కోట్లు

దిల్లీ: ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.315.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.313.6 కోట్లతో పోలిస్తే ఇది 0.66% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.2,461.9 కోట్ల నుంచి 16.4% వృద్ధి చెంది రూ.2,866 కోట్లకు చేరింది. 2024-25 జనవరి-మార్చితో పోలిస్తే, సమీక్షా త్రైమాసికంలో కంపెనీ లాభం 1.4% పెరిగినా, ఆదాయాలు 3.9% తగ్గాయి. 'కొత్త ఆర్థిక సంవత్సరాన్ని పెద్ద లావాదేవీలతో బలంగా ప్రారంభించాం. ఐరోపా, అమెరికాల్లో అంతక్రితం త్రైమాసికాల జోరును కొనసాగించాం. పలు విభాగాలపై దృష్టిపెట్టే వ్యూహంతో రెండంకెల వార్షిక వృద్ధిని సాధించనున్నాం. ఆర్డరు పుస్తకం అండతో లాభాదాయాల వృద్ధిపై దృష్టి పెట్టాం. 2025-26లో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నాం. మధ్యకాల వ్యవధికి 2 బి.డాలర్ల ఆదాయ లక్ష్యాన్ని కొనసాగిస్తున్నామ'ని ఎల్‌టీటీఎస్ సీఈఓ, ఎండీ అమిత్ చద్దా పేర్కొన్నారు.

భారత్-సింగపూర్ యూపీఐ-పేనౌ సేవలు మరో 13 బ్యాంకులకు విస్తరణ

దిల్లీ: భారత్-సింగపూర్ మధ్య యూపీఐ-పేనౌ సేవలను మరో 13 బ్యాంకులకు విస్తరించినట్లు ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) బుధవారం వెల్లడించింది. దీంతో ఈ సేవలు అందిస్తున్న మొత్తం బ్యాంకులు 19కి చేరాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ అనుబంధ సంస్థే ఎన్ఐపీఎల్. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ (ఎంఏఎస్) సంయుక్తంగా ఆవిష్కరించిన యూపీఐ-పేనౌ సేవలను బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఎస్‌బీఐ అందిస్తున్నాయి.

రామ్‌ఇన్ఫోకు రూ.14.14 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: టెక్నాలజీ సేవలను అందించే హైదరాబాద్ సంస్థ రామ్‌ఇన్ఫో రూ.14.14 కోట్ల విలువైన ఆర్డర్లను సొంతం చేసుకుంది. త్రిపుర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోసం 'ఉన్నోతి' వేదికను రూపొందించేందుకు ఈ పనులు లభించాయి. ప్రభుత్వ వ్యవస్థలకు అవసరమైన ఏఐ, ఎంఎల్ పరిష్కారాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
కల్పతరు	14.05	24.30	667.21	535.22
డీబీ కార్ప్★	80.84	117.86	559.45	589.85
ఐటీసీ హోటల్స్	133.71	87.16	815.54	705.84

★ మధ్యంతర డివిడెండ్ రూ.5

భారత్‌తో ఇండోనేషియా తరహా ఒప్పందం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- అటువంటి ఒప్పందమే వద్దు: జీటీఆర్ఐ



దిల్లీ: ఇండోనేషియాతో కుదిరిన ఒప్పందం తరహాలోనే భారత్‌తోనూ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా-ఇండోనేషియా వాణిజ్య ఒప్పందం ప్రకారం.. అమెరికా ఉత్పత్తులకు ఇండోనేషియా పూర్తి స్థాయిలో తలుపులు బార్లా తెరుస్తుంది. ఇండోనేషియా వస్తువులకు అమెరికాలో 19% టారిఫ్ వర్తిస్తుంది. 15 బిలియన్ డాలర్ల అమెరికా ఇంధనాన్ని, 4.5 బి.డాలర్ల వ్యవసాయ ఉత్పత్తులను, 50 బోయింగ్ విమానాలను ఇండోనేషియా కొనుగోలు చేస్తుంది. 'భారత్‌లోనూ మా వస్తువులకు తలుపులు తెరచుకుంటాయి. ఈ దేశాలకు ఇది వరకు మా వాళ్లు వెళ్లలేకపోయేవారు. ఇపుడు నేను విధించిన టారిఫ్‌లతో, మావాళ్లు వెళ్లేలా చేస్తున్నా' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై మేధో సంస్థ జీటీఆర్ఐ స్పందిస్తూ 'భారత్ కనుక అటువంటి ఒప్పందాన్ని అంగీకరిస్తే దేశీయ రంగాలకు ఇబ్బందే. ముఖ్యంగా వ్యవసాయ, డెయిరీ రంగాలకు ప్రమాదం. ప్రతిఫలంగా మనకు దక్కేది చాలా తక్కువ. భారత టారిఫ్‌లను తొలగించే, పరస్పర ప్రయోజనాల్లేని ప్రతికూల ఒప్పందం చేసుకోవడం కంటే.. ఎటువంటి ఒప్పందమూ లేకపోవడమే మంచిద'ని పేర్కొంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై వాషింగ్టన్‌లో భారత బృందం అయిదో దశ చర్చలను నిర్వహిస్తోంది.

బయోకాన్ నుంచి త్వరలో స్థూలకాయం మందు

ఈనాడు, హైదరాబాద్: స్థూలకాయ చికిత్సలో వినియోగించే వెగోవీ బ్రాండ్‌కు జనరిక్ ఔషధమైన సెమాగ్లుటైడ్‌ను విడుదల చేయడానికి దేశీయ ఫార్మా కంపెనీ బయోకాన్ సిద్ధమవుతోంది. మనదేశంతో పాటు కెనడాలో ఈ జనరిక్ ఔషధాన్ని వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో తీసుకురానుందని సమాచారం.



బహుళ జాతి ఫార్మా కంపెనీలైన నొవో నార్డిస్క్, ఎలీ లిల్లీ స్థూలకాలం ఔషధాల మార్కెట్లో ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ సంస్థలు ఇటీవల మనదేశంలోనూ ఈ విభాగానికి చెందిన మందులను విడుదల చేశాయి. 'వెగోవీ' బ్రాండ్‌ను నొవో నార్డిస్క్ గత నెలలోనే మనదేశంలో అందుబాటులోకి తెచ్చింది. అంతకుముందే ఎలీ లిల్లీ 'మౌంజారో' బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ మందుల ధరలు బాగా ఎక్కువగా ఉన్నందున, తక్కువ ధరలో లభించే జనరిక్ ఔషధాలను తీసుకువచ్చేందుకు దేశీయ ఫార్మా కంపెనీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధానికి మనదేశంలో అనుమతి తీసుకోవడం కోసం బయోకాన్ త్వరలో సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్)కు దరఖాస్తు చేయనుందని తెలుస్తోంది. బ్రెజిల్, మెక్సికో, లాటిన్ అమెరికా దేశాల్లో స్థానిక కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని, ఈ మందును అక్కడా విడుదల చేయాలనే ఆలోచన బయోకాన్‌కు ఉంది. జనరిక్ ఔషధాల రాకతో స్థూలకాయం మందుల మార్కెట్ ఇంకా విస్తరిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

హరిత ఇంధనానికి నిధుల ఉత్తేజం



- ఎన్‌టీపీసీ పెట్టుబడుల పరిమితి రూ.7,500 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు
- 2032 కల్లా 60 గిగావాట్ల సామర్థ్యం కోసం
- ఎన్ఎల్‌సీఐఎల్ రూ.7,000 కోట్ల పెట్టుబడులకు అనుమతి
- మంత్రివర్గ నిర్ణయాలు

దిల్లీ: దేశంలో హరిత ఇంధన సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ పెట్టుబడుల పరిమితిని రూ.7,500 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు పెంచింది. మరో ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సీఐఎల్‌కు రూ.7,000 కోట్లను పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది.

✦ 'మహారత్న' కంపెనీ ఎన్‌టీపీసీకి ప్రస్తుతం రూ.7,500 కోట్ల వరకే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికి అనుమతులున్నాయి. 2032 కల్లా 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడానికి, తాజాగా సవరించిన పెట్టుబడుల పరిమితి దోహదం చేస్తుంది. ఎన్‌టీపీసీ తన అనుబంధ కంపెనీలైన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ (ఎన్‌జీఈఎల్)లో పెట్టుబడులు పెడుతుంది. ఎన్‌జీఈఎల్ సైతం ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ, దాని ఇతర సంయుక్త సంస్థ (జేవీ)లు, అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది.

✦ ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) తన పూర్తి స్థాయి అనుబంధ కంపెనీ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యూవబుల్స్‌లో రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అనుమతులు దక్కాయి. ఈ అనుబంధ కంపెనీ నేరుగా లేదా సంయుక్త సంస్థల ద్వారా.. ముందస్తు అనుమతులు లేకుండానే వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టొచ్చు.

ఈ నిర్ణయాలను ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) సమావేశంలో తీసుకున్నారు. 2030 కల్లా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 500 మెగావాట్లకు చేర్చాలని మన దేశం లక్ష్యంగా పెట్టుకున్న విషయం విదితమే.

5.5 లక్షల మంది సీఎస్‌సీ నిర్వాహకులకు

ఏఐలో ఉచిత శిక్షణ

దిల్లీ: గ్రామాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) నడుపుతున్న 5.5 లక్షల మందికి పైగా ఔత్సాహికుల(వీఎల్ఈ)కు కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతపై ప్రభుత్వం ఉచితంగా శిక్షణ అందించనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇండియాఏఐ మిషన్ కింద మొత్తం 10 లక్షల మందికి ఏఐ శిక్షణ ఇవ్వాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. అందులో వీఎల్ఈలకు ప్రాధాన్యమివ్వనున్నట్లు సీఎస్‌సీ ఎస్‌పీవీ 10వ వార్షికోత్సవంలో మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆధారిత సేవా కేంద్రాలను సీఎస్‌సీలతో అనుసంధానించాలన్న వీఎల్ఈల డిమాండ్‌ను మంత్రి వైష్ణవ్ దృష్టికి ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారు.

సెన్సెక్స్ ▲ 64 — 82634

నిఫ్టీ ▲ 16 — 25212

నష్టాల నుంచి స్వల్ప లాభాల్లోకి

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,858.15 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,223.55 కోట్లు



సమీక్ష

సూచీలు బుధవారం ఆరంభం నాటి నష్టాల నుంచి కోలుకుని, స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా బలహీన మార్కెట్ ధోరణులు, టారిఫ్ అనిశ్చితుల నడుమ మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించారు. దీంతో సూచీలు పరిమిత శ్రేణికి పరిమితమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు తగ్గి 85.92 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.26% తగ్గి 68.55 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.85,000 కోట్లు పెరిగి, రూ.461.18 లక్షల కోట్ల (5.37 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 82,534.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,570.91) ప్రతికూలంగా ప్రారంభమైంది. 82,342.94 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ ఒక దశలో 82,784.75 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 63.57 పాయింట్ల లాభంతో 82,634.48 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 16.25 పాయింట్లు పెరిగి 25,212.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,255.30-25,121.05 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభపడ్డాయి. ఎం అండ్ ఎం 2.10%, టెక్ మహీంద్రా 1.94%, ఎస్‌బీఐ 1.81%, ఇన్ఫోసిస్ 1.50%, అదానీ పోర్ట్స్ 0.78%, ఏషియన్ పెయింట్స్ 0.73%, ఐటీసీ 0.54% చొప్పున పెరిగాయి. ఎటెర్నల్ 1.58%, సన్ ఫార్మా 1.55%, టాటా స్టీల్ 1.10%, టాటా మోటార్స్ 0.87%, బజాజ్ ఫైనాన్స్ 0.71%, బీఈఎల్ 0.67%, టీసీఎస్ 0.63%, పవర్‌గ్రిడ్ 0.50% నష్టపోయాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ, ఐటీ, సేవలు, స్థిరాస్తి, టెక్ రంగాలు రాణించాయి. కమొడిటీస్, భారీ యంత్ర పరికరాలు, లోహ, పారిశ్రామిక రంగాలు డీలా పడ్డాయి.

✦ హెచ్‌డీఎఫ్‌సీ అనుబంధ సంస్థ **హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్** ఏప్రిల్-జూన్ నికర లాభం సుమారు 4% తగ్గడంతో, షేరు బీఎస్ఈలో 3.13 శాతం తగ్గి రూ.814.75 వద్ద ముగిసింది.

నేటి బోర్డు సమావేశాలు: **యాక్సిస్ బ్యాంక్, విప్రో, హెరిటేజ్ ఫుడ్స్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఇండియన్ హోటల్స్ కంపెనీ, పాలీక్యాబ్ ఇండియా, టాటా కమ్యూనికేషన్స్, సియెట్, సౌత్ ఇండియన్ బ్యాంక్, రూట్ మొబైల్, షాపర్స్ స్టాప్, మహీంద్రా లాజిస్టిక్స్**

సంక్షిప్తంగా

✦ ఈ నెల 31 నుంచి మూడేళ్ల పాటు క్లియరింగ్ కార్పొరేషన్‌గా కొనసాగేందుకు **మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ క్లియరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్** (ఎంసీఎక్స్‌సీసీఎల్)కు గుర్తింపును మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునరుద్ధరించింది.

✦ **ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్ లిమిటెడ్** ఐపీఓ ద్వారా నిధులను సమీకరించడానికి సెబీ అనుమతి కోరుతూ, ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ మార్గంలో దాఖలు చేసింది. మరో సంస్థ **గాడియమ్ ఐవీఎఫ్ అండ్ వుమెన్ హెల్త్** కూడా త్వరలోనే ఐపీఓ ముసాయిదా పత్రాలు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

✦ **యాంథమ్ బయోసైన్సెస్** రూ.3,395 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 63.86 రెట్ల స్పందన లభించింది. 4,40,70,682 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 281,44,34,470 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. క్యూఐబీ విభాగంలో 182.65 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 42.35 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 5.64 రెట్ల స్పందన దక్కింది.

ఈనాడు ప్రతిభ

గురువారం, జులై 17, 2025

17 ◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

1. కింది వాటిలో ఫారడే నియమాన్ని గుర్తించండి.
1) $\varepsilon = \frac{\Delta p}{\Delta t}$ 2) $\varepsilon = \frac{\Delta \phi}{\Delta t}$ 3) $\varepsilon = \frac{\Delta t}{\Delta p}$ 4) $\varepsilon = \frac{\Delta t}{\Delta \phi}$

2. తీగచుట్టలో అభివాహ మార్పును వ్యతిరేకించే దిశలో, ప్రేరణ విద్యుత్తు ప్రవాహం ఉంటుందని తెలిపే నియమం?
1) ఫారడే నియమం
2) మాక్స్‌వెల్ కార్క్ - స్క్రూ నిబంధన
3) ఆంపియర్ నిబంధన 4) లెంజ్ నియమం

3. జనరేటర్‌లో ఏ శక్తి ఏ శక్తిగా మార్పు చెందు తుంది?
1) విద్యుత్తు శక్తి - యాంత్రిక శక్తి
2) యాంత్రిక శక్తి - విద్యుత్తు శక్తి
3) విద్యుత్తు శక్తి - ఉష్ణ శక్తి
4) ఉష్ణ శక్తి - విద్యుత్తు శక్తి

4. కింది వాటిలో ఫారడే నియమం ఆధారంగా పని చేసే పరికరాన్ని గుర్తించండి.
1) ఏటీఎం కార్డు 2) టేప్‌రికార్డర్
3) ఇండక్షన్ స్టవ్ 4) పైవన్నీ

5. అయస్కాంత క్షేత్ర దిశకు సమాంతరంగా కదిలే ఆవేశంపై పనిచేసే అయస్కాంత క్షేత్రబలం?
1) F = qVB 2) F = BIL
3) F = 0 4) F = qVBsinθ

6. AC జనరేటర్‌కు, DC జనరేటర్ మధ్య తేడాను గుర్తించండి.
1) స్లిప్ రింగ్స్ 2) కార్బన్ బ్రష్‌లు
3) ఆర్మేచర్ 4) కమ్యూటేటర్

సమాధానాలు: 1-2; 2-4; 3-2; 4-4; 5-3; 6-4.



సాగు ప్రగతికి సమగ్ర వ్యూహాలు!



జనరల్ స్టడీస్ ఇండియన్ ఎకానమీ

దేశంలో వ్యవసాయ రంగ ప్రగతికి, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం రూపొందించిన సమగ్ర వ్యూహాలే జాతీయ వ్యవసాయ విధానాలు. వ్యవసాయ ఉత్పాదకతను అధికం చేయడం, ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, నీటివనరులను సమర్థంగా ఉపయోగించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం తదితర లక్ష్యాలతో కేంద్రం వ్యవసాయ విధానాలను ప్రకటించింది. దాంతోపాటు ఇటీవల అనేక నూతన వ్యవసాయ వ్యూహాలనూ సిద్ధం చేసింది. పోటీపరీక్షల అభ్యర్థులకు వీటిపై స్థూల అవగాహన ఉండాలి. ఆహారభద్రత, రైతు సంక్షేమం, సాధికారత, స్థిరమైన వృద్ధి, సమతౌల్యత తదితర లక్ష్యాలతో తీసుకొచ్చిన ఆ విధానాల్లోని ముఖ్యాంశాలను అర్థం చేసుకోవాలి.

భారతదేశంలో వ్యవసాయ విధానాలు

(ఆవశ్యకత–ఇటీవల వ్యవసాయ రంగంలో రూపొందించిన కొత్త విధానాలు/ కార్యక్రమాలు)

భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కాలానుగుణంగా వ్యవసాయ విధానాలను రూపొందించింది. రైతులు, వినియోగదారులతో పాటు మొత్తం ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఇవి ఉన్నాయి. నిర్దిష్ట కాలపరిమితిలో పంటల ఉత్పాదకతను పెంచడం, రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆహార భద్రతను నిర్ధారించడం, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం తదితరాలపై ఈ విధానాలు దృష్టి పెడతాయి.

ఆవశ్యకత: ◆ వ్యవసాయ రంగ సమగ్ర అభివృద్ధి కోసం భారత వ్యవసాయ విధానాలు అవసరం. ◆ వనరుల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం, మార్కెట్ సౌలభ్యం మొదలైన కీలక అంశాలను పరిష్కరించడం ఈ వ్యవసాయ విధానాల లక్ష్యం. ◆ స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడం ద్వారా వ్యవసాయ విధానం ప్రస్తుత, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా బలమైన స్థితిస్థాపక వ్యవసాయ రంగాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తుంది.

లక్ష్యాలు: ◆ మేలురకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, నీటిపారుదల ప్రాజెక్టులు తదితర సౌలభ్యాలతో ఉత్పాదకతను పెంచడం. ◆ చిన్న, సన్నకారు కమతాల ఉత్పాదకతను మెరుగుపరచడం ద్వారా ఒక హెక్టారుకు విలువ ఆధారిత ఉత్పత్తిని పెంచడం. ◆ భూ సంస్కరణల ద్వారా మధ్యవర్తులను రద్దు చేయడం, పేద, సన్నకారు రైతులకు సంస్థాగత రుణ సహకారాన్ని విస్తరించడం. ◆ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం అంటే వ్యవసాయ కార్యకలాపాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం, మేలురకం విత్తనాలు, ఎరువులు, మెరుగైన వ్యవసాయ పద్ధతులను వర్తింపజేయడం. ◆ పరిశోధనా సంస్థలు, రైతుల మధ్య సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచడం ద్వారా వ్యవసాయ పరిశోధన, శిక్షణ సౌకర్యాలు ప్రోత్సహించడం, దీనికి సంబంధించిన పరిశోధనా ప్రయోజనాలు రైతుల్లో వ్యాప్తి చేయడం. ◆ సహకార సంఘాలు, స్వయంసహాయక సంస్థలు స్వతంత్రంగా పనిచేయడానికి వీలుగా అధికారపరమైన అడ్డంకులను తొలగించడం.

జాతీయ వ్యవసాయ విధానాలు

మొదటి జాతీయ వ్యవసాయ విధానాన్ని 1993లో చేపట్టారు.

ముఖ్యాంశాలు: ◆ వ్యవసాయ ఉత్పత్తి వార్షిక వృద్ధి రేటు 2.6 నుంచి 3.5 శాతానికి పెంచడం. ◆ వ్యవసాయ రంగంలో మార్కెటింగ్ సౌకర్యాల కల్పన. ◆ సహకార సంఘాలను బలోపేతం చేయడం. ◆ ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం.

జాతీయ వ్యవసాయ విధానం-2000

2000, జులై 28న ప్రభుత్వం జాతీయ వ్యవసాయ విధానాన్ని బహిరంగంగా ప్రకటించింది. వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించడంతోపాటు ప్రైవేటు పెట్టుబడులను పెంచడం ద్వారా 4% కంటే ఎక్కువ వృద్ధి లక్ష్యంగా చేసుకుని ఈ విధానాన్ని ప్రకటించారు. డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా ఈ విధానం రూపొందింది.

ముఖ్యాంశాలు: వ్యవసాయ రంగంలో 4% కంటే ఎక్కువ వార్షిక వృద్ధి రేటు సాధించడం. ◆ అన్ని రాష్ట్రాల్లో కమతాల సమీకరణ చేపట్టడం. ◆ వ్యవసాయ రంగంలో పరిశ్రమలను ప్రోత్సహించడం. ◆ నేల, నీరు, జీవవైవిధ్య పరిరక్షణకు ఏర్పాట్లు చేస్తూ వనరులను సమర్థ ఉపయోగంతో వృద్ధి సాధించడం. సమానత్వంతో కూడిన వృద్ధి సాధించడం, దీని ప్రభావం ప్రాంతాలు, వివిధ వర్గాల రైతుల్లో విస్తృతం చేయడం. ◆ బయోటెక్నాలజీని ప్రోత్సహించడం. ◆ భూమి రికార్డులను మెరుగుపరచడం, ఆధునీకరించడం. ◆ నూతన వంగడాల సృష్టికి ప్రాధాన్యం. ◆ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల నుంచి గరిష్ఠ ప్రయోజనాలు పొందడం. ◆ సాంకేతికంగా, పర్యావరణ పరంగా, ఆర్థికంగా స్థిరమైన వృద్ధిని సాధించడం.

రైతుల కోసం జాతీయ విధానం-2007

డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతుల సంఘం సిఫార్సుల మేరకు 2007లో ఈ విధానం (నేషనల్ పాలసీ ఫర్ ఫార్మర్స్) రూపొందింది. రైతుల సంక్షేమం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి రూపొందించిన విధానమిది.

ముఖ్యాంశాలు: ◆ రైతుల ఆదాయాన్ని పెంచి, వారికి మెరుగైన మార్కెట్ సౌకర్యాలను కల్పించడం, పంటల బీమా పథకాలను బలోపేతం చేయడం. ◆ రైతుల పంట ఉత్పత్తి, ఉత్పాదకాలతోపాటు వారి ఆర్థిక సంక్షేమంపై దృష్టి. ◆ వ్యవసాయ సంక్షోభాలను పరిష్కరించడం, రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభాలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలను సిఫార్సు చేయడం. ◆ రైతులకు బయోటెక్నాలజీ, ఇన్‌పుట్ మిషన్ టెక్నాలజీ ఉపయోగాలపై దృష్టి పెట్టేలా చూడటం. ◆ మద్దతు ధర, సాంఘిక భద్రత అందించడం.

ఇటీవల వ్యవసాయ రంగంలో రూపొందించిన కొత్త విధాన కార్యక్రమాలు

వ్యవసాయం రాష్ట్ర అంశం కావడంతో భారత ప్రభుత్వం తగిన విధాన చర్యలతోపాటు వివిధ పథకాలు, కార్యక్రమాల కింద బడ్జెట్ కేటాయింపులు చేస్తూ రాష్ట్రాల ప్రయత్నాలకు మద్దతు ఇస్తోంది.

క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్ (సీపీపీ): దీన్ని కేంద్ర ప్రభుత్వం 2024, ఆగస్టులో ప్రకటించింది. వ్యాధిరహిత సామగ్రి అందించడం ద్వారా ఉద్యాన పంటల నాణ్యత, ఉత్పత్తిని పెంచడం దీని లక్ష్యం. ఇందుకు కేంద్రం రూ.1765.67 కోట్లు కేటాయించింది.

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్: 2024, సెప్టెంబరులో కేంద్రం ప్రకటించింది. దీనిద్వారా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సృష్టించింది. డిజిటల్ జనరల్ క్రాప్ట్ ఎస్టిమేషన్ సర్వే(డీజీసీఈఎస్)ను అమలుచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాపరిశోధనా సంస్థల ద్వారా అమలయ్యే డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి ఈ మిషన్‌ను గొడుగు పథకంగా రూపొందించారు. ఇందుకు రూ.2,817 కోట్లు కేటాయించారు.

వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి పథకం: దేశంలో వ్యవసాయ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, బలోపేతం చేయడానికి, అర్హత ఉన్న ప్రాజెక్టుల పరిధిని విస్తరించడం ద్వారా రైతులకు మద్దతు ఇవ్వడానికి ఈ నిధిని ఏర్పాటు చేసింది.

జాతీయ వంటనూనెల మిషన్: 2024, అక్టోబరులో ప్రారంభించారు. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తి పెంచడం, తినదగిన నూనెల విషయంలో స్వావలంబన సాధించడం దీని లక్ష్యం. ఈ మిషన్ 2024-25 నుంచి 2030-31 వరకు ఏడేళ్లపాటు అమలవుతుంది.

జాతీయ సహజ వ్యవసాయ మిషన్: 2024, అక్టోబరులో ఒక స్వతంత్ర కేంద్ర ప్రయోజన పథకంగా దీన్ని ఆమోదించారు.



ఈ పథకం వ్యయం రూ.2,481 కోట్లు. ఇందులో కేంద్రం రూ.1,584 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897 కోట్లు వ్యయం చేశాయి.

అగ్రిసూర్ స్టార్టప్‌లు: వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి, కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి లేదా వ్యాపార నమూనాల సృష్టికి ప్రయత్నించే కొత్త సంస్థలు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి, రైతులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి లేదా వ్యవసాయంలో కొత్త పద్ధతులు ఉపయోగించడానికి అవకాశాలుంటాయి.

కృషి డీఎస్ఎస్ (డెసిషన్ సపోర్ట్ సిస్టమ్స్): వ్యవసాయ పురోగతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన జియో స్పెషియల్ ప్లాట్‌ఫామ్. వాతావరణం, నేల ఆరోగ్యం, ఇతర ముఖ్యమైన సమాచారంపై రియల్‌టైం డేటా అందిస్తుంది. రైతులకు, వివిధ రూపకర్తలకు సహాయపడుతుంది.

కృషి నివేష్ పోర్టల్: వ్యవసాయంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి, సులభతరం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన ఆన్‌లైన్ వేదిక. రైతులు, పెట్టుబడిదారులు, పరిశ్రమలు, ఇతర వాటాదారులకు ఒకేచోట వ్యవసాయ సంబంధిత సమాచారం, ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలు కల్పిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి.) ఎవరు నిర్ణయిస్తారు?
1) వ్యవసాయ మంత్రిత్వ శాఖ
2) వ్యవసాయ వ్యయం, ధరల కమిషన్
3) రైతు సహకార సంఘం 4) ఏదీకాదు

2. 'హరిత విప్లవం వాణిజ్య పంటల పక్షపాతి' అని ఎవరు వ్యాఖ్యానించారు?
1) ప్రొఫెసర్ ధర్మ్ నారాయణ్
2) ఎం.ఎస్.స్వామినాథన్
3) విలియం ఎస్ గాండ్ 4) బి.శివరామన్

3. రెండో హరిత విప్లవాన్ని ప్రారంభించిన ప్రధాని?
1) ఇందిరా గాంధీ 2) మన్మోహన్ సింగ్
3) లాల్‌బహదూర్ శాస్త్రి 4) పి.వి.నరసింహారావు

4. ఎవర్‌గ్రీన్ రివల్యూషన్‌కు శ్రీకారం చుట్టినవారు?
1) డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్
2) డాక్టర్ సి.సుబ్రమణ్యం
3) నార్మన్ బోర్లాగ్
4) ఫోర్డ్ ఫౌండేషన్ కమిటీ

సమాధానాలు
1–2; 2–1; 3–2; 4–1.



రచయిత: వమరవల్లి రమణయ్య

గిరిజన పథకాల పటిష్ఠ అమలుకు ఆదికర్మ యోగి

ఉత్తమ ఆహారం లభించే వంద దేశాల జాబితాలో భారత్ పన్నెండో స్థానంలో నిలిచింది. దేశంలో తొలి సౌర బస్‌స్టేషన్ సూరత్‌లో ఏర్పాటైంది. రైల్వే ప్రయాణికులకు అన్నిరకాల సౌకర్యాలను ఒకే చోట అందించే సూపర్‌యాప్ అందుబాటులోకి వచ్చింది. బౌద్ధులు, సిక్కుల తీర్థయాత్రలకు నగదు ఇచ్చే పథకాలను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు ముప్పై అయిదు శాతం రిజర్వేషన్లను బిహార్ ప్రభుత్వం ప్రకటించింది. అఫ్గాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వాన్ని రష్యా అధికారికంగా గుర్తించింది. యూరో ఉమ్మడి కరెన్సీ జోన్‌లో బల్గేరియా చేరింది. ఈ విధంగా దేశీయ, అంతర్జాతీయ ముఖ్య వార్తాంశాలు, ప్రధాన పరిణామాలు, నూతన పథకాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు విడుదలయ్యే సర్వే నివేదికలు, వైజ్ఞానిక ఆవిష్కరణలు, ప్రపంచస్థాయి సదస్సులు, నాయకత్వ మార్పులు, వార్తల్లో నిలిచిన ఘటనలతోపాటు ప్రధాని మోదీ ఇటీవలి విదేశీ పర్యటనలు, ఆ దేశాల్లో ఆయన అందుకున్న అవార్డులు, అందజేసిన పాలకులను గుర్తుంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. బ్యాంకాక్ వేదికగా జరిగిన 24వ అంతర్జాతీయ మానసిక ఆరోగ్య సదస్సులో, డబ్ల్యూహెచ్ఓ మెంటల్ హెల్త్ 2025–అవార్డు స్వీకరించిన 'సైమావాజేద్' ఏ దేశానికి చెందినవారు?
1) పాకిస్థాన్ 2) సింగపూర్
3) ఇండియా 4) బంగ్లాదేశ్

2. క్రొయేషియాలో జరిగిన సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ర్యాపిడ్ టైటిల్ ఎవరు నెగ్గారు?
1) వెస్లే 2) గుకేష్
3) శ్రీహరి 4) ప్రజ్ఞానంద

3. న్యూయార్క్ టైమ్స్ ప్రకటించిన 21వ శతాబ్దంలోని టాప్–100 చిత్రాల్లో తొలిస్థానం దక్కించుకున్న సినిమా ఏది?
1) మూన్‌లైట్ 2) డార్క్ నైట్
3) వాల్ - ఈ 4) పారాసైట్

4. ఐసీసీ సీఈఓగా ఎవరు నియమితులయ్యారు?
1) సంజీవ్ మిశ్రా 2) సంజోగ్ గుప్తా
3) అరవింద్ మిశ్రా 4) లలిత్ దాస్

5. సిలికాన్ లేకుండా పనిచేసే మొదటి కంప్యూటర్‌ను ఏ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు?
1) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
2) పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ (అమెరికా)
3) మాంచెస్టర్ విశ్వవిద్యాలయం (బ్రిటన్)
4) వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా)

6. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్ వేదికగా జరిగిన 20వ జాతీయ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏడు స్వర్ణాలతో తొలి స్థానంలో నిలిచిన రాష్ట్రం?
1) ఉత్తరాఖండ్ 2) కేరళ
3) మహారాష్ట్ర 4) తెలంగాణ

7. దేశంలో మొదటిసారి సౌర బస్‌స్టేషన్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) అహ్మదాబాద్ 2) సూరత్
3) ముంబయి 4) చెన్నై
నోట్: జర్మన్ సంస్థ సహకారంతో సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ దీన్ని నిర్మించింది.

8. అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశంగా ఏది నిలిచింది?
1) అమెరికా 2) జర్మనీ
3) జపాన్ 4) రష్యా

9. క్రొయేషియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ప్రఖ్యాత ప్రైవేట్ ట్రావెల్ గైడ్ సంస్థ 'టేస్ట్ అట్లాస్' విడుదల చేసిన జాబితాలో ఉత్తమ ఆహారం లభించే 100 దేశాల జాబితాలో భారత్‌కు ఏ స్థానం లభించింది?
1) 18వ 2) 16వ
3) 12వ 4) 6వ
నోట్: 1) గ్రీస్ తొలి స్థానంలో నిలిచింది.
2) ఉత్తమ ఆహారం లభించే నగరాల జాబితాలో ముంబయి 5వ, హైదరాబాద్ 50వ స్థానాల్లో నిలిచాయి. 3) నేపుల్స్ (ఇటలీ) నగరం తొలి స్థానంలో ఉంది. 4) మిలాన్, బొలోగ్నా, ఫ్లోరెన్స్ (ఇటలీ) నగరాలు 2, 3, 4 స్థానాల్లో ఉన్నాయి.

10. ప్రయాణికులకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో సూపర్ యాప్‌ని భారత రైల్వే ప్రారంభించింది. దాని పేరేంటి?
1) రైల్‌రథ్ 2) రైల్‌వన్
3) రైల్‌నిరథ్ 4) రైల్ పవర్

11. భారత నావికాదళంలో ఫైటర్ పైలట్‌గా శిక్షణ పొందిన తొలి మహిళగా ఎవరు నిలిచారు?
1) ఆస్థా పూనియా 2) అన్నె దివ్య
3) భావనా కాంత్ 4) అమీ జాన్సన్

12. క్వాడ్ (అమెరికా, ఇండియా, జపాన్, ఆస్ట్రేలియా) దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం – 2025 ఎక్కడ జరిగింది?
1) న్యూదిల్లీ 2) వాషింగ్టన్
3) న్యూయార్క్ 4) ముంబయి
నోట్: 1) క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్)

13. 'ఆదికర్మయోగి' కార్యక్రమం ఉద్దేశం?
1) గిరిజన ప్రజలకు ఇళ్లు నిర్మించే కేంద్రం కార్యక్రమం.
2) గిరిజన సంక్షేమ పథకాలను మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ అందించే కేంద్ర కార్యక్రమం.
3) ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు శిక్షణ ఇవ్వడానికి.
4) గిరిజన ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు కల్పించడానికి.

14. 2025, జులై 2 నుంచి 9 మధ్య తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించిన దేశాల క్రమాన్ని గుర్తించండి?
1) ఘనా, అర్జెంటీనా, ట్రినిడాడ్-టోబాగో, బ్రెజిల్, నమీబియా
2) ఘనా, ట్రినిడాడ్-టోబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా
3) ఘనా, ట్రినిడాడ్-టోబాగో, బ్రెజిల్, అర్జెంటీనా, నమీబియా
4) ఘనా, ట్రినిడాడ్-టోబాగో, అర్జెంటీనా, నమీబియా, బ్రెజిల్



15. 17వ బ్రిక్స్ సమావేశం ఏ దేశంలో జరిగింది?
1) బ్రెజిల్ 2) చైనా
3) రష్యా 4) ఇండియా
నోట్: థీమ్: స్ట్రెంథనింగ్ గ్లోబల్ సౌత్ కోఆపరేషన్ ఫర్ మోర్ ఇన్‌క్లూసివ్ అండ్ సస్టైనబుల్ గవర్నెన్స్

16. కింది వాటిని జతపరచండి.

దేశం	ప్రధాని/అధ్యక్షుడు
1) ఘనా	ఎ) క్రిస్టీన్ కంగాలూ
2) ట్రినిడాడ్-టోబాగో	బి) జాన్ మహామా
3) అర్జెంటీనా	సి) లూలా డసిల్వా
4) బ్రెజిల్	డి) జేవియర్ మిలేయ్
5) నమీబియా	ఇ) నెటుంబో నండి

1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
2) 1-ఇ, 2-డి, 3-సి, 4-బి, 5-ఎ
3) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి, 5-ఇ
4) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి, 5-ఇ

17. కింది వాటిలో సరైంది?



ఎ) మోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్'ను ఇటీవల ఇచ్చారు.
బి) మోదీకి ట్రినిడాడ్-టోబాగో దేశం ఆ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో' ఇటీవల ప్రకటించింది.
సి) నమీబియా ప్రభుత్వం మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్'ను ప్రకటించింది.
డి) ఘనా ప్రభుత్వం మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' ఇచ్చింది.
ఇ) ఇప్పటివరకు మోదీ 27 అంతర్జాతీయ పురస్కారాలు పొందారు.
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి, ఇ
3) బి, సి, డి 4) ఎ, సి, డి

18. ప్రపంచంలో అత్యంత రద్దీ విమానాశ్రయాల జాబితా 2025కి సంబంధించి సరికానిది?
ఎ) అంతర్జాతీయ విమానాశ్రయాల మండలి ఈ జాబితాను విడుదల చేసింది.
బి) ఈ జాబితా ప్రకారం ప్రపంచంలో అట్లాంటా విమానాశ్రయం 10.80 కోట్ల మంది ప్రయాణికులతో అగ్రస్థానంలో ఉంది.
సి) అట్లాంటా విమానాశ్రయం ఇంగ్లాండ్‌లో ఉంది.
డి) దుబాయ్ 9.23 కోట్ల ప్రయాణికులతో రెండో స్థానంలో ఉంది.
ఇ) ఈ జాబితాలో భారత్ నుంచి దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 7.78 కోట్ల ప్రయాణికులతో 18వ స్థానంలో ఉంది.
1) ఎ, బి, సి 2) సి, ఇ
3) బి, సి, డి 4) ఎ, సి, డి
నోట్: 1) అట్లాంటా విమానాశ్రయం అమెరికాలో ఉంది.
2) ఈ జాబితాలో దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 9వ స్థానంలో ఉంది.

19. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35% రిజర్వేషన్ కల్పిస్తామని ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది?
1) బిహార్ 2) కర్ణాటక
3) కేరళ 4) గోవా
నోట్: మధ్యప్రదేశ్ ప్రభుత్వం 2024లో మహిళలకు 35% రిజర్వేషన్లు ప్రకటించింది.

20. ఏ దేశ తొలి మహిళా అధ్యక్షురాలిగా జెన్నిఫర్ సైమన్స్ నియమితులయ్యారు?



1) కొలంబియా
2) ఉరుగ్వే
3) పరాగ్వే
4) సురినామ్

21. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బౌద్ధ, సిక్కు భక్తుల కోసం 'బౌద్ధ తీర్థ్ దర్శన్ యోజన', 'పంచ్ తఖ్త్ యాత్ర యోజన' అనే రెండు తీర్థయాత్ర సహాయ పథకాలను ప్రకటించారు. ఈ రెండు పథకాల కింద ప్రతి యాత్రికుడికి కనీసం ఎంత సహాయం అందుతుంది?
1) రూ.లక్ష 2) రూ.50 వేలు
3) రూ.2 లక్షలు 4) రూ.10 వేలు

22. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నూతన సభ్య దేశాలుగా ఏ దేశాలు చేరాయి?
1) కొలంబియా, పరాగ్వే
2) కొలంబియా, ఉజ్బెకిస్థాన్
3) కొలంబియా, జింబాబ్వే
4) జింబాబ్వే, ఉజ్బెకిస్థాన్

23. యూరో జోన్‌లో కొత్తగా చేరిన దేశం?
1) బల్గేరియా 2) స్వీడన్
3) డెన్మార్క్ 4) ఇంగ్లాండ్
నోట్: యూరో జోన్‌లో 21వ దేశం బల్గేరియా.

24. 2025, జులైకు సంబంధించి ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ముకేశ్ అంబానీ ఏ స్థానంలో నిలిచారు?
1) 12వ 2) 16వ 3) 15వ 4) 13వ

25. ఆసియాలోనే అతి ఎక్కువ వయసున్న (100 సంవత్సరాలుపైగా) ఏనుగు 'వత్సల' ఇటీవల ఎక్కడ మృతి చెందింది?
1) పన్నా టైగర్ రిజర్వ్ (మధ్యప్రదేశ్)
2) నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ (ఆంధ్రప్రదేశ్)
3) జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వ్ (ఉత్తరాఖండ్)
4) కన్హా టైగర్ రిజర్వ్ (మధ్యప్రదేశ్)

26. భారతదేశ మొదటి జాతీయ ఆరోగ్య పరిశోధన బయోబ్యాంకును కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎక్కడ ప్రారంభించారు?
1) ముంబయి 2) న్యూదిల్లీ
3) చెన్నై 4) హైదరాబాద్

27. ఆసియా స్క్వాష్ డబుల్స్ ఛాంపియన్‌షిప్ 2025కి సంబంధించి సరైంది?
ఎ) ఆసియా స్క్వాష్ డబుల్స్ ఛాంపియన్‌షిప్-2025 మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగింది.
బి) పురుషుల డబుల్స్ విజేత అభయ్ సింగ్-సెంథిల్ కుమార్ (ఇండియా)
సి) మహిళల డబుల్స్ విజేత జోత్స్న చిన్నప్ప - అనహాత్ సింగ్ (ఇండియా)
డి) మిక్స్‌డ్ డబుల్స్ విజేత అనహాత్ సింగ్ - అభయ్ సింగ్ (ఇండియా)
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి

28. ముంబయి అంతర్జాతీయ చెస్ టోర్నీ విజేత ఎవరు?
1) ఎస్.ఆర్. శ్రీహరి 2) ప్రజ్ఞానంద
3) లలిత్ బాబు 4) గుకేశ్



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-4; 2-2; 3-4; 4-2; 5-2; 6-3; 7-2; 8-4; 9-3; 10-2; 11-1; 12-2; 13-2; 14-2; 15-1; 16-4; 17-2; 18-2; 19-1; 20-4; 21-4; 22-2; 23-1; 24-3; 25-1; 26-2; 27-1; 28-3.



ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. నానాటికీ తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రగతిలో ముందుకు దూసుకెళ్తోంది. దేశ ఆర్థిక వృద్ధికి ఊతంగా నిలిచే రంగాల్లో రవాణా రంగానిది ప్రముఖ స్థానం. భారత ప్రభుత్వం రోడ్డు, రైలు, జల, వాయు రంగాల్లో కావాల్సిన సదుపాయాలు కల్పిస్తోంది. బడ్జెట్‌లోనూ వీటికి తగిన ప్రాధాన్యతనిస్తూ, నిధులు కేటాయిస్తోంది. డిమాండ్‌కు అనుగుణంగా దేశంలో ప్రైవేట్-ప్రభుత్వ భాగస్వామ్యంతో విమానాశ్రయాలు నిర్మాణాలు చేపడుతోంది. పోటీపరీక్షార్థులు విమానరంగ చరిత్ర, అమలవుతున్న పథకాలు, తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

గగనతల వీధిలో ప్రగతి రథ ప్రయాణం!

వాయు రవాణా

దేశంలో రోడ్డు, రైలు రవాణాతో పాటు క్రమంగా వాయు రవాణాకు ప్రాధాన్యత పెరుగుతోంది. చదువు, ఉద్యోగం, పర్యటన, వ్యాపార అవసరాల కోసం విదేశీ ప్రయాణం చేసే వారి సంఖ్య ఎక్కువవుతోంది. మధ్యతరగతి వారి ఆదాయాల్లో పెరుగుదలతో విమానయానానికి ఆదరణ లభిస్తోంది. దీంతో విమానయాన రంగం దేశాభివృద్ధిలో ప్రధానపాత్ర పోషిస్తోంది.

భారత విమానరంగ చరిత్ర

1910లో పటియాల మహారాజు భూపేందర్ సింగ్ సొంత విమానాన్ని కొనుగోలు చేశారు.

✦ దేశంలో 1911 ఫిబ్రవరి 18న మొదటి వాణిజ్య విమాన రవాణా ప్రారంభమైంది. ఈ సర్వీసు అలహాబాద్ నుంచి నైనీ జంక్షన్ వరకు 6500 ఉత్తరాలను తీసుకెళ్లింది. ఇది ప్రపంచంలోనే మొదటి విమాన తపాల సేవా సర్వీసు.

✦ 1912లో కరాచీ - ఢిల్లీ మధ్య మొదటి దేశీయ ప్రయాణికుల విమాన సర్వీసు (బ్రిటిష్ ఇంపీరియల్ ఎయిర్‌వేస్ సంస్థ).

✦ 1915లో మొదటి భారతీయ విమాన సంస్థ టాటా సన్స్ లిమిటెడ్ కరాచీ, మద్రాస్‌ల మధ్య జంతువులను రవాణా చేసింది.

✦ 1920లో రాయల్ ఎయిర్‌ఫోర్స్ కరాచీ, బొంబాయి మధ్య పౌర విమానాశ్రయాల నిర్మాణాన్ని చేపట్టింది.

✦ 1927 - ప్రభుత్వ పౌర విమానయాన శాఖ ఏర్పాటు

✦ 1928లో దేశంలోనే మొదటి పౌర విమానాశ్రయాన్ని బొంబాయి సమీపంలోని జుహూ వద్ద నిర్మించారు. ఇది వైల్‌పార్లే ఫ్లైయింగ్ క్లబ్‌గా ప్రసిద్ధిగాంచింది.

✦ 1932లో టాటా సన్స్ లిమిటెడ్ సంస్థ శాఖగా టాటా ఎయిర్ లైసెన్స్ ప్రారంభమైంది. ఇదే తర్వాతి కాలంలో (1946లో) ఎయిర్ ఇండియాగా మారింది.

✦ 1940లో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL) ఏర్పాటైంది.

✦ నిజాం నవాబు, టాటాలు సంయుక్తంగా 1945లో దక్కన్ ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించారు.

✦ 1953లో ఎయిర్ కార్పొరేషన్స్ చట్టం పార్లమెంట్ ఆమోదం పొందింది. దీంతో 8 దేశీయ ప్రైవేట్ విమాన ప్రయాణ సంస్థలను జాతీయం చేశారు.

✦ జాతీయం చేసిన సంస్థలను కలిపి ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ అనే రెండు విమాన సంస్థలు ఏర్పాటయ్యాయి. విదేశీ ప్రయాణాల నిర్వహణ బాధ్యతను ఎయిర్ ఇండియా, దేశీయ విమాన ప్రయాణాల నిర్వహణ బాధ్యత ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ది.

✦ 1972లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (IAAI) ఏర్పాటవగా, 1986లో నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (NAAI) ఏర్పాటైంది. 1995లో ఈ రెండింటినీ విలీనం చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) గా ఏర్పాటు చేశారు.

✦ 1987లో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీని ఏర్పాటు చేశారు.

✦ 1991లో భారతీయ విమానరంగంపై ప్రభుత్వ క్రమబద్ధీకరణను తొలగించారు.

✦ ప్రైవేట్ రంగంలో మొదటి జాతీయ స్థాయి ఎయిర్‌లైన్స్ ఈస్ట్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్. దేశంలో ఇతర ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ జెట్ ఎయిర్‌వేస్, స్పైస్‌జెట్, ఇండిగో మొదలైనవి.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

e-GCA ప్రాజెక్టు

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కార్యకలాపాలను డిజిటలైజేషన్ చేయడానికి ఈ ప్రాజెక్టును 2019లో ప్రారంభించగా, జులై 2021 నాటికి ఇది పూర్తయింది. ఈ కార్యక్రమంతో 298 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. దీంతో నియంత్రణ సమ్మతి, పారదర్శకత, వ్యాపారం గణనీయంగా మెరుగుపడ్డాయి.

బయోమెట్రిక్ యాక్సెస్ కంట్రోల్

విమానాశ్రయ సిబ్బంది ప్రవేశానికి జాతీయ బయోమెట్రిక్ ఆధారిత వ్యవస్థ (ఏఈపీ)ను డిసెంబరు 2019లో ప్రవేశపెట్టారు.

e-BCAS

బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ అంతర్గత, బాహ్య ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి దీన్ని డిసెంబరు 2019లో ప్రారంభించారు. దీన్ని లైసెన్సులు జారీ చేయడానికి, భద్రత ఆడిట్‌లను నిర్వహించడానికి, కాగితరహిత పర్యావరణ వ్యవస్థలో భాగంగా సృష్టించారు. డిజిటల్ ఇండియాలో ఒక భాగమైన ఈ సాఫ్ట్‌వేర్‌ను NIC అభివృద్ధి చేసింది.

భారత విమానాశ్రయ ప్రాధికార సంస్థ

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ - 1994 ప్రకారం దేశంలో భారత విమానాశ్రయ ప్రాధికార సంస్థను 1995, ఏప్రిల్ 1న పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. దీని ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. ఇది మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యంలో ఉంది. దీనికి మినీరత్న హోదా ఉంది.

■ ఈ సంస్థను అంతర్జాతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (IAAI), జాతీయ విమానాశ్రయ ప్రాధికార సంస్థలను విలీనం చేసి ఏఏఐను ఏర్పాటు చేశారు. విమానాశ్రయాల స్థాపన, విమానయాన సమాచార కేంద్రాలు, పౌర విమాన కేంద్రాల నిర్వహణ, గగనతల రవాణా సేవలు తదితరాలు దీని విధులు.

ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ:

1953లో టాటా గ్రూప్ నుంచి ఎయిర్ ఇండియాను జాతీయం చేశారు. ప్రైవేటీకరణలో భాగంగా ఈ సంస్థను 2022 జనవరిలో తిరిగి టాటా గ్రూపునకే అమ్మేశారు. రుణభారం అధికమవడంతో ఈ అమ్మకం చేపట్టారు.

డిజియాత్ర

ముఖకవళికల గుర్తింపు సాంకేతికత ఆధారంగా విమానాశ్రయాల్లో తనిఖీ ప్రక్రియ సదుపాయం కల్పించారు. దీన్ని 2022లో ప్రారంభించారు. పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులకు టికెట్ గుర్తింపు ధ్రువీకరణ తనిఖీ లేకుండా కాగితరహిత కాంటాక్ట్‌లెస్ ప్రాసెసింగ్‌ను డిజియాత్రలో భాగంగా ఏర్పాటు చేశారు. మార్చి 2025 నాటికి 5.22 కోట్లకు పైగా ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఇది 24 ప్రధాన విమానాశ్రయాల్లో అందుబాటులోకి వచ్చింది.

ఉడాన్ (UDAN)

భారత ప్రభుత్వం జాతీయ పౌర విమానయాన విధానంలో భాగంగా 'ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్' (ఉడాన్)ను పథకాన్ని 2016లో ప్రారంభించింది. ప్రాంతీయ మార్గాల్లో సరసమైన, ఆర్థికంగా లాభదాయకమైన విమాన ప్రయాణ సౌకర్యం కల్పించడమే ఈ పథక ప్రధాన లక్ష్యం.

❖ ఈ పథకం ప్రకారం కొత్త మార్గాలు, కొత్త విమానాశ్రయాల కనెక్టివిటీని పెంచాలని పేర్కొన్నారు. దీనిలో భాగంగా 2014లో దేశంలో పనిచేస్తున్న విమానాశ్రయాల సంఖ్య 74 ఉండగా 2025 నాటికి ఆ సంఖ్య 160కి పెరిగింది. ఈ పథకం కారణంగా 625 మార్గాలు అందుబాటులోకి వచ్చాయి.

❖ విమానాశ్రయాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం రూ.4500 కోట్ల వ్యయానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

❖ ఈ పథకంలో భాగంగానే 50 విమానాశ్రయాల హెలిపోర్ట్‌లు, వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి కోసం వ్యయ ఆర్థిక కమిటీ (EFC) రూ.1000 కోట్లను ఆమోదించింది.

❖ 1.51 కోట్లకు పైగా ప్రయాణికులు ప్రాంతీయ కనెక్టివిటీ విమానాల్లో ప్రయాణించారు.

❖ ఈ పథకం ఈశాన్య భారతదేశం, కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలపై అధిక దృష్టిసారించి వాటి కనెక్టివిటీకి కృషి చేసింది.

713 Word of the Day

Outlaw

Telugu meaning: బందిపోటు, చట్టవిరుద్ధం

English meaning: The word outlaw (ఔట్లా) is a noun that refers to a person who has broken the law and is not protected by it; as a verb, it means to make something illegal.

Synonyms: Fugitive, Banish

Antonyms: Law-abiding citizen, Uphold

Usage: **1. (As a Noun):** In the Wild West, outlaws were hunted down and brought to justice.

2. (As a Verb): The government decided to outlaw single-use plastic bags to protect the environment.

Latest Updates

Apprentice Posts In AAI

Airports Authority of India-Mumbai has released a notification for the recruitment of Graduate, Diploma, ITI Apprentice posts on contract basis. The no.of posts is 34. Last date for submission of online applications is 31 July 2025.

Scientist Posts in ARCI

International Advanced Research Centre for Powder Metallurgy and New Materials (ARCI), Hyderabad is inviting applications for the Scientist vacancies on direct recruitment basis. The total no.of posts is 11. Last date for online application is 28 July 2025.

Indian Coast Guard Recruitment

The Indian Coast Guard, Ministry of Defence, invites online applications from dynamic and talented Indian male candidates for the recruitment of Assistant Commandants in General Duty and Technical branches for the 2027 batch. The total no.of posts is 170. Last date for online application is 23 July 2025.

Did You Apply..?

Today (July 17) is the last date for the following jobs/ Apprentice posts/ Admissions

☛ Telangana MHSRB Assistant Professor 2025 - 607 posts. ***Eligibility:*** MD/MS/DNB/DM/M.Ch

☛ 241 Group-'A&B' Jobs in UPSC. ***Eligibility:*** Degree, BE, PG.


☛ Assistant posts in IGRUA. ***Eligibility:*** Degree, Intermediate.

☛ Visiting Doctors posts in HAL. ***Eligibility:*** MBBS, PG Degree, Diploma (Pathology).

For more information and other notifications - scan QR code

అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం

జులై 17
చరిత్రలో ఈనాడు



ప్రపంచవ్యాప్తంగా న్యాయం, జవాబుదారీతనం, మానవ హక్కుల రక్షణను పెంపొందించే లక్ష్యంతో ఏటా జులై 17న 'అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం'గా (International Criminal Justice Day) నిర్వహిస్తారు. ప్రపంచ దేశాల మధ్య నిరాయుధీకరణను సాధించడం, వివిధ దేశాల మధ్య తలెత్తే సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడం, అంతర్జాతీయ సంబంధాలను పెంపొందించడం, మానవాళి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు వారి హక్కులను పరిరక్షించేందుకు వివిధ అంతర్జాతీయ సంస్థలను ఏర్పాటు చేశారు. ఇవి ప్రపంచ దేశాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయి. వాటిలో ఒక ప్రముఖ సంస్థే అంతర్జాతీయ నేర న్యాయస్థానం (International Criminal Court - ICC). దీని ఏర్పాటు, ప్రాముఖ్యాన్ని తెలియజేయడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ఐసీసీ అధికారాలు/ విధులు:

మానవ సమూహాల పట్ల ఘోరమైన నేరాలు, యుద్ధనేరాలపై విచారణ జరిపే అధికారం దీనికి ఉంది.

☛ హత్యలు, చిత్రహింసలు, అత్యాచారాలతో సహా మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడేవారు, దేశాధినేతలు మొదలు సామాన్య పౌరుల వరకు ఎవరిపైనైనా విచారణ జరిపే అధికారం దీనికి ఉంది.

☛ ఐసీసీ ఏర్పాటును సమర్థించిన దేశాల్లోని కోర్టులు విచారణ జరపలేని, తీవ్రనేరాలకు సంబంధించిన కేసులను దీనికి నివేదించొచ్చు. వాటిపై ఐసీసీ విచారణ చేపడుతుంది.

ముఖ్యాంశాలు:

ప్రస్తుతం ఐసీసీలో 125 సభ్యదేశాలు ఉన్నాయి. ఇందులో మన దేశానికి సభ్యత్వం లేదు.

❖ దీని ప్రధాన కార్యాలయం ది హేగ్ (నెదర్లాండ్స్)లో ఉంది.

❖ ప్రస్తుత ప్రెసిడెంట్ - టొమొకో అకానే (జపాన్‌కు చెందిన ఈమె 2024, మార్చి 11 నుంచి కొనసాగుతున్నారు.)

❖ అధికార భాషలు - 6 (ఇంగ్లిష్, ఫ్రెంచ్, అరబిక్, చైనీస్, రష్యన్, స్పానిష్)

❖ ఐసీసీకి సొంత పోలీస్ దళం లేదు.

చారిత్రక నేపథ్యం:

ప్రపంచవ్యాప్తంగా నేరాల కట్టడికి ఒక అంతర్జాతీయ వ్యవస్థ ఉండాలనే ఉద్దేశంతో 1998, జులై 17న రోమ్ నగరంలో ఒక సమావేశం జరిగింది. 139 దేశాలు ఇందులో పాల్గొన్నాయి. దేశాల మధ్య యుద్ధాలు, మానవాళికి వ్యతిరేకంగా నేరాలు, దురాక్రమణలకు వ్యతిరేకంగా 'అంతర్జాతీయ నేర న్యాయస్థానాన్ని' ఏర్పాటు చేయాలని సదస్సులో ఒక ఒప్పందాన్ని ఖరారు చేశారు. దీన్నే రోమ్ ఒప్పందం అంటారు. ఐసీసీ అమల్లోకి రావాలంటే వీటిలోని 60 దేశాలు గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించాలని నిర్దేశించారు.

■ 2002, జూన్ నాటికి 66 దేశాలు రోమ్ ఒప్పందాన్ని ధ్రువీకరించాయి. 2002, జులై 1 నుంచి ఐసీసీ అమల్లోకి వచ్చింది.

■ 2010, జూన్ 1న ఉగాండాలోని కంపాలాలో జరిగిన ఐసీసీ సర్వసభ్యవేశంలో ఏటా జులై 17న 'అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం'గా జరుపుకోవాలని సభ్యదేశాలు తీర్మానించాయి. అప్పటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.


జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

వ్యవసాయంలో ఆధునిక ధోరణులు - పంటశాస్త్రం పాత్ర

భారతదేశంలో నేటికీ సుమారు 50 శాతానికి పైగా జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలోనూ ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది. అయితే దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 19.9% మాత్రమే. ప్రస్తుతం ఈ రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు ఆహారాన్ని అందించడం పెద్ద సవాలుగా మారింది.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రకారం, 2050 నాటికి ప్రపంచ జనాభా 7 బిలియన్ల నుంచి తొమ్మిది బిలియన్లకు పెరగవచ్చని అంచనా. పెరుగుతున్న జనాభా విస్తరణకు తగ్గట్లు ఆహార డిమాండ్‌ను తీర్చాలంటే ప్రపంచ ఆహార ఉత్పత్తి 70% పెరగాలి.

పంటశాస్త్రం: ఇది మొక్కల ఆధారిత పంటల పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించే బహుళ విభాగ రంగం. ఇందులో పంట సాగు, నిర్వహణ, ప్రాసెసింగ్, ఉత్పత్తి అధ్యయనం మొదలైనవి ఉంటాయి. దేశ జీడీపీలో వ్యవసాయం పాత్ర గణనీయంగా పెరగడానికి పంటశాస్త్రం దోహదం చేస్తోంది.



నూతన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వ విధానాలు - సహకారం ఏ విధంగా ఉన్నాయి, భారతదేశంలో ప్రధాన పంటలు - పంట ఉత్పత్తులు, మొక్కల లక్షణాలు, మొక్కల వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలు - దుష్పరిణామాలు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Current Affairs




The Assam government launched the "Gajah Mitra" scheme on July 11. The govt introduced the scheme to stop the increasing number of Human-Elephant conflict. The scheme aims to protect wildlife, create safe spaces for elephants, and help villages deal with such situations in a peaceful way. The scheme will focus on 80 high-risk areas cross the state where elephants and people frequently come into contact.

President Draupadi Murmu appointed new Governors to two states and one Union Territory on July 14.

✦ Ashim Kumar Ghosh named Haryana's new Governor. He is ex-BJP West Bengal chief.

✦ TDP senior leader and former Union minister Pusapati ***Ashok Gajapathi Raju*** was appointed as Governor of Goa.



✦ Former Deputy Chief Minister of Jammu & Kashmir, Kavinder Gupta was named the new Lieutenant Govenor of Ladakh.

The Indian Army has launched "Operation SHIVA" to ensure safe Amarnath Yatra in Kashmir. According to the Army, over 8500 troop have been deployed this year. This effort is in close coordination with the civil administration and Central Armed Police Forces.

For more Current Affairs: Scan QR code

Cause & Effect

Directions (Qs. 1 - 6): *Read the given both the statements and decide which of the following answer choice correctly depicts the relationship between these two statements. Mark your answer as..*

A) If Statement (I) is the cause and statement (II) is its effect.

B) If Statement (II) is the cause and Statement (I) is its effect.

C) If both the Statements (I) and (II) are independent.

D) If both the Statements (I) and (II) are effects of independent causes.

E) If both the Statements (I) and (II) are effects of some common cause.

1. (I) All the airline corporations have increased the fares in all the domestic sectors with immediate effect.

(II) The State Road transport corporations have increased the fares on long distance routes with immediate effect.

2. (I) The Prime Minister has visited the drought affected areas and promised government assistance to help the farmers.

(II) A large number of farmers in the drought affected areas have been suffering due to drought situation and are unable to feed their family.

3. (I) The government has recently fixed the fees for professional courses offered by the unaided institutions which are much lower than the fees charged last year.

(II) The parents of the aspiring students launched a severe agitation last year protesting against the high fees charged by the unaided inst itutions.

4. (I) There has been a high increase in the incidents of atrocities against women in the city during the past few months.

(II) The police authority has been unable to nab the culprits who are committing crime against women.

5. (I) Major part of the sugarcane crop were affected by pests resulting into huge loss incurred by the farmers in the farmers in the state.

(II) The farmers in the state who were cultivating sugarcane earlier have now scatched over to grapes cultivation this year.

6. (I) All the lakes supplying water to the city started overflowing at the end of the second month into the monsoon.

(II) The normal life in the city has been disrupted quite a few times during the first two months of the monsoon due to water logging at various parts.

Bank Exams
Reasoning

Directions (Qs. 7 - 13): *Read the given both the statements and decide which of the following answer choice correctly depicts the relationship between these two statements. Mark your answer as..*

A) If 'A' is effect and 'B' is its immediate and principal cause.

B) If 'A' is the immediate and principal cause and 'B' its effect.

C) If 'A' is an effect but 'B' is not its immediate and principal cause.

D) If 'B' is an effect but 'A' is not its immediate and principal cause.

E) None of these

7. (I) Prices of gold have gone up in the local market.

(II) India has won several prizes in design of gold ornaments.

8. (I) The State government has proposed to start a project "alert citizen" to curb possible crimes and nab the criminals.

(II) Public cooperation is imperative in control long crime.

9. (I) There is considerable increase in the number of people having computers.

(II) Computer education is being made compulsory in schools.

10. (I) The interview panel has recommended 5 candidates for 3 vacancies which are to be filed in immediately in Company Z.

(II) The 5 candidates have been asked to contact Company Z next week to know their result and and accordingly to collect appointment letters.

11. (I) Government has appointed a large number of teachers in the state.

(II) There has been a significant reduction in number of school dropouts in the govt. run schools.

12. (I) This year Bank 'N' has celebrated its silver jubilee.

(II) More customers are getting attracted to the market branch of Bank M.

13. (I) The sales of cars have dropped in the state 'X' since last Monday.

(II) The State 'X' has suspended registration of cars which do not confirm to the emission norms stipulated recently.

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: క్రియేటివైజ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఎక్స్‌డీ, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ స్టైపెండ్: రూ.12,000-40,000
☛ https://shorturl.at/Yk6Oj

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఈజీ అలైడ్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, ఫిగ్మా, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.2,000-10,000
☛ https://shorturl.at/hn5Xs

బీటుబీ లీడ్ జనరేషన్ (రిమోట్)

సంస్థ: ప్యారడైజో సొల్యూషన్స్
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఈమెయిల్, లింక్డ్‌ఇన్ మార్కెటింగ్, లీడ్ జనరేషన్ స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/nEnAE

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: అండర్ స్కై మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రై.లి. నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్ మార్కెటింగ్ స్టైపెండ్: రూ.1,000-3,000
☛ https://shorturl.at/efmrz

హైదరాబాద్‌లో

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ఇన్‌విక్టస్ ఇంజినీర్స్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/qUOdb

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 8

మార్కెటింగ్

సంస్థ: పెన్‌స్టర్ నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం స్టైపెండ్: రూ.8,001-14,000
☛ https://shorturl.at/I7Zjo

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్

సంస్థ: అప్టాగ్రిమ్ కన్సల్టింగ్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, డార్ట్, ఫ్లట్టర్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.13,000-15,000
☛ https://shorturl.at/oRZtR

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 7

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: పీమ్యాట్స్ ఇన్నొవేటివ్ అప్రోచ్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, టిపోగ్రఫీ, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.5,000-6,000
☛ https://shorturl.at/baVET

ఫుడ్ టెక్నీషియన్

సంస్థ: మెటగ్రో ప్రై.లి. నైపుణ్యం: ఫుడ్ సేఫ్టీ
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/aUgSk

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: సికం కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: కాంపెన్సేషన్ మేనేజ్‌మెంట్, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, ఎంప్లాయీ రిలేషన్స్, ఎంప్లాయిమెంట్ ఎంగేజ్‌మెంట్, ఇంగ్లిష్, హెచ్‌ఆర్ అనలిటిక్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మ్యాన్‌పవర్ ప్లానింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, నెగోషియేషన్, ఆన్‌బోర్డింగ్, పేరోల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిక్రూట్‌మెంట్, శాలరీ స్ట్రక్చర్, టీమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.8,000-13,000
☛ https://shorturl.at/KIjLo

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 3

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: స్నైప్ నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్ స్టైపెండ్: రూ.20,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 6
☛ https://shorturl.at/Uzipl

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: ఐఎస్‌జీ మల్టీ మీడియా
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్, పబ్లిక్ స్పీకింగ్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.15,000- 20,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 5
☛ https://shorturl.at/wE8Y5

సైబర్ సెక్యూరిటీ

సంస్థ: ఫిన్‌ప్రో టెక్నాలజీస్
నైపుణ్యాలు: కంప్యూటర్ నెట్‌వర్కింగ్, ఎథికల్ హ్యాకింగ్, లినక్స్, పైథాన్, వీఏపీటీ, వెబ్ అప్లికేషన్ సెక్యూరిటీ స్టైపెండ్: రూ.25,000-45,000
దరఖాస్తు గడువు: జులై 30
☛ https://shorturl.at/CegjM

కంటెంట్ రైటింగ్

సంస్థ: ఆడిం లైఫ్‌సైన్సెస్
నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ మార్కెటింగ్, క్రియేటివ్ రైటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: జులై 27
☛ https://shorturl.at/DViGu

సేల్స్

సంస్థ: మెట్రోల్యాబ్స్ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: జులై 30
☛ https://shorturl.at/3JKhg



పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ విద్యార్హతలతో భారత నౌకా దళంలో సేవలందించే అవకాశమొచ్చింది. ఈ సంస్థ 1110 సివిల్ ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. పరీక్షతో నియామకాలుంటాయి. వీటికి మహిళలు, దివ్యాంగులూ పోటీ పడొచ్చు. ఎంపికైనవారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి. బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నవారు ఈ పరీక్షను సులువుగానే ఎదుర్కోవచ్చు.

నౌకా దళంలో.. సివిల్ కొలువులు



ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్‌సెట్)తో పోస్టులన్నీ భర్తీ చేస్తారు. గ్రూప్ బీ, గ్రూప్ సీ విభాగాల్లో ఈ ఖాళీలున్నాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఫైర్‌మెన్, ఫైర్ ఇంజిన్ డ్రైవర్ పోస్టులకు అదనంగా దేహదార్ఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. దేశంలో ఉన్న నేవీ కేంద్రాల్లో వీరు సేవలందించాలి. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎక్కువ ఖాళీలున్న పోస్టుల వివరాలు..

ఛార్జ్‌మెన్

ఖాళీలు: మెకానిక్ విభాగంలో 49, ఎక్స్‌ప్లోజివ్‌లో 53. **అర్హత:** మెకానిక్ విభాగానికి మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ప్రొడక్షన్ ఇంజినీరింగ్‌లో డిప్లొమాతోపాటు సంబంధిత విభాగంలో రెండేళ్ల అనుభవం. ఎక్స్‌ప్లోజివ్ విభాగానికి కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమాతోపాటు రెండేళ్ల పని అనుభవం.

ఫైర్‌మెన్

ఖాళీలు: 90, **అర్హత:** ఇంటర్మీడియట్‌తోపాటు ఎలిమెంటరీ/బేసిక్/ఆక్సిలరీ ఫైర్ ఫైటింగ్ కోర్సు. నిర్దేశిత శారీరక ప్రమాణాలు.

స్టోర్ కీపర్

ఖాళీలు: 176 **అర్హత:** ఇంటర్‌తోపాటు సంబంధిత విభాగంలో ఏడాది పని అనుభవం.

డ్రైవర్

ఖాళీలు: 117 **అర్హత:** పదో తరగతితోపాటు హెవీ వెహికల్ లైసెన్స్, డ్రైవింగ్‌లో ఏడాది అనుభవం.

ట్రేడ్స్‌మెన్ మేట్

ఖాళీలు: 207 **అర్హత:** పదో తరగతితోపాటు నిర్దేశిత ట్రేడులో ఐటీఐ.

పెస్ట్ కంట్రోల్ వర్కర్

ఖాళీలు: 53 **అర్హత:** పదో తరగతితోపాటు హిందీ/ ప్రాంతీయ భాషలో పరిజ్ఞానం

మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (మినిస్టీరియల్)

ఖాళీలు: 94
అర్హత: పదో తరగతి/ ఐటీఐ

మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (నాన్ ఇండస్ట్రియల్)

ఖాళీలు: 81
అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ప్రావీణ్యం

ఇవే కాకుండా పలు విభాగాల్లో భిన్న విద్యార్హతలతో ఖాళీలు ఉన్నాయి. వీటికి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: ఎక్కువ పోస్టులకు 25 ఏళ్లకు మించరాదు. కొన్నింటికి 27/ 30/ 35 ఏళ్ల వరకు అవకాశం ఉంది. అన్ని ఉద్యోగాలకూ.. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం 10-15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు: జులై 18 వరకు స్వీకరిస్తారు.
ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఉండదు. మిగిలినవారికి రూ.295.
పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు. ఈ సమాచారం అభ్యర్థి ఈ-మెయిల్, మొబైల్‌కు అందుతుంది.

వెబ్‌సైట్: https://incet.cbt-exam.in/incetcycle3/login/user

విడి పరీక్ష.. ఒకే సిలబస్

గ్రూప్ బీ, గ్రూప్ సీ రెండు పోస్టులకూ విడిగా పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష విధానం, సిలబస్ ఒకటే. అయితే ప్రశ్నల స్థాయిలో తేడా ఉంటుంది. గ్రూప్ సీ ప్రశ్నపత్రం పదో తరగతి స్థాయిలో, గ్రూప్ బీ డిగ్రీ స్థాయిలో వస్తుంది.

పరీక్షను వంద మార్కులకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మొత్తం వంద ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు. జనరల్ ఇంటెలిజెన్స్ 25, జనరల్ అవేర్‌నెస్ 25, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. వ్యవధి 90 నిమిషాలు. పరీక్షలో విజయవంతమైతే, వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగంలోకి తీసుకుంటారు.

సన్నద్ధత వ్యూహం

▼ నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు శ్రద్ధగా గమనించాలి. ప్రతి విభాగంలోనూ అంశాల వారీ సన్నద్ధం కావాలి. ఆ తర్వాత వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.
▼ ఐఎన్‌సెట్ పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. వీటిద్వారా ప్రశ్నల స్థాయి తెలుస్తుంది. సాధనను అందుకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి.
▼ పరీక్షలో 90 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. అంటే ప్రతి ప్రశ్నకు 54 సెకన్ల సమయం దక్కుతుంది. ఉన్న వ్యవధిలో ఎక్కువ ప్రశ్నలకు సరైన సమాధానం గుర్తిస్తేనే విజయం సాధించగలరు.
▼ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో రాణించడానికి ఎక్కువ సంఖ్యలో మాదిరి ప్రశ్నలు సాధన చేయడం, సూత్రాలు ఉపయోగించే విధానం, షార్ట్ కట్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి.
▼ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్.. అగ్నివీర్ పరీక్షల ప్రశ్నపత్రాలూ అధ్యయనంలో ఉపయోగపడతాయి. ఐబీపీఎస్, ఎస్ఎస్‌సీ, రైల్వే పాత ప్రశ్నపత్రాలతోనూ ప్రయోజనమే.

విధులు, వేతనం

గ్రూప్ బీ పోస్టులకు ఎంపికైనవారు లెవెల్-6 వేతనం పొందుతారు. రూ.35,400 మూలవేతనంతో అన్నీ కలిపి సుమారు రూ.60,000 మొదటి నెల నుంచే అందుకోవచ్చు. వీరు ఇంజినీర్లు, అధికారులకు సహాయకులుగా ఉంటారు. సాంకేతిక సేవల్లో భాగమవుతారు. గ్రూప్ సీలో.. డ్రాఫ్ట్స్‌మెన్ పోస్టులకు లెవెల్-4 వేతనం చెల్లిస్తారు. వీరు 25,500 మూలవేతనంతో సుమారు రూ.45,000 జీతం అందుకోవచ్చు. ఫైర్‌మెన్‌కు లెవెల్-2 వేతనాలు దక్కుతాయి. వీరు రూ.19,900 మూలవేతనంతో రూ.35,000కు పైగా జీతం మొదటి నెల నుంచే పొందవచ్చు. ఫైర్ ఇంజిన్ డ్రైవర్లకు లెవెల్-3 వేతనాలు చెల్లిస్తారు. వీరికి రూ.21,700 మూలవేతనం, అలవెన్సులతో మొదటి నెల నుంచే సుమారు రూ.40,000 పొందవచ్చు. ట్రేడ్స్‌మెన్ మేట్, మిగిలిన ఉద్యోగాలకు లెవెల్-1 రూ.18,000 మూలవేతనం లభిస్తుంది. డీఏ, హెచ్‌ఆర్ఏ.. అన్నీ కలిపి రూ.30 వేలు ప్రారంభ వేతనం తీసుకోవచ్చు. ట్రేడ్స్‌మెన్లు సబ్‌మెరైన్లు, షిప్పుల ఉత్పత్తి/నిర్వహణ విధుల్లో పాల్గొంటారు. మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు ఎంపికైనవారు.. వివరాలు నమోదు, ఫైళ్లను తీసుకెళ్లడం, క్లరికల్ విధులు నిర్వర్తిస్తారు.


సైంటిస్ట్ అవ్వాలంటే?

ఇస్రోలాంటి అంతరిక్ష పరిశోధన కేంద్రాల్లో సైంటిస్ట్‌గా పనిచేయాలనుంది. దీని కోసం పదో తరగతి తర్వాత ఏ కోర్సులు చదవాలి? – కె.రవి.

■ ఇస్రో లాంటి అంతరిక్ష పరిశోధన కేంద్రాల్లో సైంటిస్టుగా పని చేయాలంటే, పదోతరగతిలో ఇంటర్మీడియట్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో కనీసం 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. తిరువనంతపురంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ) ఇస్రోకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఇంజినీర్లను/ సైంటిస్టులను అందిస్తుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ద్వారా ఐఐఎస్‌టీలో ప్రవేశం పొంది అక్కడ కోర్సులు పూర్తి చేస్తే ఇస్రోలో సైంటిస్ట్/ఇంజినీర్‌గా నియమితులయ్యే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

✦ ఐఐఎస్‌టీలో సీటు రాకపోతే బీఈ/బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్/మెకానికల్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌ల్లో మీకు నచ్చిన బ్రాంచిలో కనీసం 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

✦ ఒకవేళ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందలేకపోతే బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథమేటిక్స్) చదవవచ్చు. కానీ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఆ తరువాత స్పేస్ సైన్స్, ఆస్ట్రోఫిజిక్స్, ఏరోనాటికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, అప్లైడ్ ఫిజిక్స్‌ల్లో ఎంటెక్/ఎమ్మెస్సీ చేస్తే ఉపయోగకరం.



✦ అంతరిక్ష పరిశోధన కేంద్రాల్లో శాస్త్రవేత్త అవ్వాలంటే ఇస్రో నిర్వహించే సైంటిస్ట్ పరీక్షలు కానీ, గేట్ కానీ రాయాలి. గేట్‌లో అత్యుత్తమ స్కోరు, పదో తరగతి నుంచి డిగ్రీ/పీజీ వరకూ మంచి అకడమిక్ రికార్డ్ అవసరం. పరిశోధన పట్ల అపరిమితమైన ఆసక్తితో పాటు సమస్యా పరిష్కారం, బృందంలో పనిచేయడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యం, తార్కిక ఆలోచనా నైపుణ్యాలుంటే ఇస్రో లాంటి సంస్థల్లో సైంటిస్ట్ అవ్వడం కష్టమేమీ కాదు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సిలర్

కుదించడానికి పనికొచ్చే ఫైల్?

రైల్వే, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), ఇతర పోటీ పరీక్షల్లో 'కంప్యూటర్ ఆప్టిట్యూడ్' ఉంటుంది. ఈ విభాగంలో అధిక మార్కులు సాధించాలంటే ఏ మెలకువలు పాటించాలి?

ఉపయోగించే విధానం ఆధారంగా	పామ్ టాప్ కంప్యూటర్	లాప్ టాప్ కంప్యూటర్	పర్సనల్ కంప్యూటర్
ఆకృతి ఆధారంగా	మైక్రో కంప్యూటర్	మినీ కంప్యూటర్	మెయిన్ ఫ్రేం కంప్యూటర్
యుటిలిటీ ఆధారంగా	జనరల్ పర్పస్ కంప్యూటర్	స్పెషల్ పర్పస్ కంప్యూటర్	
ఆపరేషన్ ఆధారంగా	అనలాగ్ కంప్యూటర్	డిజిటల్ కంప్యూటర్	హైబ్రిడ్ కంప్యూటర్

కంప్యూటర్ రకాల గురించి విద్యార్థులు పూర్తి అవగాహన పెంచుకుంటే ఏ విధంగా ప్రశ్నలడిగినా జవాబులు ఇవ్వగలుగుతారు.

విరివిగా వాడుతున్న రంగాలు: విద్య, వైద్య, వ్యాపార, వ్యవసాయ, శాస్త్ర సాంకేతిక, ప్రింటింగ్ లాంటి వివిధ రంగాల్లో మనుషులు చేయగల పనులే కాక, మనుషులు చేయలేని ఎన్నో పనులను చాలా వేగంగా, పూర్తి కచ్చితత్వంతో కంప్యూటర్లు చేయగలుగుతున్నాయి. నిత్యజీవితంలో కంప్యూటర్ల వినియోగం తప్పనిసరి అయింది.

కంప్యూటర్ విభాగాలైన ఇన్‌పుట్ యూనిట్ అంటే ఏమిటి, సి.పి.యు. ఇన్‌పుట్ యూనిట్ విభాగాలు, మెమరీల్లో రకాలైన ప్రైమరీ మెమరీ, సెకండరీ మెమరీ ఎలా పనిచేస్తాయి అనే విషయాలు తెలుసుకోవాలి. వీటిపై గత పరీక్షల్లో ఇచ్చిన ఒక ప్రశ్నను చూద్దాం.

ఒక చిత్రం, వీడియో, పాట, కార్యక్రమం మొదలైనవి ఈ రూపంలో నిల్వ చేస్తారు...
ఎ) ఫైల్ బి) ఫోల్డర్
సి) టెక్స్ట్ డి) డేటా **జవాబు: ఎ**

ఒక్కటి లేదా అంతకన్నా ఎక్కువ ఫైళ్లను కుదించడానికి ఉపయోగపడే ఫైల్ కింది వానిలో ఏది?
ఎ) EXE బి) PDF
సి) DOC డి) ZIP **జవాబు: డి**

వివిధ ఇన్‌పుట్ పరికరాలైన కీ బోర్డ్, మౌస్, స్కానర్, జాయ్ స్టిక్, ట్రాక్ బాల్, బార్ కోడ్ రీడర్, మాగ్నెటిక్ ఇంక్ క్యారెక్టర్ రికగ్నిషన్ (MICR), ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (OMR), మైక్రో ఫోన్, వెబ్ కెమెరా లాంటి పరికరాలు, అవి చేయగలిగిన పనుల గురించి నేర్చుకోవాలి.



కంప్యూటర్‌లో స్కైప్ పనిచేయడానికి కింది వాటిలో ఏది అవసరం?
1) వెబ్ కామ్ 2) మైక్రో ఫోన్ 3) స్పీకర్
ఎ) 1, 2 మాత్రమే బి) 1, 2, 3
సి) 2, 3 మాత్రమే
డి) 1, 3 మాత్రమే **జవాబు: బి**

కీ బోర్డ్ షార్ట్ కట్స్ పై గత పరీక్షల్లో ఇచ్చిన ఒక ప్రశ్నను చూద్దాం.

విండోస్ OSలో ఫైల్ లేదా ఫోల్డర్ పేరు మార్చడానికి సాధారణంగా ఉపయోగించే కీబోర్డ్ షార్ట్ కట్‌లు ఏవి?
ఎ)Ctrl + R బి)F2
సి) Ctrl + F5
డి)Alt + Enter
జవాబు: బి



డా. చెన్నంశెట్టి రమేష్

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

రైల్ వికాస్ నిగమ్‌లో మేనేజర్లు

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▶ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐటీ&ఎస్&టీ/బీడీ): 02
▶ మేనేజర్ (ఎస్&టీ): 05
▶ డిప్యూటీ మేనేజర్ (ఎస్&టీ): 05
అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్ (కంప్యూటర్/ఐటీ/ఎలక్ట్రానిక్స్), పీజీ, డిప్లొమాతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు.
వేతనం: నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000, మేనేజర్‌కు రూ.50,000 - రూ.1,60,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 - రూ.1,40,000.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.400. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు ఫీజు లేదు.
చిరునామా: డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్టు క్రాంతి భవన్, భికాజీ కామా ప్లేస్, ఆర్‌కేపురం, న్యూదిల్లీ-110066. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 13.08.2025
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://rvnl.org/job

బీడీఎల్‌లో 212 పోస్టులు

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)హైదరాబాద్ యూనిట్ ఒప్పంద ప్రాతిపదికన ఏపీ & తెలంగాణలోని విభాగాల్లో 212 ట్రైనీ ఇంజినీర్, ఆఫీసర్, డిప్లొమా అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, హెచ్‌ఆర్, ఫైనాన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్.
▶ ట్రెయినీ ఇంజినీర్: 100 ▶ ట్రెయినీ ఆఫీసర్: 12
▶ డిప్లొమా అసిస్టెంట్: 90 ▶ ట్రెయినీ అసిస్టెంట్: 10
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ. **వయసు:** 10.08.2025 నాటికి 28 నుంచి 33 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి 5 ఏళ్లు, ఓబీసీకి 3 ఏళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు ట్రెయినీ ఇంజినీర్, ఆఫీసర్‌లకు రూ.29,000 - రూ.38,000, డిప్లొమా అసిస్టెంట్, ట్రెయినీ అసిస్టెంట్‌కు రూ.24,500 - రూ.29,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2025
ఎంపిక: రాత పరీక్షతో
వెబ్‌సైట్: https://bdl-india.in/recruitments

కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్‌లో..

ముంబయిలోని కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 35 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▶ సీఎఫ్‌ఓ: 01 ▶ కంపెనీ సెక్రటరీ: 01
▶ ఇన్‌స్టిట్యూషనల్ డీలర్: 01
▶ కంప్లైయెన్స్, సర్వైలెన్స్ రిసెర్చ్: 03
▶ మార్కెటింగ్: 03 ▶ జూనియర్ ఆఫీసర్: 01
▶ డీపీఆర్ఎం ట్రెయినీ: 25
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, ఎల్ఎల్‌బీ, ఐసీడబ్ల్యూఏ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ/పీజీడీఎంతో పాటు ఐసీఏఏఐలో సభ్యులై ఉండాలి. పని అనుభవం ఉండాలి. **వయసు:** 30.06.2025 నాటికి 22 - 30 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు డిప్యూటీ మేనేజర్‌కు రూ.38,160 - రూ.50,360, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.25,440 - రూ.36,740, జూనియర్ ఆఫీసర్‌కు రూ.22,000, డీపీఆర్ఎం ట్రెయినీకి రూ.22,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.07.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.canmoney.in/careers

బీఈసీఐఎల్‌లో ఎంటీఎస్‌లు

దిల్లీలోని బ్రాడ్ కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 16 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▶ డ్రైవర్: 02 ▶ డీఈఓ: 02 ▶ ఎంటీఎస్: 11
▶ జీఐఎస్ ఆపరేటర్: 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఇంటర్, డిగ్రీతో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు డ్రైవర్‌కు రూ.25,506, డీఈఓకు రూ.23,218, ఎంటీఎస్‌కు రూ.19,760 - రూ.23,218, జీఐఎస్ ఆపరేటర్‌కు రూ.25,506.
తపాలా ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 30.07.2025 **చిరునామా:** బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ , బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా-201307 (ఉత్తర్‌ప్రదేశ్).
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.295. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://www.becil.com/Vacancies

బీవోబీ క్యాపిటల్ మార్కెట్స్‌లో..

బీవోబీ క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్ ఏపీ, తెలంగాణ, బిహార్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, నొయిడా, తమిళనాడు, న్యూదిల్లీ, జైపూర్‌లలో 80 బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు సేల్స్, ఫైనాన్స్ రంగంలో 6 నెలల పని అనుభవం. **దరఖాస్తు:** ఈ మెయిల్ ద్వారా. email: careers@bobcaps.in
దరఖాస్తుకు చివరి తేదీ: 31.07.2025.
వెబ్‌సైట్: https://www.bobcaps.in/careers

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్లు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఒప్పంద ప్రాతిపదికన 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: లీగల్, ఐఈసీ, ప్లానింగ్ అండ్ మానిటరింగ్, సెక్యూర్, ఎంఐఎస్ అండ్ డీబీటీ, ఫైనాన్స్
▶ ప్రాజెక్ట్ ఆఫీసర్: 09
▶ జూనియర్ ప్రాజెక్టు ఆఫీసర్: 04
అర్హత: పోస్టును అనుసరించి బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, పీజీ, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం. **వయసు:** 60 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.1,40,000, జూనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.1,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.07.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.300. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: http://career.nirdpr.in//

వాక్-ఇన్స్

మనూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) తాత్కాలిక ప్రాతిపదికన 4 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▶ లా: 02 ▶ సోషియాలజీ: 01 ▶ హిస్టరీ: 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్‌తో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ.50,000. ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 21.07.2025 **వేదిక:** మనూ లా స్కూల్ వద్ద మనూ క్యాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://manuu.edu.in/notifications

హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్స్


హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్- నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం).. తాత్కాలిక/ ఒప్పంద ప్రాతిపదికన 4 యంగ్ ప్రొఫెషనల్స్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, బీటెక్/బీఈ, పీజీతో పాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, ఎడిటింగ్ స్కిల్స్. **వేతనం:** నెలకు రూ.42,000. **వయసు:** 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి. **ఇంటర్వ్యూ తేదీలు:** జులై 27, 30, ఆగస్టు 6 **వేదిక:** ఐసీఏఆర్- ఎన్ఏఏఆర్ఎం, రాజేంద్రనగర్ హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://naarm.org.in/

ఐఐఎంఆర్‌లో..

ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్ (ఐఐఎంఆర్) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన 9 యంగ్ ప్రొఫెషనల్-1, 2 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▶ యంగ్ ప్రొఫెషనల్-2: 04 ▶ యంగ్ ప్రొఫెషనల్-1: 05
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (అగ్రికల్చర్), మాస్టర్స్ డిగ్రీ (అగ్రికల్చర్ ఎకనామిక్స్, అగ్రిబిజినెస్, డేటా సైన్స్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 2025 జులై 24వ తేదీ నాటికి 45 ఏళ్లు. **వేతనం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్-1కు రూ.30,000, యంగ్ ప్రొఫెషనల్-2కు రూ.42,000. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీ:** జులై 24. **వేదిక:** ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030. **వెబ్‌సైట్:** www.millets.res.in/ad.php

ప్రతిభ, అవకాశాల కేంద్రంగా రాష్ట్రం

• లింక్డ్ ఇన్ జాబితాలో విశాఖ.. విజయవాడకు చోటు
• ఎక్స్ వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాష్ట్రం ప్రతిభ, అవకాశాల కేంద్రంగా మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. లింక్డ్ ఇన్ మొదటి సారిగా విడుదల చేసిన 'సిటీస్ ఆన్ ది రైజ్ రిపోర్ట్'లో విశాఖపట్నం, విజయవాడ మొదటి, మూడో స్థానాలను సాధించినందుకు సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. 'క్వాంటమ్ వ్యాలీ, ఏఐ విశ్వవిద్యాలయాల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో రాష్ట్రం ఆధునిక సాంకేతికతలో దేశంలోనే ప్రధాన కేంద్రంగా గుర్తింపు పొందుతోంది' అని పేర్కొన్నారు.

రాజగోపాలరాజు ఆత్మకు శాంతి చేకూరాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'ప్రముఖ కథా నాయకుడు రవితేజ తండ్రి రాజగోపాలరాజు కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. రవితేజ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పార్వతీపురం శాస్త్రవేత్తకు జాతీయ పురస్కారం



అవార్డుతో పాపారావు

మక్కువ, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం చప్పబుచ్చింపేట గ్రామానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త డా.వైకుంఠపు పాపారావుకు రాష్ట్రీయ కృషి విజ్ఞాన జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఐసీఏఆర్ స్థాపన దినోత్సవం సందర్భంగా దిల్లీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు.

పాలిటెక్నిక్ ద్వితీయ ఏడాదిలోకి స్పాట్ అడ్మిషన్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఐటీఐ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను సాంకేతిక విద్యా మండలి బుధవారం విడుదల చేసింది. ఈ ప్రక్రియ ఈ నెల 19వ తేదీన నిర్వహించి, స్పాట్ అడ్మిషన్ల జాబితాను స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ)కి 21వ తేదీలోగా పంపాలని ప్రతి జిల్లాలోని నోడల్ ప్రిన్సిపాళ్లకు ఆదేశాలను జారీ చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

కోర్టుల్లో పనిచేసే మసాల్చీల వేతనం రూ.570కి పెంపు

ఈనాడు, అమరావతి: దిగువ కోర్టుల్లో దినసరి వేతనంతో పనిచేస్తున్న మసాల్చీల వేతనాన్ని రూ.300 నుంచి రూ.570కి పెంచినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల ప్రాంగణాల్లో వివిధ సహాయ పనులు చేసే మసాల్చీలు దీర్ఘకాలంగా వేతన సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు రాష్ట్రప్రభుత్వం పరిష్కరించిందన్నారు. దీంతో నెలకు రూ.14,820 వేతనం లభిస్తుందన్నారు.

ఐసెట్ వెబ్ ఐచ్ఛికాల నమోదు ప్రారంభం

ఈనాడు, అమరావతి: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసెట్ వెబ్ ఐచ్ఛికాల నమోదు బుధవారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వం 26 విశ్వవిద్యాలయాల కళాశాలలు, 291 ప్రైవేటు కళాశాలల్లోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సీట్లకు ఆమోదం తెలుపుతూ జీఓలు జారీ చేయడంతో కౌన్సెలింగ్ మొదలైంది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13 నుంచి వెబ్ ఐచ్ఛికాల నమోదు కావాల్సి ఉండగా.. జీఓలు జారీ కాని కారణంగా వాయిదా పడింది.

రేపటి నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో శనివారం నాటికి అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది ఏపీ తీరానికి దగ్గరగా రానున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. శని, ఆదివారాల్లో కూడా వర్షాలకు అవకాశముందని తెలిపింది. బుధవారం రాష్ట్రంలో వేడి, ఉక్కపోత వాతావరణం కొనసాగింది. దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది.

షిర్డీసాయి, ఇండోసోల్ ప్రాజెక్టులపై సీబీఐ విచారణ జరిపించాలి

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ లేఖ

ఈనాడు, అమరావతి: షిర్డీసాయి ఎలక్ట్రికల్స్, ఇండోసోల్ సోలార్ పవర్ లిమిటెడ్‌లకు కేటాయించిన భూములు, కాంట్రాక్టులు, ప్రాజెక్టుల వ్యవహారాలపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు.

నియామకాల తుది జాబితా ప్రకటన తాత్కాలికంగా నిలుపుదల

ఈనాడు, అమరావతి: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (నోటిఫికేషన్ నంబరు 14/2023), ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ (11/2024) నియామకాల తుది జాబితా ప్రకటనను హైకోర్టు ఆదేశాల దృష్ట్యా తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో బుధవారం పేర్కొంది. ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్‌ల పాటింపు అంశంపై హైకోర్టులో విచారణ సాగుతోంది.

జులైలోనూ కరెంటు మీటర్ల పరుగులు

• డిమాండ్ గరిష్ఠంగా 12,949 మెగావాట్లు
• శ్రీశైలానికి వరదతో కాస్త ఊరట

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. వారం రోజులుగా డిమాండ్ పెరుగుతూ.. మంగళవారం 254.72 మిలియన్ యూనిట్లకు (ఎంయూ) చేరింది. జులైలో కూడా వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఫ్యాన్లు, ఏసీల వినియోగం బాగా పెరిగింది. దీంతో అంచనాకు మించి సుమారు 55 ఎంయూల విద్యుత్ వినియోగం అదనంగా నమోదైంది. సర్దుబాటు కోసం విద్యుత్ సంస్థలు బహిరంగ మార్కెట్ నుంచి రోజుకు 10-15 ఎంయూలు కొనాల్సి వస్తోంది. సాధారణంగా జులైలో వినియోగం రోజుకు 200 ఎంయూలలోపే ఉంటుంది. విద్యుత్ సంస్థలు వినియోగాన్ని ముందుగా అంచనా వేసేందుకు వినియోగించే సాంకేతికత కూడా ప్రస్తుత డిమాండ్‌ను అంచనా వేయలేకపోయింది. జులైలో గరిష్ఠంగా 210 ఎంయూల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేయగా.. ప్రస్తుతం అంతకుమించి నమోదవుతోంది.

శ్రీశైలం.. రికార్డు ఉత్పత్తి

ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి ముందుగానే వరద నీరు రావడం వల్ల జల విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తికి అవకాశం ఏర్పడింది. ఈ ప్రాజెక్టులో 2017లో ఉన్న 17.42 ఎంయూల రికార్డును తిరగరాస్తూ.. గత సోమవారం 18.72 ఎంయూల ఉత్పత్తి నమోదైంది. సీలేరు, ఒడిశాలోని మాచ్‌ఖండ్‌ల నుంచి రాష్ట్ర వాటాగా వచ్చేది కలిపి 25.83 ఎంయూల జల విద్యుత్ వస్తోంది. ఇది అందుబాటులో లేకుంటే ఇబ్బంది పడాల్సి వచ్చేది.

విద్యుత్ సర్దుబాటు

✦ థర్మల్, జల విద్యుత్ కేంద్రాల నుంచి 105.83 ఎంయూల విద్యుత్ అందుతోంది.

✦ సౌర, పవన ప్రాజెక్టుల నుంచి సుమారు 75 ఎంయూలు వస్తోంది. ఇతర వనరుల నుంచి మరో 50 ఎంయూలు గ్రిడ్‌కు అందుతోంది.

✦ ఇంకా సర్దుబాటుకు అవసరమైన 10 నుంచి 15 ఎంయూల విద్యుత్‌ను రియల్‌టైం మార్కెట్‌లో డిస్కంలు కొంటున్నాయి. పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ రూ.10 చొప్పున కొంటున్నాయి.

గత వారం రోజులుగా విద్యుత్ వినియోగం (ఎంయూల్లో)

తేదీ	డిమాండ్
09.07.2025	230.31
10.07	239.25
11.07	243.31
12.07	238.29
13.07	243.31
14.07	246.86
15.07	254.72

కృష్ణపట్నం పోర్టు కేసులో పీసీబీకి సుప్రీంకోర్టు నోటీసులు

• జరిమానా విధిస్తూ ఎన్జీటీ ఇచ్చిన తీర్పుపై స్టేకి నిరాకరణ

ఈనాడు, దిల్లీ: పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా చెల్లించాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సంస్థ దాఖలు చేసిన అప్పీలులో.. ప్రతివాది అయిన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)కి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌ల నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జరిమానా చెల్లించాలన్న ఎన్జీటీ ఉత్తర్వులపై స్టేకి నిరాకరించింది. కృష్ణపట్నం పోర్టు నుంచి రవాణా చేసే బొగ్గు దుమ్ము కాలుష్య నియంత్రణ విషయంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈ సంస్థపై జరిమానా విధించాలని ఏపీ పీసీబీని ఫిబ్రవరి 13న ఎన్జీటీ ఆదేశించింది. బొనిగి రంగయ్య అనే స్థానికుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎన్జీటీ విచారణ జరిపింది. కృష్ణపట్నం పోర్టు నుంచి రవాణా అవుతున్న బొగ్గు నుంచి వచ్చే దుమ్ము సమీప గ్రామాల్లోకి విస్తరించి గాలి నాణ్యత, పంటలు, ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోందని ఆయన ఎన్జీటీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరుగుతుండగానే పోర్టు యాజమాన్యం దిద్దుబాటు చర్యలు తీసుకొందని చెప్పి పిటిషనర్ తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. అప్పటికే జాయింట్ కమిటీ ద్వారా నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరిగినట్లు తేలడంతో ఆ సంస్థ నుంచి పర్యావరణ పరిహారం వసూలుచేయాలని పీసీబీని ఎన్జీటీ ఆదేశించింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఇప్పుడు అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫిర్యాదుదారు తన ఫిర్యాదును ఉపసంహరించుకున్న తర్వాత కూడా ఎన్జీటీ జరిమానా విధించడం అవాంఛనీయమని ఆ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది ధ్రువ్ మెహతా వాదించారు. ఎన్జీటీ ముందున్న కేసులో తమ వాదనలు వినకుండానే ఏకపక్షంగా ఉత్తర్వులు జారీచేసినందున దానిపై స్టే ఇవ్వాలని కోరారు.

ముందస్తు గుర్తింపుతోనే టీబీ నిర్మూలన సాధ్యం: గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: టీబీని ముందస్తుగా గుర్తించి, చికిత్స చేస్తేనే.. 2025 నాటికి ఆ వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యాన్ని చేరుకోగలం అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. రాష్ట్రంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' అమలు తీరుపై బుధవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంతోపాటు టీబీ నిర్మూలనకు అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం అని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ని-క్షయ్ పోర్టల్‌లో గవర్నర్ తన పేరును నమోదు చేయించుకుని గుర్తింపు పత్రాన్ని తీసుకున్నారు. సీటీడీ టీబీ అధికారి డాక్టర్ భవానీసింగ్ కుష్వాహా, జాతీయ కన్సల్టెంట్ (ని-క్షయ్ మిత్ర ఇనిషియేటివ్) డాక్టర్ డి.ధర్మారావు, టీబీ సంయుక్త సంచాలకుడు డాక్టర్ టి.రమేష్, రాష్ట్రంలో టీబీని నిర్మూలించడానికి తీసుకుంటున్న చర్యలను గవర్నర్‌కు వివరించారు. 20 మంది టీబీ రోగులకు గవర్నర్ తరఫున పోషకాహార బుట్టలను పంపిణీ చేయడానికి ఆయన ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్ రూ.84 వేల చెక్కును అధికారులకు అందజేశారు.

బ్రిటిష్ పాలనలో వలస వెళ్లిన భారతీయ శ్రామికులపై అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: బ్రిటిష్ పాలనలో వలసవెళ్లిన భారతీయ శ్రామికుల సాంస్కృతిక చరిత్రపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని హిందీ విభాగం సీనియర్ ఆచార్యుడు గజేంద్ర పాఠక్ నేతృత్వంలోని బృందం అధ్యయనం చేయనుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) నుంచి రూ.1.20 కోట్లతో ఈ పరిశోధన ప్రాజెక్టును పొందింది. 1830 నుంచి 20వ శతాబ్దం ప్రారంభం వరకు భారత్ నుంచి లక్షల మంది కార్మికులను ఫిజీ, మారిషస్, ట్రినిడాడ్, గయానా, సురినామ్, దక్షిణాఫ్రికా తదితర బ్రిటిష్ పాలిత ప్రాంతాలకు తరలించారు. తర్వాత వారు అక్కడే స్థిరపడిపోయారు. భారత్‌తో సంబంధాలు తెగిపోయాయి. వారి వారసులు, పూర్వీకుల మూలాలపై పాఠక్ నేతృత్వంలోని బృందం శోధించనుంది. చారిత్రక పత్రాలు, ఫొటోలు, లేఖలు, కళాఖండాలు, పరిశోధన వ్యాసాలను ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. ఈ పరిశోధనను వారణాసిలోని మహాత్మా గాంధీ కాశీ విద్యాపీఠ్, బనారస్ హిందూ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్‌లతో కలిసి చేపట్టనున్నారు.

450 ఎరువులు, విత్తన దుకాణాలపై దాడులు

రూ.30 కోట్ల విలువైన ఉత్పత్తుల అమ్మకాల నిలిపివేత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 14వ తేదీ నుంచి 450 ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రూ.30 కోట్ల విలువైన ఉత్పత్తుల అమ్మకాల నిలిపివేతకు ఆదేశాలు ఇచ్చామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 93 విత్తన దుకాణాల్లో తనిఖీలు చేసి.. రూ.63.17 లక్షల విలువైన 86 క్వింటాళ్ల విత్తనాల అమ్మకాలను నిలిపేశామని వివరించారు. 208 దుకాణాల్లో తనిఖీలు చేసి.. రూ.8.09 కోట్ల విలువైన 1.54లక్షల లీటర్ల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేయించినట్లు పేర్కొన్నారు. ఎరువులకు సంబంధించి 7,278 టన్నుల అమ్మకాలు నిలిపివేసి, 2,127 టన్నులను సీజ్ చేసి 4 దుకాణాలపై 6ఎ కేసులు నమోదు చేశామని వివరించారు.

అర్చకుల ముఖ గుర్తింపు హాజరుపై రచ్చ

• తప్పనిసరి అంటూ తిరుపతి ఆర్‌జేసీ ఆదేశాలు • అర్చక ఐకాస విజ్ఞప్తితో ఆదేశాలు నిలిపేసిన కమిషనర్

ఈనాడు, అమరావతి: ఆలయాల్లో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగుల మాదిరిగానే, అర్చకులకు కూడా ముఖ ఆధారిత గుర్తింపు హాజరు (ఎఫ్‌ఆర్‌ఏఎస్)/బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అంటూ దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్-2 (ఆర్‌జేసీ-తిరుపతి) మెమో జారీచేయడం, దానిని నిలిపేస్తూ కమిషనర్ ఆదేశాలివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలతోపాటు రాయలసీమ జిల్లాల పరిధిలోని అన్ని ఆలయాలు, దేవాదాయ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల హాజరు నమోదుకు ఎఫ్‌ఆర్‌ఏఎస్ అమలు చేయాలంటూ తిరుపతి ఆర్‌జేసీ ఆజాద్.. ఏప్రిల్ 23న మెమో జారీచేశారు. రెగ్యులర్ ఉద్యోగులతోపాటు ఆప్కాస్ కింద పనిచేసే ఉద్యోగులు సైతం దీనిని పాటించాలని అందులో పేర్కొన్నారు. తాజాగా వంశపారంపర్య అర్చకులు మినహా, మిగిలిన అర్చకులకు కూడా ఇదే హాజరు విధానం అమలుచేయాలని, రిజిస్టర్‌లో సంతకాలను పరిగణనలోకి తీసుకోవద్దంటూ ఆర్‌జేసీ ఈనెల 3న మరో ఉత్తర్వు జారీచేశారు. దీనిపై అర్చక ఐకాస నేతలు రెండు రోజుల కిందట దేవాదాయ కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిసి.. ఎఫ్‌ఆర్‌ఏఎస్ హాజరు నుంచి అర్చకులను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో 2017లో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం.. అర్చకులకు రిజిస్టర్‌లో సంతకం ద్వారా హాజరునే పరిగణనలోకి తీసుకోవాలంటూ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

భిన్నవాదనలు ఇలా..

ఈ అంశంపై దేవాదాయశాఖలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. అనేక ప్రధాన, ముఖ్య ఆలయాల్లోని అర్చకుల్లో కొందరు విధులకు హాజరుకాకుండా, వారి స్థానంలో ఇతరులతో పని చేయిస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. అందరు ఉద్యోగుల్లా అర్చకులకూ ఎఫ్‌ఆర్‌ఏఎస్ హాజరు సరైనదని చెబుతున్నారు. మరికొందరు మాత్రం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కారణంగా వారికి రిజిస్టర్‌లో హాజరు నమోదు విధానమే అమలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే 2017లో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుపై.. పూర్తిస్థాయి తీర్పు వచ్చేలా అధికారులు దృష్టిపెట్టకపోవడం కూడా సరికాదనే వాదనను మరికొందరు వినిపిస్తున్నారు.

నకిలీ పదోన్నతుల ఆదేశాలు!

కొన్ని ఆలయాల ఈవోలు.. అధికారిక మెయిల్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను కిందిస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు ఇస్తుండటంతో.. ఆయా ఈవోల పేరిట నకిలీ ఉత్తర్వులు జారీ అవుతున్నట్లు బయటపడింది. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ సిబ్బంది కొందరు కమిషనర్, ఆర్‌జేసీ నుంచి ఐదుగురికి పదోన్నతులు కల్పిస్తూ ఆదేశాలొచ్చాయంటూ నకిలీ ఆదేశాలు సిద్ధం చేయగా, ఈవో వాటిని అమలు చేసినట్లు తేలింది. ఇటీవల ఇది బయటకు రావడంతో ఆ పదోన్నతులు రద్దుచేసి, సంబంధిత ఉద్యోగులపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించారు.

★ మరికొన్ని ఆలయాల్లో కిందిస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు.. ఫైనాన్షియల్ ఎకౌంట్స్ విధానంలో తప్పుడు ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలిసింది. ముందస్తు ఆడిట్ జరగకుండానే.. జరిగిందంటూ నకిలీ ఉత్తర్వులను ఈవోల ముందు ఉంచి, ఆదేశాలు పొందుతున్నారు. తర్వాత ఆడిట్ అధికారులు.. ఆయా దస్త్రాలను తాము అసలు పరిశీలించనేలేదంటూ పేర్కొనడంతో నకిలీ దందాల వ్యవహారం బయటకొచ్చింది. ఇకపై ఆలయాల అధికారిక మెయిల్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను.. ఇతరులకిస్తే ఆయా ఈవోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ తిరుపతి ఆర్‌జేసీ ఇటీవల ఆదేశాలిచ్చారు.

ప్రత్యేక రైళ్లు అక్టోబరు వరకు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి తమిళనాడు, కేరళకు వెళ్లే పలు ప్రత్యేక వీక్లీ రైళ్లను ద.మ.రైల్వే అక్టోబరు వరకు పొడిగించింది. ప్రతి సోమవారం బయల్దేరే కాచిగూడ-మదురై(07191) రైలు అక్టోబరు 13 వరకు, బుధవారం బయల్దేరే మదురై-కాచిగూడ (07192) రైలు అక్టోబరు 15 వరకు, శనివారం ప్రారంభమయ్యే హైదరాబాద్-కొల్లం(07193) రైలు అక్టోబరు 11 వరకు, సోమవారం మొదలయ్యే కొల్లం-హైదరాబాద్(07194) రైలు అక్టోబరు 13 వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. బుధవారం బయల్దేరే హైదరాబాద్-కన్యాకుమారి(07230) రైలు అక్టోబరు 8 వరకు, శుక్రవారం మొదలయ్యే కన్యాకుమారి-హైదరాబాద్ (07229) రైలును అక్టోబరు 10 పొడిగించినట్లు ద.మ.రైల్వే సీపీఆర్వో సీహెచ్ శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ రైళ్లు ఒక్కోటి తొమ్మిది చొప్పున మొత్తం 54 ట్రిప్పులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఇతర రూట్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 38 ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను అదనంగా నడిపించాలని ద.మ.రైల్వే నిర్ణయించింది. సికింద్రాబాద్-తిరుపతి, తిరుపతి-సికింద్రాబాద్ (07009, 07010), కాచిగూడ-నాగర్‌సోల్, నాగర్‌సోల్-కాచిగూడ (07055, 07056), నాందేడ్-తిరుపతి, తిరుపతి-నాందేడ్ (07015, 07016), నాందేడ్-ధర్మవరం, ధర్మవరం-నాందేడ్ (07189, 07190) రైళ్లు ఆగస్టు నెలాఖరు వరకు ఐదేసి అందుబాటులో ఉంటాయి.

వైకాపా నేతల అండతో భూ కబ్జా

• తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి వైకాపా నేతల అండతో తన భూమి కబ్జా చేశాడని చిత్తూరు జిల్లా రాచరంగయ్యపల్లికి చెందిన కె.చంగలరాయుడు ఫిర్యాదు చేశారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు వినతులు స్వీకరించారు. వైకాపా ప్రభుత్వంలో అకారణంగా తొలగించిన పింఛను పునరుద్ధరించాలని విజయవాడకు చెందిన ప్రశాంతి, సీతమ్మ అర్జీ ఇచ్చారు. మూగ, చెవిటి సమస్యతో బాధపడుతున్న 24 ఏళ్ల కుమార్తె ఏడు నెలలుగా కనిపించడం లేదని నెల్లూరు జిల్లాకు చెందిన పెంచలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నా.. సరిపడా వసతిగృహం, ప్రహరీ లేకపోవడం ఇబ్బందిగా ఉందని అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని సంబంధిత స్కూల్ కమిటీ సభ్యులు విన్నవించారు.



సాంబశివరావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఆర్వో గంగాధర్ గౌడ్, కమిషనరు అబ్దుల్ రషీద్

చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవి తెదేపా కైవసం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవిని తెదేపా కైవసం చేసుకుంది. ఛైర్మన్ పదవికి మించాల సాంబశివరావు పేరును ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రతిపాదించగా.. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, కౌన్సిలర్ యు.శోభనారెడ్డి బలపరిచారు. ఆయనకు పోటీగా ఇంకెవరూ నామినేషన్ వేయలేదు. 33 మంది కౌన్సిలర్లకు 31 మంది హాజరుకాగా, అందులో 25 మంది కౌన్సిలర్లు సహా ఎక్స్ అఫీషియో సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి మొత్తం 27 మంది మద్దతుతో సాంబశివరావు ఎన్నికయ్యారు. ఆయనతో ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ ఛైర్మన్ ఎంపికకు కోరం లేకపోవడంతో గురువారానికి వాయిదా వేస్తున్నట్లు పీవో ప్రకటించారు.

జగన్‌రెడ్డి కాదు.. రప్పా రప్పా రెడ్డి

మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: "రాజకీయాల్లో హింసాత్మక చర్యలకు పాల్పడడంలో తప్పేమీ లేదు. మేము అధికారంలోకి వచ్చాక ప్రతీకారం తీర్చుకుంటాం" అని మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. "జగన్‌రెడ్డి తన సైకో నైజాన్ని వెల్లడించి రప్పా రప్పా రెడ్డిగా తనను తాను ఆవిష్కరించుకున్నారు. చీకట్లోనే ప్రత్యర్థులను లేపేయాలన్న పేర్ని నాని వ్యాఖ్యలను సమర్థించేలా పట్టపగలే అలా చేయాలని జగన్ వ్యాఖ్యానించడం హింసాత్మక భావజాలానికి ప్రతీక. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. జగన్ మాటే శాసనంగా అతిక్రమణలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన పిన్నెల్లి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డితోపాటు ఉన్నతాధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్‌కుమార్‌లను పునీతులుగా పేర్కొనడం విడ్డూరంగా ఉంది. హామీల అమలులో వైకాపా ప్రభుత్వ వైఫల్యం వల్ల ప్రజలు ఎంత నష్టపోయారో జగన్‌రెడ్డి వెల్లడించాలి. ఐదేళ్ల పాలనలో రైతు ఆదాయం పెంచడానికి ఒక్క ఎకరాకు కూడా కొత్తగా నీరివ్వని జగన్ రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చడం ఏమిటి? 2019 ఎన్నికల్లో 151 సీట్లు దక్కించుకున్న జగన్.. 2024లో కేవలం 11 సీట్లకు ఎందుకు పతనం అయ్యారో ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు.

చంద్రబాబు ఇంటి గేటుకు తాళ్లు కట్టినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తులేదా?

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజం



ఈనాడు, అమరావతి: మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును ఇంటి నుంచి బయటకు రాకుండా గేట్లకు తాళ్లు కట్టి అడ్డుకున్నప్పుడు జగన్‌కు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు నిలదీశారు. "యువగళం పాదయాత్రపై ఆంక్షలు పెట్టి స్టూలుపై నిలబడి మాట్లాడేందుకూ అనుమతి ఇవ్వకుండా చేసిన ఆయన.. ఇప్పుడు పోలీసులపై విమర్శలు చేస్తున్నారు. 75 ఏళ్ల పాత్రికేయుడు అంకబాబును అరెస్టు చేయించిన జగన్ ఎంతమాత్రం సిగ్గులేకుండా మా ప్రభుత్వం వస్తే జాగ్రత్త అని హెచ్చరిస్తారా?" అని ధ్వజమెత్తారు. తెదేపా జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ సభలకు వచ్చే వారంతా జనం కాదు. సైకోబ్యాచ్. రప్పా రప్పా నరికేస్తే తప్పేంటని సిగ్గులేకుండా మాట్లాడుతున్న జగన్ సమాజానికి ఏం చెబుతున్నారు?" అని నిలదీశారు. "జగన్ తన పాలనలో ప్రతిపక్షాలను వేధించేందుకు, చెట్లు కొట్టించేందుకు, పరదాలు కట్టేందుకే పోలీసుల్ని ఉపయోగించుకున్నారు. ఇప్పుడు నిజాయతీగా పనిచేస్తున్న పోలీసు వ్యవస్థపై విమర్శలు చేస్తున్నారు. డీజీలను మాఫియా డాన్‌లు అంటారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మద్యం కుంభకోణంపై జగన్ మౌనం అర్ధాంగీకారమేనా?

• ఎంపీ మిథున్‌రెడ్డి దాక్కోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది?
• తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజం



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంతో వైకాపా ప్రతిష్ఠ మసకబారుతుండడంతో.. రప్పా రప్పా అనే రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్రజల దృష్టి మరల్చేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నిస్తున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య దుయ్యబట్టారు. ఈ కేసులో జగన్ మౌనం అర్ధాంగీకారమేనా? అని ప్రశ్నించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. "ఎంపీ మిథున్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడ? మారువేషంలో కలుగులో దాక్కోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? దీనికి జగన్ సమాధానం చెబుతారా? పేరు మార్చుకుని దొంగ పాస్‌పోర్టుతో విదేశాలకు వెళ్లి వచ్చిన వ్యక్తి ఆయన దృష్టిలో నీతిపరుడా?" అని నిలదీశారు. "మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్లు కొట్టేసి దుబాయ్ తరలించారని సిట్ దర్యాప్తులో తెలుస్తోంది. మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి, కెసిరెడ్డి లాంటి వారు జగన్‌కు తెలియకుండా ఇన్ని కోట్ల అవినీతి చేస్తారా?" అని మండిపడ్డారు. సిట్ దర్యాప్తు పూర్తయ్యే వరకు తిమింగలాలు దేశం విడిచి పారిపోకుండా చూడాలని ఈ సందర్భంగా రామయ్య విజ్ఞప్తి చేశారు.

వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర సాధనలో కేంద్ర పథకాలదే కీలకపాత్ర: లంకా దినకర్

ఈనాడు, అమరావతి: 'వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర 2047 సాధనలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఇరవై సూత్రాల అమలు పథకం ఛైర్మన్ లంకా దినకర్ వివరించారు. వికసిత్ భారత్ కోసం పథకాలు, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై బుధవారం రాజస్థాన్‌లోని జైపుర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 అమల్లో భాగంగా 15% వృద్ధిని సాధించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారని చెప్పారు. పేదరిక నిర్మూలన, పేదలకు గృహాలు, అందరికీ రక్షిత తాగునీరు, విద్య, నైపుణ్యాభివృద్ధి, యువత, మహిళా సాధికారత, అందరికీ ఆరోగ్యం, లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ, నాణ్యమైన ఉత్పత్తి, వినియోగం తదితర పది సూత్రాలతో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారని వివరించారు.

ముందే పోలవరం- బనకచర్ల చేపడితే వృథా

• విద్యార్థులు హిందీని ద్వితీయ భాషగా తీసుకుంటే తప్పేముంది?
• మాజీ ముఖ్యమంత్రి జగన్



ఈనాడు, అమరావతి: పోలవరం- బనకచర్ల అనుసంధానం అంత ముఖ్యం కాదని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుపై స్పందించారు. 'గోదావరి జలాలను కృష్ణాలోకి తీసుకువెళ్లే పోలవరం- బనకచర్ల ముఖ్యం కాదు. గోదావరి ఉపనది ఇంద్రావతిపై ఛత్తీస్‌గఢ్ సుమారు రూ.50 వేల కోట్లతో కడుతున్న రెండు ప్రాజెక్టులకు కేంద్రం కూడా సమ్మతించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ ఉపనది నుంచి గోదావరిలోకి నీరు వస్తుందా లేదా అనేది మొదట చూసుకోవాలి. తర్వాత పోలవరంలో 41.72 మీటర్లు కాకుండా 45.72 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేయగలిగితేనే అప్పుడు గోదావరి జలాల వినియోగం, కృష్ణాకు మళ్లించడం వంటి వాటిపై ఆలోచించవచ్చు. పోలవరాన్ని 41.72 మీటర్లకే కుదించి.. మిగిలిన దానికి నిధులు ఇవ్వనని కేంద్రం వెనక్కి వెళితే.. 45.72 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయడానికి ఆర్ అండ్ ఆర్ కోసమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు వెచ్చించేందుకు సిద్ధపడాలి. గోదావరిలో మిగులు జలాలు ఎంత ఉన్నాయనేదీ చూడాలి. పోలవరం- బనకచర్లకు రూ.80 వేల కోట్లు ఖర్చు పెట్టాక మిగులు జలాలు లేకపోతే ఆ డబ్బంతా బూడిదలో పోసినట్లే' అని జగన్ వ్యాఖ్యానించారు.

నాడు జగన్ ఏమన్నారంటే..

'భావితరాల కోసమే గోదావరి జలాలను శ్రీశైలానికి మళ్లించాలనుకుంటున్నాం' అని గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ప్రతిపాదించారు. దీనిపై నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశంలోనూ చర్చించారు. అసెంబ్లీలో ఆ విషయాన్ని ప్రస్తావించారు. గోదావరి- కృష్ణా అనుసంధాన ప్రాజెక్టుకు సహాయమందించాలని అప్పట్లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రికి లేఖ కూడా రాశారు.

నా ఫస్ట్ లాంగ్వేజ్ హిందీ

హిందీని ద్వితీయ భాష (సెకండ్ లాంగ్వేజ్)గా విద్యార్థులు ఎంచుకుంటే అందులో తప్పేంటని జగన్ బుధవారం జాతీయ మీడియాతో అన్నారు. రాష్ట్రాల మాతృభాష మాత్రం మొదటి లాంగ్వేజ్‌గా ఉండాలన్నారు. 'నేను చదువుకున్నప్పుడు నా ఫస్ట్ లాంగ్వేజ్ హిందీ. సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు ఉండేది' అని జగన్ చెప్పారు.